వినుకొండ వల్లభరాయని

# క్రీడాభిరామం

వచనము - పద్యములు - విశేషాలు



ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు

వినుకొండ వల్లభరాయని

# క్రీడాభిరామము

**(వచనము, పద్యము, విశేషాలు)**


వ్యాఖ్యాత :

**ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు**, యం.ఏ., పిహెచ్.డి.,

పర్యవేక్షణ :

**ఆచార్య లకంసాని చక్రధరరావు**, ఎమ్.ఏ.; పిఎచ్.డి



**నిర్మలా పబ్లికేషన్సు**

13-8/1, కృష్ణనగర్

విజయవాడ - 520 007

**వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామము**

*(వచనము, పద్యము, విశేషాలు)*

ప్రథమ ముద్రణ : జూన్ 2008

ప్రతులు : 1000

సర్వహక్కులు రచయితవి

ముఖచిత్రం : *ప్రఖ్యాత నర్తకి పద్మభూషణ్* శ్రీమతి వక్కలంక స్వప్నసుందరి

ప్రతులకు :

**ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు**
13-8/1, కృష్ణనగర్, విజయవాడ - 520 007
ఫోన్ : 0866 - 2552010 సెల్ : 9849499169

**విశాలాంధ్ర బుక్‌హౌస్,** అన్ని బ్రాంచీలు

**జయంతి పబ్లికేషన్స్,** కార్ల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ

**నవోదయ పబ్లిషర్స్,** కార్ల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ

**నవయుగ బుక్‌హౌస్,** సుల్తాన్ బజార్, హైదరాబాద్

**నవోదయ బుక్‌హౌస్,** ఆర్య సమాజ్ ఎదుట, కాచిగూడ, హైదరాబాద్

ముద్రణ :

**శ్రీశ్రీ ప్రింటర్స్**
మసీదు ఎదుట,
అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్
విజయవాడ - 520 002
ఫోన్ : 0866 - 2433359

మూల్యము : రూ. 80.00

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నా మాట | 4 |
| 2. | ఆముఖం | 24 |
| 3. | వచనము | 31 |
| 4. | సామాజిక విశేషాలు | 77 |
| 5. | పద్యగ్రంథం | 85 |
| 6. | పదాలు - పదబంధాలు | 143 |
| 7. | ధ్వన్యనుకరణ పదాలు | 162 |
| 8. | జాతీయాలు - వివరణ | 164 |
| 9. | అవతారికా భాగములో ప్రసక్తమైన వ్యక్తులు - వివరాలు | 169 |
| 10. | ఇతివృత్తంలో ప్రసక్తమైన వ్యక్తులు - వివరాలు | 171 |
| 11. | పేర్లు లేకుండా ప్రసక్తమైన వారి వివరాలు | 174 |
| 12. | ప్రసక్తమైన నృత్యాలు - వివరణ | 176 |
| 13. | ప్రసక్తమైన రాగాలు - వివరణ | 181 |
| 14. | క్రీడాభిరామము - కొన్ని విశేషాలు | 188 |
| 15. | వల్లభరాయని వంశవృక్షము | 195 |
| 16. | పద్యాల ఆకారాది అనుక్రమణిక | 196 |

# నామాట

క్రీడాభిరామం రసికజనమనోభిరామం. సాహితీవేత్తలకు సరే, సామాజిక శాస్త్రవేత్తలకూ, ఇతరులకూ, 13వ శతాబ్దినాటి మన సమాజజీవన వైఖరి ఎలావుందో తెలుసుకోవటానికి దీనిని మించిన ఉపకరణం మరోటి లేదంటే–ఆ మాట అతిశయోక్తి కాదు. అక్షర సత్యం. దీనిని 15వ శతాబ్దంలో వినుకొండ వల్లభ రాయడనే ఆయన రచించాడు. దీనిని తాను, తనకు ముందువాడైన రావిపాటి త్రిపురాంతకుడు ప్రేమాభిరామమనే పేరుతో సంస్కృతంలో వ్రాసిన దానిని అనుసరించి రచించినట్లు చెప్పుకున్నాడు. ఇది దృశ్యకావ్య విభాగానికి చెందిన దశరూపక భేదాలలో వీథి అనే రూపక భేదానికి చెందింది. వీధి లక్షణాలు వేరుగా ఇవ్వడం జరిగింది. స్థూలంగా చెప్పాలంటే. వీథి అనేది స్త్రీ పురుషుల అన్యోన్యానురాగ సంబంధమైన విషయం వస్తువుగా కలిగి వుంటుంది. ఒకరిద్దరు వ్యక్తుల పాత్రలేవుంటాయి. ఒక దినంలో జరిగిన వృత్తాంతమే సాధారణంగా కథనం గావింప బడుతుంది. ఇందులో ఉన్నదీ అదే. మంచన శర్మ అనే బ్రాహ్మణున్నాడు. ఆయనకో వైశ్యమిత్రుడున్నాడు. పేరు టిట్టిభసెట్టి. మంచనశర్మ గారు కాసల్నాటి వాడు. ఆయనకు నాటి ఆంధ్రరాజధానీ నగరం వరంగల్లులో ఓ ననుపుగత్తె వుంది. ఆవిడ పేరు కామమంజరి. అది కన్యగా వుండగానే ముండమోసింది. ఇలా అనడం ఎందుకంటే – ఆమె పునర్భువుగా పరిచయం చేయబడింది గనుక! ఆమెను చేరదీసాడు ఈ మంచనశర్మ. ఈయనే నన్న మాటేమిటి – ఈయన మేనమామ కొడుకు శ్రీధరుడూ మదాలస అన్నదానిని చేర దీసి అక్కడే కాలక్షేపం చేస్తున్నాడు. మరో మాధవశర్మ గారి (మంచనశర్మ తండ్రి పేరు కూడా మాధవశర్మే. మరి ఆయనా ఈయనా ఒకరవునో కాదో, సమమైన సమాచారంలేదు) కుమార్తె మధుమావతి అనే వేశ్య ప్రస్తావనా ఇందులో వుంది. వారినే అనుకోవాల్సిన పనిలేదు. నిన్న మొన్నటి వరకూ– అంటే ఓ యాభైఏళ్ళక్రితం వరకూ, సంపన్నులైన గ్రామీణ గృహస్థులకు పట్టణాల్లో ఇలాంటి ఖాతాలుండేవి. నా ఎరుకలో మా గ్రామానికి చెందిన వారు అలా ఇద్దరున్నారు.

పైగా వారికి సంఘంలో మంచి గౌరవ ప్రతిపత్తులుండేవి కూడా! ఎందుకో తెలుసా? సంపాదన దినవెచ్చానికే చాలీ చాలని స్థితిలో, మరొకరిని చేరదీసి పోషించటం, అదెంత గొప్పకాదుగనుక! ఇంకా చెప్పాలంటే. మా ఆయనకు మరొకతెతో సంబంధముందని చెప్పుకోవడం, ఇల్లాండ్రు గొప్పగా భావించేవారు! దానికేమి! మంచనగారు ఒక సంవత్సరంగా కాలు అటు మళ్లించినట్లు లేదు. ఇప్పుడు బుద్ధి అటు తిరిగినట్లుంది. కాలు అటుసాగించాడు. అలాంటి ఉబలాటమే వున్న టిట్టిభసెట్టి తనకు కూడా అలాంటి ఏర్పాటేదో, చూసి పెట్టమన్నాడు

గాబోలు. సరే అయితే వెంట రమ్మన్నాడు. అయితే దారి ఖర్చులూ వగైరాలు నీవే సుమా అని ముందే సెట్టిగారితో ఖరారు చేసుకున్నట్లున్నాడు మంచన శర్మ! మరి సెట్టిగారికి తప్పుతుందా? ఉబలాటం ఊరకే తీరుతుందా ఏమి? సరే బయలుదేరారు మిత్రులిద్దరూ ఉదయాన్నే. పొద్దుగూకే వేళకు కావలిసిన గూటికి చేరారు. ఇదీ కథ.

కథ ఇదే అయితే - దీన్ని గురించి పెద్దగా చెప్పుకోవల్సింది లేదు. ఈ మాత్రపు కథలు ఎన్ని లేవు గనుక! సంగతదే అయినా, నగర ప్రవేశం చేసింది మొదలు, గూటికి చేరేవరకు వారి కంటబడిన విశేషాలన్నీ ఇందులో పూసగుచ్చినట్లు ఏకరువుపెట్టబడ్డాయి. గూటికి చేరి గువ్వలతో ముచ్చట్లు-వారిరువురి వ్యక్తిగత విషయాలు. మనకు వాటితో పనీ లేదు! ప్రసక్తీ లేదు. మనకు కావలిసిందంతా మధ్యలోని ముచ్చట్లే! వాటిల్లో అప్పటి అంధ్రనగర సామాజిక జీవనం పాక్షికంగానైనా మన కళ్ళముందుంచాడు రచయిత, వారిరువురినీ నెపంగా పెట్టుకొని. మరి బయలు దేరిన వారి ప్రవృత్తిని బట్టి గదా వుంటుంది వారి చూపులెలా వుంటాయనేది. కనుక అలాగే నడిచింది వృత్తాంతమంతా. అంతా అంటే-అంతా అదే ననుకునేరు. అదేం కాదు! ఇంకా చాలా చాలా ఇతర విషయాలూ చూసారు. అయితేనేమి వాటిల్లోగూడా వారు దానినే చూసారు. అలాగే అన్వయించుకుని చెప్పారు. దానికేమి! వీధి లక్షణమే అంత! అదలాగుంటే-వారిది ఎంత నిశితమైన చూపని. పైపైన ఆహో, ఓహో అనుకోవడం గాదు. చూపుకానిన వారిని ఎంతగా గుచ్చి గుచ్చి చూస్తారో! వాటినన్నింటినీ ఏకరువు పెట్టడం ఇక్కడికిక్కడ కుదిరే పనికాదు. అయినా అంతా నేనే చెప్పేస్తే, చదువరులకు ఏం మిగులుతుంది. కనుక వారుగా చదివి ఆకళింపుకు తెచ్చుకుంటే-పడ్డపాటుకు ఓ ఫలితమంటూ వుండాలి గదా మరి - అది మంచిది. అయినా ఒకటి రెండు విషయాలు వారి పరిశీలన-ఎంత సాంద్రమైందో చెప్పటానికి నివేదిస్తాను. ముందు అలాగని, మళ్లీ ఇలాగెందుకంటారా! నాకిదో ఉబ్బళాయితనం! ఉబలాటం అనుకోండి పోనీ!

ముందు వెలిపాళెం చేరారా! అక్కడే వీరి కంటపడింది ఓ మేదరివేశ్య. ఆవిడ తీరు తెన్నులన్నీ చెప్పారు బాగుంది. ఎక్కడ కూర్చుంది. ఎలా కూర్చుంది, పాపిట ఎలా సరిదిద్దుకుంది అద్దంలో చూసుకుంటూ, ఎలా నవ్వుతోందీ-అన్నీ చెప్పాడా! అక్కడే ఇంకోమాట చెప్పాడు. రవికలోకి చెయ్యిపోనిచ్చి వక్షోజాలను ఒక పాటులోకి తెచ్చుకుందని. ఇది-ఆడవాళ్ళు అప్పటిదాకా ఏదో పనిలోవున్నవాళ్ళు, (అంటే కొంత వయసు మళ్ళిన వాళ్ళు) అవి కొంత పక్కలకు జారటం, స్థితితప్పడం జరిగినవేళ, చేయిలోనికి పోనిచ్చి కుదురుచేసుకుంటారు. అప్పుడప్పుడు. ఇది చాలా స్వాభావికమైన సంగతి. పై విషయాలన్నీ చెప్పటం - ఆమె హొయలను గూర్చి చెప్పడం. కాగా ఇది అలాంటిది కాదు. మరి ఇలాంటి విషయాలను చెప్పినపుడే, రచయిత పరిశీలనా శక్తి, పాటవాలు బయల్పడతాయి. అలాగే బ్రాహ్మణుడై వుండీ, కోళ్ళపోరును ఎంత స్వాభావికంగా చెప్పాడో-ఆ తీరును చూస్తే- ఆశ్చర్య పోవడం

మన వంతు అవుతుంది. అవి, ఆయా సందర్భాలలో అరుస్తున్న తీరును- వివరించిన తీరు నిజంగా అబ్బురమైన విషయం. ఒక సన్నివేశాన్ని స్థూలంగా చూడటం, చూసి ఆనందించటం ఒక ఎత్తు. దానిని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించి ఇతరులకు చెప్పటం మరోఎత్తు. అన్నింటికంటె మించింది దానికి అక్షరాకృతి ఇవ్వడం-అంటే రచన లోనికి ఒదిగించటం! అలాగే పూటకూటింట భోజనంచేసి వస్తున్న కాసల్నాటి బ్రాహ్మణుని కిర్రుచెప్పుల విషయం చెప్పటం! ఎవడో ఒక బ్రాహ్మణుడు ఎదురైనాడు. అతన్ని అడిగి సమాచారం అంతా తెలుసుకున్నాడని చెప్పాల్సినచోట, వివరణ అవసరమేమివుంది? అంటే - ధరించిన బట్టల్నిబట్టి, ఆహార్యాన్ని బట్టి, వైఖరిని బట్టి, ఎవరు ఏ ప్రాంతం వారో చెప్పగలిగేటట్లుగా వున్నాయి. వారి వేషభూషలని గూర్చి చెప్పడం. ఇలాంటి సన్నివేశాలు మరి రెండు మూడున్నాయి. ఇక్కడ కిర్రుచెప్పులు వేసుకున్నాడని చెప్పడం అదనం. అంటే అతడి చూపునుండి ఏదో తప్పించుకు పోలేదు. ఇలా చెపితే, ఇది ఇతివృత్త పరంగా మంచనశర్మ చెప్పినట్లు. కాని ఆయన చేత ఆ మాట చెప్పించింది వల్లభామాత్యుడే ననేది మరువరాదు. పోనీ అతడు కాకపోతే ప్రేమాభిరామ కర్త రావిపాటి తిప్పన్న. ఎవరైతేనేం ఇక్కడ వ్యక్తమవుతోంది, వారి నిశిత పరిశీలనా దృష్టి. వాటిని చదువరులకు పరిచయం గావించాలన్న కోరిక. ఈ కృతి ద్వారా వెల్లడయ్యేది, ప్రధాన ఇతివృత్తం మిషగా, నాటి సాంఘిక విశేషాలు! ప్రధాన ఇతివృత్తం ఒక ఉల్లాసాన్ని కల్గిస్తే, ఈ విశేషాలు మరో విధమైన ఆనందాన్నీ, తృప్తినీ ఇస్తాయి. ఇంకా ఇలాంటి విశేషాలు గ్రంథమంతా చోటుచేసుకున్నాయి. అవి ఎవరికి వారుగా చదువుకోవచ్చును.

దీని రచన 15వ శతాబ్దంలోనే జరిగినా, క్రీడాభిరామమనే పేరుగల గ్రంథం ఒకటుందని మాత్రమే గత శతాబ్దం వరకూ తెలియ వచ్చిన సమాచారం. దీనిని మొదటిసారిగా వెలుగులోనికి తెచ్చిన మహానుభావులు కీ.శే. మానవల్లి రామకృష్ణకవిగారు. 1909 లో దీని మొదట ప్రచురణ జరిగింది. అప్పటికే శ్రీనాథుని వీథి పేరుతో ఆయన చాటువులతో కూడిన గ్రంథం ఒకటి అచ్చుపడింది. అందులోని రెండుపద్యాలు క్రీడాభిరామంలో వున్నాయి. ఆ కారణంగా కవిగారు క్రీడాభిరామం శ్రీనాథుని రచన కావడానికి అవకాశముందా అని సందేహించి, చివరకు కాదని, వల్లభరాయని రచనేనని నిర్ధారించారు. దానికి ఉపబలకంగా పూర్వకవుల ఉట్టకింపులను చూపారు. అందులో ముఖ్యమైనది, ఆళియరామరాయల ముత్తాత సోమభూపాలునికి అంకితమివ్వబడ్డ శ్రీధర ఛందంలో 'మంచన వింటివో,వినవో' అనే పద్యం వల్లభరాయని క్రీడాభిరామం లోనిదిగా ఉదాహరింపబడటాన్ని ఎత్తి చూపారు. ఇదంతా వారు ఎందుకు చేసినట్లు ? గ్రంథంలో వల్లభరాయ కృతమని వుండగా! అంటే-క్రీడాభి రామంలోని రెండుపద్యాలు అప్పటికే అచ్చుపడ్డ శ్రీనాథుని వీథి అన్న చాటు పద్యసంపుటిలో కానరావడం, అప్పకవిమున్నగు వారు ఇందులోని పద్యాలను శ్రీనాథుని వీథిలోనివిగా ఉదాహరించడం కారణాలుగా, అలాంటి అపోహకు తావు లేదని, ఇది వల్లభరాయ కృతియేనని

నిరూపించటానికి! అయితే జరిగింది వారు ఆశించిన దానికి భిన్నంగానే! అది, క్రీడాభిరామం శ్రీనాథుని రచనేనని నిరూపించే ప్రయత్నం.

ఈ పని చేసిన వారు ప్రముఖ పరిశోధక పండితులు కీ.శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. 1928లో వారు, దీనిని శ్రీనాథుని రచనే అని నిరూపిస్తూ విపులమైన పీఠికతో ప్రచురించారు. తరువాత మరి రెండు ముద్రణలు (1952,1960) పొందింది. 1960 తరువాత కూడా వెలువడిందేమో తెలియరాలేదు. ప్రస్తుతం నా వద్ద గలది 1960లో జరిగిన తృతీయముద్రణ. మొదటిముద్రణ (1928) మానవల్లి వారు ప్రకటించిన సుమారు 20 ఏళ్ళకు వచ్చింది. ఆ మాట ప్రభాకరశాస్త్రిగారు తమ పీఠికలో కూడా చెప్పారు. ఇక్కడ ఈ మాట చెప్పడానికి ప్రత్యేక కారణముంది. అదేమంటే శ్రీ ప్రభాకర శాస్త్రిగారు అనంతరం, (అంటే మానవల్లి వారి ప్రచురణ వచ్చిన తరువాత) తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయానికి క్రీడాభిరామానికి శుద్ధ ప్రతి వ్రాసుకోవడానికి వెళ్ళిన సందర్భంలో, అందులోని మొదటి సీసపద్యపు (అఖిల ప్రపంచంబు నన్యథా కల్పించె.....) ఎత్తుగడ చూచిన క్షణమే, క్రీడాభిరామం శ్రీనాథుని కృతి అనే అనుమానం కలిగిందని, దానికి కారణం అందలి యత్తదర్థక ప్రయోగమనీ, అది శ్రీనాథుని కాశీఖండ షష్ఠాశ్వాసంలోని 46 వ పద్యం ఎత్తుగీతిని పోలివుందని, క్రీడాభిరామం శ్రీనాథుని కృతే నని నిశ్చయించడానికి గల కారణాలలో, ముఖ్యంగా మొదలు ఆ అనుమానం రావడానికి అది కారణమైందని వారు తమ పీఠికలో వ్రాసారు. ఇక్కడ విశేషమేమిటంటే - అలాంటి అనుమానం అప్పుడు రావడమేమిటి? అప్పటికి సుమారు 20 ఏళ్ళ క్రితంగదా మానవల్లి వారు దానిని ప్రచురించింది. ఇంతకాలం లోపల వారు దానిని చూడనే లేదని భావించగలమా? చూసినట్లువారే వ్రాసుకున్నారు గదా! మరి ఇంతకాలంలో రాని అనుమానం ఇప్పుడే ఎలా కలిగిందో బోధపడదు. అంతేగాక వారి వాక్యవిన్యాసాన్ని బట్టి వారు క్రీడాభిరామాన్ని చూడటం అదే ప్రథమం అన్నట్లుగా భాసిస్తోంది.

ఇక, వారు అలా ఆ నిశ్చయానికి వచ్చిన తరువాత, అది శ్రీనాథుని రచనే అని నిరూపించటానికి చూపిన ఉపపత్తులు అనేకంగా వున్నాయి. ఆ మేరకు అవి సమంజసాలు గానే అనిపిస్తున్నాయి. వారి ధారణ అసామాన్యం. కనుక శ్రీనాథుని ఇతర రచనల్లోనుండి ఆయా పద్యాలలోని పాదాలకు పాదాలు, పదబంధాలు, పదాలు, అవి క్రీడాభిరామంలో చోటు చేసుకున్న తీరుతీయాలు విపులంగా, ఇక క్రీడాభిరామం శ్రీనాథుని రచనకాదు అని ఎవరూ అనడానికి వీలులేని విధంగా చూపి చెప్పారు. అయినా అలా అనే వారు ఉంటారనే ఊహ వారికే ప్రబలిందో, ఏమో, వాదమా నీకో దండమని కూడా వారే అన్నారు. సరే! వారన్నట్లుగా, అనుకున్నట్లుగా పలువురు పలువిధాలుగా శ్రీ శాస్త్రిగారి వాదనను ఎదుర్కొన్నారు! దానినలా వుంచితే- శ్రీ శాస్త్రిగారే, తాము చూపిన కొన్ని పదబంధాలు (భావాలుకూడా) నిజానికి శ్రీనాథుడే వాటిని సంస్కృత గ్రంథాలనుండి సంగ్రహించాడని, ఆ

గ్రంథాల పేర్లు, ఆ కవుల పేర్లు ఉదాహరిస్తూ చూపారు. అయినపుడు శ్రీనాథుడు గ్రహించినట్లు, వల్లభరాయడుకూడా గ్రహించి వుండవచ్చు గదా! వల్లభరాయని పాండిత్యం కూడా, ఆయనే చెప్పుకున్నట్లు తక్కువదేమీ కాదు గదా! అయితే అసలు వల్లభరాయని రచనే కాదన్నది శ్రీ శాస్త్రి గారి అభిప్రాయం). లేదా వల్లభరాయడు శ్రీనాథునినుండే గ్రహించివుండవచ్చును. ఇవి నా మాటలే కావు! శ్రీ శాస్త్రిగారి వాదాన్ని ఎదుర్కొన్న వారి మాటలు కూడా! వాటి నన్నింటినీ ఇక్కడ మళ్లీ ఎత్తి చూపడం అనవసరపు కాలహరణం. గ్రంథ విస్తరణ. అంతగా అక్కరపడ్డవారు. వాటినే చూడవచ్చును. అవి ఇప్పుడు లభ్యం కావనుకున్న వారికి వీలుగా శ్రీ బి.వి.సింగ రాచార్యగారు వాటినన్నింటినీ ఎమెస్కో వారి కొరకుగా కూర్చిన సందర్భంలో సంగ్రహంగా ఇచ్చారు. వాటినైనా చూడవచ్చును.

భావాలు, పదబంధాల విషయం అలావుంచితే, శ్రీశాస్త్రిగారు కొన్ని పదాలనిచ్చి, (శ్రీనాథుడు తన ఇతర కావ్యాలలో ప్రయోగించినవి) అవి క్రీడాభిరామంలో కూడా ఉపయుక్తమైనాయని, అలాకూడా క్రీడాభిరామం శ్రీనాథుని దేనని స్పష్టమవుతోందని వ్రాసారు. ఆ పదాలు క్రీడాభిరామంలో చోటుచేసుకున్న మాటనిజమే. ఇక్కడ నాకు ఒక మాట చెప్పాలనిపిస్తోంది. ముందు, శ్రీ శాస్త్రిగారి అసాధారణ ధారణనుగూర్చి, వారి ప్రజ్ఞాపాట వాలను గూర్చి ప్రస్తుతిస్తూ వ్రాసాను. అది అక్షరసత్యం. వారిపై నాకు గల ప్రత్యయమూ అంతే! అయితే వారి చెప్పినదంతా నాకు అంగీకార్యం కాదు. దానికేమి! ముందుచెప్పాను. వారెన్నో శ్రీనాథుని భావాలను, పదబంధాలను, పదాలను అలవోకగా ఎత్తిచూపారని. అవును అలవోకగానే చూపారని నేను విశ్వసిస్తున్నాను. కారణం ఒక్క శ్రీనాథుని కావ్యాలతోనే గాదు, అన్ని కావ్యాలతోనూ వారికిగల పరిచయం సాధారణమైనది కాదు. బహు వారములు వాటిని పఠించి వుంటేనే, అప్పటికప్పుడు ఉదాహరించటం సాధ్యమవుతుంది. ఎవరైనా ఒక పద్యం చదవగానే, అప్పుడే దానిని వింటున్నా, అది ఏ కవిదో, ఏ గ్రంథంలోనిదో, కనీసం ఏ కాలంలోనిదో కొంచెం అటూ ఇటూగా నైనా చెప్పలేకపోతే, అతడు సాహిత్య విద్యార్థే కాడనేది నా నిశ్చితాభిప్రాయం.

సరే, దాని నలావుంచితే, ఒక కవిరచనను గుర్తు పట్టటానికి ఉపకరించేవి, అతడు తరచుగా ఉపయోగించే పదాలు. మనం కూడా మాట్లాడేటపుడు కొన్ని కొన్ని పదాలు మనం కోరి ప్రయత్నం చేయకున్నా అవి మన మాటల్లో దొర్లుతాయి. వాటిని ఊత పదాలంటూ వుంటాము. అలాంటది కవుల రచనల్లోనూ చోటు చేసుకుంటుంది. అలాంటి వాటిననే కాదుగాని. శ్రీనాథుని రచనల్లో దొర్లే కొన్ని పదాలను శ్రీ శాస్త్రిగారు ఈ సందర్భంలో ఎత్తి చూపారు. ఆ పదాలమాట అలావుంచితే, శ్రీనాథుడు తన అన్ని కావ్యాల్లోనూ అలవాటుగా, ఎక్కువగా ఉపయోగించినవి కొన్నివున్నాయి. అలాగే, కొందరిని సంభావించటంలో (ముఖ్యంగా పార్వతీ పరమేశ్వరులను) ఆయనలో కాంత విలక్షణత కనుపిస్తుంది. పార్వతిని,

శివుని అర్ధాంగలక్ష్మి, వడకుగుబ్బలి కుమారి, మేనాత్మజ అని అనకుండా వుండలేడు. అలాగే శివుని మంచుంగొండ యనుంగు పెండ్లి కొడుకు అని అనకుండా వుండలేడు. ఆగలేడు. పార్వతిని గూర్చిన వాటిల్లో ఆయనకు ఇష్టమైన మరోపదం ఉమబోటి అనేది. ఈ పదాన్ని నాకు తెలిసినంతలో ఆయనకు ముందు ఉపయోగించింది పాల్కురికి సోమన. కాని వీటి ఊసే కనుపించదు క్రీడాభిరామంలో! పోనీ పార్వతీ పరమేశ్వరుల ప్రసక్తి అందులో లేదను కోవడానికి వీలులేదే! ఇక శివపూజ విషయం, ప్రసంగం చోటుచేసుకుంటే షట్కాలలింగార్చన, పంచబ్రహ్మషడంగ బీజసహిత ప్రాసాద పంచాక్షరి, లేదా కనీసం ప్రణవ పంచాక్షరి అనేవాటిని ప్రసక్తం చేయకుండావుండడు. క్రీడాభిరామంలో అవీ కనుపించవు. ఇక ఎవరిచేతనైనా స్నానమంటూ చేయిస్తే ఆయన చేయించేది అఘమర్షణ స్నానమే! క్రీడాభిరామంలో దాని ఊసూ లేదు. ఆ సందర్భం క్రీడాభిరామంలో లేదనుకోవటానికి లేదు మరి. అలాగే భోజనాల వేళను (పగలు) కుతపకాలమని చెప్పటం శ్రీనాథుని అలవాటు. చిఱుబంతి పసపు, కుఱ్ఱ, వలరాచ నీరు, చిన్నారి పొన్నారి, మాంజిష్ఠ (చీరలు) రారాపు చనుదోయి రాయిడి, తఱపి వెన్నెల, విధుమండలము, అరుణగభస్తి బింబము, మొగలివాకిలి, కన్నె గేదగిపువ్వు, ఆకంతంబుగ, ఎలనాగ, కటియాలనేయి, అసివాఱు, కోర్కులిగురొత్తు, కఱకు, మురువుసూపు-ఇంకా ఇలా ఎన్నెనా చూపవచ్చును గాని, క్రీడాభిరామవృత్తాంతంలో కనీసంగా చోటుచేసుకోదగినవి మాత్రమే-వాటిలో కూడా కొన్నింటినే ఇక్కడ చూపడం జరిగింది. మరి వీటి ప్రసక్తీ కానరాదే క్రీడాభిరామంలో! అది శ్రీనాథుని రచనే అయితే, ఆ పదాలు ఎందుకు చోటుచేసుకోనట్లు? కనుక దీనిని శ్రీనాథుని రచన అనడం పొసగనే పొసగదు. మరి శ్రీ శాస్త్రిగారు అలా ఎందుకు అభిప్రాయపడ్డారో- అదీ మొదటప్రచురణ అయిన 20 ఏళ్ళ తరువాత! ఇక, వల్లభరాయడు, శ్రీనాథుడు సమకాలం వారని శ్రీ శాస్త్రిగారు నిర్ధారించారు. కాని చరిత్ర దానిని అంగీకరించదుగాక అంగీకరించదు. ఇపుడు ఆ తబిసీళ్ళలోనికి వెళితే ఒక పట్టాన తెమలదు. కాదంటే రెండవ ప్రౌఢ దేవరాయల పాలనా కాలం, ఆయన తన తండ్రికి ప్రతినిధిగా ఉదయగిరిని పాలించినప్పుడు ప్రకటించిన శాసనకాలం, అప్పటి శ్రీనాథుని వయసు, పాకల (ఆయన స్వస్థలం) విడిచి అవచి తిప్పయ ప్రాపున కొండవీడు ఆస్థానంలో చేరదామనుకోవడం, మామిడి కుటుంబం వారికి పండితరాధ్య చరిత్ర, శాలివాహన సప్తశతి, శృంగారనైషధాలు అంకితమిచ్చిన తీరు-వీటన్నింటిని మనసులో వుంచుకుంటూ, వల్లభరాయని తాతతండ్రుల కాలాలను బేరీజు వేసుకుని చూడండి. విషయం బోధపడకమానదు. వారు మరోమాట కూడా అన్నారు. క్రీడాభిరామరచన భీమఖండ హరవిలాస రచనానంతరము కాశీఖండ రచనమునకు వెనుకనో ముందో రచియించి యుండవచ్చును అని. కాశీఖండం రచన వరకూ, శ్రీనాథుని రచనలు సాగిన వరుస ఎలాంటిదంటే - పండితారాధ్య చరిత్ర, శాలవాహన సప్తశతి, (కొండవీడులో), శృంగారనైషధం (కొండవీడులో, మామిడిసింగనకు

అంకితం చందవోలులో), హరవిలాసం (కంచిలో), భీమేశ్వరపురాణం, కాశీఖండం (రాజమహేంద్రవరంలో)–ఇదీ ఆ రచనల వరుస. ఈ విషయంలో ప్రభాకర శాస్త్రిగారు పొర పడ్డారనడంలో సందేహం లేదు. వారి నాటికి శ్రీనాథుని జన్మస్థలమేది అనే విషయంలో సంధిగ్ధత నెలకొనివుంది. అంతే గాక హరవిలాస రచనకు గల చారిత్రక నేపథ్యం విషయాన్ని చారిత్రకులుగాని, సాహితీ వేత్తలుగాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయాలపై ఆసక్తి గలవారు నా రచన 'అక్షరయజ్ఞం' చూడవచ్చును. తిరిగి దాని నంతా ఇక్కడ ఏకరువు పెట్టడం చర్వితచరణ మవుతుంది. వృథా కాలయాపన. ఇక క్రీడాభిరామం శ్రీనాథుని రచనగా వారు విశ్వసించారు గనుక, శ్రీనాథుని ఇతర రచనల ప్రసక్తిగావించారు తప్ప, అది వల్లభరాయకృతమే అయినప్పుడు ఈ పర్యాలోచనకు ప్రసక్తే లేదు.

ఇక శ్రీ శాస్త్రిగారు దీనిని వెలువరించిన తరువాత, వారి వాదాలు ఖండిస్తూ పలువురు తమ అభిప్రాయాలు వ్రాయడం జరిగింది. కాదన్నవారిలో ప్రముఖులు శ్రీ బండారు తమ్మయ్యగారు. వీరి పరిష్కరణముతో క్రీడాభిరామాన్ని వావిళ్ళవారు 1960 లో ప్రకటించారు. (పిదప 1968లో బి.ఎస్. శాస్త్రిగారి పీఠికతో నవోదయ సమితి, హైదరాబాద్ వారు క్రీడాభిరామాన్ని ప్రచురించినట్లు తెలియవచ్చింది. నేను దానిని చూడలేదు.అయితే తమ్మయ్యగారు, క్రీడాభిరామ రచనలో వల్లభరాయనికి శ్రీనాథుడు సాయపడి వుండవచ్చుననే అభిప్రాయాన్ని వెలవరించారు.దాదాపుగా ఇదే అభిప్రాయాన్ని చిలుకూరి పాపయ్య శాస్త్రిగారు వ్యక్తీకరించారు. టేకుమళ్ళ అచ్యుతరావుగారు, టేకుమళ్ళ కామేశ్వరరావుగారలు కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అలాంటిదేమీ లేదని, ఇది పూర్తిగా వల్లభామాత్యరచన అని భావించిన వారు కుందూరి ఈశ్వరదత్తుగారు. శ్రీనాథుని ప్రమేయాన్ని నిర్ద్వంద్వంగా త్రోసి రాజని, వల్లభరాయ కృతమేనని చాటినవారు శ్రీ బి.వి.సింగరాచార్య గారు. (చూడు. క్రీడాభిరామము. సమావలోకనము. ఎమెస్కో సంప్రదాయ సాహితి. జూన్ 1972). వీరి అభిప్రాయంలో, శ్రీనాథుని పద్యాలను వల్లభరాయడు అనుకరించటానికి కారణం, ఆయనపై భక్తి ప్రపత్తులు కాక, వ్యంగ్యానురూపంగా చిత్రించటమనేదే ఆయన ఆశయమని చెప్పారు. ఈ అభిప్రాయాన్నే మొదట మానవల్లి వారు వెలిబుచ్చారు. అది అలాగే కావచ్చును. కాకపోవచ్చును. శ్రీ సింగరాచార్యగారు ఒక మంచి మాటన్నారు. అది, గ్రంథస్థసాక్ష్యం వల్లభరాయనిది అని వుండగా, దానిని సందేహించాల్సిన పనేమి అనేది. ఇది నిఖార్సైన మాట. ఎవరో అనంతర లాక్షణికులు, కొన్ని పద్యాలను తమ అవసరార్థమై ఉపయోగించుకున్న వాటిని పురస్కరించుకొని, గ్రంథస్థ సాక్ష్యాన్ని కాదని, ఆ లాక్షణికుల అభిప్రాయాన్ని మాత్రమే గ్రహించి, దీనికర్త శ్రీనాథుడని నిరూపించే ప్రయత్నం దేనికో అర్థంకాదు. ఏమి? ఆ లాక్షణికులు పొరపడి వుండ కూడదా? వారు గ్రంథాన్ని చూసే వ్రాసారని ఎందుకనుకోవాలి? వినికిడి పైనా, వారి విశ్వాసంపైనా ఆధారపడి వ్రాసివుండవచ్చుగదా! కనుక ఇది శ్రీనాథుని రచన

అనడం అసంగతం. అయినపుడు శ్రీ ప్రభాకర శాస్త్రిగారు ఎందుకు అలా భావించారో తెలియవలసివుంది. దానిని పరామర్శించే ముందు మరికొన్ని విషయాలు చెప్పుకోవాల్సినవి వున్నాయి.

శ్రీ ప్రభాకర శాస్త్రిగారు, క్రీడాభిరామం శ్రీనాథుని రచనే అని నిరూపించటానికి గ్రహించిన పద్యాల్లో 'పంచారించిన..........." ఇత్యాదిగా గల పద్యమొకటి. ఈ పద్యంలో 'ణిసి' ధాత్వర్థాన్ని అనుష్ఠించటం శ్రీనాథుని నైషధంలో వుండటాన్ని చూపి, ఆ పదాన్ని ఉపయోగించటంలో శ్రీనాథునికి అభిరుచి హెచ్చు అని వ్రాసారు. అంటే-ఆ పదం క్రీడాభిరామంలో కూడా ఉపయోగింపబడింది కనుక, అది శ్రీనాథుని రచనే అని వారి అభిప్రాయం. ఏమి? ఆ పదాన్ని ఇంకెవరూ ఉపయోగించరాదనే ఆంక్ష ఏమైనావుందా? ఉంటుందా? (ఆయనకు అత్యంత ప్రియమైన పదాల విషయం, అవి క్రీడాభిరామంలో కనుపించని వైనాన్ని గూర్చిముందు చెప్పుకున్నాము) ఈ సందర్భంలోనే, అదేపద్యంలో ప్రయుక్తమైన 'పంచాస్త్రోపనిషద్రహస్య' అనే దానిని చూపుతూ, శ్రీనాథుని భీమఖండంలోని గంధర్వోప నిషద్రహస్యములు వక్కాణింతురు (1-91) అని కలదు అని వ్రాసారు. ఇక్కడ దానికి గల పోలిక 'ఉపనిషద్రహస్య' అన్నంతవరకే. కాని రెంటి సందర్భాలు వేరు. ఏమీ సంబంధంలేనివి. గాంధర్వవిద్య (సంగీతం) ఒకవిధంగా ఉపనిషత్తే! వేదమే. పంచాస్త్రోప అనడంవలన మన్మథస్ఫురణ వలన అదీ వేదమే! సుమనోబాణాసనామ్నాయ విద్యోపాధ్యా యినిగా గదా మాచల్దేవి పరిచయం గావింపబడింది. స్మరదివ్యాగమ కోవిదుల్ మదనశిక్షా పరతంత్ర విద్యావిదులని గదా, జారధర్మాసనంలోని విటులను పేర్కొన్నది. కాబట్టి మన్మథవేదాన్ని పంచాస్త్రోపనిషత్తుగా చెప్పటం వరకూ బాగానేవుంది. కాని ఆ తరువాత చెప్పింది, అదే-ఆ వేద పరమబ్రహ్మస్వరూపంగా, ఆ కర్ణాటి కాంచీదామ పదాన్ని చెప్పడంలోని ఔచిత్యమేమిటి? ఎక్కడనుండి ఆ ఔచిత్యాన్ని క్రీడాభిరామకర్త సాధించాడు? శ్రీనాథుడు ఏ సందర్భంలోనైనా ఈ మాట అన్నాడా? అని వుంటే శ్రీశాస్త్రిగారు ఎత్తి చూపి వుండే వారు కారా? అయితే ఉపనిషత్తు అని గాకపోయినా, శ్రీనాథుడు 'లసత్ప్రసూనశర వేద రహస్యము'లను పేర్కొన్నాడు. (శృంగారనైషధం 3-177). ఉపనిషత్ పదసామ్యాన్ని కోరి శ్రీశాస్త్రి గారు భీమఖండం ప్రయోగాన్ని ఎన్నుకున్నారు. దానినలా వుంచితే, కర్ణాటి కాంచీ దామ పదాన్ని పంచాస్త్రోపనిషద్రహస్య పరమబ్రహ్మ స్వరూపంగా క్రీడాభిరామకర్త సంభావించడానికి కారణమేమిటి? అంటే-అది అతని స్వకపోల కల్పితమా లేక ఏదైనా ఆకరముందా? ఇక్కడ కాంచీదామపదంతో సంభావింపబడుతున్నది కేవలం, ఆమె మొల నూలికి దిగువ భాగం గాక, మరునిల్లునే గదా అతడు అన్యాపదేశంగా ప్రస్తావిస్తున్నది. దానిని అలా చెప్పటానికి గల ఆకరమేమిటనేది ప్రశ్న. దీనికి తలవకార బ్రాహ్మణం ఆకరం. అది, బ్రహ్మకు రెండే ముఖాలని, అంటే-ప్రపంచస్థితికి మూలం రెండేనని, ఆ రెండూ ఆహారం

స్వీకరించే నోరని, రెండవది స్త్రీ జననాంగమని చెప్పింది. నిజమంతేగదా! ఈ భావాన్ని చెప్పే వక్కణమొకటి గ్రామీణుల వ్యవహారంలో నిలిచివుంది. ఒకటి మింగుడు. రెండవదానిని పాఠకులు ఊహించుకోగలరు గదా! ఇక్కడ మనం భావించవలసింది, క్రీడాభిరామకర్తకు ఆ ఉపనిషత్తుతో గల పరిచయాన్ని, దానిని తన అభిమతానికి అనుగుణంగా మలుచుకొని ఉపయోగించిన తీరును! మరి ఈ ప్రజ్ఞకు అతనిని అభినందింప వలసివుంది గదా!

క్రీడాభిరామంలో ప్రసక్తమైన పూటకూటింటి భోజనంలో వడ్డించే పదార్థాలను గూర్చిన సమాచారంలో పెసరపప్పు ప్రస్తావన వుంది. దీనిని గూర్చి, శ్రీ శాస్త్రిగారు ఎలాగూ దీనికర్త శ్రీనాథుడని విశ్వసించారు గనుక, ఆయన ఇతర కావ్యాలలో పెసరుపప్పుకు గల ప్రసక్తాలను దృష్టిలో వుంచుకుని శ్రీనాథునకు కందిపప్పు ప్రియముగాదేమో! పెసరుపప్పునే బహువారములు పేర్కొన్నాడని ఒక చెణుకు విసిరారు. శ్రీ శాస్త్రిగారు ఇలా ఎందుకన్నారో తెలియరాదు. భోజనం లోనికి ఆధరువుగా ఉపయోగపడే రెండు పప్పు ధాన్యాల్లో (కంది, పెసర) పెసరుకు గల ఔషధ ప్రాశస్త్యం శాస్త్రగారికి తెలియదని అనుకోవడం ఎలా? కన్నడిగులైతే నానబెట్టిన (కొంచెం ఉప్పుతో) పెసరపప్పును (వడపప్పు) భోజనంతో వడ్డిస్తారు. కంది (ఇందులో చాల భేదాలున్నాయి.) సహజంగా మెట్టపంట. పెసర రెండు విధాలైన భూముల్లోనూ పండుతుంది. ఇప్పుడంటే తగ్గింది కాని పప్పు విషయంలో పెసరకే ప్రాధాన్యం. ముఖ్యంగా నాగరకుల విషయంలో! ఇక పితృకార్యాల విషయంలో నైతే తప్పనిసరి. పప్పుకు నేయి తోడు గదా! కందిపప్పుకంటే, పెసరపప్పు విషయంలో దాని వినియోగం అధికం. కందిపప్పు ఉపయోగించటానికి మొదటికారణం నేయికి కాగల అధిక వ్యయాన్ని భరించలేకపోవడమే. రుచి విషయం (వ్యక్తినిష్ఠమే అయినా) లో మొదటి స్థానం పెసరపప్పుదే. పొట్టకు బలాన్నిస్తుంది. ఆయుర్వేదం దీనిని నొక్కి చెపుతుంది మరి.

మూలంలో లేకపోయినా శ్రీనాథుడు భీమఖండ, హరవిలాసాల్లో కొన్ని విషయాలను శృంగారపరమైన వాటిని అభిరుచికొద్దీ రచించాడని, అంటే ఆ విధంగా కూడా శ్రీనాథుని అభిరుచి అలాంటిదని, ఆ విధంగా కూడా క్రీడాభిరామ రచన శ్రీనాథునిదేనని నిరూపించారు. ఈ మాట నిజమే. మూలాతిక్రమణం నన్నయగారే చేసారు గదా! అర్జునుని తీర్థయాత్ర సందర్భంలో దక్షారామాన్ని దర్శింపచేసారు. పైగా అది జగదాది అని అన్నారు. దానికి చారిత్రక కారణాలు వేరు. ఇక్కడ తెలియవలసింది, అతిక్రమణమనేది శ్రీనాథుని తోనే ప్రారంభం కాలే దన్నంత వరకే! అవును శ్రీనాథుడు హరవిలాసంలో కంచి అఱవతలను వర్ణించాడు. తానువెళ్ళిన చోట తటస్థపడ్డవారిని వర్ణించి చెప్పటం శ్రీనాథుని కొక సరదా! ఆ విధంగా వారి కట్టుబొట్టులను వర్ణిస్తూ వారిని మన కన్నుల ముందు పొడగట్టించాడు. ఇదేమీ అసంగతమైన విషయం కాదు గదా! క్రీడాభిరామం వలన తెలియవచ్చే విశేషాలు కావ్యం, లేదా వచనామవర్తనం ఎలాగూ చదువబోతున్నారు కనుక పాఠకులకు తెలియవస్తాయి.

దానికి తోడుగా, ఆయావివరాలను సంగ్రహంగా వేరే గుదిగుచ్చటం జరిగింది. దాని వలనా వివరాలు అందుబాటులోకి వస్తాయి.

క్రీడాభిరామంలోని రెండవపద్యం (సీసపద్యం) ఎత్తుగీతి చదివిన క్షణమే శ్రీశాస్త్రిగారికి, అది శ్రీనాథుని రచన అని అనిపించింది. ఇక దానిని అలా నిరూపించే ప్రయత్నమే చేసారు. ఆ వివరాలు ముందు చదివారు. ఆ నిరూపణ కొరకు వారు సహాయభూతంగా తీసుకున్నది శ్రీనాథుని పేరుతో లోకంలో చెలామణి అవుతున్న చాటువులు. (అందులో కొన్ని శ్రీనాథునివి కాకపోవచ్చునేమో అని శ్రీశాస్త్రిగారే సందేహించారు.) ఆయన ఇతర కావ్యాలలో వారు ఆశ్లీలంగా భావించిన కొన్ని పద్యాలు. అయితే వారే మరో మాట కూడా అన్నారు. సుమారుగా వీటి అన్నింటికి సంస్కృతంలో మాతృకలున్నాయని, వాటిని, వాటికర్తల పేర్లను ఉట్టంకించారు. ఈ విషయం వారి ఋజుత్వానికి అద్దంపడుతోంది. అయితే వారు తపన పడిందంతా, శ్రీనాథుడు అలా ఎందుకు వ్రాయాలా అని. మరి ఆయన వ్రాయకపోతే ఆ విశేషాలు ఎలా తెలియవస్తాయనేది నా ప్రశ్న. వారి పట్ల ఔదార్యం చూపారు శ్రీశాస్త్రిగారు. తెనుగు (సంస్కృతం అందరికీ అందుబాటులో వుండేది కాదు గనుక) అయితే అందరికీ అందుబాటులోకి వచ్చి సంఘం ఎక్కడ చెడిపోతుందో ననేది వారి బెంగ! వారిది అనవసరపు భయం! కావ్యాలు (తెనుగువే) చదివే వారెందరు? చదివిన వారెందరు గనుక? మరి ఇప్పటి సినిమాలు చూస్తే శాస్త్రిగారు ఎంత తల్లడిల్లిపోయే వారో గదా! అయినా సంఘం దాని త్రోవన అది పోతూ వుంటుంది. దాని నెవడూ ఆపలేడు. ఆది సంస్కరింపబడాలంటే–దానికి తగు సమయం ఆసన్నం కావాలి. దానికి తగు ప్రయత్నం జరుగుతూ వుండాల్సిందే. దీనినెవరూ కాదనరు, అప్పటి తీరు తీయాలిలాగున్నాయి, అని తెలియడానికైనా, దానినుండి పాఠాలు నేర్చుకోవటానికైనా క్రీడాభిరామం ఉపయోగపడుతోంది గదా! దానిని శాస్త్రి గారూ కాదనడం లేదు! వారికి వచ్చిన ఇబ్బంది అంతా, శ్రీనాథుడు అలాంటి రచన ఎందుకు చేయాలి అని. శ్రీనాథుడు దాని కర్తకానపుడు వారికి దాని విషయకంగా వచ్చిన ఇబ్బందేమీ ఉన్నట్లు తోచదు!

క్రీడాభిరామం శ్రీనాథుని రచన కాదు. అవుననడానికి వారు చూపిన ఉపపత్తులనూ, అవి వీగిపోయిన, పోతున్న విషయాన్ని చూసాము. అదలా వుంచితే శ్రీనాథుడు దీనిని వ్రాసి సొమ్ముకొరకు వల్లభరాయని పేర వెలయించాడని, శ్రీ శాస్త్రిగారు వ్రాసారు. శ్రీనాథుడిని బహువారాలు తరచి చదువుకున్న వారుగా శ్రీ శాస్త్రిగారు మనకు దర్శనమిస్తున్నారు. శ్రీ నాథుని వ్యక్తిత్వం వారికి అలా ఎలా దర్శనమిచ్చిందో అర్థంకాదు. శ్రీనాథుడు తానై చెప్పుకోకపోయినా, ఇతరులు ఆయన్ని గూర్చి చెప్పిన మాటల వలన, ఆయన వ్యక్తిత్వం మనకు తెలియవస్తోంది గదా!

**మామిడి సింగన** మాటల్లో అతడు

బ్రాహ్మీదత్త వరప్రసాదుఁడ వురు ప్రజ్ఞా విశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చన కళాశీలుండ వభ్యర్థిత
బ్రహ్మాండాది మహా పురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళానిధానమవు నీ భాగ్యంబు సామాన్యమే!

**అవచి తిప్పయ**

కనులనాభుని పౌత్రుఁ గవితామహారాజ్య
భద్రాసనారూఢుఁ బరమపుణ్యుఁ
బాత్రు నాపస్తంబ సూత్రు భారద్వాజ
గోత్రు సజ్జనమిత్రుఁ గులపవిత్రు
భీమాంబికా మారనామాత్య నందను
నఖిల పురాణ విద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖా ధీతి నిష్ణాతు
నంధ్ర భాషా నైషధాబ్జ భవుని
నుభయ భాషా కవిత్వ ప్రయోగకుశలు
............................................
ఆగమజ్ఞాన నిధివి తత్త్వార్థ ఖనివి
బహుపురాణజ్ఞుఁడవు శుభ భవ్యమతివి
........................................

అని గదా తన బాలసఖుని మన్నించాడు.

**బెండపూడి అన్నయామాత్యుడు**

వినిపించి నాఁడవు వేమభూపాలున
కఖిల పురాణ విద్యాగమములు
కల్పించి నాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధ కావ్యమాంధ్రభాష
భాషించి నాఁడవు బహుదేశ బుధులతో
విద్యాపరీక్షణ వేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తి స్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందుఁ
బాకనాటింటి వాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వమలమతివి
నాకుఁగృపసేయు మొక ప్రబంధంబు నీవు
కలిత గుణగణ్య శ్రీనాథ కవివరేణ్య

అని గదా ఆయన్ని ప్రశంసించాడు.

**అల్లాడ వేమారెడ్డి**

ఈ క్షోణిన్నిను బోలు సత్కవులు లేరీనేఁటి కాలంబునన్
దాక్షారామ చళుక్య భీమవర గంధ ర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ గంధసార ఘుసృణ ద్వైరాజ్యభారంబు న
ధక్షించున్ గవి సార్వభౌమ! భవదీయ ప్రౌఢ సాహిత్యముల్

అని గదా కీర్తించాడు. మరి ఇవన్నీ పొల్లు మాటలందామా?

తన వ్యక్తిత్వాన్ని గూర్చి తానుగా ఆయనేమీ చెప్పుకోకపోయినా, ఆయన తీర్చిదిద్దిన ఇతివృత్తాల్లోని వ్యక్తుల తత్వాలనుబట్టి, ఇతర ఘటనలను బట్టి కొంతకు కొంత గ్రహించే అవకాశముంటుంది.

కాశీఖండంలో, వింధ్య పర్వతం మాటలుగా ఇలా అనిపించటం జరిగింది.

శాస్త్రమాచార్యసన్నిధి జదువఁడేని
నిద్ధబోధంబు మది సంగ్రహింపఁడేనిఁ
దెగువమీఱి ప్రతిజ్ఞ సాధింపఁడేని
జ్ఞాతి జయమందఁడేని తజ్జనుఁడు జనుఁడె.

అలాగే, ఆయన తత్వాన్ని పట్టి ఇచ్చే పద్యం, ఆ వెంట చెప్పినది 'కంటికి నిద్రవచ్చునే ....' ఇత్యాదిగా గలది. శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు అని మామిడి సింగన మాటల్లో చూసాము.

తన తాతగారిని గూర్చి

కనకక్ష్మాధర ధీరు వార్ధి తటవాకల్పట్టణాధీశ్వరున్
ఘనునిన్ బద్మపురాణ సంగ్రహ కళాకావ్య ప్రబంధాధిపున్
వినమత్కాకతి సార్వభౌముఁ గవితా విద్యాధరుం గొల్తు మా
యనుఁగుం దాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్య చూడామణిన్.

అని కీర్తించాడు. ఇక్కడ చెప్పుకోవలసింది తాతగారి విద్యావైభవం సంగతి అలావుంచితే ఆయన 'పాకల' రేవుపట్టణానికి సర్వాధికారి. అది కాకతి రెండవ ప్రతాపరుద్రుని వలన ఆయనకు కట్టబెట్టబడ్డ అధికారం. మరి ఆయన సిరి సంపదలు ఎలాంటివై వుంటాయి. కుటుంబగౌరవం, వైభవం ఎలా వుండి వుంటాయి. గ్రామాధికారులే వైభవంగా జీవించిన కాలంలో ఆ కుటుంబం ఎలా జీవించి వుంటుంది! శ్రీనాథుని కాలానికి రాజకీయ పరిస్థితులూ మారాయి. సంపద మూడవతరం నాటికి ఎలాగూ హరించుకుపోతుంది! అయినా ఇంగువ కట్టిన గుడ్డ కదా! శ్రీనాథుడు దైన్యానికి పాల్పడతాడా! ఆయన రాజుల్ని ఆశ్రయించాడు. సందేహమేముంది గనుక! అయితే తనను ఎరిగి గౌరవింపగల వారిదగ్గరకే వెళ్ళాడు. వారి

ద్వారానే ఆశ్రయం పొందాడు. కొండవీడుకు, అక్కడ తిప్పయ్య బాల్యస్నేహితుడున్నాడు గనుక వెళ్ళాడు. కర్ణాట కటక పద్మవన హేళి శ్రీనాథ భట్టసుకవినని చెప్పుకున్న శ్రీనాథుడు.తనకు దగ్గరలోనే వున్న ఉదయగిరికి (కర్ణాటకటక మధ్య స్థలంగా. శాసనాల్లో చెప్పబడింది. అప్పుడు రెండవ ప్రౌఢ దేవరాయలు తండ్రికి ప్రతినిధిగా పాలిస్తున్నాడు) వెళ్ళలేదే! కారణాంతరాల వలన ఆశ్రయం కొండవీడులో లభించనప్పుడు, మామిడి కుటుంబంవారితో గల సన్నిహితత్వం వలన (నిజానికి మామిడి సింగన తండ్రి కొండవీడులో మంత్రి. వారి మాటపై సింగన దగ్గరకు చందవోలుకు వెళ్ళాడు. కొండవీడు పెదకోమటి వేముని వశమైన తరువాత (అది అలా కావడంలో శ్రీనాథుని పాత్ర చాలా వుంది). విద్యాధికారిగావుండి ఇతరులకు అగ్రహారాలు ఇప్పించాడు తప్ప తానై ఏమీ గ్రహించ లేదే! కొండవీడులో రెడ్డి రాజ్యం పతనమైనాక దూరపు బంధువు బెండపూడి అన్నయ మంత్రి ప్రాపున రాజమహేంద్రవరం చేరాడు. అక్కడ ఆయన స్థానిక పండిత శ్రేణి నుండి ఎదురైన నిరసనను రాజసంగా ఎదుర్కొన్నాడు. ఆ సందర్భంలో ఆయన చెప్పిన చాటువు. 'హంసీయానకుఁగామికిన్నధమరోమావళుల్.....'. ...ఇత్యాదిగా గలది. వారితో గల వైరుధ్యాన్నే, భీమఖండంలో ముందుగా కవిత్వమంటే ఎలావుండాలో చెప్పి పిదప నాలుగు పద్యాల్లో వారిని నిరసించాడు.

హర చూడా హరిణాంక వక్రతయుఁ గాలాంత స్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధర స్ఫుట తటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యముల్ దిక్కులం
జిరకాలంబు నటించు చుండుఁ గవి రాజీ గేహ రంగంబులన్.

కుకవులను నిరసించిన సందర్భంలో

వెస వసుధా స్థలంబునఁ గవీంద్రులు గొందఱు శేముషీ మషీ
రసము మనః కటాహ కుహరంబుల నించి కలంచి జిహ్వికా
కిసలయ తూలికం గొని లిఖింతురు కబ్బము లెన్నఁగా మహా
వ్యసనముతో నిజానన వియత్తల తాళ పలాశ రేఖలన్.

బోధమల్పంబు గర్వమభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మత్సరము ఘనము
కూప మండూకములుఁ బోలెఁ గొంచె మెఱిఁగి
పండితం మన్యులైన వైతండికులకు.

నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ
నడరికాకులు బిట్టు పెద్దఱచి నప్పు
డుడిగి రాయంచ యూరక యుంట లెస్స
సైఁపరాకున్న నెందేనిఁ జనుట యొప్పు.

ప్రౌఢిఁ బరికింప సంస్కృత భాష యండ్రు
పలుకు నుండికారమున నాంధ్ర భాష యందు
రెవ్వ రేమన్న నండ్రుగా కేల కొఱంత
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష.

కవిత్వ విషయమై ఇంత నిక్కచ్చి తనమున్న వ్యక్తి, ధనానికి ఆశపడి తాను వ్రాసిన కావ్యాన్ని మరొకరి పేర వెలయించాడని భావించగలమా! పోషించే ప్రభువులు కనుమరుగైన వేళ వ్యవసాయాన్ని నమ్ముకున్నాడు తప్ప యాచనకు పాల్పడ లేదే ఆయన. కూడూ గుడ్డ వసతి కల్పింప గల వారే ఆయనకు కరవైనారా! ఆ మాత్రపు ఈ మాత్రపువారు ఆయనను పోషించ లేరు. అలాంటి వారి పంచన ఆయన చేరనూ లేదు. కనుకనే వ్యవసాయానికి దిగాడు. అది బెడిసి కొట్టిన వేళ, శిక్ష ననుభవించటానికే సిద్ధపడ్డాడు తప్ప, ఏదోవిధంగా అధికారులను మెప్పించి పన్ను భారాన్ని మాఫీ చేయించుకునే ప్రయత్నం చేయలేదు. ఆయనంటూ అడిగితే, ఆ మాత్రం సాయమందించే వారే కరవైనారా! 'దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ నరుగుచున్నాడు. శ్రీనాథుఁ దమరపురికి' అనే రాజసం గల వ్యక్తి కావ్యాన్ని అమ్ముకున్నాడని భావించగలమా! కాని శ్రీశాస్త్రి గారికి అలా అనిపించటం మన దురదృష్టం తప్ప మరే మనుకోగలం! శ్రీనాథుని మీద వారికి ఎంత ప్రత్యయముందో! వారే వ్రాసుకున్నారు గదా! శ్రీనాథుని రచన పోగూడదనే కోరికతోనే దానిని (క్రీడాభిరామాన్ని) ప్రచురిస్తున్నామని చెప్పారు గదా! ఎప్పుడు? క్రీడాభిరామాన్ని విషముష్టి విత్తులు, నాభి, నల్లమందు, ఉల్లిపాషాణాలతో పోలుస్తూ! (కాని వారి కంటే ముందే మానవల్లి ప్రచురించారు).

శ్రీశాస్త్రిగారు దీనిని బూతుపుస్తకంగా పరిగణించారు. అసభ్యమూ, అశ్లీలమూ అయిన రచన అన్నారు. ఆ విషయాలను తరచబోయేముందు, వారు వ్రాసిన మాటనొక దానిని ప్రస్తావిస్తూ శ్రీ బి.వి. సింగరాచార్య గారు అన్నదానిని ఒకటి విచారించాల్సివుంది. శ్రీ శాస్త్రిగారు ఏమని వ్రాసారంటే- తంజావూరి లోని ప్రతి బాగా శిథిలమైపోయిందని, దానిని చూసి తాము వ్రాసుకున్న ప్రతి గనుక పోతే, ఇక-క్రీడాభిరామం ఆంధ్రదేశానికి లభ్యమయ్యే అవకాశం లేదని. దానిపై సింగరాచార్యగారు, తంజావూరులో ఇప్పటికీ (జూన్1972) క్రీడాభిరామ తాటాకుప్రతి డి.నెం. 512తో మిక్కిలి ప్రాచీనంగా కనిపిస్తున్నా ఎక్కువ శిథిలావస్థలో లేదని, ప్రభాకరులు అలా ఎందుకు అభివర్ణించారో అని వ్రాసారు. 1988-1998 మధ్యకాలంలో నేను మొత్తం ఆరు పర్యాయాలు తంజావురు సరస్వతీ మహల్ లైబ్రరీని వివిధ విషయాల నిమిత్తం (ముఖ్యంగా హేమాబ్జనాయికా స్వయంవరం, కస్తూరి రంగకవి శతకం, మరి ఇతర కావ్యాలు చూడటానికి) సందర్శించాను. ఆ సందర్భాల్లో రెండుపర్యాయాలు క్రీడాభిరామాన్ని నేనూ చూసాను.

ఇక క్రీడాభిరామం శాస్త్రిగారు చెప్పినట్లు బూతు, అశ్లీలము, అసభ్యమూ అయిన రచనేనా అనేది పరిశీలించాలి. అయితే ఈవిషయమై కూడా శ్రీశాస్త్రిగారు అలా అంటూనే దాని ప్రాధాన్యం దానికి వుందని వ్రాసిన విషయం మనం జ్ఞప్తితో వుంచుకోవలిసి వుంది. బూతు పదాన్ని మనం అశ్లీలమన్నదానికి సమంగా ఉపయోగిస్తున్నాము. అంటే, పదుగురి ఎదుటా మాట్లాడగూడని మాటలు. అలాగే స్త్రీ పురుషుల మర్మావయవాలను తెలిపే మాటలు కూడా! కాని సన్నిహితులమధ్య అవి మాట్లాడ కుండా వుండలేనితనం కూడా ఒకటి వుందనే సంగతినీ మనం గుర్తుంచుకోవాలి. శిష్టాచార కుటుంబా లనుకున్న వాటిల్లోనే, చిన్న ఆడపిల్లలను ముద్దుగానే కావచ్చుగాక- లంజకానా అనడం నాకే గాదు. అంగీకరించే సహృదయముండాలే గాని, చాలమందికి తెలిసిన విషయమే. ఇక స్త్రీ పురుష సంబంధాల విషయంలో మనకు కొన్ని కట్టుబాట్లున్నాయి. వావి వరుసలున్నాయి. వాటిని పాటించటం సంఘం ఆరోగ్యానికి ఎంతో అవసరం. దీనిని ఎవరుమాత్రం కాదంటారు? మొదలు ఎందుకు కాదనాలి. అయితే స్త్రీ పురుష ప్రకృతుల పట్ల ఆకర్షణ సహజం. అది సంఘ అనుమతికి లోబడి వుంటే సభ్యం. కాకపోతే అసభ్యం, ఆశ్లీలం. అంటే సభ్యత అనేది సంఘంలో వ్యక్తుల పాటింపుపై ఆధారపడి వుంటుంది. పాటించాలని సభ్య సమాజం కోరుకుంటుంది. కాని దాని కతీతమైన వర్తన ఎప్పుడూ వుంటూనే వుంది. దానిని సరిచేయడానికే జరుగుతున్న బోధ అంతా! బోధను ఆచరించే వారు ఆచరిస్తున్నారు. లేని వారు లేదు. కొండొకచో బోధించేవారే, తమ బోధకు కట్టుబడరు. మరి కట్టుబాట్లు, సభ్యత ఏమైనాయి! వాటిదారి వాటిది. బలవత్తరమైనది స్త్రీ పురుష ప్రకృతులలో గల సహజమైన ఆకర్షణ. వాంఛ! జీవాతువు, అంతే! సత్యాన్ని అంగీకరించగల ధైర్యముంటే-అది అంతే!

ఇక లైంగిక క్రియా కలాపాన్ని బూతు అనగలమా! అసహ్యించుకుని అడ్డుకట్ట వేయగలమా! అది అలా జరగకూడదనేదే గదా మన పురాణాల బోధ అంతా! బూతులో పుట్టి, బూతులోనే పెరుగుతున్నాము. ఎప్పుడు? దానిని బూతు అనుకుంటే! అయితే అది బహిరంగం కావడం, అనుకోవడం మాత్రం హర్షించ దగింది కాదు. ప్రోత్సహించ దగిందీ కాదు. అదే సమయంలో నిరోధించగల సత్తా కూడా ఎవరికీ లేదు. మర్యాదస్తుల విషయం వేరు. అందుకే ఒక ఇంగ్లీషు ప్రొఫెసరు గారు ఒక మాటన్నారు. బ్రతుకంతా బూతే! మాట్లాడు కోవటానికి ఆస్కారం, ఎలాగూ లేదు. సాహిత్యంలో కూడా లేకపోతే ఎలాగయ్యా అని!

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఇంతకీ బూతు అంటే ఆశ్లీలమూ, అసభ్యమూ అయినది కాదు. అర్థవిపరిణామం వలనే దానికి ఆ అర్థాలు సంక్రమించాయి. ఆశ్లీలమూ, అసభ్యమూ అయిన దాన్నే ఆ పదం వ్యక్తీకరించేటట్లయితే, 'బూతు వొగడినట్లు వొగిడెదు' అని శ్రీమహాభారతం ఎలా వుంటుంది. అక్కడ సందర్భమూ అది కాదు గదా! మరి భారతం లోని మాటకు అర్థమేమిటి? ఇంపు, ఇష్టమూ అనే గదా! నిజం! దాని అర్థాలు అవే! తూర్పు

గోదావరి జిల్లాలో ఇప్పటికీ ఆ పదాన్ని ఆ అర్థాల్లోనే ఉపయోగిస్తున్నారు.

దాని నలా వుంచితే, ప్రచారం లోనున్న భావనలో నైనా క్రీడాభిరామం బూతును, అశ్లీలాన్ని అసభ్యాన్ని బోధిస్తోందా! సంఘంలోని ఆయా వ్యక్తుల అబిరుచులను చెపుతోందా! ఆ అభిరుచి అప్పుడే అనుకోవడమేమి ఇప్పుడు మాత్రం లేదా! అంటే అలాంటి అభిరుచి గలవారి మాట. మరి వారిని సంఘం ఆదర్శంగా తీసుకుంటోందా! లేదు గదా! అయినపుడు క్రీడాభిరామం మాత్రం చెరుపు ఎలా చేస్తుంది? కనుక దానిని అలా పరిగణించటం మంచిదని పించదు. ఒకనాటి మన సంఘపు జీవన శైలిని అదీ పాక్షికంగానే, ఒక పార్శ్వానికే-అది అద్దం పడుతోంది.

సాంఘిక మానవీయ శాస్త్రజ్ఞులకు (Socio-Anthropological schloras) అది ఎంతో ఉపకరిస్తుంది. ఇక భాషా జిజ్ఞాసవులకు ఉపయోగపడే తీరు మరో విధం. కేవలం పడక్కుర్చీలో వాలి నవలలు వార పత్రికలు చదివే వారికి ఉల్లాసాన్నిచ్చే రచన! దీనినంతటినీ శ్రీశాస్త్రి గారు అంగీకరిస్తూనే దీనిని చెడ్డపుస్తకంగా భావించి, దాని కర్తృత్వాన్ని శ్రీనాథునికి అంటగట్టటానికి వారికి గల బలీయమైన కారణం-తరచి చూస్తే-వారు దీనికిముందు వెలువరించిన శృంగార శ్రీనాథంపై వచ్చిన విమర్శ ఎదుర్కోవటానికి తప్ప మరొక కారణం బుద్ధికి అందడం లేదు. ఇది వల్లభరాయని రచనే అనడంలో మరో మాట లేదు. ఇక ఎమెస్కో ప్రచురణకు సంపాదకీయం వ్రాసిన శ్రీబి.వి సింగరాచార్యగారు, ఈ రచన అంతా చదివిన తరువాత రెండు మూడు సందేహాలు తలెత్తుతున్నాయని వ్రాసారు. అవేమిటంటే 1. మంచనశర్మ ఓరుగల్లుకు పాతకాపే గదా! మరి మాచల్దేవి భవనం ముందు మాత్రం దానిని అప్పుడే చూస్తున్న వానిగా అంటే పరదేశిగా కన్పిస్తున్నాడేమి అనేది. ఇక్కడ వెంటనే ఆ సందేహం కలిగే మాట నిజమే! కాని కొంచెం జాగ్రత్తగా చదివితే అర్థమయ్యే విషయం వేరు. మాచల్దేవిని మంచనశర్మ ఎరుగును. అంటే-ప్రత్యక్షంగా కాదు. పరోక్షంగా. ఆమె వున్నదని తెలుసు. కనుకనే ఆమె వృత్తాంతాన్ని నాటకంగా ఆడుతారని మిత్రునికి చెప్పగలిగాడు. ఆమె నివాస మెక్కడో తెలియదు. తెలిసినా, ఆమెను ఎన్నడూ అతడు చూడలేదు. అది అలా వుంచితే, ఇది చిత్రశాలా భవనం. ఇప్పుడు ఆమె దాని లోనికి ప్రవేశిస్తోందని గదా అక్కడి వారు చెప్పిన సమాచారం. అంటే ఆ భవనం ఇటీవలే కట్టారు. మంచనశర్మ సంవత్సర కాలంగా ఓరుగల్లును దర్శించ లేదని, పోయిన ఏడాది కాకుళయ్య తిరునాళ్ళకు వెళ్ళానని అతడు కామమంజరికి చెప్పినమాటల్లోనూ, కార్యాంతర వ్యాసంగంబున అనే సూత్రధారుని మాటల్లోను వ్యక్తమవుతోంది. అంటే ఈ కాలవ్యవధిలో ఆ భవన నిర్మాణం జరిగింది. అంతేకాదు, ఆ వీధిలో ఇంకా మార్పులు చోటుచేసుకున్నట్లుంది. ఎందుకంటే కామమంజరి ఇంటిని గూర్చి కూడా ఇక్కడే ఎక్కడో వుండాలే అని అనుకున్నాడు గదా! ఆ మార్పులు మంచన శర్మకు తెలియవు. ఇప్పుడే తెలియవచ్చిన విషయం.

2. కామమంజరి మంచన శర్మకు చిర పరిచిత. ఆ పగలు ఆమె ఇంటికి వెళ్ళివచ్చిన వాడే. ఆమె వలన అతనికి జన్మించిన కూతురూ వుంది. అయినపుడు ఆమెను రహస్యంగా తమ్మడి సాని ఇంటికి రప్పించి, అక్కడ ఎందుకు భోగించవలసి వచ్చింది అనేది. ఈ సందేహం సమంజసమైనదే. అయితే ఇక్కడ నేను ఇలా భావిస్తున్నాను. అదేమంటే-సానులను చేరదీసిన, వారు స్థోమతులేని వారు, వారి ఇళ్ళకే వెళ్ళేవారు. అయితే ఆ ఇంట్లో తాను చేరదీసిన ఆమె మాత్రమే గాక, ఆమె అప్పచెల్లెండ్రు వుండేవారు. వారిని చేరదీసినవారు ఉండేవారు. వారిలో ఒకరికే అంకితం కాని వారు వుంటే, వారి కొరకు వచ్చే వారుంటారు. కాగా ముఖ్యసాని (యజమానురాలు) పోషణలో కూడా ఇతర వేశ్యలు వుండే అవకాశముంది. ఇంతమంది వుండటానికి, వారి వసతికి, వారిని సందర్శించే వారికి వసతి కల్పించటానికి, ఆ ఇంట్లో అవకాశాలు తక్కువగా వుండే అవకాశముంది. ఎవరికి వారు (విటులు) ప్రత్యేక వసతిని, (Privacy) కోరుకుంటారు గదా! అలాగే తమ ఉనికి ఇతరులకు తెలియరాదని కోరుకునే వారుంటారు. ఇలాంటి సందర్భాల్లో, స్థోమతు కలిగిన వారు పట్టణాల్లో, నగరాల్లో తమవైన స్వంత గృహాలు నిర్మించుకునేవారు. అంతకు చాలనివారు బాడుగకు (సుదీర్ఘకాలం) గృహాలను తీసుకుని తమ సేవకుల పర్యవేక్షణలో వుంచుకునేవారు. ఇక క్రీడాభిరామంలో చెప్పబడిన స్థితిని చూస్తే, కామమంజరే మంచన శర్మ వున్న చోటికి వచ్చే పరిస్థితివున్నట్లు మంచన శర్మ మాటలవలన తెలుస్తోంది. మంచనశర్మకు వరంగల్లులో వేరేవసతి గృహంవుందేమో -అక్కడ సమాచారం లేదు. ఒక వేళ వున్నా, ఆ వేళ తమ్మడి సాని కూతుర్ని టిట్టిభసెట్టికి అనువుపరిచే ఆలోచన ఎలాగూ వుంది. తమ్మడి సాని గృహం విటజనులకు సంకేత స్థలంగా ముందునుండీ ఉపయోగపడుతూనే వుంది. కనుక ఆ పూటకు ఆక్కడ విడిది చేయటానికే శర్మగారు సంకల్పించినట్లుంది. అందువల్లనే కామమంజరి, తమ్మడిసాని చేతనే కబురందించాడు. అయితే కామమంజరిని కలిసేది ఎప్పుడూ అక్కడే నని కూడా మంచన శర్మ మాటల్లో ఉంది.

3. కర్ణాటి, కర్ణాటాంగనలు భిన్నంగా వర్ణింపబడ్డారనేది శ్రీ సింగరాచార్యగారి అభిప్రాయం. వారు అలా ఎందుకు భావించారో తెలియదు. 'కర్ణాటి' (నీళ్ళబిందె మోసుకువస్తున్న ఆమె) విషయంలో కటిభారంబును జన్నుదోయి భరమున్ గల్పించె నా బ్రహ్మ పిన్నటి కౌఁ దీగకుమున్న' అనేవిధంగా చెప్పి, ఆమె నీలకబరీ భారాన్ని గూర్చి కూడా చెప్పాడు. అంటే - అంతా ఆమె శరీర పొంకాన్ని గూర్చి. ఇలా ఎవరైనా వుండవచ్చు! కాని ఆమెను కర్ణాటిగా ఎలా గుర్తుపట్టాడు అన్నదానికి వివరాలు అక్కడ లేవు. అంటే ఆమె వస్త్రధారణను గూర్చి- దానిని బట్టి గదా ఎవరినైనా ఫలానా ప్రాంతంవారని చెప్పగలం-ఏమీ చెప్పలేదు. చెప్పక పోయినా, అప్పటి ఆమె వేషధారణను బట్టి అతడు ఆమెను కర్ణాటిగా చెప్పగలిగాడు. ఇక కర్ణాటాంగన(వేశ్య) విషయంకూడా అంతే! కేవలం 'కుసుమం బెట్టిన చీర' అని మాత్రమే

చెప్పాడు. అలాంటి చీరను ఎవరైనా ధరించవచ్చుగదా! ఇక మిగతా దంతా అప్పటి ఆమె శరీరస్థితిని గూర్చిమాత్రమే. ఆమెను కర్ణాంటాంగనగా గుర్తించటం కూడా, అక్కడ వర్ణన లేకపోయినా, ఆమె వస్త్రధారణను చూసే! మాటతీరు గురించి అనుకుందామంటే, రెండు సందర్భాల్లోనూ మొదటి ఆమె మాట్లాడింది లేదు, రెండవ ఆమె (వేశ్య) తరువాత మాట్లాడింది. ఆ ఇరువురి కట్టూబొట్టూ తీరులను గూర్చిన వర్ణన అక్కడ ఏమీలేదు. ప్రత్యక్షంగా మంచనశర్మ వారిని చూసి వారిని కర్ణాట దేశపు వారిగా గుర్తించటం తప్ప వర్ణించి వుంటే గదా భిన్నత్వముందని అనుకోవాలి. కనుక ఆ సమస్యే తలెత్తటం లేదు.

4. పాములాట, పాములమెంగడి నైపుణ్యం భిన్నంగా వర్ణింపబడ్డాయని శ్రీ ఆచార్య గారు భావించారు. కాని అలాంటిదేమి లేదని నేను భావిస్తున్నాను. వారు అలా భావించటానికి కారణం బహుశా పాములాటను గూర్చి చెప్పటం అయింది కదా, తిరిగి మెంగడి సంగతి ఎందుకు చెప్పవలసి వచ్చిందనేది అయివుంటుంది. వారి భావన సమంజసమే. అయితే ఒకటి ఆలోచిద్దాము. ఈ పాములాడించే వాళ్ళు ఒకరిద్దరుగా వచ్చివుండరు. కనీసం ఇద్దరైనా వుండివుంటారు. ముందు ఒకచోట ఆడించటం పూర్తి అయివుంటుంది. మెంగడితో పాటు వచ్చిన వాడు ముందుగా వీరున్న (శర్మ, సెట్టిగార్లు) చోటికి వచ్చి ఆడిస్తూవుంటాడు. మెంగడు ప్రధానవ్యక్తి అయి వుంటాడు. అతడు, ముందు ఆడించినచోట ఆ ఆటను చూసిన ప్రేక్షక జనం నుండి కానుకలు వసూలు చేసుకొని వెనుకగా వచ్చి వుంటాడు. మొదటివాడు కేవలం నాగస్వరం ఊదేవాడు, అంటే గంగిరెడ్లవారి సన్నాయిమేళంలో గుడ్డి బూర ఊదేవాడు (శ్రుతి) వుంటాడు చూడండి! అలాంటివాడు అయివుంటాడు. స్వర భేదాలను పలికించగలవాడు మెంగడు మాత్రమే. ఇక్కడి సన్నివేశం అలాంటిదని నేను భావిస్తున్నాను.

ఇక ఇప్పటికిప్పుడు దీనిని నేను వచనంలోకి అనువర్తింపచేయటానికి గల ఒకే ఒక కారణం-క్రీడాభిరామం ఒక విశిష్టమైన రచన. కాని అది పద్యంలో వుంది. పద్యవిద్యను బోధపరచుకోవటానికి భాషాపరంగా ప్రత్యేక శిక్షణ అవసరం. అలా ప్రత్యేక శిక్షణ పొందిన వారంతా దానిని చదివారా- అంటే, అది వారి,వారి అభిరుచికి సంబంధించినది. అయితే అది కేవలం పద్యవిద్యతో పరిచయమున్న వారికి, దానిని అభిమానించి చదివే వారికే గాక, సాహిత్యాభిమానులకెందరికో పరిచయమున్న రచన. అంటే - దానిని గూర్చి విన్నవారు, కొందరైతే, అందులోని విషయమిది అని ఇతరులు చెప్పగా విన్నవారు మరికొందరు. కాని వారికి పద్యం నడవదు. సరిగ్గా ఇలాంటి విషయమే నా దృష్టికి వచ్చింది. 2001లో 'తానా' కు వెళ్ళినపుడు, డా॥ బండ్ల హనుమయ్యగారు దీనిని గూర్చి ప్రస్తావించి, అది వచనం లోకి వస్తే చాలా మందికి ఉపకరిస్తుందన్నారు. అప్పటినుండి, దానిని వచనంలోకి తేవాలని అనుకుంటూవచ్చాను. ఈ మధ్య కాలంలో ఒకరిద్దరు సాహితీమిత్రులు, ఇతరులు కూడా ఈ ప్రస్తావన చేసారు. అలా చేద్దామనిపించింది. ప్రారంభించాను.

అయితే, క్రీడాభిరామం ఎన్ని పర్యాయాలు చదువుకోలేదు గనుక! మొదలు చదివాను అంటేనే, కనీసం ఆరుసార్లు చదివివుంటే తప్ప, ఆ పదం నేను ఉపయోగించను. అయితే నేమి! వచనం వ్రాయడం ప్రారంభించింది మొదలు అక్కడక్కడ అన్వయక్లిష్టత, కొన్ని పురాణ గాధలు నన్ను ఇబ్బంది పెట్టాయి. భాష కనీసం 7శతాబ్దాలకు పూర్వపుది. నిఘంటువుల కెక్కని పదాలు అనేకం. కొన్నింటిని సాధించినా, కొన్ని కొరుకుడు పడ్డాయి కాదు. అప్పుడు అనిపించింది. ఈ విషయంలో మా గురువర్యులు ఆచార్య లకంసాని చక్రధరరావు మహోదయుల సాయం అపేక్షిద్దామని. ఆ మాటే వారితో అన్నాను. దీనికి తాము పర్యవేక్షకులుగా వుండాలని. వారు నా మీది గల వాత్సల్యంతో, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అలాగే నన్నారు. వారికి కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలి. అది సాధ్యమయ్యేదేనా! ఏమైనా, మాట అంటూ ఒకటి అనాలి గనుక, వారికి నా సాష్టాంగదండప్రణామాలు. అయితే ఇందులో వెలిబుచ్చిన నా అభిప్రాయాలు నావే! వారికేమీ సంబంధం లేదు. ఆ బాధ్యత నాదే సుమా!

సాధారణంగా అయితే వారి చేతే దీనికి పీఠిక వ్రాయించుకునే వాడిని. కాని పర్యవేక్షక బాధ్యత వహిస్తున్నవారిని, దానికై ఎలా అడగటం? ఆ మాట డా॥ లింగంనేని బసవ శంకరరావుగారితో అన్నాను. వెంటనే వారన్నమాట–క్రీడాభిరామం కంఠోపాఠం ఆచార్య రామచంద్ర గారికి. వారి చేత వ్రాయించమన్నారు. వారిని అడిగాను. వారు, కెనడా వెళ్ళే పనిలో వున్నారు. అయినా నా మీది ప్రేమతో దానికి అంగీకరించి, తమ ఆముఖాన్ని దయచేసారు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు. అలాగే, సమయానికి వారిని సూచించిన డా॥బసవశంకరరావు గారికి నమస్కృతులు.

ఇక దీనికి ముఖచిత్రంగా ఒక నర్తకి ఛాయాచిత్రాన్ని ప్రచురించాలని దీనిని ప్రారంభించి నప్పటి నుండి కోరుకున్నాను. కాని ఎవరిని అడగటం. ఎవరు అంగీకరిస్తారు గనుక! అలా అనుకుంటూ, ఒక ఉదయాన పద్మభూషణ బిరుదాంచితురాలు, సుప్రసిద్ధ నర్తకి శ్రీమతి వక్కలంక స్వప్నసుందరి గారితో, ఇలా అనుకుంటున్నాను, నర్తకి రేఖాచిత్రం పంపగలరా–నిజానికి వారి చిత్రం అడగాలని వున్నా, ధైర్యం చాలక అలా అడుగలేదు– అని అడిగాను. అలా ఎందుకు, మీరు ప్రచురించాలని భావిస్తే, సంతోషంగా నా చిత్రమే పంపుతాను అన్నారు. నా ఆనందం మాటల్లో వ్యక్తీకరించలేను. అలాగే కృతజ్ఞతలు కూడా! ఎందుకంటే, కృతజ్ఞత అనేది హృద్గతం గనుక. మాటలో అది కేవలం మాటవరుస మర్యాదగా పరిణమిస్తుంది గనుక. అయినా వారి అమృత హృదయానికి నమస్కారాలు.

దీనిని మీకు అంకితంగా (వచనానువర్తనాన్ని, క్రీడాభిరామ పాఠాన్ని కాదు! అది వల్లభరాయని రచన!) ఊహించి ప్రచురిస్తున్నానని నా మిత్రులు, మించి శ్రేయోభిలాషులు, సాహిత్యాభిమాని, నా వ్యాసంగాన్ని నిండుగా మనసారా అభిమానించి ఆదరించే శ్రీ కాకాని మధుసూదనరావుగారితో అన్నాను. వారి దానికి ఆమోదించారు. శ్రీకాకుళాంధ్రనాయకుడు

వారిపై తన ఆశీస్సులను వర్షింప చేయాలని ప్రార్థిస్తున్నాను.

దీనిని ఇంత అందంగా ముద్రించి ఇచ్చినవారు శ్రీశ్రీ ప్రింటర్సు అధినేతలు శ్రీ విశ్వేశ్వరరావుగారు. అత్యంత సహనంతో డి.టి.పి నిర్వహించినవారు శ్రీమతి కొడాలి శ్రీదేవిగారు. వీరికి, ఇతర కార్యాలయసిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. రచనా వ్యాసంగానికి కుటుంబపరంగా నెమ్మది కలిగించిన నా కుటుంబసభ్యులు నా శ్రీమతి నిర్మల, నా కుమారులు చి.నాగేశ్వరరావు, చి.వెంకటరమణ, కోడలు చి.ల.సౌ శ్రీమతి నీలిమ, నా మనుమసంతతి చి.లక్ష్మీ చక్రధర్ (దొరగారు), చి.చిన్న బాలగంగాధర్‌లకు నా శుభాశీస్సులు. నా పూర్వరచనలను పాఠకలోకం బాగా ఆదరించింది. ఇది కూడా వారి ఆదరణకు పాత్రమవుతుందని ఆశిస్తున్నాను.

"సత్యే సర్వం ప్రతిష్ఠితం".





# ఆముఖము

దశ రూపకా లనబడే వాటిల్లో అయిదు బహ్వంకాలు. అయిదు ఏకాంకికాలు. వ్యాయోగం, వీథి, భాణం, ప్రహసనం, అంకం - అనేవి ఏకాంకిలపేర్లు, బహ్వంకాలను రూపకాలనవచ్చును గానీ ఏకాంకికాలను నాటకాలనకూడదు. అందుకే అన్నింటినీ కలిపి దశరూపకాలనడం.

వీటిలో వీథి అనే రూపకాన్ని కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో ఓరుగల్లు పురాన్ని ఆధారంగా తీసుకొని 'ప్రేమాభిరామ' మనేపేరుతో రావిపాటి త్రిపురాంతక కవి (తిప్పన్న) సంస్కృతంలో రూపొందించాడు. కాకతీయ సామ్రాజ్యం క్రీ.శ 1323లో అంతరించింది 15వ శతాబ్దంలో వినుకొండ వల్లభామాత్యుడు ప్రేమాభిరామాన్ని అనుసరించి తెలుఁగులో క్రీడాభిరామ వీథిని రచించాడు. వల్లభరాయని కాలానికి సాంఘిక పరిస్థితులలో పెద్దగా మార్పులు కలిగి ఉండక పోవచ్చును. అందుచేత తననాటి సంఘాన్ని సంస్కరించడం కోసం వల్లభుడు ప్రేమాభిరామ రూపకానుసారిగా క్రీడాభిరామ రచనను చేపట్టి ఉండవచ్చును. వీథిలో శృంగారమే ప్రధాన రసం. అయితే అది పరిపోషింపబడే కథాశరీరం అంతగా అందులో ఉండదు. శృంగారం సూచనా మాత్రంగానే ఉంటుంది. కథానాయకులు ఒకరిద్దఱు ధూర్తవిటులు (చూ.ప. 290 కన్నెటికముడుప.....) రచన చాటూక్తి మధురంగా, అధిక్షేపాత్మకంగా ఉంటుంది.

తెలుఁగులో శ్రీనాథుని పేర, ఆయన చాటుపద్యాలను కొన్నింటిని వీథినాటకం పేర వావిళ్ళవారు ఒకప్పుడు ప్రకటించారు. అయితే దానికి రూపక లక్షణాలేవీ పట్టవు. ఈ క్రీడాభిరామమే ఆ వీథి అనీ, అందుచేత క్రీడాభిరామం శ్రీనాథకృతమనీ, అందుకు క్రీడాభిరామం లోని రచనా ధోరణులే నిదర్శనాలనీ ఒక అభిప్రాయం. అయితే ఇందలి సంస్కృత సమాసాదులను పురస్కరించుకొని క్రీడాభిరామంలోని రచనగా నిర్ధారించటం కుదురదు. ఎందుకంటే ఆ సమాసాదులలో చాలావాటిని సంస్కృతం నుండి శ్రీనాథుడైనా గ్రహింపవచ్చును. వల్లభుడైనా గ్రహింపవచ్చును. తెలుగు పలుకుబడులూ, నుడికారపు సొగసులూ తెలుగు కవులందఱకూ సొంతమే. అసలింతకూ సంస్కృత ప్రేమాభిరామం లభించలేదు. అది లభించేంత వఱకూ క్రీడాభిరామం వల్లభరాయనిదే అని భావించక తప్పదు. పైగా క్రీడాభిరామంలోని విషయాలు త్రిపురాంతకుని నాటివి. వాటినలా వ్యక్తీకరించి క్రీడాభిరామమని

పేరు పెట్టవలిసిన అవసరం, ఆలోచన వల్లభరాయనికి తప్ప మఱొకరికి కలిగే అవకాశం లేదు. కేవలం ధనసంపాదన కోసం ప్రౌఢమైన కవిత్వాన్ని కవితారచనా సామర్థ్యం లేని వేరొకరి పేర వ్రాసి ప్రకటించడం మహాకవులు చేసే పని కాదు. వల్లభరాయ వాగ్వైభవాన్ని అంతగా పొగడవలసిన అవసరం అటువంటి మహాకవి కుండదు. అంకితమివ్వడం వేఱు. కవిత్వాభిమానం కలవారి కెవ్వరికైనా యీ వచ్చును. పోతే చాటు పద్యాలు కొన్ని శ్రీనాథునివి గానూ, వల్లభరాయని వీథిలోనూ కనిపించడం ఒకటి. శృంగారా త్మకమైన పద్యాలను శ్రీనాథునికీ, భక్తిరసాత్మకాలైన పద్యాలను పోతనకూ అంటగట్టటం మనవాళ్ళకు పరిపాటే! 'అంబనవాంబు జోజ్జ్వల' పద్యం భాగవత ప్రారంభంలో కనుపిస్తుంది. కాని అది పోతనది కాదు. అరణ్యపర్వంలోని ఎఱ్ఱాప్రగడ రచనలో తార్క్ష్యుడనే మునికి సరస్వతీదేవి ప్రత్యక్షమైనప్పుడు ఆ ముని ఆ దేవిని స్తుతించే పద్యమది. దాన్ని లేఖకు లెవరో భాగవతానికి బదిలీ చేసారు. తార్క్ష్యుడు చేసిన స్తుతి ఆ ఒక్కపద్యమే. అందుచేత ఆ పద్యం ఎఱ్ఱనదే అనే విషయంలో సందేహం లేదు. శ్రీనాథుడు కవిత్రయంలో ఎఱ్ఱనను కూడా స్తుతించాడు. కాని క్రీడాభిరామంలో వల్లభుఁడు 'నన్నయభట్టా'ది పద్యంలో ఎఱ్ఱన పేరెత్తలేదు. పైగా రావిపాటి తిప్పన్నను, నన్నయ, తిక్కన, హుళక్కి భాస్కర, చిమ్మపూడి యమరేశ్వరులు సాటిగా చెప్పాడు. తిప్పన్న త్రిపురాంతకోదాహరణం మాత్రం లభిస్తున్నది.

క్రీడాభిరామంలోని మొదటిపద్యం మొదటిపాదంలో వల్లభుడు తన రచనను రూపకమనీ, మూడవపాదంలో ప్రబంధమనీ పేర్కొన్నాడు. ఇది స్వవచో వ్యాఘాతమా? తెలియక వ్రాసిందా? కాదు! ఆ పద్యం ప్రస్తావన, "ప్రస్తూయతే ప్రబంధార్థే –నయా. కథావస్తు విక్కడ ప్రస్తావింపబడింది. వల్లభరాయని వాగ్వైభవాలను సూత్రధారుని చేత చెప్పించడం రూపక రచనలో పరిపాటే. కడపట "ముదమున ముల్కినాటిపుర" మిత్యాదిగా కథానాయకుని చేత భరతవాక్యం చెప్పించడం కూడా రూపక లక్షణమే. నటులది దోర సముద్ర మిత్యాది పద్యం ఆ రూపకాన్ని వ్రాసి, ప్రదర్శించిన కవి తప్ప–అంటే వల్లభుఁడు తప్ప మఱొకరు చెప్పే అవకాశం లేదు. ఈ రూపకం ప్రారంభంలో "గతి రసికుండ" పద్యం చూళిక. వీథిలో ఇతర పాత్రలతో కథానాయకులు చేసే సంభాషణలు ఆకాశభాషణ రూపంలో ఉండి అభినయింప బడతాయి. రూపకంలోని వచనాలు ఈ – రూపకం ప్రదర్శింపబడేటప్పుడు పాత్రలకు చేసే అభినయ సూచనలుగా, పఠితలు ప్రబంధంగా చదువుకొనేటప్పుడు సంధివచనాలుగా ప్రవర్తిల్లుతాయి. ఈ పనుల చేసే పద్యాలు కూడా కొన్ని యిందున్నవి. అందుకే దీన్ని వల్లభుడు రూపకమనీ, ప్రబంధమని కూడా పేర్కొన్నాడు. ఇన్ని లక్షణాలు కలిగి శాస్త్రీయంగా రూపొందింపబడిన వల్లభరాయని వీథి రూపకానికీ, ముక్తకాల రూపంలో చెదురుమదురుగా చెప్పబడిన శ్రీనాథమహాకవి చాటువులను పోగుపోసి 'వీథినాటక'మని

పేరు పెట్టిన అశాస్త్రీయ రచనకూ సంబంధం లేదు. ఇలా అనడంలో నేను భిన్నాభిప్రాయులైన పెద్దలెవరినీ నిరసించడం లేదు. ఇంతకంటే ధ్రువమైన ఆధారాలతో దృఢమైన, హేతుబద్ధమైన నిర్ణయం కుదిరితే ఆ నిర్ణయానికి కట్టుబడటంతో నాకెటువంటి సంకోచం లేదు.

ఈ క్రీడాభిరామం ప్రౌఢకవితాభిరామం. అందఱకూ అందనిది. అందలి యితి వృత్తమా? సాధారణ సామాజికోదంతం. అందఱకూ అందవలసినది. ఇంతకాలానికి ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావుగారు దీనికి వచన రూపాన్ని ప్రసాదించి ప్రజలకు చేరువ చేసే పనిని చేపట్టడం ముదావహమైన విషయం. రావు గారు రచనను సాగించే విషయంలో–ఆయన సంగతేమో గాని–నాకుమాత్రం కొన్ని సందేహాలు, కొంత సంకోచం కలిగిన మాట మాత్రం నిజం. ఇందులోని "ఆదియుగంబున, ఈమరి, పంచారించిన, అగురు ధూప, ముంజెపదనైన, పేర్చిన సందడిన్, దొరసెమునందు...' వంటి పద్యాల అర్థాలను స్పష్టంగా వివరించి, పండొలిచి చేతికిచ్చినట్లు ఈ పుస్తకాన్ని పఠితలకెలా అప్పగిస్తారు చెప్మా?అనేదే ఆ సంకోచ సందేహాలు. పామరుల దృష్టిలో ఆ పద్యాలు ఆశ్లీల భరితాలు కావచ్చు. కాని కవిత్వ తత్త్వవేత్తలూ, రసికులూ – అయిన పఠితలకు అవి చమత్కార భరితాలే. సాహిత్యంలోని బూతుకవిత్వమంతా యిలాంటిదే. కేవలం బూతుమాటల్తో కవులు పనికట్టుకొని కవిత్వం వ్రాయవలసిన పనిలేదు. అశ్లీలమనేది అపరిణత బుద్ధుల మనస్సుల్లో ఉంటుంది. మహాకవుల రచనల్లో ఉండదు. ఆ విషయాన్ని రావు గారీ వచన క్రీడాభిరామంలో చక్కగా నిరూపించారు. ఆయన ఏ పద్యాన్నీ, ఏ భావాన్నీ వదలలేదు. అన్ని భావాలను సరళసుందరమైన వచనంలో శాస్త్రీయ ధోరణిలో విశదీకరించి పఠితలకీ గ్రంథాన్ని అందించడం ప్రశంసార్హమైన పనిగా భావిస్తున్నాను.

కేవలం ప్రధానగ్రంథాన్ని వచనీకరించడమేగాక క్రీడాభిరామంలో ప్రయుక్తమైన ధ్వన్యనుకరణపదాలు, ప్రసక్తమైన గ్రామాలు, ప్రాంతాల వివరణ, ఇతివృత్తంలో, ప్రస్తావనభాగంలోని వ్యక్తులు, పేర్లులేకుండా ప్రసక్తమైన వారి వివరాలు, క్రీడాభిరామం వలన తెలియవచ్చే సామాజిక విశేషాలు, ప్రసక్తమైన నృత్తాల, రాగాల వివరణలు, వల్లభామాత్యుని వంశవృక్షం, పదాల పదబంధాల అర్థాల వివరణలు, జాతీయాల వివరణలతో ఈ గ్రంథాన్ని క్రీడాభిరామ విజ్ఞానసర్వస్వంగా రూపొందించారు. క్రీడాభిరామ రూపకాన్ని వల్లభరాయ కృతిగానే ఆయన భావించారు. ఆ భావనకు ఆయన ఇచ్చిన వివరాలు పోషకంగానే ఉన్నాయి. వచన రచన సరళసుందరంగా ఉంది. శాస్త్రీయ ధోరణిలో విషయాలు వివరింపబడినా, రచనలో క్లిష్టతలేదు. రచనలో అన్ని విషయాలూ ఆస్వాదయోగ్యంగా తీర్చి దిద్దబడి మెచ్చు గొలుపుతున్నని.

ఇక ఇందులో రావుగారు చెప్పిన కొన్ని విషయాలను పరిశీలించవలసిన అవసరం

వుంది. ఒకప్పుడు కావలి నగరానికి వెళ్ళుతూ దారిలో నెల్లూరి తూముకాలువను చూసాను. దానిలో హల్లకాలు (ఎఱ్ఱకలువలు) కనిపించలేదుగాని ఎఱ్ఱచీరలు కట్టుకొని బట్టలుతుక్కొంటున్న స్త్రీలు మాత్రం కొందఱు దర్శన మిచ్చారు. నా పాలిటికి వీళ్ళే ఎఱ్ఱకలువలు లెమ్మని సరిపెట్టుకొన్నాను. ఈ తూముకాలువతో సన్నిహిత పరిచయమున్న కవి తప్ప, ఆ వర్ణన చేయలేడు, అట్టి పరిచయం, వల్లభన్నకే ఎక్కువగా ఉండే అవకాశం వుంది. ఈ హల్లకాల కమ్మఁదావులను వ్యాపింపచేయడంలో రావుగారి రచన మలయమారుతం లాగా చేస్తుందని చెప్పవచ్చు.

"పటు ఝంఝూ పవనోత్తృణాలయ" మనేపద్యంలో, దానికి రావు గారిచ్చిన వివరణకు మఱికొంత జోడిస్తే బాగుంటుందేమో! ఏమంటే ఈ పద్యంలోని పాంథవనిత వారకాంత గాదు. ఆమే అయితే ప్రియుడు కోసం వేఱేదారి చూచుకోవడం ఆమెకంత కష్టమైన పనేమీ కాదు. కార్యాం తరాసక్తుడై విడిచి వెళ్ళిన బాటసారి భార్య ఆమె. అందుకే వియోగగ్లాని, వాన గాలికి గుడిసె పైకప్పు లేచిపోగా, లోపల పట్టెమంచం మీదముడుచుకొని నిద్రిస్తున్న విరహిణిని మేఘగర్జన అనే వాక్కులతో, నట్టనడురేయి మేఘాల సమూహానికి తటిల్లత చూపి చెపుతున్నదట, 'ఇదిగో ఇక్కడున్నదని' కవి చేసిన యీ ఊహ ఎంత చమత్కార భరితంగా ఉందో చూడండి.

'జవరాలుఁబొడగన్న' అనే పద్యానికి' ఆయా కులాల వారికి ఆయాకులాల వారినే' అనేకాక ఎవరికి ఏ కులంవారు కావాలంటే-వారు-అనే అర్థంకూడా చెప్పుకోవచ్చు. ఎందుకంటే 'బ్రాహ్మణ విధవాపుంజములుండఁగ నూరక, లంజియ లేమిటికి' అన్నాడు గదా! పద్యంలో కటకారకుల వధూటి తప్ప వేఱెవరి కులనిర్దేశం లేదు. వేదవిప్రాదులమీద, వారి ప్రత్యేక సాధనాలనే మారుడు ప్రయోగిస్తున్నాడు.

'మాఘమాసంబు పులివలె మలయుచుండ' అనే పద్యం వ్యాఖ్యానింప బడింది.' ఈ రైతున్నాడే మాఘమాసపు చలి, పులి లాగా విజృంభిస్తున్నా, పాపం. డబ్బుకోసం, పచ్చడం అమ్ముకొన్నాడు. (సేద్యం కోసం - పసరమునకు-అంటే బాగుంటుంది). ఇక చలిబాధకెలా తట్టుకోగలడా హాలికుడు? (ఒఱగోయుః లక్ష్యపెట్టు).

'అరవిందాస్య! తలంచిచూడ....అనే పద్యానికి సంబంధించిన వ్యాఖ్యానంలో 'నీ సరసాలాపాలు ఆలకించిన నాకు చిలుకల పలుకులు, కోయిల కూజితాలు, వీణియ మ్రోతలు శ్రద్ధతో విననందువల్ల కర్ణకఠోరం అనిపించాయి, అన్న పద్యార్థంతో పాటు స్వీయవచనామ వర్తనం కలిపివుంటే మఱింత బాగుండేది.

పదాల అర్థాలను వివరించే సందర్భంలో కుమ్ములు-అంటే- చలిమంటలు, కుంపట్లుగావు. "అత్తయును కోడలును కుమ్ములాడు-కుమ్ముగాచు చోటికి మకరసంక్రాంతి

వేళ' అని ప్రయోగం (శ్రీనాథుఁడు......శి.మా కుమ్ములు హవ్యవాహములు. క్రీడా).

పిశంగిత : కపిలవర్ణముగాఁ జేయఁబడిన–పుల్లావు–అంటారు గదా– ఆ రంగు "పవమాన ప్లవమాన పంకజరజః పాళీ పిశంగచ్ఛవే భవదభ్యర్ణ వికీర్ణ" (మను.చ).

ధవళతాళపలాశ తాటంకములు : తెల్లని (తాళ) తాటాకును చుట్టచుట్టి చెవికొసలలోని పెద్దరంధ్రాలతో స్త్రీలు కమ్మలుగా ధరిస్తారు. వీటినే చెవ్వాకులంటారు. ఈ తాటాకులకు ఎఱ్ఱనిరంగు కూడా వేసిపెట్టు కొనేవారు. మోదుగాకులను (పలాశ) కూడా చుట్టిచుట్టి పెట్టుకొనే అలవాటుందేమో!

తంగేడు, అంటే పలాశమూ కాదు. శిరీషమూ కాదు. పలాశమంటే మోదుగు. దీని పువ్వులు చాలా యెఱ్ఱగా ఉంటాయి. చెట్టు పట్టనంతగా ఈ వృక్షం పుష్పిస్తుంది. (దీన్నే ఆంగ్లంలో ఓజబిళీలి ళితీ శనీలి ఓళిజీలిరీశి అంటారు). 'పొన్నలు', 'కొండగోగులును బూరువులు శల్లగిఁ బూరకుండగా మున్నవనంబు నన్గలయ మోదుగు లొప్పగఁబూచె నామనిన్' అని నన్నె చోడ మహాకవి. 'శిరీష'–అంటే, నైఘంటి కార్థమే దిరిసెన. కాళిదాసు వర్ణించిన దిరిసెన పూవిదే. ఈ దిరిసెనలో ఎన్నో రకాలున్నాయి. అన్నింటి పూరేకులూ కేసరాకృతిలో ఉండి చాలా సుకుమారంగా ఉంటవి. అందుకే ఆ పువ్వు తనమీద తుమ్మెదవ్రాలితే ఓర్చుకోగలదే కాని, పక్షివాలితే ఓర్చుకోలేదనడం. 'శిరీష కుసుమపేశల' మని మృదుత్వానికే గాని, సౌరభానికి కవులు దాని నుదాహరించరు. ఆ శిరీషకుసుమాన్ని ఒక్కపువ్వును ఆఘ్రాణిస్తే అంత వాసన తెలియదుగాని, శిరీషవృక్షం పుష్పించి, ఆ పువ్వులు తెట్టలుగా క్రింద రాలుతున్నప్పుడు మాత్రం ఒక సౌరభం నాసాపుటాల కెక్కుతుంది. మా గురువుగారు కీ.శే. పింగళి లక్ష్మీకాంతంగారూ, నేనూ తిరుపతిలో కపిలతీర్థానికి 'వాకింగ్' వెళ్ళి తిరిగివస్తున్న సమయంలో పాలిటెక్నిక్ కళాశాల ముందు ఈ పూలచెట్లు కనిపించి సువాసనలు ఆకట్టుకొన్నాయి. అప్పుడు పింగళివారు 'ఈ వాసనెక్కడిది నాయనా' అని అడిగితే పై విషయాలు వివరించి చెప్పాను. ఔనా? శిరీషకుసుమ పేశలం అనడమే గాని, ఆ కుసుమం ఇదేనని ఇంతవఱకూ నాకు తెలియదన్నారు. ఆ తరువాత ఆయన అదే పనిగా తన దగ్గఱకు వచ్చిన కొందఱు పండితుల నడిగితే, వారూ మాకు తెలియదన్నారు. 'నాకూ తెలియదు. నిన్న మా అబ్బాయి చెప్పాడు. ఇదీ మన సంగతి" అన్నారు వారితో. పోతే తంగేడు, దీనికి తంగెడు అనికూడా రూపాంతరం. దీనికి సంస్కృతంలో 'గోశ్రేణి' అని పేరు. దీని పూలు ముదురు పసుపురంగులో ఉంటాయి. ఈ చెట్లు విస్తారంగా వనాల్లాగా వ్యాపించి ఉండి ఒక పెద్ద పసుపు దుప్పటి పఱచినట్లుగా ఉంటుంది. 'సాక్షి'లో పానుగంటి 'పూచిన తంగేడు వనం' అని స్త్రీ సమూహాన్ని వర్ణిస్తాడు. గోవులు శ్రేణులు కట్టి నడుస్తున్నప్పుడు ఎలావుంటుందో, ఈ పూచిన తంగేడు వనం అలా వుంటుంది. అందుకే తంగేడును 'గోశ్రేణి' అన్నారేమో!

కుసుమలు : అనంతరపురం జిల్లాలో కూడా పండిస్తారు.
శాటీ : మంచి వస్త్రాలు అని కూడా చెప్పవచ్చుగదా! శాటి ముక్త కుచంబుతో – భాగవతం
మొరవంక కడియము : వీటినే వంకీలంటారు.
గొరగ పడుచు : గొరవలనే జాతి విశేషం. అనంతపురం జిల్లా మొ॥ చోట్ల ఉన్నారు. వీరిని గురించి పరిశోధనకూడా జరిగింది.
దేశభాషలందు తెలుగులెస్స : ఈ మాటలు ఇంచుమించు జాతీయం. వల్లభుఁడైనా, రాయలైనా లోకం నుండే గ్రహించారని ఎందుకనుకోరాదు. (లెస్స పండింది. వాడు చెప్పిన మాట మహా లెస్సగా ఉంది. మొ॥వి)

ఒకప్పుడు క్రీడాభిరామ ప్రతులను పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రకటించి ఆ ప్రతులు 'పరిణత బుద్ధులకు' మాత్రమే అందేటట్లు విద్యాధికులు జాగ్రత్త పడ్డారు. అటువంటి ప్రౌఢ ప్రబంధప్రాయమైన రూపకాన్ని సరళమైన, సరసమైన వ్యావహారిక శైలిలో ప్రజల కందించటానికి ఆచార్య బాలగంగాధరరావు గారు చేసిన యీ ప్రయత్నం ప్రశంసనీయమైన ఒకపాటి సాహసమనే చెప్పాలి. క్రీడాభిరామకర్త వల్లభామాత్యుడు బ్రాహ్మణుడు. అయినా ఈ రూపకంలో బ్రాహ్మణులను విమర్శించాడంటే, ఆ నాటి వారి జీవితాలను అధిక్షేప పూర్వకంగా సంస్కరించడానికే ఆ మహాకవి ప్రయత్నించాడని చెప్పవచ్చు. ఆధునికయుగంలో వీరేశలింగం పంతులుగారు చేసిన ప్రయత్నం కూడా ఇదే గదా! వందలకొలది సంవత్సరాలుగా వేళ్ళుతన్ని ఉన్న లోపభూయిష్ఠాలైన ఆ జీవిత విధానాలను తెలుగువారికి తెలియజేసే ప్రయత్నంలో ఈ క్రీడాభిరామ వచనానువర్తనం శుభోదర్కమే అవుతుంది. ఇంతవరకూ ఎవరూ చేయని యీ పనిని చేపట్టి అశేషాంధ్ర ప్రజానీకానికి ఆమోదయోగ్యంగా, సర్వసమగ్రంగా నిర్వహించిన ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావుగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఆయనకు ఆయురారోగ్యైశ్వర్యాలను ప్రసాదించి, ఆయన చేత ఇతోధికమైన సాహిత్యసేవ చేయించాలని శ్రీవెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నారు. అస్తు. శుభంభూయాత్



చెన్నై (వి. రామచంద్రచౌదరి)
*27-5-2008* *రిటైర్డ్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,*
*మద్రాసు విశ్వవిద్యాలయం*

# వినుకొండ వల్లభరాయని
# క్రీడాభిరామము
# వచనము

వినుకొండ వల్లభరాయని

# క్రీడాభిరామము : వచనము

**(ప్రక్కనున్నవి పద్యసంఖ్యలు)**

## ప్రస్తావన

**(ముందుగా సూత్రధారుడు ప్రేక్షకులతో వీథి రూపక ప్రశస్తిని గూర్చి ప్రస్తావిస్తున్నాడు.)**

1. అయ్యలారా! దశరూపకాలున్నాయి గదా! వాటిల్లో రసభావాలకు పుట్టినిల్లు వీథి సుమా! ఇక ఈ క్రీడాభిరామమనే వీథీరూపకాన్ని ఎవరు రచించారని గదా మీరు అడగ బోతోంది. చెపుతా! ఆ మాటకే వస్తున్నా! సావధానంగా వినండి.

2. **గాధి** అనే ఆయన్ని గూర్చి తెలుసుకదా! ఆయన కుమారుడు విశ్వామిత్రుడున్నాడా! ఆయన ఎలాంటి వాడనుకున్నారు! సృష్టికి ప్రతిసృష్టి చేసాడా! ఆకాశంలో త్రిశంకుమహారాజు కోసం స్వర్గాన్ని నిర్మించాడు గదా! మాలినీ నది ఇసుక తిన్నెల్లో అప్సర శిరోమణి మేనకతో సయ్యాటలాడాడు. వేదమాత గాయత్రిని ఉపాసించి బ్రహర్షిపట్టాన్ని పొందాడు గదా! అతడేమన్నా లాకాలూకాయి ఋషుల్లాంటి వాడా? తాటకిని చంపాడు గదా దశరథరాముడు. అదిగో ఆయనకు, విలువిద్య నేర్పింది సాక్షాత్తూ ఈయనే కదా!

3. అలాంటి ఆయనపేరు మీదుగా లోకంలో ఒక వంశం-అదేనయ్యా -గోత్రమంటూ ఒకటి ఏర్పడింది కాదూ! అదిగో- ఆ గోత్రంలో-ఏది-ఆ విశ్వామిత్రగోత్రంలో నన్నమాట-అందులో మంచన్న అనే ఆయన జన్మించాడు. నాటి కాలంలో ఆయన గారి పేరు ప్రఖ్యాతులు భూమ్యాకాశాల మధ్య అంతటా వెన్నెల వ్యాపించినట్లు వ్యాపించాయి సుమా!

4. ఆ మంచన్నగారి ముద్దుల తనయుడు చంద్రామాత్యుడు. ఆయన ఎంతటి విద్వాంసుడనుకున్నారు! ఎంతటి వాడంటే - పద్మంలో పుట్టింది లక్ష్మిదేవి. తెలుసుగా! ఆమె తన చనుకట్టు దిగువకంటా మంచి ముత్యాలు మాణిక్యాలు పొదిగిన హారం ధరిస్తుందా? వాటి అందచందాలు, కాంతి ఎలావుంటుంది.

5. ఈయన గారి పదవాక్య ప్రౌఢసాహిత్య విద్యావ్యాసంగ మాహాత్మ్యం - దానివలన సంతోషాతి శయంతో నిండిన ఆయన మానసిక నైర్మల్యం - అలా ప్రకాశించేవంటే నమ్మండి.

ఆయనగారు - అప్పట్లో కర్ణాట రాజ్యాన్ని పెదబుక్క రాయలు కదా పరిపాలిస్తుండేవాడు. అదిగో ఆయన గారి మాటకూ చేతకూ మనసు కెక్కిన మంత్రిగా పనిచేసాడు. మంత్రిగా పనిచేసాడంటే - అంతమాత్రమే కాదు. దాతృత్వంలో జీమూతవాహనుడంతటి వాడు. చుట్టపక్కాలందరికీ ఎంతో అండగా వుండేవాడు. అలాంటి ఆయన్ని, ఆనాటి కవి పండితులందరూ శంకరుని జటాజూటంలో గంగ వుంది కదా! ఆ గంగలోని అలల చలనానికి ఎలాంటి ఇంపైన ధ్వనిపుడుతుంది! అలాంటి మాధుర్యంతో కూడిన శబ్దాల పోహళింపుతో ఆయన్ని వేనోళ్ళ కీర్తిస్తూ వుండేవారు సుమా!

6,7. ఆ చంద్రామాత్యుని భార్య పోచాంబ. ఆ దంపతులకు మంచన జన్మించాడు. ఈ మంచనగారు కూడా పండితులను బాగా ఆదరించేవాడు. వారిపట్ల సాక్షాత్తూ కల్పవృక్షమేనన్న మాట! ఇక బుద్ధి చాతుర్యంలో బృహస్పతికి సాటి. ఈయన భార్య తిప్పమ్మ. ఈ దంపతులకు సింగన, తిప్పన, మల్లన, చెన్నమంత్రి అనే నలుగురు కొమాళ్ళు జన్మించారు.

8. ఈ చెన్నమంత్రి వున్నాడే-నయ నీతివిద్యలో ఘనుడు. ఈ నలుగురిలో సింగనకు సకల సద్గుణ పేటి అయిన చంద్రమంత్రి జన్మించాడు. ఈయన గొప్ప రూపసి. మహేంద్రవైభవంతో విలసిల్లాడని నాటి పండితులు ఆయన్ని పొగిడారు.

9,10 రెండవ వాడు మల్లనగదా! శంకరుడు హిమవంతుని పుత్రిక పార్వతీదేవిని పెండ్లాడాడు గదా - అలా ఈ మల్లన మిరుతూరి విట్ఠమంత్రి ముద్దుల తనయ త్రిపురాంబను వివాహమాడాడు. ఆయనంతటి సంపద్వంతుడు ఆయనే. ఈ దంపతులకు వల్లభన్న, లింగన, తిప్పన, సింగన, భైరవుడు అనే నలుగురు కుమారులు కలిగారు. వీరంతా కాంతివిషయంలో చంద్రునితో సమ ఉజ్జీ. అంతటి కీర్తినీ పొందారు. పుణ్యశీలురు. వీరిని గూర్చి మరోవిశేషం వుంది. ఉన్నమాట చెప్పాలి కదా మరి. మనలో మనమాట! వారకాంతల పట్ల మన్మథులంటే నమ్మండి.

11,12. అందులో వల్లభమంత్రి ఉన్నాడే - ఆయన మానవ మాత్రుడు కాడండీ! ఆయన కీర్తి నక్షత్రమండలం, ఇంద్రలోకం, ఆపైన కైలాసాలవరకు వ్యాపించిం దంటే -ఆ మాట-అతిశయోక్తి కాదు. నిజానికి వాటికి గల ప్రశస్తిని కూడా కాదు పొమ్మంది! ఇక, అందమంటారా! మన్మథ, భద్ర జయంతులు కూడా ఆ విషయంలో ఈయన ముందు తీసికట్టే. ఏమాట కామాటే చెప్పుకోవాలి గదా! దాతృత్వవిషయంలో జీమూత వాహనుడు, శిబి చక్రవర్తి, కర్ణులను మించి పోయాడు. ఆయన బుద్ధి మాంచి పదునైనది. ఆ విషయంలో శుక్రుడు గార్గ్యుడు, బృహస్పతులు

-ఏమైనా-కొంచెం లొచ్చేనేమో - అనిపిస్తుంది. ఇక రాజనీతి విషయంలో భీష్ముని మించిన వాడు సుమా? మరి అలాంటి వాడిని సదరు జనాభాలో ఎలా జమకట్ట గలం! ఏఁవంటారు!

13. కర్పూరం, మందారం, కుందనం, కుముదం, గంధకీ పుష్పాలు, చందనం - వీటి సువాసన అంతటా ఎలా వ్యాపిస్తుంది. అలా ఆయన కీర్తి అంతటా వ్యాపించింది. అలాంటి ఆ కీర్తిశాలికి బైచమంత్రి, మల్లవిభుడు, పోచన్న తిప్పనామాత్యుడు అనే నలుగురు కుమాళ్ళు కలిగారు. వారు మాత్రం తక్కువవారా! బైచమంత్రి వాగ్వైభవం ఆకాశగంగా తరంగాల సుమధుర గంభీరధ్వనిలాగా వుండేది. మల్లన్నగారున్నారే. వారు గొప్ప రసికులు. మదవతుల పట్ల మారుడు! పోచన్న గొప్ప శివపూజా ధురంధరుడు. తిప్పనగారికి సాహిత్యవిద్య సహజంగా అబ్బిందే. అందులో మంచి నిష్ణాతుడు. నిత్యనూతనంగా శోభించేది ఆయన సాహిత్యసౌరభం.

14,15,16. మల్లనగారి మరో కుమారుడు తిప్పన్నమంత్రి - ఆయన జగమెరిగిన దాతగా పేరెల్లాడు. గొప్ప శివారాధకుడు. ఆ విషయంలో విష్ణువంతటి వాడు. ఆయన కీర్తివైభవం - ఓయబ్బ, అది ఎలాంటిదని చెప్పను! దిగంతాల వద్ద దిగ్గజాలున్నాయా! ఆ మదపుటేనుగుల మదజలధారల వద్ద చేరి తుమ్మెదలు రొద చేస్తుంటాయా! ఆ రొద ఏమిటనుకున్నారు? అది మరేమీ కాదు. ఆ రూపంలో

17. అవి ఈయనగారి కీర్తినే గానం చేస్తున్నాయి. ఆయన వీరహరిహరరాయల రత్నాభాండాగారానికి అధ్యక్షుడు. సత్యవ్రతాన్ని పాటించడంలో, సత్కీర్తి విషయంలో హరిశ్చంద్రునికి చంద్రునికి, సాటి అయినవాడు. అభిమానం, ఐశ్వర్యవిషయాల్లో దుర్యోధన కుబేరులతోను, సౌభాగ్యవైభవం, జ్ఞానసంపన్నత అనే విషయాల్లో మన్మథ

18. సనత్కుమారులతోను, లాలిత్యం, విధేయతలకు సంబంధించి భద్ర, రామ భద్రులతో సాటిరాగలిగినవాడని, ఆ కాలంలో చెప్పుకునేవారు. కపటులూ, కర్కశులూ అయిన పరప్రభువుల మంత్రులపట్ల వజ్రాయుధమే! రాజనీతి వ్యవహార విషయాల్లో

19. బహు నిపుణుడు. ధైర్యం విషయంలో మేరు పర్వతం. పుణ్యసము ద్రుడు. అలాంటి తిప్పనకు సాటిరాగలవారు ఈ భూప్రపంచంలో మరొకరు లేరంటే లేరు. ఆయన

20. భుజాలు రెండూ వుండగా, సప్తసముద్రాల మధ్యగల ఈ ప్రపంచాన్ని మోయడానికి ఆదివరాహం దేనికి? ఆదిశేషుడు దేనికట? మేరు నగం దేనికి? దిగ్గజాలు దేనికి? ఆదికూర్మం మాత్రం దేనికేం! ఆయన శివారాధకుడు. వినుకొండ దుర్గానికి

పాలకుడు. అలాంటి ఆయనకు బైచన మల్లన, తిప్పన అనే ముగ్గురు కుమారులు జన్మించారు. ముగ్గరికి ముగ్గురూ బంధుజనులపట్ల కల్పవృక్షాల వంటివారుగా పేరు పొందారు.

21,22.ఈ ముగ్గురిలో తిప్పన రాయల నవరత్న భాండాగారానికి అధ్యక్షుడు. ఆయనకు చందమాంబిక యందు వల్లభామాత్యుడు జన్మించాడు. ఆయన మోపూరు-గ్రామానికి-అవును మోపూరే-ఆధిపత్యం పొందాడు. అంతేగాదు దీని సమీప గ్రామాలు మూడింటిపై అనుభవ హక్కులు కూడా ఈయన కుండేవి. అదలా వుంచితే, ఆశ్వలాయనశాఖలో ఋగ్వేదాన్ని సాంగంగా పఠించాడు. ఈ ఊరి అధిష్ఠాన దైవం భైరవస్వామిని అర్చించి ప్రత్యక్షం గావించుకున్న మహాభక్తుడు.

23. ఆయన కృపవలన సారస్వత విద్యను ఆత్మాయత్తం గావించుకున్న ధీశాలి. కామకాయన సవిశ్వామిత్ర గోత్ర వంశంలో ప్రసిద్ధికెక్కిన విఖ్యాత పురుషుడు. ఆయన వాగ్వైభవం ఎలాంటిదంటే- శంకరుడు అసురసంధ్యవేళ నర్తిస్తాడు గదా: అలా నర్తించేవేళ ఆయన జటా జూటం లోని ఆకాశగంగ ఆయనగారి నాట్యవిన్యాస వేగానికి కదిలిపోతుంది గదా! ఆ కదలిక వలన అలలు లేస్తాయిగదా. అదిగో ఆ అలల

24 సవ్వడిని తలపిస్తుం దంటే నమ్మండి.

25,26. ఆయన గారి చాటుకవితాధార, దాని పటుత్వం సరస్వతీ దేవి సేవించే తాంబూలపు కప్పుర సుగంధాన్ని తలపింప చేస్తుంది. గోపికలు నల్లనయ్య చుట్టూ చేరి ఆడి పాడే వేళ, ఆ నల్లనయ్య మెడలోని వనమాల సౌరభాన్ని, గోపికల అడుగుల సవ్వడినీ స్ఫురణకు తెస్తుంది. దేవతలు అమృతం కొరకు పాలసముద్రాన్ని చిలికారా! అప్పుడు అది కలగుండు పడిందిగదా! అప్పుడు ఎలాంటి ధ్వని ఉత్పన్నమైంది? ఆయన చాటుధారా విన్యాసం ఆ ధ్వనిని తలపిస్తుంది.

27. భిల్లావతార మప్పుడు, శంకరుడు మధు రాక్షససంహారమప్పుడు విష్ణువు, భుజాలను చరుచుకున్నారా! ధనువుల నారిని ఆకర్ణాంతం లాగి కదా బాణాలు

28. వదిలారు. అప్పుడు ఆ నారులు గావించిన ధ్వని ఎలాంటిది? ఆ చరుపు ధ్వనిని, ఈ విండ్ల ధ్వనినీ తలపిస్తుంది వల్లభన్న వాగ్వైభవం! నెల్లూరి తూము

29. కాలువలోని ఎర్రకలువల కమ్మని సుగంధాన్ని తలపుకు తెస్తుంది ఆయన వాక్య విన్యాసంలోని భావపరిమళం.

అవునా! ఇక ఆయన దాన పరాక్రమం విషయానికి వస్తే - దానితో పోల్చదగింది మేఘుని, కర్ణుని, కుబేరుని, చంద్రుని, భోజరాజ, జీమూత వాహనుల

30. దానాలే తప్ప వేరొకరివి సాటిరావు సుమా. త్యాగం విషయంలో ఆయనకు సరివచ్చే

వారు చింతామణి, కుబేరుడు, మేఘుడు, బలి, సూర్యుడు, చంద్రుడు కల్పతరువు, కామధేనువులే తప్ప మరెవరూ సాటిరారంటే రారు.

31. శిష్టాచారాన్ని పాటించడంలో, వివేకంలో, సౌభాగ్యసంపదలో, పనులు చక్కబెట్టడంలో, ప్రతాపం, దానం మున్నగు విషయాల్లో, సజ్జనులను చేరదీయడంలో
32. ఆయనతో పోల్చదగినవారు ఈ ప్రపంచంలో మరొకరు లేరనుకోండి.మందార మద్యంచే మత్తిల్లి ఆడే బలరాముడు, విశాలనేత్రాలుగల వామనుడు, ఢమరుకం, ఖట్వాంగం, దండం, కపాలం ధరించే పరమేశ్వరుడు, బుద్ధుడు, దత్తాత్రేయుడు, ఆదివరాహం, విశ్వాన్ని పాలించే శ్రీమహావిష్ణువు, వినాయకుడు వీరంతా వల్ల భామాత్యునికి ఏవేళా అండగా వుండి మనోభీష్టాలను నెరవేరుస్తూ వుంటారు.
33. అదిగో ఆ వల్లభామాత్యుడు, రావిపాటి త్రిపురాంతక దేవుడనే కవీశ్వరుడు సంస్కృతంలో రచించిన ప్రేమాభిరామనాటకాన్ని అనుసరించి, ఈ క్రీడాభిరామాన్ని
34. తెనుగులో చెప్పాడు. ఆఁ! ఏఁవంటారు? ఆ త్రిపురాంతకుడెవరు? ఆయనెంతటి వాడు? ఆ ప్రేమాభిరామం ఎంతటిది? దానిని పట్టుకుని, మనసులో ఏ అలుకూ లేకుండా, ఈ వల్లభన్న తెనుగులో వీథిగా- ఈయనెలా రచించాడు అని గదా
35. మీరనబోయేది. వస్తున్నా। ఆ మాటకే వస్తున్నా! చెపుతా!
36. నన్నయ తిక్కనలు-అదేనండీ- శ్రీమహాభారతం తెనుగులో చెప్పారు గదా! హుళక్కి భాస్కరుడు - సరే తెలుసుగదా- అలాగే చిమ్మపూడి అమరేశ్వరుడు! ఈయన కూడా తెలుసా! మరింకేం! వీరందరినీ కవీశ్వరు లందరూ నెత్తిన చేతుల పెట్టుకుని మరీ మ్రొక్కుతారు గదా! మరి ఈ రావిపాటి తిప్పన్నా ఆ కోవలో వాడే. అంతటి వాడే। అయినపుడు, అతడెవరు? ఏపాటివాడు? అని తక్కువ చేసి అలా మాట్లాడ గూడదు గదా మరి?
37. మీ రెండోమాట - తెనుగులో వ్రాయడ మెందుకని గదూ! నిజమేనయ్యా! అన్ని భాషలకూ తల్లి సంస్కృతమే! కాదన్న దెవరు గనుక! అలాగే జనం మాట్లాడే భాషల్లో తెనుగు బహు భేషైనది. ఒక మాటంటాను. ఆలోచించండి. మరేం లేదు! తల్లీ, కూతురు - ఇద్దరూ- వున్నారనుకోండి. మరి మీ చూపు ఎవరి మీదుంటుంది! కూతురి మీదే గదా! ఏం? ఎందుకనట! వయసులో, అందచందాల్లో, హొయల్లో తల్లి కంటే - ఎందుకంటే, తల్లికి వయసు మళ్ళిందనే గదా- కూతురు మిన్న అనే గదా! మరి ఇది కూడా అంతేనయ్యా! కాదంటారా? మీరే చెప్పండి మరి! అందుకూ, వల్లభరాయడు ప్రేమాభిరామాన్ని అనుసరించి క్రీడాభిరామంగా తెనుగులో చెప్పడం జరిగింది. సరేనా।

38,39. అంతలో తెర వెనుక నుండి, రసికశేఖరుడా! నీకు ఒక్క చోట కాలునిలువదు గదా! మధుపాయీ! ఓమధుర గాయకుడా! అరవిరిసిన అరవిందాలతో అందమైన కొలను అందుబాటులో వుండగా, అడవికి వెళ్ళడం ఎందుకయ్యా! చెట్టు చేమలు పట్టుకు తిరుగుతావు. అక్కడేముందని?

40. నీ తెలివి తెల్లారినట్లే వుంది. దగ్గరకంటావస్తావు. వచ్చిన వాడివి వుంటావా – అంటే, అంతలోనే అందనంత దూరంగా పోతావు. సరే వెళ్ళిపోయాడు గదా అనుకునేంతలో మళ్ళీ దర్శనమిస్తావు. హమ్మయ్య! ఇక వుంటాడు కాబోలులే అనుకునే లోపల మళ్ళీ కనుమాయమవుతావు గదా! అనకూడదు గాని, ఓయ్! మంచి రాజా! నీవు మా పాలిటికి మాయలేడివై పోయావు గదా!

41. నేపథ్యంలో అలా వినవచ్చిన దానిని విని సూత్రధారుడు, ఓహో! అదీ సంగతి. అర్థమైంది! అర్థమైంది. ఏకశిలా నగరం ఆర్యవాటికలో వితంతుకన్య కామమంజరిని కాసల్నాటి గోవిందమంచనశర్మ చేరదీసాడు గదా! ఈయనగారు తనకున్న పనుల వత్తిడిచేత కంచిన పడ్డ కాకిలాగా ఊళ్ళమీదపడి తిరుగుతూ, ఈ మధ్య కాలు అటు మళ్ళించినట్లు లేదు గాబోలు. అందువల్ల ఆమె సంకేత భాషలో తన ప్రేమానురాగాల్ని తెలుపుతూ వ్రాసిన ప్రేమలేఖ అది. మంచిరాజు అంటే, మంచనశర్మే! దానిని చదివి వినిపించినట్లున్నాడు ఆయన మనసెరిగిన మిత్రుడు టిట్టిభసెట్టి. వాళ్ళిద్దరూ ఇంతప్పట్నుంచీ నేస్తులు. వారిని కలిసి వారి వైనమేమిటో విచారిస్తాను గాక (అని అనుకుంటూ సూత్రధారుడు తెరవెనుకకు వెళ్ళిపోయాడు).

**(ఇంతటితో ప్రస్తావన ముగిసింది. రంగంమీదికి మంచనశర్మ, టిట్టిభసెట్టి ప్రవేశిస్తారు. అలా ప్రవేశించిన మంచనశర్మ కట్టూబొట్టూ, రూపురేఖా విలాసాలను కవి చెపుతున్నాడు)**

42. బాగా ఉతికి కమ్ములు పిడిచిన గన్నేరు పూచాయ కల నీరుకావి ధోవతిని, అంచు ముందుకు చెక్కుకుని, కుచ్చెళ్ళు పోసి, జారుకట్టు కట్టుకున్నాడు. పన్నీటితో మెదిపిన విభూదితో నొసట బొట్టు తీర్చాడు, కుడి చేతి మణికట్టుకు బంగారుజరీ తోరణం కట్టాడు. బాగా పురిపెట్టి వడికిన తెల్లని పట్టుజందెపు దారాలను చిక్కుపడకుండా జాగ్రత్తగా మెడకు చుట్టుకున్నాడు. మెరుపులీనుతున్న చెంగావి రంగు అంగవస్త్రం మెడ కిందుగా కప్పుకున్నాడు. ఒకపాటి పెద్ద పిలకముడి.

43. ఎర్రని పలుచని పెదవులు, ఆ పెదవులపై నిత్యనివాసమై మాయని చిరునవ్వు. మంచి హొయలు పోతూ మన్మథుని మరిపిస్తున్నాడు. కాసల్నాటి

మొత్తంలో-ఆ పాయకట్టులో పేరెల్లినవాడు. మీసాలప్పయ్యగారికి మేనల్లుడు. జగమెరిగిన బ్రాహ్మణుడు. ఇప్పుడు ఈ గోవిందమంచనశర్మగారు ఆంధ్ర రాజధానీ నగరం ఓరుగల్లుకు పయనమైనాడు.

44. తూర్పువైపు చూసి, మిత్రుడు టిట్టిభసెట్టితో మిత్రమా! శుభోదయం. కుశలమా! రాత్రి బాగా నిద్రపట్టిందా! ఈ పుష్య మాఘమాసాల చలి చాలా

45. ఘోరం. ఏమీ ఇబ్బంది పెట్టలేదుగదా! ఏమంటే-ఈ చలిపులిగాడు సామాన్యుడు కాదు మరి. పక్కటెముకలు ముడుచుకొని ముడుచుకొని రొమ్మును కూడదీసేటట్లు చేస్తుందా. మునిపండ్లు క్రింది పండ్లతో రాచుకొని గడగడలాడేట్లు వణికిస్తుందా. తలను కాళ్ళ సందులో ఇరికించి కుదపరచి గుమ్మడి కాయలాగా ముడుచుకున్నా, ఇంతలో ఎక్కడో సందు చూసుకొని వీపు మీద దూరి, వేకువజామున ఈ చలిపెట్టే బాధ ఇంతా అంతా కాదనుకో!

46. చలికుంపట్లు, గుత్తంగా జమిలినేత ఎర్రదుప్పట్లు, ఒంటికి పూసుకున్న తట్టుపునుగు, కస్తూరి, జవ్వాది, చివరికి కోడెవయసు చిన్నదాని రొమ్ముల నులివెచ్చదనాన్ని కూడా ఈ మంచు లెక్కచేయదుగదా! ఈ చలి ధాటిముందు

47. రెండుమూడు పొరలు పెట్టి నేసిన దుప్పట్లూ ఆగడం లేదు. కస్తూరీ, నల్ల అగురు పూసుకున్నా చలి ఆగడం లేదు. అసలు వేడి అనేది, వేకువజాము చలిదెబ్బకు తారుమని భయపడిపోయి, పోయి పోయి, ఆంధ్రయువతుల చనుగొండలను ఆశ్రయించిందోయ్, అంటే-నా అభిప్రాయం మనకిక అవే దిక్కని. అర్థమైందా?

48. ఒరే! ప్రియమిత్రమా! టిట్టిభసెట్టీ! ఈ జమిలి దుప్పట్లూ, సాంబ్రాణి పొగలూ, అగరు పూతలూ, ప్రియురాంద్ర రొమ్ముకుంపట్లూ, మండువా లోగిళ్ళ పడకగదులూ ఉన్నాయి గాబట్టి సరిపోయింది కాని, లేకపోతే ఈ మంచు కురిసే

49. వేళ వీచే చలిగాలిని తట్టుకోవడం, ఎంత కష్టం రా! అందుకడిగాను. చలివలన ఇబ్బంది లేకుండా సుఖనిద్రపట్టిందా అని. అలా అతని కుశలమడిగి, వేకువ అవుతోంది. మనం బయలుదేరే వేళ దగ్గరపడింది. ఏమంటావు

50. అని మళ్ళీ ఎందుకైనా మంచిదని నిర్ధారణ చేసుకుందామని తూర్పు ఆకాశంకేసి చూసి, టిట్టిభా! తూర్పున ఇప్పుడే చుక్క పొడుస్తోంది. కనుక మనం ఇప్పుడే బయలు దేరడం కుదరదనుకుంటాను. ఏమంటావా, ఇంకా బాగా చీకటి గానే వుంది. అది సరేగాని ఘుక్, ఘుక్కుమంటూ, కూస్తున్న గుడ్లగూబ కూత మనకు ఎడం వేపు నుండి వినిపిస్తోంది. విన్నావు గదా! ఇక మనకంతా పండేనోయ్. మనం అనుకున్న వన్నీ సానుకూల మవుతాయోయ్! సందేహం లేదు.

51. అదిగో అది విను. మాంచి కారుకొచ్చిన నెమలి,కే-గో అంటూ చెట్టు కొన కొమ్మల మీద నుండి షడ్జమంలో ఆగి ఆగి క్రేంకారం పెడుతోంది. కనుక,

52. సెట్టీ! మన కన్నింటా శుభం కలుగుతుందనడంలో ఇక మరో మాటలేదు. ఎందుకంటావా? శకువాలు చెప్పే శాస్త్రులుంటారు గదా! వారు చెప్పేదేమంటే - కోడి, భరద్వాజపక్షి, గుంటనక్క, నెమలి - వీటిని చూసినవారికి, కుడివైపుగా వీటికూతలు, అరుపులు విన్నవారికీ, కొంగు బంగారమేనంటారు మరి.

53,54. శర్మగారు చెప్పింది విని, నెమలి కూత ఆలకించి, అది సరేగాని మిత్రమా! నీవు విన్నావో, లేదో గాని తొలికోడి కూసింది. ఇదెలా వుందంటే - నాకు ఏమనిపిస్తోందంటే - మన్మథుడున్నాడు గదా! అతగాడు ఈ ఓరుగంటి నగరంలో తరుణులైన సతీపతులను శయ్యలపై రాత్రంతా రతికేళిలో అదేపనిగా పెట్టుకొని పోరించి పోరించి, తెల్లవారే సమయం కావడంతో, ఇక మీ యుద్ధం ఆపండర్రా అంటూ ధర్మదార గాని పట్టిస్తున్నాడా అన్నట్లుంది, ఈ తొలికూడి కూత ఏమంటావు! అని కొంచెం ముందుకునడిచి, శర్మగారితో, మిత్రమా! ఈ పల్లెపట్టుల్లోని ధనవంతులున్నారే, వారు ఉదయాన్నే కొర్ర అన్నంలో ఇంత లేత ఆవకూరవేసుకుని, అందులో పూస గట్టిన పేరునెయ్యి కలుపుకొని తిని, చివరకు ఇంత గడ్డపెరుగు వేసుకొని జుర్రుకొని బ్రేవ్‌మని తేన్చుతారు. దానిని గనుక విలువ గట్టితే కనీసం ఒక మాడ విలువైనా వుంటుందయ్యా. మరి అదృష్టమంటే వాళ్ళదే గదా అని సెట్టి ఒకముచ్చట చెప్పాడు.

57. మిత్రుడు చెప్పింది విని, ఒరే! మిత్రమా, కోడికూతంటే - ఒక సంగతి గుర్తు కొస్తోందిరా! ఒక నాడేమయిందో తెలుసా! నేనూ, కామమంజరీ, మాంచి కుశాలుగా, శయ్యపై - ఏం చెప్పమంటావులే- అయినా మిత్రుడివి, నీ దగ్గర దాపరిక మేమిటి గాని, కూడీమాడి, పొందీ పొసగీ, అణగీ,పెనగీ-ఏదో-మా తిప్పలు మేం పడుతున్నామా! పొరపాటున, ఆ సమయంలో - మనకు ఇదొక్కటేనా ఏమిటి-అలా-దేని సంగతో-నోరుజారాను. ఇక చూడు నా సామి రంగా-

58. దాని కోపం ఏమని చెప్పేదిలే. దాని అలుక తీర్చి, దారిలో పెట్టుకునేప్పటికి, నా ఠంగు తెగిందనుకో- ఏదోవిధంగా దానిని లాలించి, అలా దాని అధరామృతాన్ని గ్రోలు తున్నానో లేదో- ఉన్నట్లుండి అంతలో తొలికూడి కూసింది. ఇంకేముంది! అయిపోయింది. పడినపాటంతా ఫలితానికి రాకుండా పోయింది గదా! అలా అడ్డ పడిందయ్యా ఈ కోడి. అనకూడదుగాని, ఈ కోడిజాతి వుందే-దీనంత పాపజాతి మరొకటి లేదంటే నమ్ము!

59. టిట్టిభా! కామమంజరంటే ఏమనుకున్నావు! ముండ-మదన సామ్రాజ్యానికి పట్టపురాణి గదా! ఆ మదగజగమనను, అలా వసంత కాలంలో సురత సమయంలో అర్థాంతరంగా వదిలి వెళ్ళానా! ఆ తరువాత వేసవి. ఏం చెప్పమంటావు వేసవి ఎండ ప్రతాపం! మల్లెలకాంతి అటూ ఆ ఎండ రంగు ఇటూ. సూర్యుడు అప్పుడు ఎంత ప్రచండ మూర్తిగా వెలిగిపోతాడో గదా! ఎలాగో ఆ ఎండాకాలాన్ని గడిపాను. అంతలోనే! నే లేనా అంటూ వర్షాకాలం ముంచుకొచ్చిందా! ఇక ఆ వర్షాకాలంలో లాంగలీపుష్పాల కేసరాలనుండి వెలువడే పరాగరేణువుల వర్షం ప్రకృతి నంతా నింపి వేస్తుందా! ఇక దాని ప్రభావం ఎలా వుంటుంది! మనసంతా గుబులు రేకెత్తిస్తుందా! మరి దాన్నీ-ఎలాగో ఉగ్గబట్టి, పళ్ళబిగువున ఓర్చుకున్నాను.

60. మిత్రమా! వర్షాకాలంలో తరుణవయస్కులైన సతీపతుల ఎడబాటు వుందే – అది మరణయాతనే గదా! అది ఎలాగంటిదంటే – ఒక వారకాంత వుందనుకో, అసలే వర్షాకాలం, నెనరైనవాడు చెంత లేకపోవడం. దానికి తోడు పూరికొంప. పెనుగాలి తాకిడికి కప్పేమో కొంత లేచిపోయి, ఇంటిలోకి రయ్యిమని చలిగాలి పోటు. అసురుసురంటూ ఎలాగో ముడుచుకుని నిద్రపోతుందే అనుకో! అంతలో దిక్కులు పిక్కటిల్లేలా ఉరుములు. కళ్ళుమిరుమిట్లు గొలిపే మెరుపులు. దిగ్గున మెలకువ రావడం. భయం. చలి వలన వణుకు. ఇక ఆ వర్షాకాలపు అర్ధరాత్రి దాని సోప ఎలా వుంటుందంటావు! దాని బాధను, దీనతను చూడవయ్యా అంటూ మెరుపు, మేఘాలకు విన్నవించి చూపుతుంది. మిత్రమా! నీవూ ఆలోచించి చూడు! మాటల్లో చెప్పేది కాదయ్యా అప్పటి దాని బాధ! వర్ణనాతీత మనుకో!

61,62. మిత్రునికి ఆ ముచ్చట చెప్పి మంచనశర్మ తూర్పుకు దృష్టి సారించి

63. మిత్రమా ఆకాశం మైల విడుస్తోంది. తొలిసంజ రేకలు, దాసనపూవు చాయను అపహాస్యం చేస్తూ ఆకాశంలో పరచుకుంటున్నాయి, దానిని చూస్తే నాకే మనిపిస్తోందంటే-కోపంతో జేవురించిన కామమంజరి ముఖంలాగా వుంది. మిత్రమా! చూడు, చూడు! సూర్యబింబం తూర్పుదిక్కున మాణిక్య పూర్ణకుంభం లాగా అలరారుతోంది. ఇది, మన పనులు సఫలమవుతాయనడానికి శుభసంకేతం.

64. ఆహా! దశదిశలా ఆకాశమంతటా పదారువన్నె బంగారు కాంతులను పరుస్తూ సూర్యభగవానుడు ఉదయిస్తున్నాడు. లేత ఎండలు ఓరుగల్లు నగరం మేడలపై ప్రసరించి, ఆ మేడలపై నిలిపిన బంగారు కలశాలను ఎలా ప్రకాశింప చేస్తున్నాయో చూడు! అది చూస్తుంటే నీ కేమనిపిస్తోందో గాని, నాకు మాత్రం ఇంద్రుడు శచీదేవిని బిగియార కౌగిలించుకోగా, ఆమె తన గుత్తపు చన్నులపై పూసుకున్న కుంకుమ పువ్వు, ఆ రాపిడికి రాలిపడుతోందా అన్నట్లు అనిపిస్తోంది!

65. అది సరేగాని నాకు ఎలాగు నిత్యవ్రతమే గనుక, నా దైనందిన సంధ్యాగ్నిహోత్రాదిక అనుష్ఠానాలు ఇంతకు పూర్వమే ముగించుకున్నాను. మరి నీవు కూడా కాలకృత్యాలు తీర్చుకొని ముఖం కడుక్కుని, ఇష్టదేవతా ప్రార్థనాదికాలు పూర్తిచేసుకున్నావు గదా! ఏమంటే, మరి మనం బయలుదేరాలి కదా! నగర

66. ప్రవేశానికి గోధూళి వేళ ప్రశస్తం. అందులోనూ ముఖ్యంగా ఉషస్సు మరీ మంచిది. సిద్ధాంతులు ఈ విషయకంగా ఏమంటారంటే – ఉషః కాలం మంచిదని గార్గ్యుని మతం. శకునం చూసి బయలుదేరడం మంచిదని బృహస్పతి మతం. అవేమీ అక్కర్లేదు, నీ మనసుకు బాగుంది అనిపించిన వేళే మంచిదని వ్యాసుని పద్ధతి.

67. విప్రుడు మంచిదని చెప్పిన సమయం మేలైనదని ఈ విషయంలో విష్ణువు మతం. అని చెప్పి బయలు దేరి, నగరం బయట గల వెలిపాళెం పరిసరాల్లోకి చేరుకున్నారు మిత్రులిద్దరూ.

68. అక్కడ ఒక్క కరణదేశపు మేదరవేశ్య తన గుడిసె తడిక తలుపు దగ్గర వెదురు బొంగులతో కూర్చిన పెద్ద పీట వేసుకొని దాని మధ్యలో మాంచి కుశాలగా కూర్చొని వుంది. ఆమె వైఖరి ఎలావుందంటే, ఉన్నట్లుండి ఎకసికంగా ఏదైనా ఒక మాట అంటుంది. అంతలో పాట అందుకుంటుంది. అద్దపు ముక్కలో ముఖం చూసుకుంటూ కొనగోళ్ళతో జుట్టు సవరించుకొని పాపిడి సరిదిద్దుకుంటుంది. పైట దిగజార్చి, చేతినిలోనికి పోనిచ్చి వక్షోజాలను కదుపుకుని గుత్తంగా కూడదీసుకుంటుంది. సన్నని సవ్వడితో సాగదీస్తూ తీగె నవ్వు నవ్వుతోంది. చెవులకున్న తాటాకు కమ్మలను తిప్పుకుంటుంది. నిగారింపుతో చురుగ్గా చూస్తుంది. ఆ కళ్ళల్లో ఎంత అతిశయమో! ఎంత దిలాసానో! ఈ మేదరవేశ్య వుందే- ఇది నగరంలోని పామర విటుల పాలిట చవులూరించే తంగేటి చెట్టుకు గల తేనెపట్టు లాంటిది. మన్మథుని చేతి ముల్లు గఱ్ఱ. దీని గుడిసె మదనుని గరిడీయే నంటే

69. నమ్ము. అది ఈ నగరపు వెలుపలి ప్రాకారానికి అమర్చిన ఇత్తడి కడియంలాంటిది.

70. నున్నగా గీసిన వెదురు బద్దలతో నేసిన నిడుపాటి మంచం. దానిపై రోమాలతో కూర్చిన రెండు తలగడలు. ఇక దాని సంగతి ఏం చేప్పేదిలే.

71. హాయిగా ఆ మంచం మీద శయనించి మిండగాండ్రు అనేకులతో రమిస్తూ వుంటుంది. ఒకసారేమయిందో తెలుసా! ఒక రోజు ఒక మిండగాడు –వాడసలే దొంగ–దీనితో సరాగాలాడి, –అదే లేవయ్యా– అది ఏమరిపాటుగా వుండగా, తడిక తీసి వుండటంతో అది దాచుకున్న చిల్లర నాణేలును జాలెతో

సహా తీసుకుని జారుకున్నాడు. అప్పటినుండి ఇది తన సొమ్మును పైచెంగుకు బాగా ముడివేసుకొని మిండగాండ్రను కూడుతోంది.

72. అలా దానిని చూసి మిత్రులిద్దరూ ముందుకు సాగారు. అక్కడ చిరునవ్వుల
73. మెరుపులను చెక్కిళ్ళలో నింపుకొని, క్రీగంటి చూపులు చూస్తూ అన్నులమిన్న, మన్మథ బాణంలాంటి దైన ఒక చండాల తరుణి ఋతుస్నాన మాడటానికి వెళుతూ
74,75. వుంటే, దాన్ని చూసారు. అలా వెళుతూవుంటే, ఒక కర్ణాటస్త్రీ బిందెతో నీళ్ళుమోసుకుంటూ రావడాన్ని చూసారు. అసలే భారమైన పిరుదులు. సన్నని నడుము. ఆపైన ఆ నడుము మోయలేనంతటి చనుదోయి బరువును కల్పించాడు ఆ బ్రహ్మిగాడు. ఆ భారాన్నే మోయ లేక పోతోందనుకుంటే ఆపైన ఈ నిండు
76. నీళ్ళబిందొకటి దాపురించింది గదా అని వీరు తనను గూర్చి అన్న మాటలను విని ఆమె తన తలకొప్పు కదిలిపోయేటంతగా, కళ్ళు టపటపలాడిస్తూ సంతోషాన్ని మెరపింపచేస్తూ నవ్వుకుంటూ ముందుకు సాగిపోయింది. మిత్రులిద్దరూ ముందుకుసాగి అంగడి వీథిలో నడక సాగించారు.

77. అలా వెళుతూవుంటే-అక్కడ మైలసంతలో ఒకామె తన ఎడమచేతిలో పెద్ద ఏనుగు దంతపు పెట్టెలో జిగురుటుండలు పెట్టుకొని సుసరభేత్తని కేకలువేస్తూ,
76. వాటిని ఆడవాళ్ళకు మాత్రమే అమ్ముతూ వుండటాన్ని చూసారు, ఆమె అమ్ము తున్నదేమిటో మంచనశర్మకు బోధపడి చావలేదు. అందుకని మిత్రుడు టిట్టిభునితో అదేమిటోయ్ అరుస్తూ అమ్ముతోంది. అదేదో వివరంగా తెలుసుకొని, నాకు చెప్పు అన్నాడు శర్మ.

79. దానికి అతడు, భలేవాడివయ్యా మిత్రమా! చూడబోతే పేరెల్లిన రసికశిఖామణివి. అదేమిటో-ఇంతకు ముందెప్పుడూ-దానిని గూర్చి తెలియనే తెలియదా! చోద్యంగా వుందే! అది-అది, ఆడవాళ్ళు అక్కడ ఆ! అదేనయ్యా మన్మథుని కొంప వుంది గదా- అక్కడి రోమాలను తొలగించు కోవడానికి ఉపయోగించే మందు కదయ్యా! అందుకే దానిని అడవాళ్ళు మాత్రమే కొనుక్కుంటారు.

80. దానిని అక్కడ పూస్తే-తరుణుల స్మరమందిరం ఎలా శోభిస్తుందను కున్నావు! విష్ణువు ఒకప్పుడు తాబేలు అవతారాన్ని ఎత్తాడు గదా! ఆ తాబేలు పై చిప్ప ఎంతనున్నగా వుంటుంది! అదిగో ఆ చోటు కూడా అలా నునుపు దేరి మిసమిసలాడుతుంది. ఇంకా చెప్పాలంటే, ఆదికాలం నాటి జిననాథదేవుని నున్నని

బోడిగుండులాగా, బాగా తోమి బోర్లించిన రాగి బిందె మట్టులాగా, పెట్టుకున్న విభూది పోయేట్లు రుద్దుకున్న ఎత్తైన నుదురులాగా, మనోజ్ఞమైన కాంతితో,
81. మొదామొదలు సమర్తాడిన సమయంలో అది ఎలా తళుకు లీనుతుంది -అలావుంటుంది. జిడ్డుగా వుండి, రోమాలను తొలగిస్తుంది గనుక దానిని సుసరభేత్తని అంటారు. పంచబాణుని మందిరం వద్ద గుబురుగా అడవి లాగా పెరిగే రోమాలను తొలగించుకోవడానికి దానిని ఉపయోగిస్తారు అని దానిని గూర్చిన సమాచారమంతా మిత్రునికి పూసగుచ్చినట్లు తెలియజెప్పాడు ఆ వైశ్యమిత్రుడు.

అలా ఊసులాడుకుంటూ ముందుకు సాగుతున్నారు. అలా వారు వెలిపాళెం మధ్య, కర్షకులు నివాసముండే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఒక చూడచక్కని వయసుగత్తె ఒకతె, ఎర్రని కమ్మలు గల చీరను మోకాళ్ళపైకి ఎగదీసుకొని చిన్న ఎత్తు పీట మీద కుక్క కూర్చున్నట్లుగా గొంతుకు కూర్చుని, బంతులు ఎగరేస్తున్నట్లు కుదప పిడకలు తట్టుతూ, అవి ఎండటం కొరకు
82. ముందుకూ ప్రక్కలకు దొర్లిస్తోంది. లేయెండలో ఆమె దేహకాంతి తళుక్కుమంటోది. పిరుదులు, వక్షోజాలు, చెవులకమ్మలు, తలకొప్పు ఊగి పోతుండగా పిడకలు తడుతూన్న ఆమె భంగిమ - చూడబోతే-మగనిని ఆక్రమించి పురుషాయితం
83,84. సలుపుతోందా అన్నట్లుంది అనుకున్నారు మిత్రులిద్దరూ. కనుబొమ్మల్లో గాని, చెక్కిళ్ళలో గాని ఏ వికారమూలేకుండా ఆమె తన పని తాను చేసుకుంటూ పోతున్నది. కనీసం త్రోవన పోతున్న వారి వంక చూడటంగాని. పలకరింపుగా కళ్ళతో నవ్వడం గాని లేకుండా ఎలా వుందో చూడు. ఇలాంటి ముగ్ధత్యం కల్లలెరుగని నిర్మలత్వం, కర్షక స్త్రీలకు సహజం కదా అని వారిరువురూ ఆమెను గూర్చి అనుకున్నారు.

85. అలాముందుకు వెళుతున్నారు. అక్కడ కర్ణాట స్త్రీ ఒకతె, వెంట అలంకార సామగ్రి గల పెట్టె పెడతలపై పెట్టుకుని చెలికత్తె తనను వెంబడించి రాగా, బజారులో ఎదురుపడింది. ఆమెను చూసిన టిట్టిభసెట్టి మిత్రునికి ఆమెను చూపి,
86. మిత్రమా! ఆమెను చూడు! ఎలావుంది! రాత్రి ఎవడో దీనిని సురత క్రియలో ఓలలాడించి ముంచెత్తి తేల్చినట్లున్నాడు. చూడు చూడు! కుసుమ పూవన్నె అద్దకపు చీరకొంగు ఎలా నలిగిపోయిందో!మాంచి బిగువైన పాలిండ్లపై మూడుపేటల గొలుసు ఎంత అందంగా అమరిందో చూసావా! తలకొప్పు ముచ్చిలి గుంటలోకి
87. జారిపోయింది. ముఖంలో చూడు ఎంత అలసటో. చూడ బోతే రౌతు అదేపనిగా

స్వారిచేసి చేసి దిగిన గుర్రపుకొదమలాగా, రతికేళి మదం దిగిపోయి, వాడిన పూదీగె లాగా నిస్సత్తువుగా కాళ్ళీడ్చుకుంటూ వస్తోంది.

88. ఈవిడ వాలకం చూస్తుంటే. ఓ బాపనయ్యా! ఎవడో, అదే రంధితో – ఈసారి కొక్కసారే – ఇదిగో ఇక ఒక్కసారే – నా ముద్దులకొండవు కదూ–ఇక ఈ ఒక్కసారేనంటే నమ్ము – అదిగో అదే మరి నామాట వినవుగా– నా నోముల పంటవుగా ఇక లేదంటే లేదు – ఇదే ఆఖరు సారనుకో– అంటూ రాత్రి నాలుగు జాములూ దీనిని నానా తిప్పలూ బెట్టి ఒక పట్టాన వదలక బెల్లించి బెల్లించి మరీ రతిక్రీడ సాగించి నట్లున్నాడు. అలా గాకపోతే అంతలా అది ఎందుకు వాడిపోతుంది. చూడు ససిచెడి, వాడిపోయి ఎలా వస్తోందో అన్నాడు మిత్రునితో.

89. మిత్రుడన్న మాటలువిని శర్మగారు చిన్నగా నవ్వుతూ, దర్భలు చుట్టివున్న చేతులను చెవితమ్మలకు తాకించి, మాటల్లో కొంత మర్మాన్ని రంగరించి, తన
90. పూతిమాష గోత్రాన్ని, నామధేయాన్ని చెప్పి ఆమెకు నమస్కరించి ఇలా అన్నాడు. నీ విశాలమైన చనుకట్టుమీద అలా మెల్లగా చరచనిస్తావూ! లేలేత నీ ఎర్రని చిగురు పెదవులపై ముద్దు పెట్టుకోనిస్తావా! మదనవేద రహస్య పరమబ్రహ్మ
91. స్వరూపమైన నీ పొత్తికడుపు అలా అలా తాకనిస్తావా? ఓ కర్ణాటతాటంకినీ అని మరే! కవులు తాము దేన్నైనా వైనాలు వైనాలుగా చెప్పగల గడసరులమని, కుర్ర బొట్టెల చన్నులను జక్కువ పక్షులతోను, కన్నులను చేపలతోను పోల్చుతారుగాని, అలా పోల్చటం కేవలం ఆకారాన్ని చూసి మాత్రమే సుమా! నాకు తెలియక అంటాను. జక్కవలు నేలపై వాలతాయా! అలాగే చేపలు వలల్లో పడతాయిగదా! అలాంటప్పుడు వాలని నీ చన్నులకూ, వాలే జక్కవపక్షులకూ, సొగసుకాండ్రను వలలో వేసుకునే నీ కళ్ళకూ, వలలోపడే చేపలకూ ఏమన్నా సాపత్యముందీ? ఏమిటట! నీవే చెప్పు, నా మాట నిజమవునో కాదో అంటూ చమత్కారంగా మాట్లాడాడు.

92. అయితే ఆమేం తక్కువ తిన్నది గనుకనా! మాటకు మాట అంటించింది గడుసుగా! ఏమని? ఇదిగో చాటుమాటలు బాగానే నేర్చుకుపోయావులే! చాల్చాల్లే నీ పల్లదనం! నీ మాటతీరు చూస్తుంటే–కాసల్నాటి బాపనయ్య వనుకుంటానే!. అవునా! అంతే కావాలిలే! సంచి–నిండుగా రొక్కం, అదీ బంగారునాణాల్లో వుంటేనే సుమా. లేకపోతే ఈ కొఱగాని ఊసులింతటితో కట్టిపెట్టు. కర్ణాటస్త్రీలంటే,
93. నీ కేదో తమాషగా, లోకువుగా వున్నట్లుందే. ఇతరుల దగ్గర సాగినట్లు, ఆకుకూ పోకకూ అందకుండా, మాటకుముందు టా, టా లు గుణిస్తూ మాట్లాడితే మా

దగ్గర కుదరదు సుమా! అని, టిట్టిభసెట్టి వైపుకు తిరిగి. ఏం సెట్టీ! నీ జతగాడు, ఈ బాపనయ్య నట్టనడివీధిలో నిలేసి మరీ అడిగాడు. పొందుకోరితే సొమ్ము తే, లేకుంటే, ఈయనగారి మెడలోని జందేలను అందంగా మలుచుకొని మెడలో వేసుకోవడం ఖాయం. ఏమనుకున్నాడో మరి! నా మాటంటే మాటే. తిరుగు లేదు సుమా అన్నది.

94,95. ఆమె అలా అన్నదా! శర్మగారు ఊరుకున్నాడా! ఊరుకునేఘటం కాదుగా! ఆమెతో ఓయ్ ఓయ్! కరణదేశపు చిన్నదానా! ముసుగుపెట్టేవే అనుకో! అయితేనేమి! నీ ముత్యాల చెవికమ్మలు కాంతుల్ని ప్రసరిస్తూనే వున్నాయా! ముఖం దించుకుంటే మాత్ర మేమయిందట! నీ చిరునవ్వుల తళతళలు నీ చెక్కుటద్దాలను మెరిపిస్తూనే వున్నాయిగా! క్రీగంటి చూపులు కడకన్నులను దాటి మమ్మల్ని తడుముతూనే వున్నాయిలే! దాచుకున్నావే అనుకో! దాస్తే దాగేవైతేగా! నీ పాలిండ్ల మెరుగులు మా కన్నులతో దోబూచు లాడుతూనే వున్నాయి గదా! సిగ్గులు ఒలికిస్తూ, మా వేడుకను కాదని ఎందుకుట ఈ నటన! ఈ పాటుకు ఫలమేమిటంటాను. రతిరాజ్యపదవికి నన్ను పట్టం గట్టి, నన్ను కౌగిలించ రాదా! అది గదా వయసు వగరుకూ, వయ్యారానికీ ఫలమూ,పాటూ! ఏమంటా వంటూ చిరునవ్వులు చిందిస్తూ మంచనశర్మా, అతని మిత్రుడూ ముందుకు కదిలారు.

96. అలా ముందుకు పోగా, పోగా అక్కడ ఒక చోట జూదం ఆడటం

97. కనుపించింది. ఆడేవాళ్ళు ఆడుతూవుంటే– చూడటానికి చేరిన జనంలో ఒకటే ఉబలాటం. నిజానికి వీళ్ళకే ఆదుర్దా ఎక్కువగావుంది. ముందున్న వాళ్ళ తలలు అడ్డం వచ్చి కనపడటం లేదో ఏమో, ముంగాళ్ళపై నుంచుని వారి తలల మీదుగా ఎగబడి చూస్తున్నారు. ఇక హంగుదార్లూ, వత్తాసుగాళ్ళూ చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఇదంతా ఇలా వుంటే ఆ వేడుకని చూడ్డానికి వచ్చిన వేశ్యాజనాన్ని చూడటానికి గోవింద మంచనశర్మగారు ఉవ్విళ్ళూరారు.

98. ఆ జూదమాడే చోట ఒకటే కోలహలం. దాని తీరు, ఒక పాడూ ఒక మన్నూ కాదు గదా. వారిలో వారు అంతలో జత కడతారా! అంతలో పోట్లాడుకుంటారు. ఒకసారి గెలుస్తారు. మరోసారి ఓడి పోతారు. ఎకసికాలు. అంతలో మాట పట్టింపులు. బండబూతులు తిట్టుకుంటారు. ఈ జూదమాడే బరి గదంతా ముద్రలు చెక్కిన చెక్కపాచికల మయం. ఈ పాప జూదంలో మునిగిన వాళ్ళకి చివరికి మిగిలేది గోచిపాతలే సుమా!

99. ఈ జూదదేవత, ఈసారి గెలుపు నీదంటే, ఈసారి తప్పదంటూ

అమాయకులైన జూదరుల్ని భ్రమలో ముంచి తేలుస్తూ, ఓడిన కొద్దీ తమకంతో మళ్ళీ మళ్ళీ ఆడేట్లు వంచించి అంతలో అంతా కనుమాయ చేస్తాడు గదా! అనుకుంటూ వీరు ముందుకు నడక సాగించారు.

100. అక్కడ, కనుమ అవతలి కరణదేశపు స్త్రీ ఒకతె కనుపించింది. కొప్పుజారి
101. వుందేమో, విడివడ్డ ఒత్తైన నిడుపాటి తలకట్టు, ఆమె గుత్తపు చన్నులపై జందెంలాగా వ్రేలాడుతున్నాయి. భుజానికి పెట్టుకున్న వెండివి దండకడియాల గుబ్బలు లింగముద్రలు వేసాయి. కుచ్చెళ్ళుపోసి కట్టిన సన్నని చీరలోనుండి లోదుస్తులు లేకపోవడం వలన లోతొడలు మెరుస్తూ కనిపిస్తున్నాయి. తీర్చిన రేకలతో చేసిన చెవిదుద్దుల కాంతులు చెక్కిళ్ళపై నీడలు తేరుస్తున్నాయి. సరస్వతీ దేవి వీణానిక్వాణం లాగా, కోయిల పంచమస్వరంలో గొంతు సవరించిన చందాన తీయని గొంతుతో
102. అరుస్తూ జనాన్ని పిలుస్తూ, ఓరుగంటి ఇరుకు గొందిలో సంపెంగనూనె అమ్ముతున్నది చూసావా అని చెప్పి, ఇటుచూడు ఈ తెలికల స్త్రీని, మాటల్లో తేనె ఒలికిస్తుంది. చూడు దాని తళుకుచూపులు. చూడగా ఈమె ములికినాటిదిలాగా
103. వుంది. గానుగపట్టెపై కూర్చొని, చిన్నములుకోలతో రొప్పుతున్న తిరుగుడు ఎద్దును అదిలిస్తూ వున్న ఈమెను చూస్తూ వుంటే, నాకేమనిపిస్తోందంటే- అలనాడు పాలసముద్రాన్ని మంథర పర్వతంతో మథించిన వేళ, సుడివడ్డ సముద్రం లోంచి పైపైకి వస్తున్న లక్ష్మీదేవి తలపుకు వస్తోందోయ్! ఆహా! దీని అందమే అందం.
104. పొంకమే పొంకం. కళ్ళు చేపలా! ఇక చన్నులు. ఓ యబ్బ-అలా మీటితే ఖంగు మనేట్లున్నాయి. పలుకుల్లో అమృతం జాలువారు తుంది. అలాంటి ఈ మదవతిని, మందయానను, వేశ్యగా పుట్టించక గానుగ దానిగా పుట్టించాడేమిటి ఆ మందమతి బ్రహ్మిగాడు. వాడికసలు బుద్ధుందా అని! చెప్పొద్దూ। కనిపిస్తే వాణ్ణి గట్టిగా మొత్తాలనిపిస్తోందోయ్. ఏమంటావు!

105. అని అంటూ అక్కడ నుండి దానికి ఉత్తరంగా వున్న సైనికులుండే వాడకు వెళ్లారు. అక్కడ రకరకాలపూలను కత్తిరించి గుత్తులుగా, కోకిలలు హంసలు వానకోయిలల్లాగా మలిచి అలంకరించి వుండటాన్ని చూసారు. అదే సమయంలో
106. అక్కడున్న ఒక దర్జీవాని దగ్గరకు ఒక వేశ్య రవిక కుట్టించుకోవడానికి రావడాన్ని చూసారు. రవికకు కావలిసిన బట్టను అతగాడికి ఆమె ఎప్పుడిచ్చిందో ఏమో కాని, దానిని మాత్రం వాడు కుట్టి ఇచ్చినట్లు లేదు. అలా దాని కొరకు ఆమె వచ్చిన ప్రతిసారీ కొలతలు తీసుకునే నెపంతో ఆమె చనుకట్టును పైకీ కిందికీ పక్కలకు జానపెట్టి కొలవడం, దొంగ చూపులుచూస్తూ, ఆమె బాహుమూలాలను

చూడటం - ఇదంతా ఎందుకను కుంటున్నావు? అతగాడు ఆమెను రమిద్దామని! అందువల్లనే రవిక కుట్టిఇవ్వకుండా పదేపదే ఆమెను తిప్పించుకుంటున్నాడు అని
107. మిత్రునికి అతని వైఖరిని వివరించి చెప్పి - ఆ వాడ దాటి అక్కడ నుండి ఉత్తరానికి తిరిగారు మిత్రులిద్దరూ.

అలా వెళుతూ ఆ బజారు మొదలే వున్న ఇంటివెనుక వసారాలో ఒకామె తన జతగత్తెకు ఈరీర్చుతూ పేలు చూడ్డాన్ని గమనించారు. అది చూసిన శర్మగారు
108. ఎందుకు తల్లీ అలా మాటిమాటికీ నీ ఎర్రని వాడి గోళ్ళతో పేలను కుట్టి కుట్టి చంపుతావు. ఈర్పెనతో ఈర్చి ఇస్ ఇస్సంటూ మా చెవులకు విందుచేస్తావు. నీ బాహుమూలాలనుంచి కనువిందు చేస్తున్న నీ కుచద్వయమే మా ప్రాణాలు తోడేస్తోంది. ఆ పాపం మూటకట్టు కుంటున్నది చాలకనా పేలనుకూడా చంపి
109,110. పాపం పోగేసుకుంటున్నావెందుకే బుల్లీ అని అంటున్నాడో లేదో అంతలో ఇంటిముందు గొంతుక్కూర్చొని రోటిలో పసుపు కొమ్ములు నూరు కుంటున్నామెని చూసారు. ఇక ఆమె అప్పటి తీరును వర్ణించటానికి పూనుకున్నాడు మంచనశర్మ. చూశావుటోయ్! ఆమె ఎలా నూరుతోందో! తలవెంట్రుకలు, ఆ వేగానికి ఎలా అల్లల్లాడిపోతున్నాయో. అబ్బో! చూడు! చూడు! దాని చన్నులు. అబ్బ! ఎంత పెద్దవో! కదిలిపోతున్నాయి! గాజులసవ్వడి ఎంత కమ్మగా వినిపిస్తోందోయ్! ఇదంతా చూస్తుంటే - ఇదిగో -నాకేమనిపిస్తోందో చెప్పమంటావా? చెపుతా విను మరి. ఒబ్బిడిగా మగనిపై కూర్చుని, రతిసంబంధమైన శబ్దాలు వెలువరిస్తూ పురుషాయిత పద్ధతిలో సంభోగిస్తున్నట్లుందోయ్। ఏమంటావ్! అవును కదూ అన్నాడు.

111,112. అలా, అలా ముచ్చట్లాడుకుంటూ, నగరం వెలుపలి అందమైన దృశ్యాలు చూసుకుంటూ, కోట దగ్గరలోకి వచ్చారు. వచ్చి కోటకు ముందు చుట్టూవున్న అగడ్తను చూసారు. అబ్బో! దాని లోతు ఎంతుంటుందో! బహుశా ఈ అగడ్త గుండా పాతాళలోకం జేరుకోవచ్చునేమో! ఆ లోకం చేరుకోవడానికి ఇదే దగ్గరి రాచబాటేమోమరి! అని అనుకుని కోటగోడ మీదికి తమ దృష్టిమళ్ళించారు! దాని ఎత్తు ఎంతో అంచనా వేసుకోవటానికి అబ్బో। అది నక్షత్రమండలాన్ని తాకుతున్నట్లుంది. ఎక్కడా చూపుకు ఆనేట్లుగా లేదే అని అనుకున్నారు. ఇదేమిటి! మొత్తం లోకమంతా రూపుకట్టి ఇక్కడే నిలిచిందా ఏమి? కాకపోతే, ఇంత జన సమ్మర్దమా! అబ్బో! ఈ వంకదారి అంతా నానా రద్దీగా వుంది. ఎలాగో, కాస్త అనువుచూసుకుని ఆ దారిలోకి ప్రవేశించారు. వామ్మో! ఇవి కోట తలుపులే! ఎంతపెద్దవి. మేరుపర్వతపు మెరుపురెక్కల్ని తలపిస్తున్నాయే! ఏనుగులు, గుంపులు

గుంపులు. వాటి బారినుండి ఎలాగో సందుచేసుకుని తప్పుకుని ఒదిగి ఒదిగి నడుస్తూ ఎలాగో ఆ దుర్గ ద్వారం గుండా ఓరుగల్లు నగరంలో ప్రవేశించారు.

113,144. అంతట మంచనశర్మ మిత్రునితో – ఈ రాజమార్గమంతా ఏనుగులు, రథాలు, గుర్రాలు సైనికులు – అంతా తొడతొక్కిడి – ఒకటే దుమ్ము, ధూళి. ఈ తోవెంట మనం వెళ్ళనే వద్దు. మన వల్ల కాదు. కనుక మనం పక్క దోవలు పట్టుకుని వెళదాం. వాటిల్లో ఇంత రద్దీ వుండదు. అవునా! రద్దీ సంగతి సరే! అదలావుంచు. అలా మనం మధ్య బజారులోకి వెళితే ఆ వీథి వుంది చూసావ్. అది మన్మథుని విహారభూమి. అదేనయ్యా! వేశ్యావాటిక, అక్కడ బోలెడంత కాలక్షేపం. కంటికింపైన, మనసుకునచ్చిన మదవతులతో మనసారా ముచ్చట్లాడు కోవచ్చు. మాంచి పసందైన కాలక్షేపం. అలా ఆ పాటికి మధ్యాహ్నమవుతుంది గదా!

115. అప్పుడైతేనే అక్కవాడలో వేడుకకు అనువు మరి! కదా మరి అంటూ టిట్టిభసెట్టి మిత్రుని అనుసరించాడు.

116. అలా వారిరువురూ కోటకొమ్ము కిందనున్న దోవ పట్టుకున్నారు. అలా వెళ్ళగా వెళ్ళగా అక్కడ పలనాటి వీరుల పరదైవతం – శివాలయాన్ని చూసారు. అక్కడ ఒకామె నడివీథిలో గొంతెత్తి షడ్జమస్వరంలో మాంచి గమకంతో ధుం. ధుం, ధుం అనే తాళధ్వని ప్రాణం పోసుకుందా అన్నట్లు యతితో కూడిన ద్విపద ఛందంలో పలనాటి వీరులను ప్రస్తుతిస్తూ పాడుతూవుంది. ఆమె పాటలోని

117. ప్రతిమాటకు, వీరుల వేషాలను అభినయిస్తున్న నటులు రెట్టించిన ఉత్సాహంతో పదం పదానికి ఈలలు వేస్తూ ప్రదర్శనను రక్తి కట్టిస్తుండటాన్ని చూసారు మిత్రులిద్దరూ!

ఆ ప్రదర్శన కారులు గర్జిస్తూ కాలిపిక్కలకు వీరముద్రికల కడియాలను ధరించి ఒకడు కోలలు విసురుతున్నాడు. ముందుకు చాచిన కాలును కొంత మడిచి కుంతాన్ని విసరడాన్ని మరొకడు అభినయిస్తున్నాడు. కళ్ళల్లో వీరత్వాన్ని ఒలికిస్తూ చలించే చూపులతో రెట్టించిన ఉత్సాహంతో ఈలలు వేస్తున్నా డింకొకడు. మాంచి బలిష్ఠమైన చేతులతో భూమిని తట్టి ఒడుపుతో ఉరుకుతున్నాడొకడు. తనకు సమ ఉజ్జీ అయిన వాడెవడంటూ ఒకడు కవ్విస్తున్నాడు. మరొకడు గుర్రాన్ని ఉరికించటాన్ని అభినయిస్తున్నాడు.

118. అలా ఆ చిన్నది పలనాటి వీరులను గూర్చి పాడుతున్నపుడు నడువీథి రంగంలో వారు తమ తమ ఆటోపాన్ని ప్రదర్శిస్తున్నారు. పిరికి తనమన్నది కలికానికి కూడా లేని పలనాటి వీరులు అరవైఅయిదుగురు వీరులకు కులదైవం గురజాలలో

119. వెలసిన గంగమ్మతల్లి. యుద్ధరంగంలో ప్రతిష్ఠించబడ్డ కల్లుపోతురాజే వారికి
సావాసగాడు. ఆరువెల్లి నాగమ్మ నాయకురాలి దురాలోచన, కోడిపందేలు,
120. చాపకూటి పంక్తి భోజనాలు, ఇవే పలనాటి వీరుల యుద్ధానికి, వీరవిహారానికి
అసలు కారణాలు. పచ్చని పిండి గంధం, పసుపు పచ్చని అక్షతలు. ఎర్రని పూల
121. కంఠమాలలు, తీర్చిన తలపాగాలు, కుచ్చుల కాలితొడుగులు కాసెపోసి బిగుతుగా
కట్టిన ధోవతులు - ఇవీ పలనాటి వీరుల వేషభూషలు. పేరెల్లిన నల్లగొండ,
నకిరేకల్లు, పల్లేరు, నాగులేరు, ఈ నాలుగూ పలనాడుకు నాల్గు వైపులా గల
పొలిమేరలు.
122. ఇదిగో, ఇక్కడే సామంత రాజులందరూ తమ పంతం నెగ్గించుకోవడం
కోసం సమావేశమై చాపకూడు బంతిభోజనాలు సాగించారు. ఇదిగో, నాయకురాలు
మాయదారి ఆలోచన సాగించిం దిక్కడ సుమా!ఇదిగో ఇక్కడ పీలసాని తన భర్త
అలరాజుతో నిప్పులగుండంలో దూకి సహగమనం చేసింది. సవతి తల్లుల బిడ్డలైన
గొల్లరాచబిడ్డలు రాజ్యాన్ని పణంగా పెట్టి యుద్ధం చేసిన చోటిది సుమా! ఇదిగో
ఈ చోట మేటి వీరులూ ధీరులూ అయిన అయిదుగురు వీరపురుషులూ కళ్ళికి
ఒరిగి పోయారు అని పలనాటి లోని వయోవృద్ధులు ఆయా చోటులను చూపి
చెపుతూవుంటారు.
123. మాచెర్ల చెన్నకేశవుడు, శ్రీగిరిపాటి ఈశ్వరుడు సదాకాలం చల్లగా
చూస్తుంటారు గనుక పలనాటికి ఆ మహత్వం అబ్బింది. అలా గాకపోతే, ఆ
నాపరాళ్ళ సీమలో ఉత్తరకార్తెలో అలా మేఘం-కురవక్కర లేదు-కమ్ముకుంటే
124. చాలు, చల్లిన ఆవగింజలు మొలకెత్తి పండటం అనేది ఎలా కుదురుతుంది గనుక!
మరోమాట! పలనాటి మగధీరులు యుద్ధభూమిలో సింహాల్లాగా దూకి, ఉన్మత్తులై
యుద్ధంచేసి ప్రజల ప్రస్తుతికి పాత్రమైనారని చెప్పడం దేనికట! అక్కడి కర్షక
యువతులు మాత్రం తక్కువ తిన్నారా! వారి మాటల్లోనూ పౌరుషం తొంగిచూస్తూ
వుంటుంది. ఆ గడ్డ మాహాత్మ్యం అలాంటిది మరి! ఇక మగవాళ్ళకు అది అబ్బురమా!
125. సెట్టీ. అదిగో చూడు! అక్కడ ఆ పోతురాజు స్తంభం దగ్గర త్రిశూలాన్ని పాతి
శీలం బ్రహ్మనాయడు మొదలైన వారి బొమ్మలను నునుపుచేసిన
126. రంగుల గద్దె పలకమీద చిత్రించారు. చూడు అంటూ అతనికి చూపి, ఈ వీర
పురుషులు మనకు కార్యసిద్ధి గావిస్తారు గాక, పదపద మంటూ ముందుకు
నడిచారు. అక్కడ వేపచివుళ్ళ మండలతో అలంకరించి వున్న ఏకవీరాదేవి మండప
127. ద్వారాన్ని చూసారు. చూసి, లక్ష్మీ వల్లభుడైన విష్ణుమూర్తి కన్నతల్లికి నమస్కారం,

పాములను అలంకారాలుగా ధరించిన వెనకయ్యకు దండాలు, సూర్య చంద్రా గ్నులు నేత్రాలుగా గల శివయ్యకు దండం, జగజ్జనని దుర్గాదేవికి నమస్కారం. దేవతలచేత మునులచేత, సిరులచేత సేవించబడే తల్లికి, జమదగ్ని ముద్దుటిల్లాలు రేణుకాదేవికి వందనాలు. మనోహరరూప, శోభనాకారయైన పర్వతరాజపుత్రి పార్వతీదేవికి దండాలు. నిత్యకల్యాణికి, నల్లని తలకట్టుగల తల్లికి, ఆదిశక్తికి వేదవేదాంత సారము తానై రూపుదాల్చిన అంబ ఏకవీరాదేవికి, నిండుచంద్రుని పోలిన ముఖాకృతి గల్గి సర్వసృష్టికి తల్లియైన దేవికి మావైన సాష్టాంగ దండప్రణామాలు.

128. అని, ఆమెను గూర్చి మంచనశర్మ టిట్టిభసెట్టికి ఇలా వివరించిచెప్పాడు. భార్గవవంశానికి అలంకారమై నిలిచింది, ఈ పద్మనేత్రయే సుమా! త్రేతా ద్వాపర యుగాల సంధికాలంలో, చిరకాలం మగనితో కాపురం చేసింది. తన గారాలపట్టి పరశురామునితో ఇరవై ఒక్క సార్లు క్షత్రియులను సంహరింపజేసింది ఈ తల్లియే! హైహయరాజు ఎముకలను కంఠహారంగా ధరించిన చండమూర్తి ఈమె. మండ పాకలో, పెనుమాకలో, మాహురంలో నాగవరంలో, పోలాసలో వెలిసిన ఈ తల్లి, ఈ ఓరుగంటిలో వెలసిన ఈ ఏకవీరాదేవి సాక్షాత్తూ కాకతమ్మకు సోదరి సుమా!

129. కోపమంటూ వచ్చిందో – ఎంతటి పరాక్రమ వంతులైన ప్రభువుల భార్యలనైనా ముండ మోయించక మానదు. పెనుమాకలో జమదగ్ని కూరిమి ఇల్లాలు రేణుకా దేవిగా దర్శనమిస్తూ వెలిసిన ఈ తల్లి,సుక్షత్రియవంశాలనన్నింటనీ తన కుమారుడు పరశురామునిచే వారిపేరు మాసిపోయేట్లు చేసింది. బహుకోపదారి ఈమె. బవనీలు తనను గూర్చి పాడేపాటలతో, వేడుక ఉత్సాహం పెనగొనగా ఇల్లాండ్రచేత చిందులు వేయిస్తుంది. చాటుగా కదుళ్ళవాగులో, మోహనాకారులైన తీగెలవంటి దేబెలను కన్నతల్లి. ప్రసిద్ధికెక్కిన పోలాసలో మారెమ్మ దేవతగా వెలసి విరాజిల్లుతోంది.

130. చంకలో తగిలించుకునే పెద్దధ్వనిని పుట్టించే జవనికపైన కట్టిన తంత్రికి, కంఠ శ్రుతికి సరిపోయేట్లు తన భార్య పాడుతుండగా, శుద్ధసాళవ రాగంలోనూ, మిశ్రమరాగాల్లోనూ మా బాగా, చవులూరించేటట్లు పాడుతూ, ధమ ధమధ్వనులను తాళంగా సవరించుకొని వాద్యాన్ని పలికించడంలో ఇంతటి నేర్పుకాడు మరొకడు లేడురా అనేట్లు జనులు మెచ్చుకోలుగా అంటుండగా. ఆ బవనీల ప్రధాన నాయకుడు ఏకవీరాదేవి ఎదుట పరశురాముని కథలను ఆలపిస్తున్నాడు.

తన అవ్యక్త మధురస్వరంతో కుహూకుహూ నాదంతో కోకిల సర్వజగత్తునూ ఎలా సమ్మోహపరుస్తుందో అలా ఒక మాల యువతి ఒక్కొక్క

స్వరంతో మూర్ఛనలను ప్రస్తరిస్తూ మదనావేశాన్ని ప్రోది చేస్తూ స్పష్టాస్పష్టంగా మద్దువాద్యధ్వనులతో మేళవిస్తూ తన గానమాధుర్యంతో ఏకవీరాదేవిని ప్రస్తుతిస్తూ పాడుతోంది. నగ్నమూర్తిగా దర్శనమిస్తున్న ఆ ఆదిశక్తికి, ఆ ఏకవీరాదేవికి, ఆ
132. మాహురమ్మకు తకధుం, తకధుమ్మంటూ తాళంతో సమానంగా చిందులువేస్తూ, జవనికలను పలికిస్తూ తందానపాటలు పాడుతూ, నిండారిన సంతోషంతో సకలానంద స్వరూపిణియైన ఆ తల్లిని కీర్తిస్తూ ఒళ్ళుమరిచి తమ జన్మ సార్థక్యం
133. పొందింది గదా అనే భావనతో ఆడుతూ పాడుతూ ప్రార్థిస్తున్నారు. కొలుస్తున్నారు. చూసావా మిత్రమా! అంటూ, అదిసరేగాని మిత్రమా! ఈ దేవవేశ్య లందరూ దిసమొలతో దర్శన మిస్తున్నారు గదా! మరి మనం మొక్కి నమస్కరిం చాలంటే – ఆ మూర్తులను కళ్ళారా దర్శించి కదా అలా చేయాలి. మరి అలా చూస్తే – మనకు కామావేశం కలుగుతుందో ఏమో, ఏం చేద్దామంటావు. మానుకుందా మంటావా? చూద్దామంటావా? నీ మాటేమిలో చెప్పు మరి అంటూ శర్మగారు మిత్రునితో పరియాచక మాడాడు.

134. అలా అంటున్నాడో లేదో అంతలో ఒక కర్షక యువతిని చూడటం జరిగింది. ఆమె ఎలావుందంటే – ముడుతలు పడనిది చౌకపుగళ్ళ నేతగల ఎర్రని చీర కుచ్చెళ్ళు పోసి కట్టింది. పచ్చిగందపు బొట్టుపై ఎర్రని కుంకుమ అద్దింది. పసిమివాడని వేపచివుళ్ళ దండను గుత్తమైన తన చనుగుబ్బలపైకి వ్రేలాడేటట్లు ధరించింది. బాగా తోముకోవడంతో తెల్లనైన పలువరుసపై తాంబూలపు ఎర్రదనం వింత కాంతిని ప్రసరిస్తోంది. అప్పుడప్పుడే తొంగిచూస్తున్న యౌవనమదం ఒంపుతిరిగే ఆమె అన్ని శరీరభాగాలను అలముకుంటుండగా, ముఖంలో కాంతి, అణకువ ఉట్టిపడగా, ఒబ్బిడిగా నగరంలోనికి ఆమె ప్రవేశించ డాన్ని వారు చూశారు.

135. అంతట జతగాళ్ళిద్దరూ ఏకవీరాదేవికి నమస్కరించి ముందుకుసాగారు. అక్కడ ఒక జక్కుల పడతి, కోణం పై భాగాన తట్టడం వలన పుట్టిన ఘుం
136. ఘుమ్మనే ధ్వనితో తాళవాద్యస్వరం మేళవింపగా మంచి ధ్వని రాగలందులకు గాను మెదిపిన అన్నంతో రుద్దిన వాద్యమధ్యభాగమైన కన్నును (కరణిని) సన్నని కఱ్ఱ పుల్లతో పర్యాయక్రమంలో తట్టుతూ, శ్రుతిని సరిచేసుకోవడానికి గాను పలకను పట్టివుంచిన నరాలను బిరడాతో తట్టి సరిచూసి బిగిస్తూ గిలుక్కు గిలుక్కుమంటూ మ్రోగే గజ్జలధ్వని తాళంతో మేళవింపగా, ఒక రాగం నుండి మరో రాగం లోనికి

సంచారం చేస్తూ తొడలపై ఉరుము వాద్యాన్నుంచుకొని కామవల్లీ మహాలక్ష్మి విష్ణుమూర్తులపై అనురాగ గీతాలను పాడుతూవుండటాన్ని చూసారు.

137. అక్కడ ఒక ఇంటిముందర అక్కల ఆరాధనోత్సవం జరుగుతోంది. ఏడుగురు స్త్రీలను అక్కలుగా అలంకరించి పీటలపై కూర్చో పెట్టారు. ఉరుమువాయిద్య ధ్వని అంతకంతకూ అధికం కాగా దాని ప్రేరణతో అక్కలవేషం లోని ఒకామెకు పూనకం వచ్చింది. అంతట వెన్నెల మాణిక్యాల కాంతి ఆమె ఎర్రని చేతులలో గల పింఛం పెట్టెలోనికి విస్తరింపగా, ఉపవాసంతో మిక్కిలి బలహీనమైన నడుము కుచద్వయభారాన్ని తట్టుకోలేక జలదరింపగా తోకచుక్కల్లా వున్న ధవళ నేత్రాలు కళావైభవంతో సిగ్గుల్ని తొలగించగా కుచ్చెళ్ళు తూలి ఆమె

138. తొడలు కాంతులీనుతూ ప్రకాశిస్తుండగా నాట్యమాడసాగింది. శివ శివా! పెద్ద మోతతో, ఝుంకారంతో, మురళీరావంతో మూర్ఛనలతో సాగే గీతాలాపన మనసులను మత్తెక్కించడంతో ఒళ్ళుమరిచి. ఆ అక్కలు ఏడుగురూ తమ వక్షోజాలభారం వారి నడుములను ఊపివేస్తుండగా నృత్యం చేయడమారంభించారు

139. బహుశా ఈ ఇంటి యజమాని సంతానార్థియై కట్టిన ముడుపు చెల్లించుకోవడం కొరకు ఈ యక్షకన్యలను రప్పించి ఈ అక్కల ఆరాధనం చేయిస్తు న్నట్లుంది. మాణిభద్ర వంశంలో జన్మించిన దేవతలు, కామవల్లీ మహాలక్ష్మితో కూడి, మనం కోరుకుంటున్న కార్యాలను సఫలం చేస్తారు గాక అంటూ, నిండిన భక్తితో అక్కదేవతలకు నమస్కరించి, అక్కడ నుండి కదిలివెళ్ళారు మిత్రులిద్దరూ.

140. అలా వెళుతూవుంటే, ఒకచోట మంద్రం, మధ్యమం, తారాస్థాయిల్లో ఎనుబోతు కొమ్ముబూరధ్వనితో డమరుక, డిండిమాల ధమధమలధ్వని

141. వినిపించింది. అదివిని, అదేమిటంటావు అని టిట్టిభసెట్టి మిత్రుడు మంచనశర్మను అడగ్గా ఆయన ఇలా చెప్పాడు. వాళ్ళా! వాళ్ళు మైలారభటులు. అంటే, వాళ్ళు మైలారదేవుని ఆరాధించే భక్తులు, సాహసానికి, ధీరత్వానికి వారు మారుపేరు.

142. మరోపేరంటే నమ్ము! చూడు! వారు గుండాల్లో ఎర్రగా మండుతున్న చంద్ర నిప్పుల్లో దూకుతున్నారు. కింద పాతర లాగా తవ్వి బాణాల వాడిమొనలు పైకి వుండేట్లు పాతి, పైన దూలాలకు కట్టిన ఉట్ల తాళ్ళను తమంత తాముగా కోసి తెంపుకుని, అమాంతంగా ఆ బాణపుమొనలమీదికి దూకిపడతారు. సిడి బండి తెలుసుగదా! దాని గడకర్రకు గల గాలపు కొంకికి మెడ పైచర్మాని గుచ్చుకొని వేలాడతారు. ఎర్రగా మండుతున్న నిప్పుకణికలను బంగారు పిళ్ళుగల కత్తెరలతో పట్టి గొంతులో వేసుకొని అమాంతంగా మింగేస్తారు. కీళ్ళల్లో మేకులు గుచ్చుకుంటారు. కుడి ఎడమ – రెండు అరచేతుల్లోను ఆరతులిస్తారు.

143. చూడు! ఈ మైలారవీర భటులు గొండ్లి ఆడిస్తున్నారు. ఆ గొరగ పడుచు ను చూడు! వయసులో ఎంత చిన్నదో! నెట్టిక సీలంత లేదు. అయితేనేమి నెత్తిపై గొరగలు జారిపడిపోకుండా సమతూకంతో అడుగులు వేస్తూ మెడను అటూ ఇటూ
144. కదుపుతూ ఎలా గొండ్లి ఆడుతోందో! వెనుకకు మొగ్గగా వాలి, ఎంతో ఉపాయంగా తొట్టి నీళ్ళలో మునిగి అందులో వున్న ముక్కరను ముక్కుకు ధరించుకుని యథాప్రకారం పైకిలేస్తోంది. అవునా! ఈ వింతచూడు! నాలుకతో దండలో నల్లపూసను గుచ్చుతోంది. ఇన్ని ఉపాయాలు, ఈ విద్యలు ఎలానేర్చుకుందో ఇంత చిన్నవయసులో!

145. మైలార దేవుడు శనివారం నాడు సిద్ధినిచ్చే దైవం. సజ్జనుల పాలిట పారిజాతవృక్షం లాంటివాడు. కోరిన వరాలిస్తాడు. ఆదివారం నాటి దేవత మాడచీ (మాళవి) మనోహరుడు. మాయ ఆయనకో వినోదం. మాళవీదేవికి కూరిమి మగడు. గొప్ప కీర్తిశాలి. పల్లెమ్మ భర్త. సమస్తదేవతలకు ప్రభువు. గొప్ప వేటకాండ్రకు అధిపతి, 'కత్రశాల' స్వామి. కరుణా సముద్రుడైన అయినవోలిస్వామి, పుణ్యకీర్త నుడు. మంచును కుంచాలతో కొలిచే సామర్థ్యం గలవాడు. మాయలేళ్ళను పట్టగల మహిమాన్వితుడు. బాసవెల్లి భైరవస్వామి సరిసావాస గాడైన ఈ మైలార విభుడు మనకు మేలు చేయుగాక!

146. అదిగో, అటుచూడు! నగరం నడిబొడ్డున సింహలాంఛన పతాకం కట్టారు. వేపమండల తోరణాలతో అలంకరించారు. పసిబాలాది వృద్ధస్త్రీల వరకూ అందరూ పూర్ణకుంభాలు వీధి మొగదళ్ళలో పెట్టారు. ఇదంతా చూస్తూంటే ఏదో గొప్ప
147. ఉత్సవమే జరుగబోతున్నట్లుంది గదూ! కమ్మగా కడుపారా మద్యాన్ని సేవించి మాదిగలు అకరో అమ్మకరో అమ్మక్కరో, అదిరా, అట్టటరా అంటూ చిందులు వేస్తూ తప్పెట్లు తాళాలు మోగిస్తూ మాంచి హుషారుగా, పట్టరాని ఆనందంతో తక జుం,జుం, జుకజుం, జుం జుమ్మంటూ వాద్యాలు అదే పనిగా వాయిస్తున్నారు.

148,149. అలా దానిని చూస్తూ,మిత్రులిద్దరూ ముందుకునడిచారు. అదిగో భైరవుని గుడి. ఆ పై - అవతలగా కనుపిస్తోందే - అదే చమదేశ్వరీ ఆలయం. అదిగో, అదేమో వీరభద్రుని మంటపం. ఆ ప్రక్కనున్నది బుద్ధదేవుని చైత్యం. అటుచూడు అది ముద్దరాలు ముసానమ్మగుడి. అదేమో కుమారస్వామి గుడి. కొంచెం అటుగా వున్నది పాండవుల గుడి. దానికి కుడి పక్కగా కనుపిస్తోందే -అది కేశవస్వామి
150. స్వయంభూనాథుల ఆలయాలు, అని మిత్రునికి వాటిని గూర్చి విడమరచి చెప్పి
151. ఎదుటనున్న భైరవస్వామి ఆలయానికి నమస్కరించాడు.మంచనశర్మ. ఆ

భైరవస్వామిని గూర్చి ఆహా! ధీర పరాక్రమాలు మూర్తీభవించిన స్వామీ! మహా భైరవా। నీవు రెట్టించిన ఉత్సాహంతో ఢక్కను అలా సుతారంగా సున్నితంగా కంపింప చేసినంతలో ఆ ధ్వనికి సముద్రంలోని తాబేళ్ళు భయంతో ఒడ్డుకు చేరిపోతాయి గదా! చేపలు మెలికలు తిరిగిపోయి లుంగచుట్టుకు పోతాయి. మొసళ్ళు పైకి విసరివేయబడతాయి. తిమి తిమింగలాలు ఉవ్వెత్తున ఎగసెగసి పడతాయి. ఆదు తాబేళ్ళు చలించిపోయి మహాసంక్షోభానికి గురవుతాయి కదా అంటూ ప్రస్తుతించాడు.

152. అలా ప్రస్తుతించి ఆకాశం వంకచూసి మిత్రునితో మధ్యాహ్నకావచ్చింది

153. అంటూ మిత్రమా। చూసావా! ఎండ ఎలా నిప్పులు చెరుగుతోందో! దిక్కులు మండిపోతున్నట్లుంది గదూ! సూర్యకిరణాలు పడి మండిపోతున్న సూర్యకాంత శిలలు, వాగుడుకాయలైన గుడ్డి కొక్కిరాయి పక్షులు గల సరస్సుల్లో పద్మాల్లోని మధువుకూడా వేడెక్కిపోవడంతో, దానిని మూచూడటానికి కూడా తుమ్మెదలు వెరుస్తున్నాయి. అబ్బ! ఏం ఎండ? ఎంత ఎండ అనుకుంటూ తాపానికి ఉస్సురస్సు

154. రనుకుంటున్నంతలో ఏదో శబ్దం విన రాగా అటు చెవి ఒగ్గి విని మిత్రునితో, విన్నావా మిత్రమా! ఆకాశాన్ని ముద్దుపెట్టు కుంటోందా అన్నంత ఎత్తులో, ఆంధ్రభూపాలకుని మొగసాలపై నున్న గడియారం పదహారు గంటలు మోగడం

155. విన్నావా? చూడు! సూర్యభగవానుడు కూడా పడమటికి వాలాడు. బాగా ఆకలేస్తోంది. కనుక సెట్టీ! భోజనం చేయడానికి పూటకూటింటికి వెళ్ళి, సరిపడా డబ్బు చెల్లించి

156. భోజనం చేద్దాం సరేనా! అక్కడే కొంచెంసేపు సేదతీరవచ్చు. ఇప్పటికి తిరిగిచూసింది చాలు. ఈ పూటకూటి ళ్ళున్నాయే-మన లాంటి యాత్రికులు దర్శింప తగినవే.

157. మంచి కాలక్షేపం కూడా! ఏమంటావా! అక్కడ పగలని లేదు రాత్రని లేదు. ఏ పొద్దూ వేశ్యలు, తార్పుడుగాళ్ళు, విటులు - వారి మధ్య తగాదాలు, పరిష్కారాలు, తీర్పులు - సందడే సందడి. యాత్రికులు, బాటసారులు అక్కడ చేరుతూ వుంటారు గదా! వారి వారి అనుభవాలు, ఎక్కడెక్కడి విశేషాలు వింతలు ముచ్చట్లు వినిపిస్తూ వుంటారు అంటూ పూటకూటిల్లు వెదుక్కుంటూ ముందుకు నడిచారు.

158,159. అలా వెళుతుండగా వారి కెదురుగా ఒక బ్రాహ్మణుడు రావడాన్ని చూసారు. అతగాణ్ణి బాగా పరకాయించి చూసి మంచన శర్మ మిత్రునితో సెట్టీ! చూసావా వీణ్ణి! తెల్లాకులు బాగా దట్టించి తాంబూలం వేసుకొని వీధంట వస్తున్నాడు. బాగా చంకలబంటిగా మెక్కాడనుకుంటాను. ఇంకేం। అక్కడికి ఆ పని అయింది గదా! ఇక ఊరు మీద పడ్డాడు. ఎందుకనుకుంటున్నావు? ఏది

దొరుకుతుందా – తరువాతి కాలక్షేపాని కని – అర్థమైందిగా –అందుకే విశ్రాంతి వెతుక్కుంటూ బయలుదేరాడు. వీడి వాలకం చూస్తుంటే –కరణదేశపు బ్రాహ్మణుడు లాగున్నాడు. వీడి నడిగితే, భోజనం, దానికయ్యే సొమ్ము–ఆ వివరాలన్నీ తెలుస్తాయి.

160. ఇతడు వస్తోంది బ్రాహ్మణుల పూటకూళ్ళ వాడనుండే వస్తున్నాడు. నాకు అలాగే

161. అనిపిస్తోంది. ఏఁవంటావా! తిరగటి రాళ్ళతో విసిరిన సంబారాల వాసన ముక్కుపుటాలను అదరగొడుతోంది గదా! బ్రాహ్మణస్త్రీలు తాలింపు వేయడం వలన మాంచి ఘాటైన వాసన నల్దిక్కులా వ్యాపించి, ముక్కులను పగల కొట్టడంలా! ఇంకా వేరే నిదర్శనం కావాలా! సందేహంలేదు. అది ఆ వాడే సుమా!

162. అని మిత్రునికి చెప్పి, తమకెదురుగా మెలిదిప్పిన వారులతో కుట్టిన కిర్రుచెప్పులతో తీరుబాటుగా నడచివస్తున్న ఆ బ్రాహ్మణునికి ఎదురుగా వెళ్ళి,

163. మంచనశర్మ పూట కూటింటిని గూర్చి ఆరా తీసాడు.

164. దానికి అతగాడు. మీకు కావలిసిందేదో నాకు ముందు సమంగా తెలిస్తే గదా మీకు కావలిసిన సమాచారం చెప్పగలను. మీకు కావలిసింది కేవలం భోజనమేనా? లేక విహారానికా? అలా గాక ఆహార విహారాలు రెంటికీ నంటారా? అదేదో మీరు తేల్చిచెపితే మంచిదిగదా! అని, కేవలం భోజనానికే అయితే – దానికేం, భేషుగ్గా లక్ష్మణవజ్ఝల వారిల్లు వుండనే వుంది. అక్కడ సువాసన గుబాళించే సన్నన్నం–తోడు గోధుమపిండి పూరీలు, మరి వాటిల్లోకి ఒక గుప్పెడు పంచదార, అప్పటి కప్పుడు కాచిన ఆవునెయ్యి, పెసరపప్పు, మాంచి కొమ్ముల్లాంటి నల్లమచ్చల అరటిపళ్ళు, నాలుగో, అయిదో కూరలు, ఇక కోరినంత గడ్డపెరుగు వడ్డిస్తారు. ఇదంతా ఒక్క రూకకే సుమా!

167,168. అలాక్కాదు విహారానికంటారూ। ఏం చెప్పమంటావులే! సనసన్నని నడుమా! ఆపైన గుబ్బచన్నులా। తేట తెలికన్నులు. వాటి లోని మిలమిలలు. ఏమని చెప్పేది! ఆ బ్రహ్మ వున్నాడే! వాడు కుదిమట్టపు బాపన బోడిముండల్ని

169. అచ్చుబోసి ఊరిమీదకు వదిలాడంటే నమ్మండి. ఎక్కడమాత్రం లేరుగనుక, బాపన బోడిముండలు అనబోతారు! వుండకేం! వుంటారు. దానికేమిగాని, దీనిసంగతి, అదేనయ్యా! ఈ పూటకూటింటిది వుందే – దాని అందచందాలు, రూపు రేఖావిలాసాలు – వాటిని కూడా అలా వుంచు – అంతమాత్రపు వాళ్ళు మరో చోట లేరా అంటారు! అవునా? కాని దాని మరునింటి వన్నె! ఆహా, ఏం చెప్పేదిలే – ఈ దేశాన్నేలే ప్రభువున్నాడు గదా! అదేనయ్యా ప్రతాపరుద్ర మహారాజు! ఆయనగారి నెన్నుదుట బంగారు పట్టబంధం వుంటుంది గదా! ఉంటుందా?

దాని శోభ ఎలా వుంటుంది? ఇది కూడా దానితో సమానమేననుకో! తేడా ఏంలేదు
170. సుమా! ఒకవేళ దానికంటే దీని చాయే ఒక వాసి ఎక్కువేమో మరి! అది అలాగంటిదా! అవునా! అయితే మాత్రమేమి? దాని భక్తి – ఆబ్బో ఏమని చెప్పేదిలే ముండ! పంచమస్వరంలో కోయిల గొంతెత్తి పాడినట్లు రామాయణం పూర్తిగా ఆరుకాండలూ ఏకాదశి జాగారంచేసి ఎంత కమ్మగా పాడుతుందనీ! శివశివా! సమస్త దోషాలు పరిహారమగుగాక! దాని కెవరయ్యా సాటివచ్చేది అని చెప్పి అతడు తన తోవన తాను పోయాడు.

171. అంతట సంకృతి పూతిమాష వంశమనే పాలసముద్రంలో చంద్రుని వంటివాడైన గోవింద మంచనశర్మా, ఆయన మిత్రుడూ లక్ష్మణవరఘల వారింట–చంకలబంటిగా మెక్కారు. అయిన తరువాత తమ కంటికింపైన దాన్నొక దాన్ని చూసారు. అయితే తాము చక్కబెట్టు కోవలిసిన పనులు అనేకం వుండటంతో, మరోసారి వస్తామని దానికి చెప్పి అక్కడ నుండి బయలెళ్ళారు.

172,173. అలా కొంత ముందుకు వెళ్ళగా ఒక పూలమ్మే అమ్మి మొగలి పొట్లాలమ్ముడాన్ని చూసారు. వాటి సొబగు ఎలావుందంటే–చేపలకు గాలం వేసినట్లు, ఆ పూల పొట్లాల రేకల అంచుల్లోవుండే ముళ్ళు చేపల్ని గాలాలు లాగినట్లు అటుగా వెళ్ళే ఆడవాళ్ళ మనసులను, ప్రాణాలను తోడేస్తున్నాయి. వాటికి రక్షకంగా వుండే ఆకుపచ్చని రేకలు గరుడపచ్చల రంగును త్రోసి రాజంటున్నాయి. రేకలపై అంటివున్న చచ్చిన చిన్న చిన్న పురుగులను తుడిచి వేయగా రేకలు మురికి పోయేట్లు తోమిన స్త్రీల చెక్కిళ్ళ నునుకాంతిని తలపిస్తున్నాయి. పదారువన్నె బంగారు కాంతిని పోలిన కాంతితో, ముడుచుకొన్న రేకలు ప్రకాశిస్తున్నాయి. శివుని కంటిమంటకు ఆహుతైన మన్మథుని బూడిద వర్ణాన్ని పోలి పుప్పొడి వర్ణం వుంది. ఆ కమ్మని పుప్పొడి వాసనతో కూడిన మొగలి పొట్లాన్ని ఒకదానిని ఆ అమ్మి మంచనశర్మగారికి ఇచ్చింది.

174. అలా ఇచ్చినదానిని పుచ్చుకొని, దానిని చూస్తూ – శివునికి ఇది పనికి
175. రాకపోతే పోయింది గాక! లేకపోతే ఆయన తలపై వుండే చంద్రరేఖతో కూడి అక్కడ సుఖించే దానిని కదా అని మొగిలిపూవు కొంత చిన్న బుచ్చుకుంటుంది. కాని శివుడు తనను దగ్గరకు రానీనందుకు అదేమీ దిగులు పడాల్సిన పనిలేదు. ఏమంటే – దానిని ఆదరించి ముడుచుకునే వివేకశాలియైన విష్ణువు అంతటా వ్యాపించే వున్నాడు కదా!

176. అలా అని మంచనశర్మ, ఆ పుష్పలావికకు దాని వెల ఇచ్చి, దాని

రేకలను విడదీసి, వాటిని ఆ తోవెంట వెళుతున్న బ్రాహ్మణులకు ఒక్కొక్క రేక చొప్పున పంచి ఇచ్చి, లోపల వున్న చందమామ-కొండనాలికలాంటి మృదువైన రేకను తన సిగలో పెట్టుకున్నాడు.

177. ఇక అక్కడ నుండి కదిలారు మిత్రులిద్దరూ! అంతలో వారు వేశ్యావాటిక సమీపానికి వచ్చారు. వేశ్యావాటిక అంటే - అదెలాంటి దనుకున్నారు. సకలభువనాలను తన భుజ బల పరాక్రమంతో జయించాలనే అహమహమికతో మన్మథుడు ఉద్యమించే నాటక ప్రస్తావన లోని మొట్టమొదటి నాందీ శ్లోకం లాంటిది గదా!

178. అక్కడ ఒక ఇంటిముందు మంచి గంధంతో కళ్ళాపి జల్లారు. కుంకుమ పూవుతో మొక్కల చిత్రాలను చిత్రించారు. ముగ్గులు పెట్టారు. కర్పూరపు పొడితో రంగవల్లులు దిద్దారు.

179. పద్మాల తోరణాలు కట్టారు. బహు అందంగా వుంది. ఇది ఎవరి ఇల్లై వుంటుందబ్బా అని అనుకుంటూ పైకి చూచి అక్కడి వాళ్ళను దానిని గూర్చి ఆరా తీసారు.

180. వాళ్ళు వీళ్ళవంక ఆదోవిధంగా చూస్తూ, ఓయి వెఱ్ఱి బాపనయ్యా! నీది ఈ దేశం కాదా ఏమి! ద్వీపాంతరం నుండి దిగబడ్డావా ఏం? ఎవరైనా వింటే బాగోదు. పాపం శమించుగాక. లోకంలో పేరెల్లినది. మన్మథవేదానికి ఆచార్యపీఠాన్ని అధిష్ఠించింది, ప్రతాపరుద్ర మహారాజులుంగారి ఆస్థానంలో ప్రముఖురాలు.

181. మాచల్దేవి! పేరూ పెంపూగల వేశ్య! ఈమెనే ఎరుగవా! ఆమె ఇప్పుడు చిత్రశాలా మండప ప్రవేశం చేస్తున్నది. మంచి సమయానికి వచ్చారు. పుణ్యాహవచనం జరుగబోతోంది. మీరు కూడా ఆ శోభన మందిరాన్ని చూడ వచ్చును అని చెప్పారు.

182. అది విని సెట్టిగారితో భేష్ మిత్రమా! మనం వచ్చిన వేళా విశేషం బాగుంది. ఈ మాచల్దేవి చరిత్రను లోకంలో నాటకంగా ఆడతారు. ఆమెను చూడ్డానికి వెళదామా! ఈ నెపంతో వెళ్ళి చూద్దాం మనకు దండగేముంది గనుక! అడ్డుమాత్రమేముంది అని, ప్రవేశద్వారాలు దాటి చిత్రశాల ప్రవేశించారు.

183. మిత్రులిద్దరూ! అక్కడ ఆపాదమస్తకం అలంకరించుకొని ఆ శోభన మందిరం లోని హంసతూలికా తల్పంపై ఠీవిగా, హావభావ విలాసాలను వెలార్చుతూ కూర్చున్న మాచల్దేవిని చూసారు.

184. చూసి! ఓ లలనా! అంకుశాల పోట్లతో అందగించే మదపుటేనుగుల కుంభాలను సైతం ధిక్కరించే విధంగా వాడియైన గోటి గీరులతో విలసిల్లే నీ వక్షోజాలకు అభ్యుదయ పరంపరాభివృద్ధి కలుగుగాక! మా మాట పొల్లు గాదు సుమా! ఉన్నమాటే ఆడుతాము. నీకున్న ప్రసిద్ధి, ఢిల్లీని పాలించే సుల్తానుకు కూడా

లేదనుకో! అసలు, అహా! మాకు తెలియక అంటాము! నీకూ ఆదిలక్ష్మికి తేడా ఏమిటట! అన్నింటా నీవు ఆమెతో సమానమే. కాకపోతే నీవు, ఆమె లాగా పాలసముద్రంలో జన్మించ లేదు తప్ప, వేరే భేదమంటూ మరేమి లేదంటే నమ్ము అన్నారు.

186. అంతట మాచల్దేవి అపర మన్మథుని లాగా వున్న మంచనశర్మను చూసి, తన చేతుల గాజులు మంద్రమధురంగా గలగలలాడగా, అయ్యగారికి వందనా

187. లంటూ మొక్కింది. అంతట అతడు చూడమ్మాయి! మన్మథుని గొడుగువంటి ఈ నాట్య మండపం వుందే, లోకం లోని స్త్రీల కెవరికీ అబ్బని నాట్యవిన్యాసాలతో శోభిల్లుతూ, అగురు ధూపాల సువాసనలతో గుబాళిస్తూ ఏ అతివకూ లేని ఈ సౌష్ఠవం ఈ ఓరుగంటి కటకరసిక విటశేఖరుల వారిని (ప్రతాపరుద్రుని) రక్షించుగాక అని ఆశీర్వదించాడు మంచనశర్మ.

188,189. అంతట వారివురి మధ్య సంభాషణ సాగింది. ఎక్కడనుండి తాము ఇక్కడికి దయ చేసారు అని అడగ్గా అతడు మేము కాసలనాటి నుండి వచ్చాము అని చెప్పాడు. తమరెవరో తెలుసుకోవచ్చునా? దానికేమి. మేము సంకృతి పూతి మాష గోత్రాన్వయులైన మాధవుల కుమారులము. తమ పవిత్ర నామధేయము? గోవింద మంచన శర్మ అంటారు. తాము ఇప్పుడు మా యింటికి దయచేయడానికి కారణమేమో! మరేం లేదు. తమ బోటి వారిని ఆశీర్వదించడానికే! అయితే ఆసీనులు కండి! అలా వెళ్ళి సంధ్యాది అనుష్ఠానాలు పూర్తిచేసుకొని వస్తాముగాక! అలాగైతే ఇప్పుడు ఆ పని నిమిత్తం ఎక్కడకు వెళ్ళబోతున్నారో తెలుసుకోవచ్చునా? దానికేమి! మేము బ్రాహ్మణులం గదా! అక్కవాడకు వెళ్ళి పూర్తి చేసుకుంటాము గాక అని ఆమె అడిగిన వాటికి అన్నింటికి సమాధానం చెప్పాడు.

190,191. అలా చెప్పి చిత్రశాలలోని చిత్రపటాలను చూసి టిట్టిభసెట్టితో, మిత్రమా, ఈ పటం చూడు. అదే దారుకావనం. అతడే పరమేశ్వరుడు. వారే మహామునుల భార్యలు. అది చూడు. ఆమే కన్యకారత్నం. అతడు బ్రహ్మ. అది పడక పానుపు. ఆ పటంలో కన్పిస్తున్నవాడు–వాడు, శ్రీకృష్ణుడు. వారే గోపికలు. యమునా నదీ తీరం. ఈ పటంలో వున్నది అహల్య. ఆ ప్రక్కనే వున్న వాడు ఇంద్రుడు. అదే గౌతమముని పర్ణశాల నడిమిల్లు. ఆ పటం లోని వాడా! అతడు చంద్రుడు. అతని పక్కన వున్నది బృహస్పతి భార్య తార. ఆ పటం లోని జాలరిది ఎవరంటావా?..... అమేనయ్యా సత్యవతి. అతడేమో పరాశరమహర్షి. ఇటు ఈ పటంలోని వాడు

విశ్వామిత్రుడు. ఆమె మేనకాదేవి. మొత్తం మీద ఈ చిత్రశాల అంతా మన్మథుని పరాక్రమాన్ని చాటిచెపుతోంది కదూ! టిట్టిభా। బాగా గమనించావా!

192. మన్మథుడు రతీదేవి వక్షోజాలపై ఒత్తిగిల్లి పరుండి వంకరలుపోయేట్టు పుష్ప బాణాలను, సరిదిద్దుతున్నట్లు, ఆమె చనుగవపై తన గోళ్ళతో చంద్రవంకలను తీర్చుతున్నాడు. ఈ బొమ్మ వేసిన వాడున్నాడే – ఎవడో కాని వాడు సామాన్యుడు కాదయ్యా! దైవమే నంటే నమ్ము! కనుపిస్తే వాడికి, బంగారం పసదనంగా ఇవ్వాలని పిస్తోందయ్యా! ఏమంటావు! అన్నాడు.

193. అలా అంటూ, చిత్రశాలనుండి బయటకు వచ్చి, తనకు పూర్వ పరిచయం గల సాని ఇంటికొరకు గాలిస్తూ, కొన్ని గృహాలను దాటివచ్చాడు, ఆ పరిసరాల్లోనే ఆమె ఇల్లు వుండాలి మరి! ఆమె ఇంటిముందు వావిలి పొదిరిల్లు వుంటుంది. అదే గుర్తు. ఆఁ! ఇదే ఇల్లు అని ఆ పొదరింటి జ్ఞాపకంతో గుర్తు పట్టి, గడపదాటి మొగసాలలోనికి ప్రవేశించాడు. ఇతగాడి రాకను గమనించారు ఆమె దాస దాసీజనం. ఈయన్ని చూడంగానే వారికెంతో ఆశ్చర్యం సంబరం కలిగాయి. ఆయనకు, టిట్టిభసెట్టికి స్వాగతం చెప్పి, పరామర్శించి లోనికి తీసుకెళ్ళారు నడిమింటిలో అంతా పండుగ వాతావరణం నెలకొనివుంది. అక్కడ ఆ ఉత్సవ పనుల్లో మునిగి వున్న ఆ ఇంటి యజమానురాలు, మంచనశర్మగారికి ననుపుకత్తె దగ్గరకు వెళ్ళి, ఆమె చేసిన మర్యాదలను పొంది, సుఖాసీనులైనారు మిత్రులిద్దరూ.

194. అప్పుడు మంచనశర్మ ఆమెతో, ఏమిటి విశేషం! నీ చుట్టాలూ, పక్కాలూ, జతగత్తెలందరూ చేరారు. ఈ వేళ మన ఇంట్లో ఏమైనా పండుగా! వ్రతమేమైనా చేస్తున్నారా! లేక ఏదైనా తీర్థ యాత్రగాని తలపెట్టారా। ఏఁవిటి సంగతని ఆరా తీసాడు.

195. అందుకామె అబ్బో! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు! మీ రాక! చాలా సంతోషం. అత్రి మహర్షి సమానుడవు! శోభనమంటే – శోభనమే మరి! ఈ దినం సంజెవేళ నీ ప్రియపుత్రిక, పుష్యమీ నక్షత్రంలో, అద్దం చూస్తుంది. అందుకూ ఈ సంబరమంతా! మా అదృష్టం కొద్దీ అనుకోకుండా వచ్చావు. ఆ సమయంలో నీవు బిడ్డను ఆశీర్వదించాలి మరి. నీ ఆశీస్సులు దానికి దీర్ఘాయువును, లావణ్యాన్ని వివేకాన్ని, వృత్తిలో ప్రావీణ్యాన్ని భోగభాగ్యాలు కలిగిస్తాయి. నీకు తెలియంది

196. కాదుగా! అద్దం చూసే వేడుక పూర్తిగాకుండా వేశ్యలకు విట సాంగత్యం కూడదు గదా! యజ్ఞం చేయగోరిన వాడు ముందుగా అరణిని జాగ్రత్త చేసుకోకుండా

197. ఎలా కుదురుతుంది. అతడికి అదెంత ముఖ్యమో, భోగకాంతలకు ఇది అంత

ముఖ్యం గదా! ఈ అద్దం అంటే మరి– అది లంజెవారికి శ్రీమహాలక్ష్మి వంటిది. అలాగే వివర్తవాదులకు దృష్టాంత భూమి దర్పణమే కదా!

198. అమ్మడు, మన్మథోపాసనా దీక్ష తీసుకునే దెప్పుడంటావా! నీకు తెలియందే ముంది గనుక. మత్తకోకిల రెట్టించిన ఉత్సాహంతో, ఉన్మాదంతో పంచమ స్వరంలో వసంతఋతువులో కదా రాగాలాపన ప్రారంభించి పులకరింపజేస్తుంది. అదిగో ఆ మధుమాసపు పున్నమిని లగ్నంగా నిశ్చయించాము. అదిమాత్రం ఇంకెన్నాళ్ళుంది గనుక! పట్టుమని పదిరోజులే కదా. అదిగో అప్పటిదాకా నీవుండి మాటదక్కించాలి. ఈ అక్కవాడలో నీ కంటే కావలిసిన వాడెవడున్నాడు మాకు.

199. అదిగో నీ కుమార్తె మదనరేఖ. ఈ భడవ ముఖాకృతి విషయంలో, చంద్రబింబంతో సాటి సుమా! కను ముక్కు తీరు అంతా నీదే. కన్నుల్లో ఎంత మిలమిలలో! అలా ఆడుబిడ్డ, రూపురేఖల్లో తండ్రిని పోలినదైతే అదృష్టవంతురా లంటారు సాముద్రిక శాస్త్రవేత్తలు. ఆ మాట నిజమే అయింది కాదా! లేకపోతే అనుకోకుండా, సమయానికి, అంతా తెలిసివచ్చినట్లుగా మీరు రావడ మేమిటి! అదెంత అదృష్టం కాదు గనుక! దీనికి మరో ఋజువెందుకు? జన్మనిచ్చిన తండ్రివి, కర్తవు, గురువ్వి, సకలమంచివాడివి. అన్నింటికీ మించి ఎప్పటికప్పుడు కొత్త లంజల పొత్తుకు వెంపర్లాడే రసికుడవు. నీ కంటే ఉత్తముడెవరు గనుక! కనుక అమ్మణ్ణి, నీ ముద్దుల కుమార్తెను తొడపై కూర్చో బెట్టుకుని అద్దం మీరే చూపాలి. అదీ మా కోరిక. మా ముచ్చట కాదనరుగా అంటూ ఆమె ఎంతో మురిపెంగా అడిగింది.

200. అప్పుడు మదనరేఖ చేతిలో అద్దం పెట్టుకొని, ఆ అందాలరాసి, ఆ ఒప్పులకుప్ప చంద్రుణ్ణి బందీచేసి తెచ్చుకుని తన ముఖంగా మలచుకుందా అన్నట్లుగా మిసమిసలాడుతున్న ముఖంతో, మంచనశర్మ తొడపై ఆసీనురాలైంది.

201. అంతట శర్మగారు శ్రీవర్ధస్వం చెప్పి దీవించి, మెల్లగా టిట్టిభసెట్టి చెవిలో బిడ్డ పసపుకు ఒక వెండి నాణెం ఇవ్వమని చెవిలో గుసగుస లాడాడు.

202. అలా ఆ వేడుక ముగిసిన తరువాత, ఆ వేశ్య, తనకు మంచన శర్మతో గల పూర్వం పరిచయం కారణంగా, ప్రేమమీర ఆయన చేతిని తన చేతిలోకి

203. తీసుకొని, ఇంతకాలం ఎక్కడకెళ్ళారు. ఇటువైపు మడమ తిప్పారు కారు! ఎక్కడెక్కడ ఎందర్ని వలపించి ముద్దు ముచ్చట్లు తీర్చుకున్నారు. అబ్బే! అలాంటిదేం లేదనకండి! మీ నైజం నే నెరుగనిదా! ఇదేం కొత్త కాదుగా! మీ ఉబలాటాలు, పోకిళ్ళు నాకెరుకే గదా! ఇంతకాలానికి పాయసం ఆరగించిన పాతపద్దు

గుర్తుకొచ్చిందన్నమాట. దైవం మిమ్మల్ని మా వైపు మరల్చాడు అని ఇచ్చకాన నిష్ఠురాలాడింది.

204. దానికి అతడు, అదేం లేదు కాని, దేవతలకు దేవత అయిన శ్రీకాకుళం తెనుగు రాయడు తనవార్షిక కల్యాణోత్సవాలు దవనపున్నమికి జరుపుకుంటాడు
205. గదా! నిరుడు ఆ తిరునాళ్ళకు వెళ్ళాలే. అందువల్ల రావడం కుదిరిందిగాదు. కాకరతీగె కానక కన్న సంతానంగా కడుపునిండార కన్న, ఆ తెనుగురాయడు
206. జార,చోర, మహాధూర్త చక్రవర్తి సుమా! తెనుగువిభుడు - పసిడిగిన్నెలో పాలు త్రాగి త్రాగి. ఆయనగారి పెదవులకు అరుచి పుట్టింది కాబోలు! అందుకని ఇప్పుడు కాకుళేశ్వరుడు విప్రకన్యవద్ద గారాలు కుడుస్తున్నాడు. ఆయన గారికి వేదాలు రసహీనమైనాయి. పురాణగానం మొహం మొత్తినట్లుంది. ఉపనిషత్తులు సారహీనములైనాయి. ఆగమాలు రుచించడం లేనట్లుంది. ఆ కారణంగా వైకుంఠాన్ని విడిచి, విష్ణువు శ్రీకాకుళంలో నాగదేవ భట్టారకునింటిలో పుట్టి, ఆ వూళ్ళోనే తిష్ఠవేసి వేడుకలు జరిపించుకుంటున్నాడు.

208. ఇక ఆ తిరునాళ్ళ వేడుకలను గూర్చి-ఏం చెప్పేదిలే! గరుడధ్వజాన్ని ఎత్తి తిరునాళ్ళు ప్రారంభించింది మొదలు, మంత్రోక్తంగా పుష్పయాగంతో ఆ ఉత్సవాలకు ఉద్వాసన పలికే పర్యంతం-ఆ కృష్ణానదీ తీరం, పన్నెండు క్రోసుల మేరా ఆ దైవం అనుమతితో పరనారీ సంగమాదులకు ఏ పాపం అంటకున్నదంటే-
209. ఆ మాటనమ్ము. వామ్మో! ఆ తిరునాళ్ళలో, కోడెవయసులోని ఆ వెలనాటి కోడె విధవలు, వారి కామాసక్తి, ఆ ఆవేశం ఎలాంటిదని చెప్పేది. వారి వక్షోజసంపద ఎంతటి దనుకుంటున్నావు. బారచాపినా వారు కౌగిలిలోకి ఇముడరంటే నమ్ము! ఇకవారి సుమనోహరరూపం! వారిని-ఆ మన్మథావేశులను రతిక్రీడలో తెమల్చడం -ఏమో, ఆ-హిడింబ నేలిన భీముడు తృప్తి పరచకలడేమో గాని, సామాన్యుల వల్ల ఆయ్యే పని కాదు సుమా!

210. ఇక అక్కడ కాముక క్రీడల చంద మెలాంటిదని చెప్పమంటావు! రెక్కలు విప్పిన కోరికతో ఉవ్విళ్ళూరుతూ, గట్టిగా పెదవులతో అధరామృతాన్ని గ్రోలుతూ, రొమ్ముకు దాని చన్నులను, గాలికి కూడా సందులేకుండా గట్టిగా అదుముకుంటూ, దాని మన్మథుని కొంపలో చేయి దూర్చి, దూసివేస్తూ, పారవశ్యస్థితిలో చిమ్మిలి[1] జర్రున కారిపోయేట్లుగా చేసి, బిగి కౌగిలిలో గాలిలోనికి ఎత్తి, ఏరునే శయ్యగా చేసి, విటులు ఆ గ్రామీణ వితంతువులను రమిస్తారు కాకుళపు తిరునాళ్ళలో.

1. చిమ్మిలి : యోనిద్రవం. ఈ అర్థంలో ఈ పదాన్ని ఉపయోగించిన వాడు అన్నమయ్య, చిమ్మిలి రతి బిగువు అని ప్రయోగం

211. ముంజెపదనైన మన్మథ మందిరాలుగల బ్రాహ్మణ వితంతువులుండగా, ఇతర వేశ్యలెందుకబ్బా!

212. ఆ తిరునాళ్ళు జరిగినన్నాళ్ళూ, ఆ కృష్ణానది యిసుక తిన్నెలపై, పిండి ఆరబోసినట్లున్న వెన్నెల రేయిలో ఆయా కులాలవారికి ఆయాకులాలవారినే కూర్చే యావలో మన్మథుడు ఆయా బాణాలను సవరించే పనిలో వుంటాడంటే నమ్ము! అదెలాగంటావా! చెపుతా, ఆ మాటకే వస్తున్నా! సన్యాసికొకనికి ఒక జవరాలు తారసపడిందనుకో! అప్పుడు లేత తులసి చిగురాకుల్నే బాణాలుగా సంధిస్తాడు. అదే వేదవిప్రుని చూసిన వితంతువుపై లేతరెల్లు చివుళ్ళను అనుసంధిస్తాడు. మేదరికన్యను చూసిన కర్షకుని మీద, మన్మథుడు పూ ములుగర్ర నుపయోగించి బాధిస్తాడు. అగసాలెవానిని చూసిన స్త్రీ పై పదునైన మదనాగ్నిని రగిలించే పూలనిప్పుల బాణాన్ని వేస్తాడు సుమా అని చెప్పాడు మంచనశర్మ.

213. ఆ పిదపముందుకు నడువగా వితంతువుల గుంపొకటి తారసప డిందనీ,

214. వారిని తాను ఆశీర్వదించిన విధానాన్ని వివరించ ప్రారంభించాడు. కోరి మక్కువ మీద సన్నని చీరలు కట్టే మాసకమ్మకు దీర్ఘాయువు కలుగుగాక. విడుపూ విరామం లేకుండా మళ్ళీమళ్ళీ దేవాలయానికి వెళ్ళే రంకుముండకు సంకల్పసిద్ధియగు గాక. నిత్యమూ వ్యభిచారనిష్ఠతో-అదే యావతో వుండే విధవకు పుత్రోదయము కలుగుగాక. ఒత్తుగా తులసిదండలు ధరించినట్టి విధవకు మంచి ఆరోగ్యము కలుగుగాక. తార్పుడుగత్తెకు సమృద్ధిగా ధనం లభించుగాక. తెగించిన వితంతువుకు నిత్యసౌభాగ్యము సిద్ధించుగాక. వాగుడుకాయైన విధవకు కోరినది లభించుగాక. అధిక వ్యామోహియైన (బలిసిన) వితంతువుకు రతిసౌఖ్యము కలుగుగాక అని

215. అలా ఆశీర్వదించిముందుకు నడిచాను అని ఏదో చెప్పబోయాడు మంచనశర్మ.

216. అంతట కామమంజరి అడ్డుతగిలి, చెప్పావుకావే! అలా చెప్పు మరి! పరదేశాల్లోని వితంతువుల చేత రొమ్ము గుద్దించుకోవడానికి మరిగావు. ఇక నీకు మేమెందుకు గుర్తుకొస్తాము. చాలుగాని సరసం ఇక దయ చేయమని కడకన్నుల్లో ఈర్ష్య నింపుకొని చూసింది. అప్పుడు మంచన శర్మ, మరవడమా!

217. నిన్నా? అదెలాగ! నీ చనుగవ మంద్రవేగంగా కదలగా, తొలకరి మెరుపుతీగెల ప్రకాశంతో కూడి, కవకవలాడగా నవ్వులుచిందిస్తూ, అవి నీ కన్నుల మెరుగుచూపులలో కదలాడగా, మాంచి వయసులో వున్నప్పటి తీరున, పురుషాయితంలో నీవు పరాక్రమించిన తీరు ఓహోహో! శివశివా, ఏవిధంగా మరుద్దామన్నా మరపుకు వచ్చేమాటేనా! ఏం మాటలివి నేర్చుకుపోయావు గాక

218. అని ఆమెను అనునయించి, కొంచెం వేరే ఒక వ్యవహారం మీద వెళ్ళివస్తానని చెప్పి అక్కడి నుండి బయలుదేరాడు.

219. అప్పటికి పొద్దువాలుతోంది. సూర్యుడస్తమించడానికి ఇక నాలుగు గడియల పొద్దుంది. అలా మిత్రుడూ తానూ వెళ్ళి వెళ్ళి నడువీధిలో నాగస్వరం ఊదుతున్న ధ్వని వినపడగా శర్మ అడుగు అటువేశాడు. అక్కడ నాగస్వర వాయిద్యరంధ్రాల నుండి ప్రస్తారమవుతున్న నాగవరాళి మొదలగు వివిధరాగాలలో వెలువడుతున్న నాదానికి నాగుపాములు పడగలు విప్పి ఆడటాన్ని గమనించారు.

221. పాములంటే సామాన్యమా! కద్రూ మహాదేవి కానక కన్న సంతానం. శ్రీమహావిష్ణువుకు పానుపుగా అమరింది పామేగదా. పరమేశ్వరుని కంఠాభరణం అదే. సూర్యభగవానుని రథానికి పగ్గపుతాడూ పామే. ఆకాశంలో నట్టనడుమనున్న కుజగ్రహం, మూలానక్షత్రానికి కుదురు అదే! ఆది భైరవునికి అదే యజ్ఞోపవీతం. క్రీడావరాహానికి సరిజోడు. శనైశ్చరుని చేతి ఆయుధము. గరుత్మంతునికి సమయానికి సమకూరే ఆహారం. సంపెంగ పూలవాసనను ఇష్టపడేది. మంథర

222. పర్వతానికి కవ్వపు త్రాడుగా ఉపకరించినది కూడా పాములరాజే కదా. అలాంటి ఈ సర్పరాజులు మన మనోభీష్టాలను సఫలం చేయుగాక!

223. అక్కడకు పాముల మెంగడు రావడాన్ని గమనించారు మిత్రులిద్దరూ! వాడొట్టి వాగుడుకాయ. పాము విషాన్ని విరిగించడంలో మొనగాడు వాడు. వాడి తీరుతీయా లెలాగున్నాయంటే–నొసట చిటికెన వేలితో అడ్డదిడ్డంగా సన్నని కస్తూరి రేఖలు తీర్చుకున్నాడు. వాటి మధ్యలో చిన్నచుక్క బొట్టు పెట్టుకున్నాడు. రొమ్ముమీద అడ్డంగా కర్పూరంలో కుంకుమ మెదిపి మూడు రేఖలు దిద్దుకున్నాడు. ఎడమచెవిలో మాంచి నిగారింపుగా వున్న పాలపిట్ట ఈకలకుచ్చు జవురుకున్నాడు. తలకు కొంచెం రంగుమాసిన ఎర్రని తలపాగాను గట్టిగా వెంట్రుకలతో మెలిపెట్టి చుట్టుకున్నాడు. పొడవాటి పామునొక దాన్ని జందెంలాగా వేలాడవేసుకున్నాడు. చేతులకు ధరించిన కంకణాలు ఘల్లుఘల్లుమంటూ మోగుతున్నాయి.

224. వాడు నాగసొరాన్ని ఊదుతూ పాముల్ని ఎలా ఆడిస్తున్నాడంటే – నాగసొరం బుర్రను ఊదటానికి గాలితో బుగ్గలను ఉబ్బించాలి గదా! అలా ఉబ్బిన ఆ పుక్కిళ్ళు ముషిణిపండ్లను తలపిస్తున్నాయి. నాగసొరం బుర్ర అంటే, మరేం కాదు. అదొక రకం సొరకాయ. దీనిని ఎండించి నాగసొరంగా ఉపయోగిస్తారు. దానిని ఊదుతూవుంటే, దానినుండి వచ్చే నాదానికి, వాడు సందిటికి కట్టుకున్న శంకుపూసలదండలు కదిలి శబ్ధం చేస్తూ, అవి తాళం వేస్తున్నట్లుగా వుంది.

నాగసొరానికి గల ఏడురంధ్రాలను రెండు చేతుల వేళ్ళతో మూస్తూ తెరుస్తూ, దాని నుండి వచ్చే నాదాన్ని ఒకప్పుడు పెంచుతూ మరొకప్పుడు తగ్గిస్తూ ప్రస్తారం చేస్తున్నాడు. పుక్కిళ్ళలో పూరించిన గాలి అయిపోయినపుడు, తిరిగి పూరించుకోవడానికి గల ఎడంలో కిక్కుకిక్కుమనే శబ్దాలు వినసొంపుగా వినవస్తున్నాయి. మెంగడు పాపరాజులు నర్తించేవిధంగా నాగసింధు ప్రభేదాలను పలు వరాటరాగాలను సంగీత తరంగానుక్రమాలతో మనోహరంగా వినసొంపుగా ఊదుతున్నాడు.

225. మిత్రులిద్దరూ దానిని చూసి ముందుకుసాగారు. అక్కడ ఒక మండపం వుంది. విటులు, సైనికులు దానిచుట్టూ మూగి గోలగోలగా అరుస్తూ వుండటాన్ని విని టిట్టిభసెట్టి అదేమిటని మిత్రుడు గోవిందశర్మను అడిగాడు. దానికి ఆయన

226. ఇలా చెప్పాడు. అదా! చూడు-అక్కడ ఆడుతున్నాడే-వాడేనయ్యా-ఎలావున్నాడు ఎంత నల్లగా నున్నగా వుందో వాడి నొసలు. ఆ నొసటినుండి జుట్టు కళ్ళమీదకు జారుతోంది. చిన్నసానపై నూరి కలివె గంధంతో పెట్టుకున్న బొట్టు ఆరి ముఖాన్ని బిగలాగుతూ మెలికలు తిప్పేసింది. చంకలో కట్టుకున్న తుడుము వాద్యాన్ని మువ్వల తొడుగుతో కట్టుకున్న చేతితో వాయిస్తూంటే, పెటపెట, కిటకిట చప్పుడు చేస్తోంది. ఆ చప్పుడుకు అనుగుణంగా నొసలు ముడుస్తూ ముఖభంగిమలు మార్చుకుంటున్నాడు. ఆవురుమంటూ నోరు తెరుస్తున్నాడు. కనుగుడ్లను మిటకరిస్తాడు. రాగంతీస్తున్నాడు. దానికి అనుగుణంగా వివిధగతుల్లో ఆడుతున్న వాడు గడమీద ఆడే తూర్పునాటి వాడు సుమా!

227. అని చెప్పి ముందుకు సాగి, చూసావా సెట్టీ! ఆ రెండు పొట్టేళ్ళను. ఎంత బాగున్నాయో! వాటిని, దాని యజమాని ప్రతిరోజూ స్నానాల రేవులో స్నానమాడిస్తాడు. గో మూత్రంతో వాటి ముక్కురంధ్రాలను తుడుస్తాడు. అందువల్ల అవి, ఆవులను వాటి లేగదూడలు యజమాని వెంటే ఎలా వెంబడించి వస్తాయో! అలా వస్తుంటే. వాటి మెడపట్టీల్లోని గంటలు ఎలా మోగుతున్నాయో వింటున్నావు గదా। వాటి కొమ్ములు ఎగుడు దిగుడుగా ఎలా మెలితిరిగాయో చూడు. వాటికి చుట్టిన పట్టీల్లో రావి ఆకుల్లాంటి పలుచని ఇనుపరేకులు బలే బాగా మోగుతున్నాయి కదూ! అవి పోటీకి సిద్ధమై వస్తున్నాయి. ఈ పొట్టేళ్ళ యుద్ధం చూసి వెళదాం. మరి ఇది కూడా ఒక విధంగా జూదమే! పాచికలు నిర్జీవ వస్తువులు. అదొక రకం జూదం. ప్రాణంవున్న వాటితో ఆడే జూదం ఇది అని అంటూ అక్కడ ఆగారు.

228. అంతలో బరిలోని పందెగాండ్రు పందెం విషయమై ఖరారు చేసుకున్న ట్లున్నారు. పొట్టేళ్ళయుద్ధం మొదలైంది. పోటీలో దిగిన రెండూ దేనికదే గెలుపు తనదే అయినట్లు, పిచ్చిముండలు గెలిచేసినట్లే అనుకుంటున్నట్లున్నాయి వాటి సన్నాహం చూస్తుంటే. అవును కదూ సెట్టీ! నదురుబెదురు లేకుండా రెండు ఎలా ఠీవిగా నిలుచున్నాయో చూడు. ఢీ కొట్టడానికి కావలసిన వేగం కొరకు అవి కొంత వెనుకకు వెళుతున్నాయి. రెండూ ఒకే వేగంతో, మాంచి పౌరుషంతో ఢీ కొంటున్నాయి. అవి రెండూ ఢీ కొంటూంటే చూడు ఢి, ఢి, ఢీ అంటూ ఎలా శబ్దం వస్తోందో! మేఘాలు లేకుండానే ఉరుముల శబ్దం వినపడుతున్నట్లుంది

229. కదూ! తలలు పగిలి నెత్తురు జొటజొట కారుతున్నా దానిని అసలు లెక్కేచేయ కుండా ఏమైనా సరే గెలిచి తీరాలన్న పట్టుదలతో, శూరశ్రేష్ఠులవలె మాంచి

230. పరాక్రమంతో ఈ పొట్టేళ్ళు చూడు ఎలా పోరుతున్నాయో! కట్టకట్టిన వెదురు మోపుల్లాగా, గుండ్రాయి గుండ్రాయి మీద పడినట్లు అవి ఢీ కొంటున్నపుడు మోత వస్తోంది. అలా అవి ఢీకొట్టి ఢీకొట్టి అలసిపోయి, బాధతో యుద్ధాన్ని విరమించి నిలబడిపోయి ఆయాసపడుతూ మెల్లగా ఊపిరి తీసుకుంటున్నాయి. నిస్సత్తువతో మూర్ఛపోయాయి.

231. ఆ స్థితిలో, వాటిని చూస్తున్న మంచనశర్మ వాటిని గూర్చి పైకి మెచ్చుకుంటున్నట్లు, ఎగతాళిగా ఆహా! రాజుల సింహాసనాల మీద పరిచే రత్నకంబళాలకు మీరే కదా బొచ్చు సమకూరుస్తారు. ఓహోహో। అగ్ని దేవుని విలాస విహారానికి వాహనాలు మీరేకదా! మీ వ్రేలాడే వృషణాల రుచిని ఆశించి నక్కలు మీ వెంటే పడతాయి గదా. వీరభద్రుని చేత నిహతుడైన దక్షునికి, తిరిగి మీముఖాలే గదా కావలిసి వచ్చాయి. శబాష్! పొట్టేళ్ళారా! శెబాష్. వల్లమాలిన అహంకారంతో విర్రవీగే దరిద్రులారా! గొఱ్ఱెల మీండగింండ్రా! వెఱ్ఱిముండా కొడుకుల్లారా! మీకు మేలగు గాక! ఈ గండం గడిచి సుఖింతురు గాక!

233. అని అంటూ ముందుకు నడిచి అక్కడ చంకల్లో కోడిపుంజుల్ని పెట్టుకొన్న కోళ్ళపందెగాళ్ళను చూసి, మిత్రమా! ఈ కోడిపుంజుల పందెం కూడా సజీవ ద్యూతమే మరి! చూడదగిందే. బహు రంజుగా వుంటుంది సుమా! ఈ కోడిపుంజులున్నాయే, ఇవి సామాన్యములైనవి కావు. పానుగంటి కలుకోడి మాట విన్నావా ఎప్పుడైనా? దాని తోబుట్టువులకు సమానమైనవంటే నమ్ము!

234. కోడిపుంజుల్లో ఈ జాతి ప్రత్యేకమైనది. దాని నెత్తిమీద జుట్టు వుందే! ఎలా వుందది. పారిజాతపు పువ్వు లాగా వుంది కదూ! ఆ శిఖ చూడు! అది దాని పౌరుషానికి

నిదర్శనంగా దాని బ్రహ్మరంధ్రంలోంచి పుట్టుకొచ్చిన అగ్ని శిఖలాగా ఎలా ప్రకాశిస్తోందో గమనించావా!

235. సెట్టీ! బాగా పరికించి చూడు! ఈ నారికేళ, బక జాతికి చెందిన ఈ మొనగాడి కోడిపుంజులున్నాయే - చూడు అవి ఎలా పోట్లాడుకుంటున్నాయో! మెడలు నిక్కిస్తూ, రెక్కలు టపాటపా కొట్టుకుంటూ, కొక్కొక్కొ అంటూ, ఒక దాని మీది కొకటి కాలు దువ్వి లంఘిస్తూ, ఒళ్ళుబలిసి కొవ్వెక్కి, ఎర్రని నక్షత్రాల వలె మెరుస్తున్న కళ్ళల్లో గర్వాన్ని ఒలికిస్తూ, రెండూ ఒకదాని కొకటి దగ్గరకు వచ్చి, చురచురా చూసుకుంటూ, పౌరుషంతో కోపంతో రెచ్చిపోతూ, కుప్పించి పైకి ఎగురుతూ, వంకర తిరిగిన వాడి గోళ్ళ మొనలతో రొమ్ములను చీల్చి చెండాడుకుంటూ, ఒకదాని నొకటి తోసుకుంటూ, ఉద్రేకంతో నెట్టుకుంటూ, తండసాలవంటి బలిష్ఠమైన ముక్కుల గోళ్ళతో, నెత్తిపై నుండి బొటబొటమంటూ కారుతున్న నెత్తురును రుచి మరిగాయా అన్నట్లు కరిచి పట్టుకుంటూ కొరకొర మంటూ ముఖాలను కొరుక్కుంటూ, గురుక్, గురుక్కు మంటూ శబ్దంచేస్తూ రెండు రెక్కల్ని బాగా వెడల్పుగా సాచి తూలిపోతూ నడుస్తూ, పొడుచుకుంటూ, దెబ్బకు కాచుకుంటూ, మళ్ళీ చడీచప్పుడు లేకుండా ఎదుటిదాని కాళ్ళ కిందికి దూరి పొడుస్తూ, తేపతేపకూ, ఘూట ఘూట మని శబ్దంచేస్తూ, ఉక్కుముక్కల్లాంటి ముక్కులతో దవడలపై పొడుచుకుంటూ, నొక్కి కరుచుకుంటూ, రవ్వంతసేపు ఆగి, వెంటనే గట్టిగా పట్టుకుని, గాలపుకొంకి ముళ్ళవంటి కత్తులతో కడుపులపై కొట్టి చీల్చి చెండాడుకుంటూ, చూడు! కొంతసేపు వాలి సుగ్రీవుల వలె, విందానువిందులవలె, శ్రీకృష్ణ చాణూరులవలె ద్వంద్వయుద్ధంచేసి, చారణులు గంధర్వులు గరుడ విద్యాధరులు మెచ్చే, మహాబాగుగా పరాక్రమాన్ని చూపి, వీరోత్సాహం పెనగొనగా, పందెపు బరిలో దేనికది ఒరిగి, పాయగిలిపడిపోయి, గాయాలనుండి కారుతున్న నెత్తురుతో తడిసి ముద్దవుతూ, స్పృహకోల్పోతూ మూర్ఛ అనే చీకట్లో మునిగిపోతున్నాయి గదా, అని చెప్పి, వాటిని గూర్చి సానుభూతితో మెచ్చుకుంటూ ఇలా అన్నాడు.

236. అయ్యో! కుమారస్వామి వాహనములారా! మంత్రదేవతా స్వాములారా! అయ్యయ్యో। వేళా పాళా తెలిసిన పండిత వర్యులారా! భూతభుక్తి కొరకు కుంభాలు పోయడానికి అర్హమైన వారలారా! అహల్యాజారుడైన ఇంద్రుని సురత సౌఖ్యానికి ఉపకారకులైన వారలారా! బలవంతంగా కామతృష్ణను తీర్చుకునే వారలారా! అహంకారానికి పెట్టింది పేరైన నిరంకుశులారా! కామ విజయాన్ని కూతపెట్టి

మరీ గర్వంగా ప్రకటించే వారలారా! పక్షీంద్రు లారా! అయ్యో! పోరులో తనువు చాలించి, రంభ తిలోత్తమ మేనకాది అప్సరసలతో భోగించడానికి స్వర్గానికి వెళ్ళిపోతున్నారు గదా! అని కోడిపుంజులను మెచ్చి ముందుకడుగు వేసాడు.

237. అలా వెళుతూ, అదిగో, ఆ కుడి పక్కన బంగారు కలశాలు నిలిపిన ముఖశాల గల భవనం వుంది గదా! చూసావా! అది మాధవశర్మగారి కుమార్తె మధుమావతీ దేవి మందిరం సుమా! అని మిత్రునికి చూపి చెప్పాడు మంచనశర్మ.

238. అలా చెపుతూ, పద్మినీ జాతి స్త్రీలు- మిత్రమా -సింహళ ద్వీపంలో మాత్రమే వుంటారనే ఒక వదంతి వున్న సంగతి నీకు తెలుసుగదా! కాని ఆ మాట నిజం కాదయ్యా! ఇదిగో! ఈ ఓరుగంటిలోని ఈ మధుమావతీ దేవి నిజానికి పద్మినీజాతికి

239. చెందిన దేవకన్యే సుమా! ఈమె వుందే- దీని ఒంటి సువాసన మంచి గంధపు వాసన. దీని నిశ్వాసవాయువు పరిమళం ఎర్రకలువల పరిమళం లాంటిది. ఓహ్! ఇక దీని చనుకట్టు - ఏం చెప్పమంటావులే- చక్రవాకాలను మా ముందు మీరెంత అని ఈసడిస్తాయంటే నమ్ము. దాని ఇంతింత కన్నులు తొలకరి మెరుపుల కాంతికి చెలికత్తెలు! గండుచేపలకు విటులంటే-అది అతిశయోక్తి కాదు.

240. మిత్రమా! టిట్టిభా! దీని పూర్వజన్మ వృత్తాంతం చెవుతాను విను మరి. చెపుతానంటే అవి నా మాటలనుకునేవు! చెపుతా, ఆ మాటకే వస్తున్నా! ఒకసారి ఏమయిందంటే ఒక జోగి -మంచి అందగాడు కూడా లే! ఒకనాటి రాత్రి దీనికి వేశ్యా సుంకాన్ని చెల్లించి దీనితో భోగించాడు. అది ఇచ్చిన సుఖానికి మెచ్చి అదిగో! నీవే చూడు- దాని మేడ గోడమీద, దాని వృత్తాంతాన్ని అంటే- పూర్వజన్మ, రానున్న జన్మలను గూర్చి, అనుభవించే భోగభాగ్యాలను గూర్చి గోటితో తెనుగులో ఒక పద్యం వ్రాసిపోయాడు! అదిగో కనపడుతోంది గదా! అంటే అది పూర్వం ఎక్కడ ఏ జాతిలో పుట్టింది, ముందు ఎక్కడ పుట్టేది-అన్ని విషయాలను వివరంగా వ్రాసాడు చూడు!

అతగాడు వ్రాసిన దానిని బట్టి- ఈమె అలకాపురంలోని అంగారపర్ణు డనే వాని కుమార్తె. ఆ గంధర్వకాంతే, ఇప్పుడు ఈ ఓరుగంటిలో మధుమావతి పేరుతో జన్మించింది. తరువాతి జన్మంలో ఈ సుందరాంగి దక్షారామంలో చిన్నిపోతి అనే పేరుతో సానికూతురుగా పుట్టి, దక్షవాటికాధీశుడైన సదాశివుని కూడి భోగిస్తుంది. ఆ పిదప పవిత్రమైన తమ్మిలేరు తీర పరిసరప్రాంతంలో వేంగిదేశానికి అంటివున్న మెట్ట భూమి మధ్యగల అటవీ భూభాగం లోని కడిమి గ్రామంలో కోవి వారనే పేరుగల చెంచుకులంలో కత్తులమ్మి పేరుతో జన్మిస్తుంది.

243. ఓయ్! విటశ్రేష్ఠా! వింటున్నావా! ఆ కత్తులమ్మి పెద్ద వాలుకన్నులు గండుమీలను కూడా తోసిరాజంటాయి. దాని చనుదోయి పరిమాణం ధారానగరాన్ని పాలించే ప్రభువు మేడపై నిలిపిన బంగారు కలశాలను కూడా ఏ మాత్రపువి గనుక, అని ధిక్కరిస్తాయి సుమా!

244. ఈ మధుమావతికి మదాలస అనే చెల్లెలుంది. అది మా మేనమామ మీసాలప్పయ్య ద్వివేదుల కొడుకు శ్రీధరుడున్నాడు గదా!వాడికి అది ననుపుగత్తె -అదేనయ్యా! దానిని వాడు వుంచుకున్నాడు. వాడు ఇప్పుడు ఇక్కడే వున్నట్లు వినికిడి. వెళ్ళిపరామర్శించి వద్దాం! ఏమంటావు అంటూ, దారి తీసి మొగసాల ప్రవేశించి లోపలి ఆవరణలను దాటి వెళ్ళి. అద్దాలగదిలో చాపమీద పరిచిన కంబళిమీద, చిరచిరలాడుతున్న ముఖాలతో, ఒక మాటామంతీ లేకుండా బిగుసుకు కూర్చున్న అప్పచెల్లెళ్ళను, మామకొడుకును చూసి, చిరునవ్వు నవ్వుతూ (ఇక్కడ కొంత గ్రంథభాగం నష్టమైంది)

245. ఓయ్! మరిదీ! జొన్నగడ్డ అగ్రహారాన్ని అయిదువందల రూకలకు తాకట్టు పెట్టావు గదా! ఇంకేం! నీవూ మదాలసా సుఖంగా జీవితాన్ని అనుభవిం చండి. ఏమంటావా? ఈ జన్మ శాశ్వతం కాదు గదా! అవునూ! ఇదేమిటిలా! ఈగకు పోకచెక్క పెట్టినట్లు-మీరుముగ్గురూ-ఒక మాటా పలుకూ లేకుండా అంటీముట్ట

246. నట్లున్నారు? ఏఁవిటి కథ- మీలో మాకు ఏఁవైనా-పొరపొచ్చా లొచ్చాయా ఏం! మరి కోపమున్నట్లూ లేదు. ఏఁవిటి సంగతంటూ పరామర్శించాడు వారిని.

247,248. అలా అడిగిన మంచనశర్మతో మధుమావతి అన్నదిగదా- ఏం చెప్పామంటావు తండ్రీ! నీవు మాకు తోబుట్టువు లాంటివాడిని. అయినపుడు

249. నీ దగ్గర దాచకూడదు! నీ వియ్యంకుడు-ఈ దరిద్రుడు-అవ్వ! చెప్పుకుంటే సిగ్గుచేటు గతరాత్రి నేను, మా చెల్లి మదాలస కేళిగృహంలో ఒంటరిగా ఒళ్ళు మరిచి నిద్రిస్తున్న వేళ ఇతగాడు నా లోబట్ట లూడదీసి- ఏం చెప్పమంటావు-సిగ్గు సిగ్గు-చేయాల్సిందంతా చేసేసాడు. దీనంతటికీ మూలం మేము, మదిరసేవించి ఒంటిపై తెలివి కోల్పోవడం. ఇది తెలిసి నాకూ, చెల్లికి-ఏం చెప్పను తండ్రీ- ఈ కలక అంతటికీ అదీ కారణం!

250 అయినా నీ వియ్యంకుడున్నాడే-ఏం బ్రాహ్మడయ్యా వీడు! వట్టి నమ్మక ద్రోహి అంటే నమ్ము! అర్ధరాత్రి తాగిన మైకంలో గదిలో నున్న నన్ను ముట్టుకున్నాడు. ఇతగాడు ఎలాంటి వాడనుకున్నావ్. సామాన్యుడు కాదయ్యా! గుళ్ళో వుంటూ

గుడిరాళ్ళను తీసే గోళకుడంటే నమ్ము! ధర్మాధర్మాలు తెలిసిన మొగలాయివి నువ్వు! మా అదృష్టం పండి నీవిలా వేంచేసావు. తెలియక చేసిన ఈ పాడుపనికి ప్రాయశ్చిత్త మేమిటో చెప్పి పుణ్యం కట్టుకోమంటూ ఇంకా ఇలా అంది.

251. తాగినమత్తులో మా చెల్లి మంచంపై ఒంటిగా పడుకుని నిద్రించటం తప్ప, ఇందులో నేను చేసిన ద్రోహమంటూ మరోటి లేదు సుమా! మరి నాకు పాపం ఎలా అంటుతుంది? నీవే చెప్పు! నామాట నిజం సుమా! నమ్మకం లేకుంటే చెప్పు! అవశ్యం మన్మథుని పాదాలమీద ప్రమాణం చేస్తాను అంది.

252. ఆమె అలా అనగా మంచనశర్మ ఆమెతో-అంతా మీ వెఱ్ఱిగాని, మీకు విట ధర్మాన్ని గూర్చిన సూక్ష్మం ఆట్టే తెలిసినట్లు లేదు. ఇది ఎంతమాత్రం అన్యాయమనడానికి లేదు. ఏమంటే-వేశ్యల విషయంలో వావివరుసలంటూ లేనే లేవు సుమా! ఊర్వశి ఇంద్రునికి ననుపుగత్తేనా! అవునా? మరి ఆమె ఆయన కొడుకైన అర్జునుని కామించిందా లేదా! రంభ విషయమే తీసుకో! ఆమె నలకూబరుని ఇలాకా యేనా! ఆ లెక్కన ఆమె రావణునికి ఏం కావాలి? కోడలే గదా! అని విడిచిపెట్టాడా! చెప్పు! కేళిగృహంలో- వేశ్యను- అయ్యో ఇది తల్లి వరుసే, దాసి గదా, అప్పవుతుందే, చెల్లెలువరుసగదా అని విడిచి పెట్టడానికి విటధర్మసూత్రాలు ఒప్పవుగాక ఒప్పవు సుమా!

253. అని ఇంకో మాట కూడా చెపుతా విను మరి, అంటూ తగు జాణతనముండి, సరసత్వం వుండి, తెలివుండి. కనుముక్కు తీరుగల రూపసి వాటం
254,255. కుదిరినపుడు భోగం వారింట్లో వావివరుసలు చూడాల్సిన పనేలేదు, అని చెప్పి వారిలో వారికి సఖ్యత కలిగించి, శ్రీధరునితో, అతనికి వదినయైన మధుమావతిలో, ననుపుగత్తె అయిన మదాలసతో, పంతాలు విడిచి హాయిగా సుఖంగా వుండమని బోధించి చెప్పి, మరి మేము వెళ్ళివస్తామని చెప్పి, వారితో మర్యాదలు పొంది, వారికి గల సిరిసంపదలకు ఆశ్చర్యపడుతూ అక్కడ నుండి అడుగు బైటకు వేసాడు మంచనశర్మ.

256. అలా బైటకు నడుస్తూ టిట్టిభునితో, కొడుకులూ కొమార్తెలూ కలిగి పాడిపంటలు సమృద్ధిగా వుండి, దినవెచ్చానికి సొమ్ము దండిగా కలిగి, వెండి బంగారాలు దేనికది అధికంగా వుండి, తామూ, తమ చుట్టాలు తామర తంపర విస్తరించినట్లుగా విస్తరించి సుఖంగా వుండే వారు, తమకోరికలు ఫలించడానికి గాను కోరి శివుని తలపై ఒక ఉమ్మెత్త పూవును పూజాభావంతో వుంచుతారు సుమా అని అంటూ మధుమావతీ దేవి ఇంటినుండి బయటకు వచ్చాడు.

257. అలా వచ్చి, మంచన శర్మ మాంచి ఘుటశాసికకూడా కావడాన, దిగంతాన గల ఆకాశపటాన్ని చూసి మిత్రుడు టిట్టిభునితో- అదిగో, అలాచూడు, పశ్చిమాధిపతి వరుణుని ననుపుకత్తె చేతి అద్దాన్ని పోలి సూర్యుడు అస్తమించ బోతున్నాడు. కనుక ఇక మనం సందర్శనార్థం ఎటువైపుకూ వెళ్ళాల్సిన పనిలేదు. చూడాల్సినవన్నీ చూసేశాం గదా! ఈ వేళప్పుడు చిగురు పెదవుల సొగసు కత్తెలు తమలపాకు దొన్నెల్లో కొబ్బరికల్లు సేవించి తమ మందిర ప్రాంగణాల్లోని ఉద్యానవన బాటల్లో పుష్పగంధికా నృత్యాలు చేస్తూ ఆనందిస్తుంటారు. కొందరు విలాసినులైతే తమ మందిరాల ఆరుబయట, చిత్రవిచిత్రాలైన శ్లోకాలను వివిధ రాగాల్లో స్వరపరచి ఆలాపిస్తూ, వాటికనుగుణంగా భేషైన పద్ధతిలో వివిధ విన్యాసాల్లో నాట్యం చేస్తారు. మధ్య మధ్య ప్రచ్ఛేదనం, సైంధవం, ద్విమూఢకం స్థితపాఠ్యం, అనే మార్గాభినయ భేదాల్ని రసభావాలు ఉప్పతిల్లేట్లుగా మధురాతి మధురంగా తన్వంగులు అభినయిస్తారు. నవయువతులు తమ విశాలమైన గృహాంతర్భాగాల చావిళ్ళలో వీటిని అభినయిస్తారు. ఇలా ఈ వినోదాలన్నింటినీ మనం చూసే వేళకు-అప్పటికి కామమంజరి గృహానికి వెళ్ళడానికి దైవజ్ఞుడు నిర్ణయించిన సమయం కూడా అవుతుంది. ఇప్పుడు ఈ క్షణాన పుష్యమీ నక్షత్రం నాల్గవపాదం నడుస్తోంది. కాల గమనంలో సంభవించే వర్జ్యం కూడా లేక అమృత ఘడియలతో కూడివుంది. దీని ఫలితమేమిటో ఎరుకేనా టిట్టిభా? అతివల అధరామృతపాన లాభసిద్ధి కలుగుతుంది. కనుక ఈ వేశ్యావాటికనుండి తొందరగా బయటపడదాం ఏమంటావ్! అది సరేగాని అటుచూడు అక్కడ-ఆ సురపొన్న చెట్టు క్రీనీడలో ఒకతె కన్నె పిల్లలతో చేరి బంతాట ఆడుతోంది. ఆట అంతా అయిపోయేదాకా కాకపోయినా అలవోకగా రవంత సేపు దానిని చూసి వెళదాం అని చెప్పి, అటువేపు దారి తీసాడు మంచనశర్మ.

258. అలా వెళ్ళి, టిట్టిభునితో. చూడవయ్యా! వాళ్ళు బంతులాట ఎలా ఆడుతున్నారో! వాళ్ళు ధరించిన కంఠహారాలు-వారివి మొలక చన్నులైతేనేమి! చూడు ఎంత పెద్దగా వున్నాయో- వాటి మీదకు దిగజారాయి చూసావా! వారి మొలనూళ్ళు, నూపురాలు, చేతికంకణాలు ఎలా, ఎంత సుమధురంగా మోగుతున్నాయో వాళ్ళు ఆడుతున్నపుడు! ఆహా! ఈ చూడచక్కని కన్నెపిల్లలు మూడు బంగారు వన్నెబంతులను కుడి ఎడమల రెండు విధాలా ఎగురవేస్తూ, పట్టుకుంటూ, ఒకప్పుడు వంగుతూ, అంతలో లేస్తూ ఎలా, ఎంత అందంగా కళ్ళవేడుకగా ఆడుతున్నారో!

259. అలా అంటూ మిత్రులిద్దరూ కొద్దిగా ముందుకు నడిచారో లేదో, వారి
ఎట్టఎదుట ఒక నాట్యాచార్యుని కోడలు గోడమీద నుండి వారగా నిక్కినిక్కి
చూడటాన్ని గమనించి, ఆమె మంచన శర్మకు ముందు తెలిసినదే కావడాన, ఆ
సంగతి టిట్టిభునికి చెప్పి! చూడు! చూడు! ఆ కమలాక్షి పాలిండ్లు కొంచెంగా
260. కిందికి వాలాయి. ఎందుకనుకుంటున్నావు. ఈమధ్యనే బిడ్డనుకన్నది. మరి
261. చక్రవాకాల్లాంటిచన్నులు వాలాయంటే, వాలవా మరి! అని అంటూ వెళూతూ
వుండగా ఎదుట కనిపించిన ఒక కర్షకుడిని మిత్రునికి చూపి, చూసావా అతగాణ్ణి,
262. డబ్బులకొరకు కప్పుకునే దుప్పటిని అమ్ముకున్నాడు. అసలే ఈ మాఘమాసం
చలి పులిలాగా బాధపెడుతోంది గదా–అలా అమ్ముకున్నా డంటే– వాడిధైర్య మేమిటో
నీకేమైనా అంతుబట్టిందా! వాడి కేమయ్యా! తన పడుచు భార్య చన్నులు పొగలేని
కుంపట్లు గదా! వాటిని నమ్ముకున్నాడుమరి! ఇక వాడికి చలి భయమెందు
కుంటుంది గనుక మన వెర్రి తప్ప! దిగ్గజాల కుంభస్థలాలంతటి పెద్దచన్నులు,
263. మన్మథుని రథ టెక్కెంపై గల పతాకం –అదేనయ్యా–చేప– వాటితో సాటివచ్చే
కన్నులు, తొలకరి మెరుపుతో పోటీపడే తొడల శరీరకాంతి–ఈ ఓరుగంటి పురం
అక్కలవాడలోని వేశ్యలకు సొంతసొమ్ము, మరోచోట మరోచోట వుండే వారికి
264. అవి అలా కుదిరేవి కావంటే నమ్ము! అని అంటూ వేశ్యవాటిక నుండి బయటపడి
భైరవాలయం దగ్గరకు వచ్చారు, అక్కడ, ఆ ఆలయద్వారం ముందు వారకాంతల
265. విటుల వివాదాలను తీర్చే పెద్ద మనుషులు కొలువు తీర్చి వుండటం చూసి,
ఏమో! ఏమి తీర్పు తీర్చ నున్నారని వారిని అడగ్గా వారు అయ్యా! మరేం లేదు.
ఈ సాని ముసిల్ది, ఈ పరదేశ విటునికి ముందు తన కూతుర్ని చూపి, కూటానికి
ఇతని వద్ద శుల్కాన్ని తీసుకుని, దానిని దానికి ననుపుగాడైన వానికి తార్చి, తన
యింటి దాసీ దాన్ని అలంకరించి ఇతనితో, కూటానికి పంపింది. తెల్లవారాక
మోసాన్ని గ్రహించిన ఈ తమిళ బ్రాహ్మణుడు తలవరులకు చెప్పగా వారు ఈ
లంజెతల్లిని ధర్మాసనానికి తీసుకువచ్చారు. ఇదండీ సంగతి. ఇంతమోసం చేసిన
ఈ ముండను– లంజెతల్లి అనవచ్చునా! గుల్లాపుముండ అవుతుంది తప్ప–మీరే
చెప్పండి న్యాయం!
266. అని వారు చెప్పగా ఆ ముసల్ది భయంతో సభాసదుల కాళ్ళకు దండం
267. పెట్టి, ఆ తుండీరదేశ బ్రాహ్మణ శ్రేష్ఠునితో – అయ్యా! నా కూతుర్ని కూటానికి
ఏర్పాటు చేస్తానని నీకు ఎలా చెప్పానో– నాకైతే –ఏమిటో – ఏమీ అర్థం కావడం
లేదు. ఏమంటారా! మా అమ్మాయి– ఈ రాజ్యాన్నేలే ప్రభువు కబురంపినా

అంగీకరించదు గాక అంగీకరించదు. నిజం చెప్పాలంటే-పూలతోటలో కనీసం దోహదక్రియ కోసమైనా సరే - గోరింట మొక్కకు తనపైట తొలగించి చన్నులొత్తుతూ కౌగిలింత కూడా ఇవ్వదే! అలాంటిది నేను నీకు ఒప్పించానా! ఏం మాటలవి! నేనేం జేతురో నాయనా! మమ్మల్ని ఈవిధంగా అల్లరి పెట్టటం
268. మీవంటి వారికి ధర్మసాయమేనా! అన్నది
269. అక్కడ చేరిన విటజనులు ఒక్కమ్మడిగా గోవింద మంచనశర్మతో, ఇది ఇలా ఈ బ్రాహ్మణుని మోసపుచ్చటం ధర్మమే నంటారా? విట ధర్మం మూలమట్టుగా తెలిసిన వారు మీరు. ఈ సంగతి తేల్చిచెప్పడానికి మీరే తగుదురు కనుక చెప్పాలంటూ మనవి చేసారు. అంతట మంచనశర్మ వారితో దీనికింతగా గుంజాటన పడాల్సిన అవసరమేమీ లేదే! మన్మథ వేదవేత్తలు మరి మీరంతా! దీని కోసం ఆర్నెల్ల పాటు ఆలోచించి తలలు బద్దలు కొట్టుకోవాల్సిన పనేమీ
270. లేదు సుమా! వెంటనే, మరో ఆలోచనంటూ లేకుండా ఈ ముసల్దాని జుట్టు గొరిగించండి. చాలు. అదే శిక్ష అది చేసిన మోసానికి. లంజెతల్లి చేసే మోసాలకు శిక్ష లేమిటంటే- ముక్కు మూలందాకా కోసివేయడం ఒకటి! కాదంటే పళ్ళన్నీ
271. పీకించడం మరోటి! అదీ కాదనుకుంటే గూబలంటేట్లు రెండు చెవులు కోసివేయడం! నన్నంటూ చెప్పమని అడిగారు గనుక నాకు తోచిన ధర్మం చెప్పాను. అవే పాటించాలని లేదు. నేరానికి తగినట్లు మీకు తోచిన శిక్ష విధించండి ఈ నీచవు ముండకు. అని అంటూ నా మనవి మరోటివుంది. ఆలకించండి, మరేంలేదు! ఇక్కడ ఆట్టే సేపు తాత్సారం చేసే వ్యవధానం ప్రస్తుతం నాకు లేదు. మీరంతా
272. మదన వేద కోవిదులు. మన్మథ విద్యా తంత్ర పండితులు. మన్మథ క్రతువు ఆరంభ విశేషాల నుండి నిర్వహణం వరకూ అన్నీ సాకల్యంగా తెలిసిన సమర్థులు. కనుక దూరం చెప్పవలసింది లేదు. మరేం లేదు! మీతో చెప్పక పోవడమేమి? ప్రస్తుతం నేను అదే పనిమీద- అదేనండి! తార్తీయ పురుషార్థం సాధించుకోవటానికి వేశ్యావాటికకు వెళ్ళే త్వరలో వున్నాను, కనుక నన్ను పెద్దమనసుతో మన్నించి, సెలవు తీసుకోవడానికి అనుమతి ఇప్పించాలి మరి అని అంటూ అక్కడ నుండి కదిలాడు. మిత్రుడు టిట్టిభసెట్టి ఆయన్ని అనుసరించాడు.
273. అప్పటికి, సూర్యభగవానుడు, వరుణుని అంతఃపురకాంతల నివాసంలోని మాణిక్యపు అద్దంవలె, పశ్చిమాద్రి ప్రవేశభాగంలోని అడవి మాటున దాగున్నాడు. కుంకుమ పూలపరాగం వలె పడమటి ఆకాశమంతా ఎర్రగా సంధ్యానటుడైన ధూర్జటి జటాజూటంలో అల్లుకున్న మల్లె తీవెలమొగ్గల్లాగా

నక్షత్రాలు ఆకాశవీథిలో తళతళమని కాంతులీనుతూ ప్రకాశిస్తున్నాయి. రాత్రి అనే స్త్రీ సంపెంగ పూలనుపోలిన కర్ణాభరణంగా గాని చేసుకున్నదా అన్నట్లుగా భువనమంతా వైభవంగా వెలిగిపోతోంది. చరమ సంధ్యాకాంతి, అప్పుడప్పుడే అలము కుంటున్న మసకమసక చీకట్లు-రెండూ కలిసి దిక్కులనే భవనాల సుందరోద్యాన వనాలలో అధిక సంఖ్యలో వేలాడగట్టిన గురివింద పూసలదండలు కాబోలు ననిపిస్తోంది. అలాంటి గోధూళి వేళ మంచనశర్మ ఆర్యవాటికలోనికి ప్రవేశించాడు. ప్రవేశించి తాను కామమంజరిని అలవాటుగా కలిసే చోటైన నాలుగు రహదార్ల కూడలిలో శివాలయం దగ్గరి చలివేంద్రాన్ని పరికించి చూస్తూ, వేశ్యల తార్పుడు కత్తెలైన జంగమస్త్రీలకు తన కడకన్నుల చూపుల సైగలతో తన రాకను వారికి తెలియపరిచాడు. ఆ ప్రాంతం ఎవరినైనా ఏకాంతంగా కలవడానికి అనువైన చోటు. పైగా అది అతనికి బాగా పరిచయమైన చోటుకూడాను. జనం సంచారం వుండదు. అంటే- మగ పురుగు లంటూ వుండరని సుమా! అంతేకాని అసలు మనుషులే వుండరనే కాదు. ఉండకేం ఉంటారు! ఎవరు? ఆడవాళ్ళు! వాళ్ళు ఎలాంటి వారంటే పెళ్ళీడు వచ్చేప్పటికి-ఆ ఈడు పిల్లలకు కుచాలు గుండ్రంగా, పెద్దవిగా రూపుదిద్దు కుంటాయా! అదిగో అలాంటి చనుకట్టు సంపదగలవారు వివిధ జాతులకు చెందిన విలాసినులకు, ఇళ్ళనుండి పారిపోయివచ్చిన ఇతర ప్రాంతాల కన్యలకు అది నిలయం. నిజానికి అది ఒకవిధంగా అలాంటి వారందరికి అది ఆశ్రయం. ఇంతకూ అది ఎవరి ఇల్లంటే - తమ్మడిసాని ఇల్లు. ఆ ఇంట్లో విడిది చేసారు మిత్రులిద్దరూ. తాము తీర్థ యాత్రకు వచ్చామనే నెపంతో తమరాకను ఆమె ద్వారా ఇతరులకు తెలియపరిచి, వీరభద్రేశ్వర ఆలయం వెనుకగల బొడ్డన బావిలో స్నానసంధ్యాది అనుష్ఠానాలు తీర్చుకున్నాడు మంచనశర్మ.

అలా అనుష్ఠానాదికాలు పూర్తి చేసుకుని మంచన శర్మ మనసులో

274. అనుకున్నాడు గదా- ఖట్వాంగంతో ఖంగుమని మోత వచ్చేట్లు తలభాగాన్ని కొట్టి

275. లొంగదీసుకోనలేరు. సూర్యుని పళ్ళూడి పోయేట్లు తన్ననూ లేరు. నుదుటి కంటి చిచ్చుతో మన్మథుని కడతేర్చనూలేరు. అలా చేయలేని దేవతలకు ప్రణామాలు అర్పించాలంటే నాచేతులు నొసటికి అలా, ఆ అన్నీ చేసిన శివునికి

276. తప్ప నా ప్రణామాంజలులు ఎలా చేరుతాయి గనుక! అని అనుకుంటూ శివుని ధ్యానించి తీరుబాటుగా కూర్చున్నవాడై మిత్రుడు టిట్టిభునితో నిశ్వాసవాయువు ను..........(ఇక్కడ కొంత గ్రంథపాతం)............కామమంజరిని గూర్చిన

విశేషాలు, ఆమెతో తనకు గల పూర్వ పరిచయాన్ని, మాలిమిని ఇలా చెప్పుకు వచ్చాడు.

277. బాగా పొద్దుపోయిన తరువాత దట్టంగా చీకట్లు అలముకున్నాక, శరీర మంతానిండిన యౌవనమదంతో,నిశ్శబ్దంగా, మాటుమణిగిన వేళ జనం గాఢనిద్రలోకి జారుకున్నాక, అరమోడ్పు కన్నులతో– ఆ వేళప్పుడు కామమంజరి

278. నా దగ్గరకు వస్తూ వుంటుందోయ్! ఆ రావడం ఎలాగనుకున్నావు! ముదురు నీలపురంగు చీర చెరగు చక్కగా ఒడుపుగా కాసెపోసి గట్టిగా కట్టుకుని. చేబరిసెను చేతబట్టుకుని, దాని ఎత్తైన చన్కట్టు కనుపించకుండా చొక్కా తొడుక్కుని భటుని వేషంలో నడురేయి వేళ తటాలున నా ఎట్ట ఎదుటికి వచ్చి జోహారు అంటూ

279. వందనం చేసి నన్ను ఆటపట్టిస్తూ వుంటుంది సుమా అని అంటూ ఇంకా ఎన్నో విశేషాలు ఆమెను గూర్చిన ముచ్చట్లు మనసు మురిపెంగా మిత్రునికి వైనాలు వైనాలుగా చెపుతూ, మనసంతా ఆమె తలపులతో నిండిపోగా, మన్మథావేశం. అతగాడిని ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా– కొండంత ఆశతో ఆమె రాకకు కళ్ళింత చేసుకుని ఎదురుచూపులు చూస్తూ –గడ్డి పరక కదలాడినా, చీమ చిటుక్కుమన్నా చెవి అటు ఒగ్గి ఆలకిస్తూ, ఆమె వచ్చే వేళ దగ్గరకావడంతో .........( ఇక్కడ కొంతగ్రంథపాతం) .........దీపంలా గా పరితాపం వహిస్తూ చంద్రుడు తూర్పు దిక్కు అనే గుహాంతర్భాగం నుండి సింహంలాగా ఆకాశానికి ఎగసి తన కిరణాలనే గోళ్ళతో చీకటి అనే ఏనుగు కుంభస్థలాన్ని చీల్చి చెండాడి చిందరవందర కావించి, ఆకాశం ఒడిలోని నక్షత్రాలనే ముత్యాలను వెదజల్లాడు.

280. అలా నిండు వెన్నెలకాస్తుండగా, తన ప్రియుడి రాకను తెలుసుకొని ఓపరాని సంతోషంతో, వీరభద్రేశ్వరుని పూజించే నెపంతో....(గంథపాతం)....

281. పద్మాలవంటి చేతుల్లో, గంధాక్షతలు, పచ్చకర్పూరంతో కూడిన తాంబూలం బంగారు పళ్ళెంలో పెట్టుకుని కొంగ్రొత్త జరీ సరిగంచు పట్టు చీర, రవికె ధరించి మనసంతా మురిపాన్ని నింపుకొని శివుని అర్చించే నెపంతో చాటుమాటు శృంగారాన్ని ఆశించి గోవిందుని సమక్షానికి కులుకుతూ వచ్చింది కామమంజరి.

282. నిండిన సంతోషంతో ఉవ్విళ్ళూరే ఉబలాటంతో రాకా చంద్రోదయ దేవత వలె వచ్చిన ఆమె భయం,భక్తి సిగ్గుదొంతరలు ముప్పిరిగొనగా మంచన శర్మ పద్మాలకు నమస్కరించి కళ్ళకద్దుకుంది.

283. మాలిమి, మనసుమురిపెం, గౌరవం, మర్యాద, భక్తి, హొయలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా తనకు మొక్కిన ఆమెను, ఆమె చనుగుబ్బలు రెండు ప్రక్కలా,

నారు మడికి గనుక పులక తడిపెడితే ఎలా పులకరించి పోతుందో అలాగ మదనదేవుడు ఆమెను పులకరింప చేసే విధంగా, మంచనశర్మ ఆమెను తన రెండు చేతులతో మక్కువ మీర పొదివికొని, తన ఎదకు హత్తుకొని కౌగిలించుకున్నాడు.

284,285. తరువాత అతడు కామమంజరితో ఇలా అన్నాడు. కమలముఖీ! నీదెంత గడుసు తనమో గదా! ఒక పట్టాన నిన్నూ నీ ప్రేమనూ అర్థం చేసుకోవడం కష్టం సుమా! ఏమంటావా! ప్రొద్దుట నీమాటలు- మొదటివి నీ సరసోక్తులు- ప్రియమార వినడానికి ఎంత మధురమో! ఆ వెంట- ఇదెంత ఆశ్చర్యమో కదా! నీవన్నమాట అదే- నేను శ్రీకాకుళవు తిర్నాళ్ళ సంగతి చెప్పినపుడు, నిష్ఠూరంగా నీ వాడిన మాటలు, చెవులకు బాగా కాలుతున్న బొగ్గుల్లాగా, రాచిలుకలు, గండుకోయిలలు కర్ణకఠోరంగా పలికినట్లు - ఏమిటో- ఒక్కొక్కప్పుడు నిన్నర్థం చేసుకోవడం - చాలా కష్టమోయ్. మరి ఇంత ప్రేమ ఎక్కడ దాచుకున్నావో గదా! (ఇక్కడ గల పద్యానికి. పైది నా స్వీయ వచనాను వర్తనంగా గ్రహింపమనవి)

286. అని ఆ జారదంపతులు పూజారి ఇంటి ముందు పుచ్చపూవంటి వెన్నెల్లో కూర్చుని పులుకడిగిన ముత్యంలాంటి తమ్మడిసాని కూతుర్ని, టిట్టిభసెట్టికి కూర్చడం ఎలా అని కొంత ఆలోచించి, మెల్లగా, నెమ్మదిగా తమ్మడి సానిని పిలిచి బంగారు నాణెంతో సహా కర్పూర తాంబూలం ఆమె చేతిలో

287. పెట్టి, నఖశిఖ పర్యంతం ఆమె కుమార్తెను చూసి, ఓహో అనుకుంటూ తలనూపి, బ్రహ్మ ఈ సొగసుకత్తెను సృష్టించి తనకోశాగారం బంగారు తలుపులు విరుగకొట్టి లావణ్యమనే ధనాన్ని ఎందుకు వ్యయ పరచినట్లు! పోనీ, వ్యయపరిచాడే అనుకుందాం! అంత కష్టం ఎందుకు పడినట్లు? కష్టపడ్డాడు! బాగుంది! మంచిదే! మరి అంతకష్టమూ పడి విటజనాల్ని మోసపుచ్చడం దేనికట? వాళ్ళనలా దిగులు పడేట్టు చేసినవాడు, ఇంతవరకూ మరి ఈమెకు ఒక మంచి మొగుణ్ణి ఎందుకు సృష్టించ కున్నట్లు? సొమ్ముకూ సొమ్మూ పోయి, ఆయాసం మిగుల్చుకొని, జనాన్ని బాధిస్తూ, ఏ ప్రయోజనమూ లేకుండా-ఆ తలతిక్క బ్రహ్మిగాడు, ఈ అన్నులమిన్నను ఏమి చేయాలని తలుస్తున్నాడో! ఏమిటో!

288. మొదట-మొదట రొమ్మున చనుమొలకలు పొటమరించాయా! రూపు దిద్దుకుందా! నిరుడేమో, చూడ చక్కగా కుచాల రూపు పొడకట్టిందా! ఈ ఏడాది బంగారు కలశాల ప్రమాణంలోకి ఎదిగాయా! ఇంకేం. ముందటేడాదికి ఈ

289. గజగమన చనుకట్టు కౌగిలి పట్టుకు అనువుగాకుండా ఎలా వుంటుంది. గనుక? అంటూ పూజారిసానిని కనుసైగతో దగ్గరకు రమ్మని పిలిచి, కౌగిలి సుంకానికి గాను బంగారు టంకాలు చేతిలో పెట్టి, కూతుర్ని టిట్టిభునితో మన్మథ క్రీడకు అనుసంధానం చేయవలసిందని చెప్పి, ఇంకా ఇలా అన్నాడు.

290. కన్నెరికపు సుంకానికి మరో రెండు బంగారు నాణేలు వేరే ఏర్పాటు చేయిస్తాలే! అదలావుంచు! చుట్టాలకు తెలిస్తే- అదే-కన్నెరికం సంగతి - యాగీ చేస్తా రెలాగా అని అనుకుంటావేమో! దాని కొచ్చిన భయం లేదు. పై వాళ్ళకు ఈ విషయం పొక్కకుండా, నీకు మాట రాకుండా - ఆ పూచీ నేను పడతాగా! కనుక నీకు మనసులో మరో మారాముళ్ళు వద్దు అని సర్ది చెప్పి, ఆమెను అంగీకరింపచేసి, కనుబొమలమీదకు వాలుతున్న ముంగురులు గల పూజరిసాని కూతుర్ని ఆ విధంగా అనుసంధానించి టిట్టిభుని చేతిలో పెట్టి, పండువెన్నెల్లో అరమరికలు లేని చనువుతో......(ఇక్కడ కొంత గ్రంథపాతం)............చంద్రునిపైకి దృష్టి సారించి, టిట్టిభ సెట్టి ఆలకిస్తూ వుండగా చంద్రుని ఉద్దేశించి మంచన శర్మ ఇలా అన్నాడు.

292. పాల సంద్రపు ముద్దుబిడ్డా! మాకు శుభాలు కలిగింతువు గాక. మదనదేవుని గాదిలి మేనమామా! మాకు అభ్యుదయ పరంపరాభివృద్ధి కలిగింతువు గాక! రాకా వెన్నెలదేవతా విభుడా! మాకు ఆనందాన్ని కలుగచేయాలి మరి! శ్రీమహావిష్ణువు పట్టపురాణి లక్ష్మీదేవి తోబుట్టువా! మాకు సంపదలు అబ్బించాలి మరి! అని అంటూ పన్నీటితో చంద్రదేవునికి అర్ఘ్యమిచ్చి. పచ్చకర్పూరాన్ని అన్ని దిక్కులకూ చల్లి, ఆ జారదంపతీ ద్వయం అనురాగం ముప్పిరిగొనగా నిండు చంద్రునికి నమస్కరించారు

**293. ములికినాటిలోని మోపూరు కొండ గుహ నివాసి, పరమేశ్వర నందనుడైన కాలభైరవస్వామి కవీంద్రుల పాలిటి కల్పవృక్షమైన వల్లభామాత్యునికి అభ్యుదయ పరంపరా వైభవాలు అనుగ్రహించుగాక!**

**అలా మంగళాశాసన స్వస్తి వాచకాలు పలికి, భద్రంగా తమతమ నెలవులకు చేరి అందరూ సుఖంగా వుంటూ వచ్చారు.**

ఇది శ్రీమహామంత్రి శేఖరుడు వినుకొండ తిప్పయామాత్య పుత్రుడు, చందమాంబ గర్భముక్తా ఫలంగా జన్మించిన వాడు, సుకవిజన విధేయుడు అయిన వల్లభ రాయనిచే ప్రణీతమైన క్రీడాభిరామమనే ఏకాశ్వాస పరిమితి గల వీథి అనే రూపక కృతికి, ఈ నేటి కాలంలో భాషాశాస్త్ర ఆచార్యునిగా ప్రసిద్ధికెక్కి, అధీతి బోధ ఆచరణ ప్రచారములనే నాల్గింటిని అనుష్ఠిస్తూ, సత్యశోధనే పరమావధిగా నెంచిన వారు, తెనుగు పదవ్యుత్పత్తి కోశ నిర్మాణ దక్షులు, తనకు విద్యాభిక్ష గావించిన గురువర్యులు ఆచార్య లకంసాని చక్రధరరావు మహోదయుల పర్యవేక్షణలో, గురుభక్తియుతుడు, సత్యమే దైవమని నమ్మినవాడు అగు యార్లగడ్ల బాలగంగాధర రావు సహృదయ జనరంజకంగా తనను అవ్యాజంగా అభిమానించే మిత్రులు శ్రీ కాకాని మధుసూదన రావు మహోదయులకు అంకితంగా సర్వధారి నామవత్సర ఉగాదికి పూర్తి గావించిన వచనాను వర్తనము.

# క్రీడాభిరామము వలన తెలియవచ్చే సామాజిక జీవన విశేషాలు

కవి సమాజంలోని వాడు కనుక, తాను రచనకు ఎన్నుకున్న ఇతివృత్తమేదైనా, తన నాటి సామాజిక జీవన విశేషాలు, ఆ రచనలో ఇతివృత్తం అనుమతించిన మేరకు తప్పక చోటుచేసుకుంటాయి. ఈ విషయంలో ఏ తత్కావ్యకర్త అంతఃకరణ, జీవన శైలి కూడా ప్రభావాన్ని చూపుతాయి. క్రీడాభిరామం పూర్తిగా ఆ విషయాలను ప్రతిఫలింపచేయడానికే వచ్చిన కృతి. ఇద్దరు మిత్రులు–ఒకరు బ్రాహ్మణుడు. మరొకరు వైశ్యుడు – నాటి ఆంధ్రరాజధానీ నగరాన్ని సందర్శించే వేడుకతో బయలు దేరి– అలా ఆ నగరాన్ని సందర్శించారు. ఇందులో బ్రాహ్మణుడైన మంచనశర్మ, ఆ నగరానికి పాతకాపే! రసికుడు. అక్కడ ఆయనకో భోగపత్ని కూడా వుంది. అలా, అతడు ఆ నగరాన్ని అడపా దడపా సందర్శిస్తూనే వుంటాడు. కాకపోతే ఇప్పుడు ఒక ఏడాది కాలం పాటు కాలు అటు మళ్ళించలేదు. అలా వెళుతున్నానని వైశ్య మిత్రుడైన టిట్టిభసెట్టితో అనివుంటాడు. మరి సెట్టిగారికీ ఆ యావ వుంది.కాని ఆ బులపాటం తీర్చుకునే మార్గం స్వగ్రామంలో –కొంత ఇరుకున పెడుతుంది గదా! మనసెరిగిన మిత్రుని వద్ద అరమరిక లేముంటాయి. ఆ మాటే–తానుకూడా వస్తానని, తీసుకువెళ్ళవలసిందని కోరి వుంటాడు. దానికయ్యే వ్యయం తనదేనని కూడా చెప్పివుంటాడు. వాచా చెప్పకపోయినా, అది అలాంటిదే కదా! బ్రాహ్మణులు పుచ్చుకునే వారే గాని సాధారణంగా ఇచ్చే వారు కాదు గదా! జరిగింది కూడా అదే! పూటకూటింటి ఖర్చు విషయం సరే! తన ననుపుకత్తె కామమంజరి కూతురు కన్నెరిక సంబరానికి ఆశీర్వాదం తాను చెప్పి, సంభావన సెట్టి గారితోనే కదా ఇప్పించాడు మంచన శర్మ!లోకవృత్తం ఇలా వుంటుంది మరి. దానికేమి!

ఆ ఇద్దరిమిత్రులు ఆంధ్రనగరం–నేటి వరంగల్లు–సందర్శించిన తీరు తీయాలను వర్ణించడం నేపథ్యంగా, వల్లభామాత్యుడు ఈ క్రీడాభిరామాన్ని మన ముందుంచాడు. ముందే చెప్పుకున్నట్లు మంచనశర్మ శిష్టబ్రాహ్మణుడు. ఘటశాసి కూడా! రసికత్వానికీ కొదువలేదు. సెట్టిగారి ఉబలాటం కూడా అదే గదా! ఇంక వారి కంట్లో పడే విశేషాలు కూడా అలాంటివే కావడంలో వింతేముంటుంది. శర్మగారు ఎంత రసికులైనా, ఎన్నో విషయాలు నగరానికి సంబంధించినవి, ఇతరత్రా తెలిసివున్నా, ఒక విషయంలో ఆయన అజ్ఞానం బైటపడింది.

అదే సుసరభేత్తు! ఆడంగులు వాడే అవాంఛిత రోమహారిణి, – దానిని గూర్చి ఆయనకు తెలియదు. మరి సెట్టిగారంటే వ్యాపారి కదా. ఆయన దానిని విడమరిచి చెప్పాల్సి వచ్చింది. ఆ చెప్పడం–ఎంత రమ్యంగా! అక్కడ జిననాథ దేవుని ప్రసక్తి వలన ఆ మతంపై అతడికి గల  నిరసన వ్యక్తమవుతోంది. పైకి మాత్రం–ఆదికూర్మ ప్రసక్తి కూడా చొప్పించడం వలన యాదాలాపంగా చెప్పినట్లు అనిపిస్తుంది.

ఈ ముచ్చట సంగతి అలా వుంచితే– మరెన్నో విశేషాలు– నాటి సాంఘిక జీవనానికి సంబంధించినవి, క్రీడాభిరామంలో చోటు చేసుకున్నాయి. వాటిని, నేటి జీవనశైలితో తైపారు వేసి చూసుకుంటే–సారూప్య వైరుధ్యాలు సాక్షాత్కరిస్తాయి. వాటిని ఒక క్రమం లోనికి ఒదిగించి చూద్దాము.

ముందుగా–సామాజిక వర్గాలు ఇలావున్నాయి. మనది వర్ణ వ్యవస్థ. అవి నాలుగు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర అనేవి. ఇందులో వృత్తులున్నాయి. ఈ రెంటినీ కలగా పులగం చేసి, కులాలని చెప్పడమూ వుంది. క్రీడాభిరామంలో కూడా ఇది కనుపిస్తుంది. అలా కనుపించే వాటిల్లో–బ్రాహ్మణులు–వీరిలో, ఆయా ప్రస్తావనలను బట్టి, వేదాలు పఠించేవారున్నారు. అలా మీసాలప్పయ్య, ద్వివేది. జ్యోతిష వేత్తలున్నారు. నాట్యాచార్యులున్నారు. పూటకూటిళ్ళు నడిపేవారున్నారు. యాయజూకుల (యజ్ఞనిర్వాహకులు) ప్రసావన వుంది. వైశ్యుల విషయానికి వస్తే –టిట్టిభసెట్టిని గూర్చి ఒకచోట కోమటి అని, మరో చోట కిరాటుడని, మరో చోట వైశ్యుడని చెప్పడం జరిగింది. కిరాట పదం మనకు ఉత్తరాది నుండి వచ్చింది. మన వాడుకలోని కిరాణా పదానికి మూలం అదే. దానినలా వుంచితే వైశ్యుల ప్రధానవృత్తి వ్యాపారమే అయినా, అందులో టోకు, చిల్లర వ్యాపార భేదాలతో పాటు, దేశీయ వ్యాపారం, పరదేశీయ వ్యాపారం అనే భేదాలున్నాయి. అయితే క్రీడాభిరామంలో వాటి వివరణకు ఎక్కడా చోటు లభించలేదు. క్షత్రియులను గూర్చిన ప్రస్తావన కథా భాగంలో ఎక్కడా కనుపించదు. నిజానికి క్షాత్రవిద్యను అభ్యసించిన వారు, దానిలో నిమగ్నమైన వారు – వారెవరైనా క్షత్రియులే. అంతే తప్ప ప్రత్యేకంగా ఒక 'కులం'గా లేదు. నేటి సంగతి వేరు. ఇక శూద్రుల విషయానికివస్తే– నిజానికి మనం కులాలని వ్యవహరిస్తున్నవి ఇవే–వ్యవసాయదారులున్నారు. వీరిని కాపులని చెప్పడం జరిగింది. మేదర, సాలి (వస్త్రాలు నేసేవారు) తంబళ, దర్జీ, చర్మకార, చండాల, గానుగలాడించేవారు, సైనికులు, బవనీండ్లు, మాల, ఆసాదులు, (జనంగమ), జక్కుల, గొరగ, మైలార వీర భటులు, పుష్పలావికలు, సంపెంగ నూనె అమ్మేవారు. చిత్రకారులు, వేశ్యలు,సానులు, సన్యాసులు, పాములాడించేవారు, గడమీద ఆడేవారు, జూదరులు, కోడిపందాలు, పొట్టేళ్ళపందాలు నిర్వహించేవారు, కోవులు (చెంచు కుల భేదము), నాట్యకత్తెలు, విటులు–వీరి ప్రస్తావన క్రీడాభిరామంలో ప్రత్యక్షంగా కనుపిస్తుంది.

పరోక్షంగా-అంటే ఆయా వస్తువుల ఉపయోగం వుంది గనుక, ఆయా వృత్తుల వారున్నట్లే గనుక-రజకులు (నీర్కావి మడుగు దోవతులు), పన్నీరు తయారుచేసివారు (గొజ్జంగి పూనీరు), జలతారుతో బట్టలు నేసేవారు, జంధ్యాలువడికేవారు, సన్నని, ముతకచీరలు నేసేవారు, పచ్చకర్పూరము, కస్తూరి పునుగు, అగురు సేకరించేవారు, అమ్మేవారు, పూరిళ్ళు నేసేవారు (తృణాలయము), పట్టెమంచాలు తయారుచేసేవారు, బంగారము, రాగి, ఇత్తడితో పనిచేసే వారు, అద్దాలు తయారు చేసేవారు, దువ్వెనలు తయారు చేసేవారు, దంతపు పెట్టెలు తయారు చేసేవారు, సౌందర్య సాధన సామగ్రి తయారు చేసేవారు, అలాగే విభూది, రోళ్ళు,రోకళ్ళు, పచ్చడిబండలు, చీరలకు రంగుల అద్దకం, నాణేలు, పాచికలు, పూలగుత్తులు, ఆలయాలు, వాటినిర్మాణం, రథనిర్మాణం, వివిధ వాద్యపరికరాలు, వివిధములైన ఆయుధాలు, వివిధములైన రచనా ప్రక్రియలు, కుంచాలు, వారుణి, కొబ్బరికల్లు వంటిమద్యములు, శాకములు, మత్స్యమాంసములు, తమలపాకులు, వీడెములు, గోధుమలు, పంచదార, పెసలు, అరటిపండ్లు, పెరుగు, కోడికత్తులు, హంసతూలికపాన్పులు, పచ్చడము (శాలువ)-మున్నగువాటి ప్రస్తావనలుండటాన్ని పట్టి ఆయావస్తువులను చేసేవారు, సమకూర్చేవారు, పండించేవారున్నట్లు భావించాలి.

ఆయా సామాజిక వర్గాలు లేదా వృత్తుల వారు తమతమ సంప్రదాయాన్ని అనుసరించి ఆహార్యాన్ని (కట్టూబొట్టూ) పాటిస్తున్నారు. బ్రాహ్మణుడైన మంచనశర్మ కట్టూబొట్టూ సవివరంగా వర్ణించడం జరిగింది. అలాగే మిగిలిన వారి విషయం కూడా వివరించబడింది. మంచనశర్మ విషయంలో గన్నెరుపూచాయ గల నీరుకావి రంగు ఉతికిన పంచెలను ధరించాడు. నీరుకావి రంగు అంటే దీర్ఘకాలం ఉతుకుడు వలన ఏర్పడే రంగు. విభూది పెట్టుకోవడం, జందెం వేసుకోవడం. బ్రాహ్మణునిగా అతనికి సాధారణమే. అయితే ఇక్కడ ఒక విశేషం తెలియవస్తోంది. ప్రస్తుతం ఆ వర్గం వారు జందేన్ని ఎల్లవేళలా ధరిస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకునే సందర్భాల్లో మాత్రం చెవికి చుట్టుకుంటారు. కాని మంచనశర్మ సంధ్యాది అనుష్ఠాన కార్యక్రమాల్లో మాత్రమే సాధారణ పద్ధతిలో దానిని ధరిస్తున్నట్లు, మిగిలిన సమయాల్లో మెడలో లుంగగా చుట్టి వేసుకుంటున్నట్లు చెప్పబడింది. నిజానికిదే సరైన పద్ధతిగా అనిపిస్తుంది. కారణం అది యజ్ఞోపవీతంగదా! అనుష్ఠానాదికాలు ముగిసిన తరువాత దానికి ప్రసక్తి ఏముంటుంది గనుక! తనను తాను ఇతరులకు ఎరుకపరచుకునే సందర్భంలో చేతులలో చెవులను స్పృశించి గోత్రప్రవరలతో పరిచయం గావించుకోవడమనే సంప్రదాయాన్ని అతడు పాటించడం జరిగింది. బ్రాహ్మణుడుగా శకునాలను గమనించడమేగాక, ఆయా విషయాల్లో గల వివిధ సిద్ధాంతాలను గూర్చిన పరిజ్ఞానం కూడా అతనికి వుంది. అలాగే కాలపరిగణనము, నక్షత్రగణనం, వర్జ్యం మున్నగు విషయాలు కూడా అతనికి తెలుసు. నిజానికి అతడు

ఘుటశాసికూడా! అలా ఆ విషయాలు అతనికి బాగా పరిచయమైనవే. దీనిని బట్టి సంప్రదాయాన్ని పాటించే ఒకపాటి బ్రాహ్మణులందరికీ ఈ విషయాల్లో ఎంతోకొంత పరిజ్ఞానం వుండి వుంటుందని కూడా భావించవచ్చు.ఆడువారు నూనెగానుగ ఆడటం పిడకలు చేసుకోవడం పసపునూరుకోవడం ఇరుగుపొరుగమ్మలకు పేలు చూడటం, ముచ్చట్లు చెప్పుకోవడం వుంది.

ఆకారం, వేషభూషలు, భాష-ఈవిషయాలను బట్టే ఎదుటివారు ఏ సామాజిక వర్గానికి చెందిన వారో ఏప్రాంతపువారో గుర్తు పట్ట కలిగే విధంగా వున్నాయని కర్ణాటవేశ్య మంచన శర్మతో చేసిన సంభాషణవలన -అంటే అతడు బ్రాహ్మణుదని కాసల్నాటి వాడనేది ఆమెకు తెలిసింది-అలాగే టిట్టిభసెట్టిని కిరాట అని సంబోధించడం వలన అతడు కోమటి అని గుర్తించ గలిగింది. అంటే వారి వారి వేషభాషలను బట్టి గుర్తించినట్లే గదా! అంతేగాక ఆయా ప్రత్యేకతలను బట్టి వారు ఏ ప్రాంతానికి చెందిన వారనేది కూడా వారిని చూడంగానే తెలియవస్తున్నట్లు, కరణకాంత, కర్నాటి తాటంకిని, తూర్పునాటిగడిడు, కాపుపడతి, కాసల్నాటి బాపడు, కరణ దేశపు జాణడు, ద్రవిళుడు అనే సంభోధనలు, పద ప్రయోగాలను బట్టి బోధపడుతోంది.

ఇక, ఇవిగాక, మేదరవేశ్య, చండాలాంగన, కర్ణాటి స్త్రీ, ములికినాటి తెలికస్త్రీ సంపెంగనూనె అమ్మే కనుమఅవ్వలి కరణ కాంత, గానుగస్త్రీ, రవిక కుట్టించుకోవడానికి దర్జీవాని వద్దకు వచ్చిన వెలచేడియ, ఈరీర్చుతున్న స్త్రీ, పసవునూరుకుంటున్న స్త్రీ, పిడకలు చేసుకుంటున్న స్త్రీ, పలనాటి వీరగాధలు ఆలాపిస్తున్న, అభినయిస్తున్న పురుషులు, స్త్రీలు, బవనీళ్ళు, ఏకవీరాదేవిని కీర్తిస్తున్న జనంగమ ప్రమద, నగరప్రవేశం చేస్తున్న కావు పూబోడి, జక్కుల పురంధ్రి, మైలారవీరభటులు, గొరగ పడుచు, ఆసాదులు, పూటకూటింటి విధవలు, పుష్పలావిక, వెలనాటి కోడె విధనలు, పాముల మెంగడు, కామమంజరి, తమ్మడిసాని కుమార్తె-వీరిని గూర్చిన వర్ణనలు, వారి వారిని కళ్ళఎదుట సాక్షాత్కరించేట్లుగా చెప్పబడ్డాయి. దీనివలన వారి వారి భౌతిక ఆకారాలు, వారి కట్టూబొట్టూ, అన్ని సాకల్యంగా చదువరులకు అంది వచ్చి, మనోనేత్రం ముందు వారు సాక్షాత్కరిస్తున్న అనుభూతి కలుగుతుంది.

సాంఘిక వినోదాల విషయానికి వస్తే-దేవాలయ వార్షిక కల్యోణాత్సవాలు, ఇతర ఉత్సవాలు నిర్వహింప బడుతున్నాయి. ఇతివృత్తంలో భాగంగా శ్రీకాకుళపు తిరునాళ్ళు, మైలారదేవుని ఉత్సవం, మాచలదేవి వృత్తాంతాన్ని నాటకంగా ఆడడం, ఇతివృత్తానికి మించి మోపూరు భైరవుని ఉత్సవ ప్రస్తావనలున్నాయి. మొదలు క్రీడాభిరామం ఆ ఉత్సవాల్లోనే ప్రదర్శింపబడింది. ఇవి గాక ఆయా కళాకారులు తమ తమ వృత్తి విద్యలను వీధుల్లో ప్రదర్శిస్తున్న వైనం కనుపిస్తుంది. పలనాటి వీరుల కథాగానం, అభినయం, గొరగ పడుచు

విన్యాసం, తూర్పు నాటి గడిడు చేసిన విన్యాసం, మైలార వీరభటుల విన్యాసాలు, పాములమెంగడు నాగస్వరం ఊదుతూ పాముల నాడించడం, ఏకవీరను, పరశురాముని కీర్తిస్తూపాడటం-అనేవి చోటుచేసుకున్నాయి. కోడిపందాలు, పొట్టేళ్ళపందేలు, జూదము నిర్వహింపబడుతున్నాయి.

వైయక్తికమైన ఉత్సవాల విషయానికి వస్తే-పిల్లలు లేని వారు అక్కదేవతలకు మొక్కుకోవడం, వాటిని తీర్చుకోవడం కొరకు అక్కల ఆరాధనను జక్కుల వారి చేత చేయించడం జరుగుతోంది. వేశ్యావృత్తి వారి విషయంలో కన్నెరికం జరపడం, ఆ సందర్భంగా అద్దం చూపడం సంప్రదాయంగా వుంది. ఆ సందర్భంలో చుట్టపక్కాలను పిలిచి ఉత్సవంగా జరుపుతున్నారు. అదే సందర్భంలో, సాటివారికి కానుకలు (మేరలు?) ఇవ్వవలసిన సంప్రదాయమున్నట్లు, అలాగాక పోతే వారివలన కొంత ఇబ్బంది వున్నట్లు, తమ్మడి సాని కూతురి విషయంలో అది రహస్యంగా జరుగుతోంది గనుక, ఆ విషయం బయటకు పొక్కకుండా చూస్తానని మంచన శర్మ అనడాన్ని బట్టి తెలియవస్తోంది. కంటికింపైన వారికి, ఇష్టమైన వారికి వస్తువులు ఊరకే ఇవ్వటాన్ని పుష్పలావిక విషయంలో గమనించవచ్చు. అయితే మంచన శర్మ సరసుడు గనుక అతడు దాని వెలను ఆమెకు ఇచ్చేసాడు.

వస్తు వినిమయ విషయంలో సంతలు జరుగుతున్నాయి. మైలసంతలు, మడిసంతలు విడిగా వున్నాయి. మత్స్యమాంసాదులమ్మే సంత మైలసంత. శాకాహారసంబంధమైనవి అమ్మే చోట్లు మడిసంతలు. సంపెంగనూనె, కస్తూరి, పునుగు, అగరు, చాదు, కేతకీ (మొగిలి) పుష్పాలు, మల్లెలు, మొల్లలు, పట్టుజరీచీరలు, సన్నని ముతకదుప్పట్లు, శాలువ, కిర్రుచెప్పులు, మొరవంకలు, మొలనూళ్ళు, తాటాకు తాటంకాలు, విభూది, జంధ్యాలు, పట్టెమంచాలు, వెదురుమంచాలు, హంసతూలికాతల్పాలు, పేరునెయ్యి, పెరుగు, అద్దాలు, గుడిసెలు, మేడలు, పూరిళ్ళు, అవాంఛితరోమహరిణి, పిడకలుచేసుకోవడం రాగిబిందెలు, పిడకలు, పసపు, కుంకుమ, హారాలు, కంకణాలు, నూపురాలు, పాచికలు, వెండి, బంగారు, ఇత్తడి ఆభరణాలు, చెవికమ్మలు, గాజులు నువ్వులనూనె, తేనె, చెంగావిచీరలు, గడులుగల చీరలు, రవికెలు, ఈర్పెనలు, రథాలు, పిండిగందము, ఆవకూర, వేపచిగుళ్ళదండలు, మొలనూళ్ళు తాంబూలము, తెల్లతమలపాకులు, అక్షతలు, పన్నీరు, ఉట్లు, మద్యము, చేసానలు చేబరిసెలు, కొబ్బరికల్లు, వారుణి, అరటిపండ్లు, పంచదార, గోధుమపిండితో చేసిన తినుబండారాలు, సన్నన్నము, కొట్టుఅన్నము, వేళ తెలియడానికి గంటలుకొట్టడం, కళ్ళాపిచల్లడం, ముగ్గులుపెట్టడం, పూర్ణకలశాలు నిలుపటం, బంగారు గిన్నెలు, పాలు, పాయసము, తులసిపేరులు, మొదలైన వాటి ప్రస్తావనను బట్టి, ఆయావస్తువుల వినిమయం జరుగుతున్నట్లు తెలియవస్తోంది.

జ్యోతిషము, సాముద్రిక విషయాలను నాటి జనం పరిగణనలోనికి తీసుకుంటున్నారు. లగ్నాలు, ముహూర్తాలు నిర్ణయించడం వుంది. అలాగే శకునాలకు ప్రాముఖ్యం వుంది. కోడి, ఏట్రింత, కొంకనక్క, నెమలి-ప్రయాణవేళ ఇవి కనుపించటం, కుడివైపు నుండి వాటి కూత వినపడటం శుభసూచకంగా పరిగణిస్తున్నారు. అలాగే శకునాల విషయంలో గార్గ్య, బృహస్పతి, వ్యాస, విప్రజన వాక్యాలు (విష్ణుమతం) ప్రసక్తికి వచ్చాయి. ప్రయాణవేళ గుడ్లగూబకూత ఎడమవైపు నుండి వినపడటం శుభ సంకేతంగా పరిగణిస్తున్నారు. నగర ప్రవేశం గోధూళి వేళల్లో (ఉషఃకాలం, అసురసంధ్యలు) చేయాలని చెప్పడం జరిగింది. మదనరేఖ అద్దం చూసే మూహూర్తం అపరాహ్ణ సమాగమంలో, పుష్యమీ నక్షత్రంలోనని చెప్పబడింది. తిరునాళ్ళ సందర్భాల్లో పరనారీ సంగమాదులు పాపములు గావని చెప్పడం ఒకవిశేషం. ఇది పండుగనాడు కూడా పాత మొగుడేనా అనే సామెతకు అద్దం పడుతోంది. అంటే-బహిరంగంగా అంగీకరింపబడని, అనుమతింపబడని ప్రవృత్తిపరమైన మానవ బలహీనతలను పరితృప్తి పరచుకోవడానికి తిరునాళ్ళు అలా ఉపయోగ పడుతున్నా యన్న మాట. ఆడపిల్ల, తండ్రి పోలికతో జన్మించటం సౌభాగ్య చిహ్నంగా భావిస్తున్నారు. వర్జ్యకాలాన్ని పరిహరిస్తున్నారు. శ్రీకాకుళాంధ్ర నాయకుని తిరునాళ్ళు దవనపున్నమి నాడు జరుగుతున్నాయని చెప్పబడింది. పూజలుగావించే సందర్భంలో ఉపవాసాలుంటున్నారు వేకువ వేళను తెలుసుకోవడంలో శుక్రతారను, కోడికూతను పరిగణించడముంది. పగలు ప్రభువులు కోటల మొగసాలలో గంటలు మ్రోగించటాన్ని బట్టి, సూర్యుని గమనాన్ని బట్టి వేళ తెలుసు కుంటున్నారు. పూర్ణకుంభదర్శనం శుభంగా భావిస్తున్నారు, ఉదయాన బ్రాహ్మణులు స్నాన సంధ్యాది అనుష్ఠానాలు పూర్తి గావించుకొని, ఇష్టదేవతా ప్రార్థన కావిస్తున్నారు. అలాగే సాయంసంధ్యలో కూడా పూజాదికాలు నిర్వహిస్తున్నారు. వీధుల్లో వెళ్ళుతున్నప్పుడు, కనుపించిన దేవతామూర్తులకు నమస్కరిస్తున్నారు. అలాగే మంచనశర్మ, టిట్టిభసెట్టి, ఏకవీరాదేవికి, అక్కదేవతలకు, భైరవస్వామికి, మైలారదేవునికి నమస్కరించటం జరిగింది. పలనాటి వీరులు, మైలారుదేవుడు, నాగములు తమకు కార్యసిద్ధి కలిగింతురు గాక యని వారు భావించారు.

జవనిక (తంత్రీవాద్యము), మద్దు, ఆనద్ధము, గంటలు, కోణము, మద్దెలలు, ఉరుము మురళి, కొమ్ముబూరలు, దమరుకము, తప్పెట్లు, చిటితాళములు, నాగసొరము, గుమ్మెట, మున్నగు వాద్యాల ప్రసక్తి, సాళవ, వరాటరాగ భేదాల ప్రసక్తి క్రీడాభిరామంతో కనుపిస్తుంది.

## అవీ-ఇవీ:

వ్యక్తులను సమంగా గుర్తించడానికి పేర్లతోపాటు ఆయావ్యక్తులకు ప్రత్యేకతలను కూడా పరిగణనలోనికి తీసుకుంటున్నట్లు మీసాలపప్పయ్య అని చెప్పడాన్ని బట్టి తెలుస్తోంది.

'గారు' గౌరవవాచకంగా ఉపయోగంలో వుంది. మీసాలప్పయ్యగారు, సెట్టిగారు, అయ్యగారికి జోహారు అన్నచోట్ల ఇది కన్పిస్తుంది.

గ్రామనామాలను సంస్కృతీకరించి చెప్పడం వుంది. ఏకశిలానగరము (వరంగల్లు), శ్రుతగిరి (వినుకొండ).

వ్యక్తి నామాంత్యపదాల వాడకం వుంది. మీసాలప్పయ్య ద్వివేదులు, మంచనశర్మ, టిట్టిభసెట్టి.

చాటుకవిత, ద్విపద(యతితోకూడి)ల ప్రసక్తి వుంది. అలాగే మాచద్దేవి వృత్తాంతాన్ని నాటకంగా ఆడుచున్నారని చెప్పడం కారణంగా, నాటకరచనలు ప్రదర్శనలున్నాయని తెలుస్తుంది. క్రీడాభిరామం కూడా ప్రదర్శితమైంది గదా! దేశి మార్గనృత్యాలు ప్రస్తావింప బడ్డాయి. పరిహాసానికి మారువేషాల్లో భయపెట్టడం వున్నట్లు కామమంజరిని గూర్చిన ప్రస్తావనలో మంచనశర్మ మాటల్ని బట్టి తెలుస్తోంది.

మిత్రులు ఉదయాన మొదటిసారిగా కలిసినపుడు యోగక్షేమాలు విచారించడం, శుభోదయం చెప్పడం వుంది. డబ్బు అవసరం కొరకు శాలువాను అమ్ముకోవడం, తార్తీయ పురుషార్థ సాధనకొరకు సంపన్నులైన బ్రాహ్మణులు నగరాలలో వేశ్యలను పోషించటం, అక్కడే, వారిగృహాల్లోనే నివాసముండటం, దానికొరకు తమ అధీనంలోని అగ్రహారాలను తాకట్టుపెట్టడం జరుగుతోంది. వేశ్యతల్లులు చేసే మోసాలు, వాటికి గల శిక్షలు ప్రసక్తమైనాయి. వెలనాటి కోడె విధవల ప్రసక్తిని బట్టి, ఆడపిల్లలు (ముఖ్యంగా బ్రాహ్మణుల్లో) బాల్య వివాహాలున్నట్లు స్పష్టమవుతోంది.

నాడు చెలామణిలో నున్న నాణేలు, మాడ(56);తార(71); హాటక(బంగారు) నిష్కములు (92); మున్నగునవి ప్రస్తావన లోనికి వచ్చాయి.

గ్రంథ పఠనం వలన మరెన్నో విశేషాలు తెలియవచ్చును.

చాటుమాటు (పోనీ, గోప్యమందాము) శృంగారానుభవ ప్రసక్తివుంది. కామమంజరి విషయంలో చౌర్యరతి ప్రసక్తి చేయబడింది. అలాగే పరపురుషులపై ఆసక్తి. నట్టువుని కోడలు విషయంలో వ్యక్తమైంది. అలా క్రీడాభిరామం సభ్య సమాజానికి వెలిగావుండే మానవ ప్రవృత్తికి అద్దం పట్టింది. అంటే సమాజానికి గల మరో కోణాన్ని ఆవిష్కరించింది. వ్యాఖ్యానించింది.

## వినుకొండ వల్లభరాయని

# క్రీడాభిరామము

వినుకొండ వల్లభరాయని

# క్రీడాభిరామము

## ప్రస్తావన

తే. గణన కెక్కిన దశరూపకముల యందు
వివిధ రస భావ భావనా వీథి లెస్స
యే కవీంద్రుఁడు రచియించె నీ ప్రబంధ
మనుచు మీ రానతిచ్చెదరైన వినుఁడు 1

సీ. అఖిల ప్రపంచంబు నన్యథా కల్పించెఁ
బటు రోష రేఖ సాఫల్యమొందఁ
ద్రైశంకవం బైన తారకామండలం
బాకాశ మార్గంబు నందు నిలిపె
మాలినీ తీర నిర్మల సైకతములలో
మేనకాప్సరసతో మేలమాడె
నామ్నాయమాత గాయత్రీ మహాదేవిఁ
బ్రణుతించి బ్రహ్మర్షి పదము గాంచె

తే. నెవ్వఁ డాతండు సామాన్య ఋషియె తలఁపఁ
దాటకా కాళరాత్రికి, దాశరథికిఁ
గాలకంధర కోదండ ఖండనునకుఁ
గార్మికాచార్య వర్యుండు గాధి సుతుఁడు 2

స్రగ్ధర. ఆ విశ్వామిత్రు గోత్రంబను జలనిధి యాహ్లాదముం బొందుచుండన్
భూవిఖ్యాత ప్రభావాభ్యుదయుఁ డుదయముం బొందె మంచన్న కీర్తుల్
ద్యావా పృథ్వ్యంతరాళాం తరముల నతి నిస్తంద్ర చంద్రాతప శ్రీ
ధావళ్య స్ఫూర్తి లక్ష్మీ తరళకర కళా ధాళధళ్యంబు సూపన్ 3

శా. ఆ మంత్రీశ్వరు కూర్మినందనుఁడు చంద్రామాత్యుఁ డంభోజ భూ
భామారత్న పయోధర ద్వయ తట ప్రాలంబ నైపథ్య ము
క్తా మాణిక్య నిభాభిరూప్య పదవాక్య ప్రౌఢ సాహిత్య వి
ద్యా మాహాత్మ్య విలాస సమ్మొదిత విద్వన్మానసుం డిద్ధరన్ 4

శా. కర్ణాట క్షితినాథుఁడైన పెద బుక్కక్ష్మాప దేవేంద్రు న
భ్యర్ణామాత్యుని, దానఖేచరునిఁ జంద్రాధీశు, బంధుప్రియున్
వర్ణించున్ గవి కోటి, శంకర జటా వాటీ తటాంతర్నటత్
స్వర్ణద్యుంబు తరంగ రింఖణ లసత్సాహిత్య సౌహిత్యయై 5

క. ఆ చంద్ర మంత్రి మణికిని
బోచాంబా రత్నమునకుఁ బుట్టెను బుధ ర
క్షాచణుఁడు, మంచనార్యుఁడు
వాచస్పతి సదృశ బుద్ధి వైభవుఁ డగుచున్ 6

ఆ. మంచనార్య తిప్పమకును సుపుత్రులు
నలువు, రందు సింగనయును, దిప్ప
నయును, మల్లనయును, నయనీతి సత్కళా
న్వితుఁడు చెన్నమంత్రి విభుఁడు ననఁగ 7

గీ. సింగనామాత్య సుతుఁడు సుస్థిర గుణుండు
మానినీ మన్మథుఁడు, చంద్రమంత్రి వరుఁడు
వెలసె వైభవముల దేవ విభునిఁ బోలి
సకల బుధ తతి యెల్లను సంస్తుతింప 8

క. మిరుతూరి విట్ఠమంత్రీ
శ్వరు తనయ వరించె మల్ల సచివాగ్రణి, శం
కరుఁ డద్రి రాజనందనఁ
బరిణయ మగు భంగి నధిక భాగ్యోన్నతుఁడై 9

ఉ. మల్లన మంత్రికిం ద్రిపురమా తరళాక్షికిం గాంతి రోహిణీ
వల్లభు లాత్మ సంభవులు, వల్లభ లింగన తిప్పన క్షమా
వల్లభ మంత్రిశేఖరులు వార వధూజన పుష్పభల్లు, లు
త్ఫుల్ల యశోవిభాసితులు పుణ్యులు సింగన భైరవేంద్రులున్ 10

వ. అందు 11

సీ. తారకామందార తారాచలంబుల
తో రాయునెవ్వాని చారుకీర్తి
భావసంభవ భద్ర దేవేంద్ర సూనుల
మఱపించు నెవ్వాని మహితమూర్తి
జీమూతవాహన శిబి సూర్యతనయుల
ధట్టించు నెవ్వాని దానశక్తి
భార్గవ గార్గ్య గీష్పతి మతి ప్రౌఢిమ,
నిరసించు నెవ్వాని నిశితబుద్ధి

తే. యతఁడు రిపురాజ్య సప్తాంగ హరణ,
కరణ పరిణత యుక్తి ప్రకాశమానుఁ
డతులితాచార విజిత గంగాత్మజుండు,
మర్త్య మాత్రుండె వల్లభామాత్య వరుఁడు 12

సీ. వాచాల సురధునీ వీచికా గంభీర,
వాచావిలాసుండు బైచమంత్రి
పల్లవోష్ఠీ మానసోల్లాస కృతి పుష్ప
భల్లావ తారుండు మల్లవిభుఁడు
పన్నగాలంకార పన్నీరజధ్యాన
సన్నుతాత్ముండు పోచన్న శౌరి
ప్రత్యగ్ర సహజ సాహిత్య విద్యా కళౌ
న్నత్యుండు తిప్పనామాత్య ఘనుఁడు

తే. నందనులు చంద్రమందార కుంద కుముద
గంధకీ గంధసార సౌగంధ్య బంధు

బంధురోదార కీర్తి సౌభాగ్య నిధికి
మల్లికార్జును పుత్రుఁడు వల్లభునకు 13

మ. కనకాద్రి ప్రతిమాన ధైర్యనిధి లింగక్ష్మాప మంత్రీంద్రుతో
ననతారాతి నృపాలమంత్రి జనతాహంకార తారా హిమా
ర్కునితో, రూపరతీంద్రుతో హరిహర క్షోణీంద్ర సామ్రాజ్య వ
ర్ధనుతో సాటి, సమాన మీడు గలరా రాజన్య సైన్యాధిపుల్ 14

ఆ. తిప్పమంత్రి జగదుదీర్ణ వితీర్ణుఁ డు
ద్వాహమయ్యె నధిక వైభవమున
హరితగోత్ర జలధి హరిణాంకుఁడగు తిప్ప
నార్యతనయఁ బెద్దమాంబ నెలమి 15

స్రగ్ధర. ఆ మల్లామాత్య పుత్రుం డయుగ నయన పూజాను సంధాన సంధా
సామగ్రీ పుండరీకేక్షణుఁడు వెలసె నైశ్వర్య సంపత్సమృద్ధిన్
సీమాదంతా వళాభ్యుచ్ఛిత్ర కరట తట క్షేత్ర నిర్యన్మదాంభస్
స్తోమ వ్యాలోల భృంగ స్తుత విమలతర స్ఫూర్తి మత్కీర్తి లక్ష్మిన్ 16

సీ. సత్యవ్రతాచార సత్కీర్తి గరిమలఁ
జంద్రుతోడను హరిశ్చంద్రుతోడ
నభిమాన విస్ఫూర్తి నైశ్వర్యమహిమల
రారాజు తోడ రైరాజు తోడ
సౌభాగ్య వైభవ జ్ఞానసంపన్నత
మారుతోడ సనత్కుమారు తోడఁ
లాలిత్య నిరుపమ శ్లాఘా విభూతుల
భద్రుతోడను రామభద్రుతోడఁ
తే॥ బాటియనఁదగు ధారుణీపాల సభల
వీర హరిహరరాయ పృథ్వీ కళత్ర
రత్న భాండార సాధికార ప్రగల్భు
మల్లికార్జున త్రిపురారి మంత్రివరుని. 17

మ. కపటాచార విరోధి రాజ సచివ గ్రావోగ్ర దంభోళికిన్
నృప నీతి వ్యవహార కార్య ఘటనా నిర్ధారణా శాలికిన్
దపనీయాచల రాజధైర్యనిధికిన్ ధర్మైక పాథోధికిన్
త్రిపురారాతి మహాప్రధానునకు వేరీ యుద్దు లిద్ధారుణిన్ 18

మ. అటవీసూకరమేల, యేల ఫణి, యేలా కొండ లేలా దిశా
తట వేదండము లేల కూట కమఠాధ్యక్షుండు సప్తాబ్ధి సం
ఘటనాలంకృత మధ్యమైన నిఖిల క్ష్మా చక్రవాళంబు నె
క్కటి దాల్పం ద్రిపురారి వల్లభు భుజా కాండ ద్వయం బుండఁగన్ 19

ఉ. గంధవతీ ప్రతీర పుర ఘస్మర పాద బిస ప్రసూన పు
ష్పంధయ చక్రవర్తి, శ్రుతపర్వత దుర్గ మహాప్రధాన రా
డ్గంధగజంబు తిప్పన యఖండిత ధీనిధి, కాంచెఁ బుత్త్రులన్
బాంధవ కల్పవృక్షముల బైచన మల్లన తిప్పమంత్రులన్ 20

వ. అందు 21

సీ. మూఁడు గ్రామగ్రాసముల తోడఁ గూడంగ
మోపూరు పాలించె ముల్కినాట
నాశ్వలాయన శాఖ యందు ఋగ్వేదంబు
కరతలామలకంబుగాఁ బఠించెఁ
బ్రత్యక్ష మొనరించి భైరవ స్వామిచే
సిద్ధ సారస్వతశ్రీవరించెఁ,
గామకాయన సవిశ్వామిత్ర గోత్రంబు
వంశ గోత్రంబుగా వార్త కెక్కె

తే. నెవ్వఁడా త్రిపురాంత కాధీశ్వరునకు
రాయ నవరత్న భండార రక్షకునకుఁ
బ్రియతనూజుండు చందమాంబిక సుతుండు
మనుజమాత్రుండె వల్లభామాత్య వరుఁడు 22

క. అహరవధి సమయ నృత్య
త్తుహినాంశు ధరప్రచార ధూతాభ్రధునీ
లహరీ భ్రమ ఘుమ ఘుమములు
వహిఁదిప్పయ వల్లభన్న వాగ్వైభవముల్ 23

క. హాటకగర్భ వధూటీ
వీటీ కర్పూర శకల విస్రుమర సౌర
భ్యాటోప చాటుకవితా
పాటవ మరు దవని వల్లభన్నకు నమరున్ 24

క. హల్లీసక నట నోద్భట
వల్లవ హరికృష్ణ కంఠ వన మాల్య మిళ
ద్గల్లత్ సురభులు, తిప్పయ
వల్లభ రాజ ప్రధాన వాగ్వైభవముల్ 25

క. అమృతరస మథన సంభవ
ఘుమఘుమిత పయః పయోధి కోలాహలమున్
భ్రమియించుఁ దిప్పసచివో
త్తము వల్లభ విభుని చాటు ధారా ఫణితుల్ 26

క. భిల్లావతార మధుభి
ద్భల్ల భుజాస్ఫాల్య మాన పటు చాప జ్యా
వల్లీ మతల్లి చెల్లెలు
వల్లభరాయ ప్రధాని వాగ్వైభవముల్ 27

క. నెల్లూరి తూము కాలువ
హల్లకముల కమ్మఁ దావి నపలాపించున్
సల్లలిత లీలఁ దిప్పయ
వల్లభరాయ ప్రధాన వాగ్డంబరముల్ 28

క. ఉపమించెద ధారాధర
తపనజ రైరాజ రాజ ధారా నగరా
ధిప ధారాధర వాహులఁ
ద్రిపురాంతక వల్లభుని వితీర్ణ ప్రౌఢిన్ 29

క. సరివత్తు రీవి, నిర్జర
పరివృఢ మణి ధనద జలద బలి ఖచర నిశా
కర సురతరు సురధేనువు
లరుదే త్రిపురారి వల్లభామాత్యునకున్ 30

శా. సారాచారమునన్ వివేకసరణిన్, సౌభాగ్య భాగ్యంబులన్
ధౌరంధర్యమునన్, బ్రతాపగరిమన్, దానంబునన్, సజ్జనా
ధారున్ దిప్పన మంత్రివల్లభు నమాత్య గ్రామణిన్, బోల్పఁగా
వేరీ మంత్రులు సింధువేష్టిత మహోర్వీ చక్రవాళంబునన్ 31

సీ. మందార వారుణీ మద ఘూర్ణితాత్ముచే
వెడద కన్నుల చిన్ని వడువు చేత
డమరు ఖట్వాంగ దండ కపాలపాణిచే
ధూర్తబాలక చక్రవర్తి చేతఁ
గుర్కుర పరివార కోటి సేవితునిచే
వెలఁది కోఱల మోము వేల్పుచేత
.................(గ్రంథపాతము).................

తే. విశ్వవిశ్వంబు పాలించు విభుని చేతఁ
బార్వతీదేవి గారాపుఁ బట్టిచేత
నీప్సితముగాంచుఁ దిప్ప మంత్రీంద్ర తనయుఁ
డార్యమణివల్లభామాత్యుఁ డహరహంబు 32

వ. ఆ మంత్రి శేఖరుండు రావిపాటి త్రిపురాంతక దేవుండను కవీశ్వరుం డొనరించిన ప్రేమాభిరామ నాటకంబు ననుసరించి క్రీడాభిరామంబను రూపకంబు తెనుంగుబాస రచియించిన వాఁడు 33

తే. ఆతఁడెంతటి వాఁడు ప్రేమాభిరామ
మనఁ గనెంతటి యది దాని ననుసరించి
వీథి యను రూపకము మది వెఱపు లేక
తిప్పవిభువల్లభుం డెట్లు తెనుఁగుఁ జేసె 34

వ. అని యానతిచ్చెదరేని 35

ఉ. నన్నయభట్ట తిక్క కవి నాయకులన్న హుళక్కి భాస్కరుం
డన్నను జిమ్మపూఁడి యమరాధిపుఁ డన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు నింతురు జే యని, రావిపాటి తి
ప్పన్నయు నంత వాఁడ! తగునా యిటు దోసపు మాటలాడఁగన్ 36

ఆ. జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశభాష లందుఁ దెనుఁగు లెస్స
జగతిఁ దల్లి కంటె సౌభాగ్య సంపద.
మెచ్చుటాఁడు బిడ్డ మేలు గాదె 37

వ. నేపథ్యము నందు 38

చ. 'గతిరసికుండ! షట్చరణ! గాన కళాకమనీయ! యో మధు
వ్రత! వికచారవింద వనవాటిక నేమిటికిం బరిత్యజిం
చితి వటవీ ప్రదేశమునఁ జెట్టులఁ జేమల నేమి గల్గునన్
రతి నిటు సంచరించెదవు ప్రాఁబడిపోయెనె నీ వివేకమున్ 39

ఆ చేరవచ్చి వచ్చి దూరంబుగాఁ బోదు
డాయ వత్తు దవ్వు పోయి పోయి
మాట లింక నేల మా పాలిటికి నీవు
మాయలేడి వైతి మంచిరాజ' 40

వ. ఆకర్ణించి సూత్రధారుఁడు "హా!యే నెఱింగితి, నేక శిలానగరంబునం దార్య వాటంబునం గామమంజరి యను పునర్భువునందు బద్ధాను రాగుండై, కార్యాంతర వ్యాసంగంబున దేశాంతర గతుండైన కాసల్నాటి గోవింద మంచనశర్మ నుద్దేశించి, యమ్ముద్దియ పుత్తెంచిన యసంబంధీభూత ప్రేమ సంధుక్షణా గర్భంబైన మదనలేఖ సందేశ పద్ధతి యది: ఆ లేఖ పఠియించుచున్న వాఁడతని కట్టనుఁగుఁ జెలికాఁడు టిట్టిభసెట్టి గావలయు, నయ్యిరువురు నాబాల్య మిత్రంబులు, వీరి యోగక్షేమంబు లనుసంధించెదం గాక, యని నిష్క్రాంతుండయ్యె.

**(ఇంతటితో ప్రస్తావన ముగిసింది. కథ ప్రారంభమవుతోంది)**

సీ. గన్నెరుఁబూఁజాయ కరమొప్పు నీర్కావి
మడుఁగు దోవతి పింజె విడిచికట్టి
గొజ్జంగి పూనీరు గులికి మేదించిన
గంగమట్టి లలాటకమునఁ దీర్చి
వలచేత బంగారు జలపోసనము తోడఁ
బ్రన్నని పట్టు తోరము ధరించి
జటిగొన్న వెలిపట్టు జన్నిదంబుల లుంగ
యంటులు వాయంగ నఱత వైచి

తే. తళుకు చెంగావి కోకయు, వలుఁద శిఖయుఁ
జిగురు బొమ్మంచు పెదవులు చిన్ని నగవు
నంద మొందంగ వచ్చె గోవిందశర్మ
మాధవుని పట్టి యొసపరి మన్మథుండు. 42

క. కాసల్నాటి శ్రేష్ఠుఁడు
మీసాలప్పయ్యగారి మేనల్లుఁడు ధా
త్రీసుర తిలకుఁడు కుసుమ శ
రాసన సము డంధ్ర నగర యాత్రోన్ముఖుఁడై 43

వ. తూర్పుఁ గనుంగొని, టిట్టిభునిం జూచి వయస్య! సుప్రభాతంబు. సుఖనిద్రయయ్యెనే? శీతం బుపద్రవంబు సేయదు గదా! యీ పుష్య,మాఘంబు లందు 44

ఉ. ప్రక్కలు వంచివంచి మునిపండ్లును బండ్లును రాచిరాచి ఔొ
మ్మక్కిలఁ జేసి చేసి తల యల్లన, గాళుల సంది సంది లో
చక్కికి నొక్కినొక్కి యిరుచంబడ గుమ్మడి మూటగట్టి వీ
పెక్కి దువాళి చేసి, చలి యిక్కడ నక్కడఁ బెట్టు వేఁకువన్ 45

ఉ. కుమ్ములు హవ్యవాహములు, గుత్తపు సుగ్గడితంపు దోఁపు రెం
టమ్ములు, దట్టు పున్గు మృగనాభియుఁ జాదును నోడె నద్దిరా
యమ్మకచెల్ల! యింక నవ యౌవన దర్ప నఖంపచంబులౌ
కొమ్మల చన్నులన్ సరకు గో నటులున్నవి వో తుషారముల్ 46

శా. స్థూల ద్వి త్రిపటావ కుంతనముఁ గస్తూరీ రజః పాళికా
కాలాగు ర్వనులేపనంబులను నుద్ఘాటించి, ధాటీ గతిన్
బ్రాలేయంబు దువాళిసేసిన, భయభ్రాంతంబులై యూష్మముల్
వాలాయంబుగఁ బ్రాఁకె నంధ్రవనితా వక్షోజ శైలాగ్రముల్ 47

శా. స్థూల ద్వి త్రిపటావకుంతనములున్, ధూపోపచారంబులున్
గాలా గుర్వనులేపనంబులు. వధూ గాఢోపగూహంబులున్
గేళీ గర్భ నికేతనంబులును గల్గెం గాక, లేకున్న నీ
ప్రాలేయాగమ మెవ్విధంబున భరింపన్ వచ్చురా టిట్టిభా 48

వ. శీతోపద్రవంబు లేక సుఖ నిద్రయయ్యెనే యని యడిగి, వేఁకువ యగుచున్నయది,
కావున నిదియ మనకుఁ బ్రస్థానకాలంబని నిమిత్తం బనుసరించి 49

ఉ. చుక్క యొకింత నిక్కి, బలసూదను దిక్కున రాయుచుండుటన్
జక్కఁగ వేగ దిప్పుడు నిశాసమయం బిది ప్రస్ఫుటంబుగా
ఘుక్కని మాటి మాటికిని గోటఁడు వల్కెడు వామ దిక్కునన్
జొక్కటమై ఫలించు మన శోభన కార్యములెల్లఁ డిట్టిభా! 50

క. మూఁగిలి మూఁగిలి వృక్షము
పూఁగొమ్మున నుండి షడ్జము ప్రకాశింపన్
లేఁగొదమ నెమలిపల్కెడుఁ
గేఁ గోయని వైశ్య! మనకు గెలుపగుఁ జుమ్మీ! 51

తే. గొనకొనం గోడి యేట్రింత కొంకనక్క
నమిలి యీ నాలుగిటి దర్శనంబులెస్స
వీని వల తీరుఁ బలుకు నుర్వీ జనులకుఁ
గొంగు బంగార మండ్రు శాకునిక వరులు 52

వ. అనిన నాకర్ణించి టిట్టిభుఁడు. 53

ఉ. మంచన! వింటివో వినవొ, మన్మథుఁ డేకశిలాపురంబులోఁ
జంచల నేత్రలం బతుల శయ్యలపై రతికేళి రాత్రి పో
రించి, ప్రభాతకాలము పరిస్ఫుటమైనను ధర్మదార వ
ట్టించుచునున్న వాఁడదె! కుటీ గత కుక్కుట కంఠ కాహళిన్ 54

వ. అని యట వోయి ముందట 55

తే. శీతకాలంబు కడిమాడ సేయఁ గుడుచు
భాగ్యవంతుండు జేపాడి పల్లె పట్లఁ
గొట్టి యోరెంబు నిగు రావకూర తోడఁ
బిచ్చిలంబైన నేతితోఁ బెరుగుతోడ 56

వ. టిట్టిభ! తలంపునం బాటె, నొక్క నాఁడేనునుం గామమంజరియును బ్రేమం బెలర్పఁ గలసి మెలసి, కూడి మాడి, పొంది పొసఁగి, యనఁగి పెనఁగి, చొక్కి తక్కి యుండ,దైవ వశంబున గోత్రస్ఖలనంబు కారణంబుగా నక్కాంతారత్నం బలిగిన 57

గీ. ఎట్టకేలకు నలుక రే యెల్లఁ దీర్చి
యువిద యధరామృతము గ్రోలుచున్న నాకుఁ
బానవిఘ్నంబుగా మ్రోసెఁ బాపజాతి
జాతి చండాలమైన వేసడపుఁ గోడి 58

వ. టిట్టిభ! యమ్మదన పట్టాభిషేక మత్తేభరాజగమన నట్టనడుమ సురతకాలంబున వసంత సమయంబునం బాసి, మల్లికా ధవళాట్ట హాస మహాకాళమూర్తి యగు తపర్తు సమయంబు

లంఘించితి. లాంగలీ కుసుమ కేసర పరాగ రేణు విసర పిశంగిత దశ దిశా హట్టంబగు వర్షాసమయం బెట్టకేలకుం గడపితిఁ బ్రావృట్కాల ప్రవాసంబును మరణంబును రమణీ రమణులకు నొక్క సమంబ యది యెట్టిదనిన 59

మ. పటు ఝుంఝూ పవనోత్తృణాలయములో, భద్రంబునం బట్టె కం
కటిపై ముచ్చముడింగి నిర్భర వియోగ గ్లాని శోషించి యె
క్కటి నిద్రించుచునున్న వాడ వనితన్, గర్జావచః ప్రౌఢిమన్
దటి దుద్యోతము చూపు నట్ట నడు రే ధారాధర శ్రేణికిన్ 60

వ. అని, మంచన మఱియును బ్రాగ్దిశాంచలము వీక్షించి 61

తే. దాసనపుఁ బువ్వు చాయతోఁ బ్రస్తరించు
చుదయ మయ్యెడు నదె చూడు మొదలి సంజ
సొబగు వీడినఁ గట్టెఱ్ఱ సోకినట్టి
కామమంజరి నెమ్మోము కాంతి వోలె 62

మ. అదె మాణిక్యపుఁ బూర్ణకుంభము వయస్యా! కార్య సంసిద్ధికై
మొదలం దోఁచిన యట్టి మంచి శకునంబుగా విచారింపరా!
యుదయం బయ్యెడు భానుబింబము దిశా వ్యోమావకాశంబులన్
బది యార్వన్నె పసిండి తీఁగల గతిన్ బ్రాఁకెన్ బ్రభా జాలముల్ 63

శా. ఓరుంగంటి పురంబు సౌధములపై నొప్పారెడిన్ జూచితే
యీరెండల్ మణి హేమ కుంభములతో నేకాంతముల్ సేయుచున్
స్వారాజ ప్రమదా ఘన స్తన భర స్థానంబులం బాసి, కా
శ్మీర క్షోదము, ప్రాణవల్లభ ధృఢాశ్లేషంబులన్ రాలె నాన్ 64

వ. అనుదిత నియమవ్రతంబు గావున నిట క్రితంబ సంధ్యాగ్నిహోత్ర క్రియా కలాపంబులు నిర్వర్తింపంబడియె. నీవు ముఖ మజ్జనంబు సేసి, యిష్ట దేవతాభివందనంబు గావించితివి గదా! గోధూళి లగ్నంబునం బురంబు ప్రవేశింపవలయు. విశేషించి యుషఃకాలంబు సర్వప్రయోజ నారంభంబులకుఁ బ్రశస్తంబు. 65

తే. గార్గ్య సిద్ధాంత మత ముషః కాల కలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
వ్యాసమతము మనః ప్రసాదాతిశయము
విప్రజన్య వాక్య మరయంగ విష్ణుమతము 66

వ. అని పరిక్రమించి, వెలిపాళెంబు కట్టకడపటఁ గటకార కుటీర వాటికఁ
బ్రవేశించి 67

సీ. ఎకసక్కెముగ నాడు నేదైన నొకమాట
పాడు నొయ్యన పాట పాటపాట
యలఁతి యద్దపు బిళ్ళ యలవోక వీక్షించుఁ
గొనగోరఁ బదనిచ్చి కురులు దీర్చుఁ
బయ్యెద దిగజార్చి పాలిండ్లు పచరించు
దిస్సువాఱఁగ నవ్వుఁ దీఁగ నవ్వు
ధవళ తాళ పలాశ తాటంకములు త్రిప్పుఁ
గలికి చూపులఁ జూపు గర్వరేఖ

తే. కట కుటీద్వార వేణుకా కాష్ఠ పీఠ
మధ్యభాగ నిషణ్ణయై మదము మిగిలి
వీటి పామర విటుల తంగేటి జున్ను
కాము బరిగోల మేదర కరణ వేశ్య 68

క. పుటభేదన బహిరంగణ

కటకశ్రీ కారకూట కటకం బగు నీ
కటకార కుల వధూటీ
కుటికాగారంబు గరిడి కుసుమాస్త్రునకున్ 69

క. గీసిన వెదురు సలాకల
నేసిన యిరుఁదల శిఖండి నిడు మంచమునం
దోసరిలి, కట కుటీర వి
లాసిని రమియించు మిండల సహస్రములన్ 70

ఉ. పల్లవ తస్కరుం డొకఁడు, ప్రాక్సముపార్జిత తార పంక్తితో
వల్లువ మెత్తికొంచుఁ బెడ వాకిట వెళ్ళిన నాఁట నుండి పా
టిల్లిన శంక నీ కట కుటీర విలాసిని యహ్హాహా! పటీ
పల్లవ కోణముల్ బిగియఁ బట్టి రమించును మిండగీలతోన్ 71

వ. ఆ చేడియం జూచి, యట పోవం బోవ ముందట 72

శా. గండాభోగము పజ్జ లే నగవు శృంగారింపఁ గ్రేఁ గన్నులన్
మెండై మించు మెఱుంగుఁ జూపు గమి క్రొమ్మించుల్ పిసాళింపఁగాఁ
జండాలాంగన వచ్చె నొక్కతె ఋతు స్నానార్థమై యిక్షు కో
దండుం డేర్చిన బాణమో యనఁగ సౌందర్యంబు నిండారఁగన్

వ. అట్లు పోవం బోవ ముందట 74

మ. కటిభారంబును జన్నుదోయి భరమున్ గల్పించె నా బ్రహ్మ పి
న్నటి కౌఁదీగకు మున్న, యిప్డు విమలార్ణః పూర్ణమై యున్న యీ
ఘటిభారం బొకఁడెక్కుడయ్యె ననినన్ గర్ణాటి క్రాల్గన్నులన్
బటితాళింపుచు నవ్వె నీలకబరీ భారంబు కంపింపఁ గాన్ 75

వ. అనుచు గోవింద మంచనశర్మ నర్మసఖుండగు టిట్టిభుండును దానును
హట్టమార్గంబునం జనునప్పుడు 76

తే. జిగురు టుండలు నించి. డా చేతి యందుఁ
బెద్ద యేనుఁగు దంతంబు పెట్టెఁ బెట్టి
యింతులకుఁ బ్రీతిగా మైలసంత లోన
సుసరభేత్తని ఘోషించె జోటి యొర్తు 77

వ. ఇదియేమి ఘోషించుచున్నయది? కిరాటకుల రత్నంబ! నీవు తేటపడ
నెఱింగి, మాకు నెఱింగింపు మనుచు మంచనశర్మ యడిగిన 78

చ. ముసిముసి నవ్వుతో నతని మోము గనుంగొని వైశ్యు డిట్లనున్
రసిక కులావతంసుఁడవు, బ్రాహ్మణ! యింతకు మున్నెఱుంగవే
యసమ శరాలయంబునను హత్తిన వెంద్రుక కప్పు వోవఁగా
విసరు సమీరణం బయిన వేడుక మందిది కొందు రంగనల్ 79

సీ. కమఠావతారంబుఁ గైకొన్న దైత్యారి
కమనీయ చరమ భాగంబు వోలె
నాదియుగంబునం దావిర్భవించిన
జిననాథ దేవుని శిరసు వోలెఁ
గసటు వోవఁగఁ దోమి కడిగి బోరగిలంగఁ
బెట్టిన తామ్రంపు బిందెవోలెఁ
గంగమట్టియ తోడ సాంగత్య మెడలిన
నునుపారు మునుమిట్ట నుదురు వోలెఁ
తే. జఱుత ప్రాయంపు నాఁటి సజ్జికపుఁ జాయ
తొలు సమర్తయ కాలంపు విలసమునఁ
దరుణులకుఁ బంచబాణ మందిరము లమరు
సుసరభేత్తను నీ మందు సోఁకి నపుడు 80

వ. ఇది నిర్యాస మయంబును, సరభేదన సమర్థంబును నగుటం జేసి, సుసరభేత్తను నామంబు దీనికిం గలిగెఁ గామనిలయాఘాట రోమాటవీ సముత్పాటన పరిపాటికై పాటలగంధులు దీనిం బాటింతు రనుచు నెఱింగించి, యట పోవం బోవ ముందట వెలిపాళెంబు మధ్య ప్రదేశంబున హాలిక వాటియందు నొక్క చక్కని జవరాలు కట్టెఱ్ఱ తొగరుం గఱ్ఱల యెఱ్ఱ యొల్లియ నితంబభారంబున నమర్చి. బాలార్క కిరణ సంపర్కంబునఁ జాంపేయకుసుమ చ్ఛద చ్ఛాయా దాయాదంబు లైన యవయవం బులు మిసమిస మెఱవం గుర్కురాసనంబునం గూర్చుండి 81

ఉ. కందుకకేళి సల్పెడు ప్రకారమునం బురుషాయిత క్రియా
తాండవ రేఖ చూపెడు విధంబునఁ బామర భామ లేఁత యా
రెండ ప్రభాత వేళ రచియించె, నితంబ భరంబుఁ జన్నులున్
గుండలముల్ గురుల్ కదల గోమయ పిండము లింటి ముంగిటన్ 82

వ. అ ప్పామర భామారత్నంబు నుద్దేశించి 83

తే. పొలపములు లేవు కటివంక బొమల యందుఁ
జిన్ని నగవులు లేవు లేఁ జెక్కు లందుఁ
గలికితనములు లేవు క్రాల్గన్నులందు
గాఁపుటిల్లాండ్ర కిట్టి మౌగ్ధ్యముల యొప్పు 84

వ. అట చని, వీథీ విటంకంబునఁ డిట్టిభుండు విట పేటికా ప్రకాఘటిత కృకాటికా
నికట చేటికానుయాత యగు కర్ణాటాంగనం గనుంగొని 85

మ. కుసుమం బెట్టిన చీర కొంగు వొలయన్, గ్రొవ్వారు పాలిండ్లపైఁ
ద్రిసరంబుల్ పొలుపార వేణి యవటూదేశంబుతో రాయ న
ప్పస మెవ్వాఁడొ యొకండు రాత్రి సురత ప్రౌఢిం దనుం దేల్చినన్
వసివాళ్వాడుచు వచ్చుచున్న యది కర్ణాటాంగనం జూచితే? 86

తే. వాహకుం డెక్కి విడిచిన వారువంపుఁ
గొదమయును బోలి, రతికేళి మదము డిగ్గి
యలస భావంబు తోడఁ గర్ణాట వేశ్య
వచ్చుచున్నది యదె విప్రవర్య! కంటె? 87

ఉ. ఈమరి, యింక నొక్క మరి యింకొకమా ఱిఁక నొక్క మాఱు 'నా
నోములపంటగా' యనుచు నోడలఁ బెట్టుచు రే యొకండు నా
ల్జాములు దీనితోఁ గుసుమ సాయక తంత్రము సల్పఁ బోలు, లే
దా మృగశాబ నేత్ర యఖిలాంగములున్ వసివాళ్ళు వాడునే? 88

వ. అనిన మందస్మితంబుతో గోవిందమంచనశర్మ నర్మగర్భంబు గా
దర్భాంకు రాలంకృతంబులగు తన కరపంకజంబులం గర్ణపుటంబులు
ముట్టుకొని పూతిమాష గోత్రంబును మంచన నామధేయంబునుం జెప్పి
నమస్కరించి యిట్లనియె. 89

శా. పంచారించిన నీ పయోధరము లాస్ఫాలింతునో! లేఁత బొ
మ్మంచుం గెం జిగురాకు మోవి ణిసి ధాత్వర్థం బనుష్ఠింతునో
పంచాస్త్రోప నిష ద్రహస్య పరమబ్రహ్మ స్వరూపంబు నీ
కాంచీదామ పదంబు ముట్టుదునొ యో కర్ణాట తాటంకినీ! 90

క. వ్రాలని నీ చన్నులతో
వ్రాలెడు జక్కవలు సరియె? వలలం బెట్టం
జాలెడు నీ కన్నులతో
బాలకి! సదృశములె వలలఁ బడు మత్స్యంబుల్ 91

శా. చాటు ప్రౌఢిఁ బిసాళమాడెదవు కాసల్నాటి బాఁపండవో
శాటీహాటక నిష్కముల్ వెలిగ జంఝూటంబు చాలించు క
ర్ణాట స్త్రీలు కటారికత్తియలటే రాపాడగాఁ బట్టగాఁ
డా టా లీడ గుణింపరాదు పెఱ చోటం బోలెఁ బైపాటునన్ 92

తే. దిట్ట బాఁపండు నడువీథిఁ దెగడి పలికెఁ
గూటమీక్షింపఁ దెమ్ము కిరాట! నేఁడు
పన్నిదము వీని మెడ నున్న జన్నిదములు,
సవరగా గ్రుత్తుఁ గ్రొత్త పుంజాల దండ 93

వ. అనుటయు విప్రుం డిట్లనియె 94

సీ. ముసుఁగువెట్టిన నేమి, ముత్యాల కమ్మల
క్రొమ్మించు లీలలు కులుకరించె
మోము వంచిన నేమి, మొలక నవ్వుల కాంతి
చెక్కుటద్దములపైఁ జీరు వాఱెఁ
జూడ కుండిన నేమి, సొబఁగు ఱెప్పలమించి
తేట వాల్మెఱుఁగులు దిచ్చరించెఁ
జాటు చేసిన నేమి, చక్రవాకులఁ బోలు,
పాలిండ్ల మెఱుఁగులు బయలుపడియె

తే. సిగ్గు నటియించి, మా వేడ్క చిన్న పుచ్చి,
యేల యిటు వలెఁ జరియించె దిందేమి సిద్ధి

కాము సామ్రాజ్య పట్టంబుగట్టి, నన్ను
గౌఁగిలింపంగఁ గదవె! యో కరణకాంత! 95

వ. అని చిఱునవ్వు నవ్వుచు గోవిందమంచనశర్మ, నర్మసఖుండును దానును
నట పోవఁ బోవ ముందట 96

మ. పరివేష్టించి ప్రజా కదంబకము పై పై వ్రాలి వీక్షింపఁగాఁ
బర హస్తంబున నొత్తుకాండ్రు నపలాప ప్రౌఢి బోధింపఁ బా
మరులై పన్నిదమాడి యోడి, మఱి దుర్మానంబుతో నాట గొ
ల్పిరి వేశ్యా వలయాభిసంవళిత ముప్పిళూర్చె గోవిందునిన్ 97

శా. సంగాసంగ జయాజయంబు, పరిహాస ప్రస్ఫు టాశ్లీల భా
షాంగం బాకలితాంతరా వలయ కక్ష్యా భాగ ముద్రా లస
ద్భంగీ నిష్ఠిత కాష్ఠ శంకుకము, పాపద్యూత మీ పన్నిదం
బంగీకారము సేయు వారి మొలలం బ్రాప్తించుఁ గౌపీనముల్ 98

తే. నీకు నౌ నీకు నౌనంచు నెమకి నెమకి,
ముగుదలగువారి భ్రమియించు, మోసపుచ్చుఁ
బశ్యతోహరుఁ డత్యంత పాప బుద్ధి
పట్టణములోఁ దగుల్పరి పందెగాఁడు 99

వ. అనుచు నట ముందట శతానందగేహినీ కరరుహ ప్రరోహ శిఖర ముఖర
వీణాక్వాణ పాణింధమంబైన మధుర స్వరంబున 100

సీ. విజ్జోడు పడ నిడ్డ వెండ్రుక జందెంబు,
వలి గుబ్బ పాలిండ్ల కెలఁకు లొరయఁ
గర మూలమున వెండి మొరవంక కడియంబు,
మూఁడుమూలల లింగముద్ర లొత్త
జంగాళముగఁ బింజె సవరించి కట్టిన
మడుఁ గొంటి పొరను లోఁ దొడలు మెఱయ

బలితంపు విచ్చుటాకుల దుద్దుఁ గమ్మలు
నిద్దంపుఁ జెక్కుల నీడఁ జూడ

తే. నోరుగంటి పురంబులో నోరఁగంత,
బెద్ద యెలుఁగున నమ్మె సంపెంగ నూనె
కోకిలము పంచమశ్రుతిఁ గొసరినట్లు,
కనుమ యవ్వలి దేశంబు కరణ కాంత 101

తే. పలికినప్పుడు తేనియ లొలికి పడెడు,
జళుకుఁ జూపులఁ గ్రొమ్మించు లులికి పడెడు
ములికినాటిది కాఁబోలుఁ జెలి, కిరాట!
కలికి చిలుకలకొలికి, యీ తెలికి జోటి 102

ఉ. ఈ నళినాక్షి, తాఁ దిరుపుటెద్దు ప్రతోదము మోపి రొప్పుచున్
గానుగపట్టెపై ఁదిరుగఁ గట్టిడిఁ డిట్టిభ! మంథరాద్రి మం
థానక మధ్యమాన తిమి ధామ జల భ్రమి మండలం బధి
ష్ఠానముగా భ్రమించు నల సంపద చేడియఁ బోలకుండునే 104

ఉ. మీనవిలోచనంబులును మీఁటిన ఖంగను గుబ్బచన్ను లిం
పైన వచోఽమృతంబు సొగసైన మదాలస మందయానముం
గా నొనరించి, దీని గణికా మణిఁ జేయక నిర్దయాత్ముఁడై
గానులదానిఁ జేసిన వికార విధిం దల మొత్తఁగాఁ దగున్

వ. అట యుత్తరంబునం గత్తెర నొత్తి, పెక్కు వన్నెల పొత్తుల బహువిధ వర్తనల హత్తించి, యెత్తి కట్టిన పూగుత్తులు, మత్తకోకిల కలహంస దాత్యూహ వ్యూహంబులుం గలిగిన మోహరివాడ యందు, 105

చ. కొలుచును, జానవెట్టుఁ గుచ కుంభ యుగం బెగడిగ్గఁ గన్ను గ్రే
వలఁ బరికించుఁ గక్షముల వైచును దృష్టులు మాటిమాటికిన్
గలికి తనంబునం దఱచుగా నగు సౌచికపల్లవుండు గం
చెల వెసఁ గుట్టి యీఁడు వెలచేడియకున్, విషయాభిలాషియై 106

వ. అనుచు నవ్వాడ గడచి, యట యుత్తరంబు సనునప్పుడు ముందట నొక యింటి
మఱుంగున మచ్చెకంటిం బొడ గని 107

ఉ. సారెకు సారె కేమిటికిఁ జంపెదు గోరఁట యెఱ్ఱలైన వా
లారు నఖాంకురంబుల వయస్య కచంబునఁ బాట పాడి యీ
రీరిచి సీత్ కృతుల్ చెవుల కింపొనరింపఁ జకోరనేత్ర! నీ
చారు కుచద్వయంబు మముఁ జంపెడు దోసము నీకుఁ జాలదే 108

వ. అనుచు నయ్యింటి ముందట 109

మహాస్రగ్ధర.
పరిపాటీ ఖర్వ ఖర్జూపరతి సమయ సంభ్రాంత సంభోగ భంగిన్
దరుణీ రత్నంబు హేలా తరళ గతి హరిద్రారజః కర్దమంబుం
గురు లల్లాడంగ వీఁగుం గుచములు గదలం గొంతు కూర్చుండి నూఱెన్
గరవల్లీ కాచ భూషా కలమధుర ఝణత్కారముల్ తోరముల్ గాన్ 110

వ. అని యచ్చోటు వాసి, బాహ్య కటక వీథీ విటంకంబు నతిక్రమించి 111

సీ. సప్తపాతాళ విష్టప మహా ప్రస్థాన
ఘంటా పథం బైన గనప పరిఖ
తారకామండల స్తబకావతంసమై
కనుచూపు గొనని ప్రాకార రేఖ
పుంజీభవించిన భువనగోళము భంగి
సంకులాంగణమైన వంకదార
మెఱుఁగు ఱెక్కలతోడ మేరుశైలముఁ బోలు
పెను బైఁడి తలుపుల పెద్ద గవని

తే. చూచెఁ జేరెఁ బ్రవేశించెఁ జొచ్చెఁ బ్రీతి,
సఖుఁడు దానును రథ ఘోట శకట కరటి
యూథ సంబాధముల కొయ్యొ నోసరిలుచు
మందగతి నోరుఁగల్లు గోవింద శర్మ 112

వ. ప్రవేశించి, టిట్టిభ నామధేయుండైన కోమటి సెట్టిగారితో నాతఁ డిట్లనియె 113

సీ. రాజమార్గంబు వారణ ఘటా ఘోటక
శకటికా భట కోటి సంకులంబు
ధరణీ స్థలీ రజ స్త్రసరేణు బహుళంబు,
గావున మన మందుఁ బోవ వలదు
క్రంత త్రోవల నొందు కలకలంబులు లేవు
తఱుచుగా సుఖ వినోదములు గలవు
మఱియు విశేషించి మన్మథకూటమౌ,
వేశవాటిక మధ్య వీథి దఱిసి

తే. చిత్తమున కెక్కినట్టి లంజియల తోడ,
సరససల్లాప సౌఖ్యంబు సలుప వచ్చు
నంత మధ్యాహ్న సమయమౌ, నపుడు గాని,
వేడుకై యుండ దక్కలవాడ సొరఁగ 114

తే. అనిన। టిట్టిభుఁ డౌనంచు ననుచరింప,
నాలువరి క్రింది త్రోవగా నరిగి యరిగి
విప్రుఁ డీక్షించెఁ బలినాటి వీరపురుష
పరమదైవత శివలింగ భవనవాటి 115

మ. ద్రుత తాళంబున వీరగుంఫితక ధుం ధుం ధుం కిటాత్కార సం
గతి వాయింపుచు, నాంతరాళిక యతిగ్రామాభిరామంబుగా
యతిగూడన్, ద్విపద ప్రబంధమున వీరానీకముం బాడె నొ
క్కతె, ప్రత్యక్షరముం గుమారకులు ఫీట్కారంబునం దూలఁగన్ 116

సీ. గర్జించి యరసి జంఘాకాండ యుగళంబు
వీరసంబెట కోల వ్రేయు నొకఁడు
ఆలీఢపాద విన్యాస మొప్పగ వ్రాలి
కుంతాభి నయముఁ గై కొను నొకండు

బిగువుఁగన్నుల నుబ్బు బెదరుఁ జూపుల తోడ
ఫీట్కారమొనరించుఁ బెలుచ నొకఁడు
పటుభుజావష్టంభ పరిపాటి ఘటియిల్ల
ధరణి యాస్ఫోటించి దాఁటు నొకఁడు

తే. ఉద్ది ప్రకటింప నొక్కరుం డోల వాఁడు,
బయలు గుఱ్ఱంబు భంజళ్ళఁ బఱపునొకఁడు
కొడుము దాటింపుచును బెద్ద కొలువులోనఁ,
బడఁతి పల్నాటి వీరులఁ బాడు నపుడు 117

ఆ. కులము దైవతంబు గురిజాల గంగాంబ,
కలని పోతులయ్య చెలిమికాఁడు
పిఱికి కండలేని యఱువది యేగురు,
పల్లెనాటి వీర బాంధవులకు 118

గీ. ఆరువెల్లి నాయురాలి దుర్మంత్రంబు,
కోడిపోరు చాప కూటి కుడుపు
ప్రథమ కారణములు పల్నాటి యేకాంగ
వీర పురుష సంప్రహారమునకు 119

ఉ. పచ్చని పిండి గందమును బాలము సేసయు నెఱ్ఱపూవులన్
గ్రుచ్చిన కంఠమాల్యములు గొప్పుఁగ నల్లిన వేణి బంధముల్
కుచ్చుల వీర సంబెటయుఁ గ్రొత్తమఱుంగగు కాసెపుట్టము
న్రచ్చల కెక్కినట్టి రవణంబులు వీర కుమార కోటికిన్. 120

క. నల్లంగొండయు, నాగరి
కల్లును ధరణీ స్థలిం బ్రగల్భ స్థలముల్
పల్లేఱు, నాగులేఱును
బల్లె క్ష్మా కాంత యెల్ల ప్రారంభమ్ముల్ 121

సీ. ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై
సామంత నృపతులు చాపకూడు
ఇచ్చోటఁ జింతించె నిచ్చ నుపాయంబు,
నళినాక్షి యార్వెల్లి నాయురాలు
నిజ మనుశుద్ధికై నిప్పుల యేటిలో
నోలాడె నిచ్చోటఁ బీలసాని
యిచ్చోటఁ బోరిరి యిల పణంబుగ గొల్ల
సవతి తల్లుల బిడ్డ లవనిపతులు

తే ధీరులగువార లేవురు వీరపురుషు,
లై మదోద్ధతి నిచ్చోట నాజిఁ బడిరి
యనుచుఁ జెప్పుదు రైతిహ్య మచట నచట
జనప పెద్దలు పల్లె దేశముల యందు 122

ఉ. చిత్తముగూర్చి మాచెరల చెన్నుఁడు శ్రీగిరిలింగముం గృపా
యత్తతఁ జూడఁ బల్లె విషయంబున కా మహిమంబు చెల్లెఁ గా
కుత్తర లోన మింట జలముట్టిన మాత్రన నాపటాలలో
విత్తిన యావనాళ మభివృద్ధి ఫలించుట యెట్లు చెప్పుమా 123

మ. మగసింగంబులు సంగరాంగణములన్ మత్తిల్లి రున్మత్తులై
జగదేక స్తుతులంచు నేమిటికి సంశ్లాఘింప నా భూమిలోఁ
జిగురుం బోఁడులుఁ గాఁపు గుబ్బెతలు నక్షీణ ప్రభావంబునన్
మగసింగంబులఁ గా నెఱుంగుదురు పుంభావ ప్రసంగంబులన్ 124

తే. కోలదాపున ద్రిక్కటిఁ గూడియున్న,
గచ్చుచేసిన చిత్రంపు గద్దె పలక
వ్రాసినారదె చూడరా వైశ్యరాజ
శీలబ్రహ్మాది వీర నాసీర చరిత 125

వ. ఈ వీర పురుషులు మనకుం గార్యసిద్ధి సేయుదురు గాక! పద పద మనుచుం
గతిపయ పదంబు లరిగి, నింబపల్లవ నికురంబ సంధానిత వందన మాలికా
లంకృత ద్వారంబగు నేకవీరాగార గోష్ఠంబు గనుంగొని 126

సీ. వందనం బిందిరావరు కన్నతల్లికి
దండంబు ఫణిరాజ మండనకును
నంజలి సోమసూర్యానలనేత్రకు
నభివందనము జగదంబికకును
మొగుపుఁజేతులు దేవముని సిద్ధసేవ్యకు
జమదగ్ని గారాపు సతికి శరణు
జోహారు రమణీయ శోభనాకారకు
నమితంబు గిరిరాజ నందనకును

తే. నిత్యకల్యాణి కలికుల నీలవేణి
కాదిశక్తికి వేద వేదాంతసార
కేకవీరకుఁ బూర్ణరాకేందు ముఖికి
నఖిల జననికి సాష్టాంగ మనుదినమ్ము 127

సీ. పద్మలోచన, భృగుబ్రహ్మ సంయమవంశ
పరిపాటి కభినవాభరణమయ్యె
రమణి త్రేతా ద్వాపరముల సంధ్యావేళ
మగనితోఁ బెక్కేండ్లు మనువు మనియె
నెలఁత కానక కన్న నెయ్యంపు కొడుకుచేఁ
జంపించె ముయ్యేడు సారెన్నృపుల,
తరుణి హైహయ రాజ దంతాస్థిపటలంబు
గవడపేరుగఁజేసి కట్టె నఱుత

తే. మండపాకను, బెనుఁబాక, మాహురమున
నాగవరమునఁ బోలాస ననిచె నింతి
యోరుఁగంట వసించె నీలోత్పలాక్షి
కాకతమ్మకు సైదోడు యేకవీర 128

సీ. అలిగియెంతటి రాజు నాంధ్రనైనను బట్టి
పుట్టుఁబాపలఁ జేయు రట్టుకత్తె
ఘనుఁడైన జమదగ్ని మునినాథు కూరిమి
నెలయించు పెనుబాక వేడ్కకత్తె
సుక్షత్రియ కులంబు నిక్షత్రముగఁ జేయు
కొడుకుఁ గాంచిన యట్టి కోపకత్తె
బవనీల జవనిక పాటల నిల్లాంధ్ర
రమణఁ ద్రుళ్ళాడించు రంతుకత్తె

తే. యొలిమిఁ గదుళ్ళ వాఁగులో నోలలాడు
కలికి పల్లిక దేబెలఁ గన్నతల్లి
వాసి కెక్కిన యట్టి పోలాస యిల్లు,
చక్కమెప్పుల మాహురమ్మక్క నాచి 129

సీ. కక్ష నిక్షిప్త వికస్వర స్వరవిలా
స శ్రీనివాసంబు జనని కందుఁ
గట్టిన తంత్రికిఁ గంఠ శ్రుతికిఁ గూడఁ
జొక్కంబుగా నారి సొబగు మీఱ
నాలాపముల శుద్ధసాళవ సంకీర్ణ
వివిధ రాగంబుల చవులు చూపి
డమడమధ్వనుల బొటారించి యెడ నెడఁ
గత్తెర మార్గంబు బిత్తరిల్ల

తే. వాద్యవైఖరిఁ గడు నెఱవాది యనఁగ
నేకవీరా మహాదేవి యెదుట నిల్చి
పరశురాముని కథలెల్లఁ బ్రౌఢిఁ బాడెఁ
జారుతరకీర్తి బవనీల చక్రవర్తి 130

మ. అలరుం బోఁడి జనంగమ ప్రమద మధ్వానద్ధ ఘంటా ధ్వనుల్
చెలఁగం బాడె సమస్త లోకజననిన్ శ్రీయేకవీరాంబికన్

వలరా జొక్కొక మూర్ఛనా స్వరమునన్ బ్రాణంబు గల్పింపఁగాఁ
గలకంఠీ కలకంఠ కోమల కుహూకారంబు తోరంబుగన్ 131

వం. అకలంక స్థితిఁ గోరి కొల్చెదరు బ్రహ్మానంద భావంబునన్
సకలానంద మయైక మాత యగుచున్ సంతోష చిత్తంబునన్
తక దుందుమ్ములు తాళముల్ జవనికల్ తందాన లమ్మయ్యకు
న్నేకవీరమ్మకు, మాహురమ్మకు నథో హ్రీంకార మధ్యాత్మకున్ 132

శా. ఆలోకింపక మ్రొక్కరాదు నిజభక్త్యావేశ సంపత్తిమై
నాలోకించినఁ జిత్తమెట్లగునొ కామావేశ సంయుక్తిమై
నేలాగోయి కిరాట! మానుదమొ, సంవీక్షింతమో, చెప్పుమా
వ్రీళా శూన్య కటీర మండలము దేవీ శంభళీ వ్రాతమున్ 133

సీ. చరివోని గడితంపుఁ జిఱుత చౌకంబుల
తొగరుఁ బుట్టము కచ్చుఁ దొడివికట్టి
యోలగందపు బొట్టు నుపరిభాగంబుపై
సిందూర తిలకంబుఁ బొందు పఱచి
పసరు దారెడు నింబ పల్లవంబుల దండ
గుబ్బచన్నుల మీదఁ గుదురు కొల్పి
క్రొత్త తోమిన దంత కోరకంబుల యందుఁ
దాంబూల రాగంబు తళుకు గూర్చి

తే. సకల సంధ్యంగములకుఁ దేజంబు గలుగ
మధు మదారంభ మణఁకువ మరలఁ ద్రోవఁ
దేఁకువయు నారజంబునుఁ దేట పడఁగఁ
బురమునకు వచ్చె నొక కాఁపుఁ బూవుఁ బోడి 134

వ. అయ్యవసరంబున నేకవీరాంబకుం బ్రణమిల్లి యట చనునప్పుడు 135

సీ. కోణాగ్ర సంఘర్ష ఘుమ ఘుమ ధ్వని
తార కంఠస్వరంబుతో గారవింప
మసిబొట్టు బోనాన నసలు కొల్పిన కన్ను

కొడుపుచేఁ దాటించు నెడప దడప
శ్రుతికి నుత్కర్షంబుఁ జూపంగ వలయుచోఁ
జెవి త్రాడు బిగియించు జీవగట్టి
గిల్కు గిల్కున మ్రోయు కింకిణీ గుచ్ఛంబు
తాళమానంబుతో మేళవింప

తే. రాగముననుండి లంఘించు రాగమునకు
నురుమ యూరుద్వయంబుపై నొత్తిగిల్లిఁ
గామవల్లీ మహాలక్ష్మి కైటభారి
వలపు వాడుచు వచ్చె జక్కుల పురంధ్రి 136

సీ. ముద్రికా మాణిక్యముల దీప్తి కెంగేలి
పించెంబు గుంచెతో బిత్తరింప
నుపవాసమునఁ దద్దయును సన్ననగు కౌను
చనుదోయి భరమున జలదరింపఁ
దోఁక చుక్కలఁబోలు తోరంపుఁ దెలి కన్ను
లావేశమున సిగ్గు నతకరింప
నిద్దంపు వెలిపట్టు నెటిక తూలిన యప్డు
తొడలమించులు వెలిఁ దొంగలింప

తే. నురుమ చప్పుళ్ళకును బిల్లదొరుల మ్రోఁత
కంతకంతకుఁ బేరుబ్బు నావహింప
నాడెఁ బీటలపై నోలిఁ గూడియున్న
యక్క లేడ్వురలో నొక్క యలరుఁ బోఁడి 137

చ. హర!హర! యింత యొప్పునె మహారభటిన్ జగ ఝంకృత స్వన
న్మురళి విమిశ్రితాంకరవ మూర్ఛలఁ జిత్తము లుబ్బి యక్క లే
డ్వురు నదె యాడఁజొచ్చిరి కడుంగడు వేడ్క సమున్నమత్పయో
ధర యుగ భార భీరు తమ తన్వవలగ్నములైన నృత్యముల్ 138

వ. ఇదె యీ యింటి యజమానుండు సంతాన కాంక్షియై, ప్రతిబంధ నోదనార్థంబు యక్షకన్యలం బరీక్షారాధనంబు సేయుచున్నవాఁడు గావలయు, మాణిభద్ర కులోద్వహులైన దేవతలు కామవల్లి శ్రీమహాలక్ష్మితోఁ గూడి యపేక్షిత కార్యంబు మనకు నవ్యాక్షేపంబునం జేయుదురు గాక యనుచు విశ్వాసంబుతో సమస్కారంబుసేసి, కాసల్నాటి గోవిందమంచనశర్మ నర్మసఖుండు దాను నట చని ముందట 139

ఆ. మంద్ర మధ్య తార మాన త్రయీ భిన్న
మహిష శృంగనాద లహరిఁ గూడి
డమరు డిండిమంబు డమడమ ధ్వని మ్రోసె
నద్భుతం బదేమి యార్భటంబు 140

వ. అని టిట్టింభుం డడిగిన 141

సీ. అవఅవమందు నెఱ్ఱని చంద్రమల్లెల
చోద్యంపు గుండాలు చొచ్చు వారు
కరవాఁడి యలుగుల గనప పాఁతర్లలో
నుట్టి చేరులు గోసి యుఱుకు వారు
గాలంపుఁ గొంకిఁ గంకాళ చర్మము గ్రుచ్చి
యుడు వీధి నుయ్యేల లూఁగు వారు
కటికి హొన్నాళంబు గండెగత్తెర వట్టి
మిసిమింతులును గాక మ్రింగు వారు

తే. సందులను నారసంబులు సలుపు వారు
యెడమ కుడి చేత నారతు లిచ్చు వారు
సాహసము మూర్తి గైకొన్న సరణి వారు
ధీరహృదయులు మైలార వీరభటులు 142

తే. వీరు మైలార దేవర వీరభటులు
గొండ్లి యాడించుచున్నారు గొరగ పడుచు
నాడుచున్నది చూడు మూర్ధాభినయము
తాను నెట్టిక సీలంత గాని లేదు. 143

చ. వెనుకకు మ్రొగ్గవాలి కదు విన్నను వొప్పఁగఁ దొట్టె నీళ్ళలో
మునిఁగి తదంతరస్థ మగు ముంగర ముక్కున గ్రుచ్చుకొంచు లే
చెను రసనా ప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూస పే
రనుపమలీల నిప్పడు చుపాయము లిట్టివి యెట్టు నేర్చెనో 144

సీ. శనివార సిద్ధి సజ్జన పారిజాతంబు
వరదాత యాదిత్యవార భోగి
మాడచీ రమణుండు మాయా వినోదుండు
మాళవీ ప్రియభర్త మహితయశుఁడు
పల్లెమ్మ నాయకుం డెల్ల వేల్పులరాజు
గనపవేఁటల వేడ్కకాంద్ర భర్త
కత్రశాల స్వామి కరుణాపయోరాశి
పుణ్యకీర్తనుఁ డైనప్రోలియయ్య

తే. మంచుకుంచాలఁ గొలువంగ మాయలేళ్ళఁ
బట్టికట్టంగ నేర్చిన బాసవెల్లి
భైరవుని తోడి జోడు మైలారదేవుఁ
డోరుగంటి నివాసి మేలొసఁగుఁ గాక 145

మ. అదిగో యెత్తిన వారు పట్టణము మధ్య క్షోణి సింహధ్వజం
బదిగో కట్టినవారు నింబదళ మాల్యా తోరణ వ్రాతముల్
విదితం బయ్యె మహోత్సవంబు నెఱయన్ వీథీ విటంకంబులం
దదిగో నిల్పిన వారు పూర్ణకలశం బాబాల వృద్ధాంగనల్ 146

మ. అకలంక స్థితి శీధుపాన రుచులై యాసాదు లుప్పొంగి యో
యకరో! యమ్మకరో! యమక్కరొ! యదీ! యట్టట్టకో! యంచుఁ బా
యక తప్పెట్లును దక్కె తాళములు నింపై సొంపు రంజిల్లఁగా
జక జుం జుం జక జుం జు జుమ్ముమనుచున్ సాగుం గడున్ వాద్యముల్ 147

వ. అటచని ముందట 148

సీ. అదె భైరవస్థాన మటమీఁద నల్లదె
చమదేశ్వరీ మహాశక్తి నగరు
వీరభద్రేశ్వరాగార మండప మదె
యదె బౌద్ధ దేవు విహార భూమి
అదె ముద్దరాల్ ముసానమ్మ నివాసంబు
నల్లదె కొమరుసామయ్య నగరు
అదె పాండవుల గుడి యటదక్షిణంబునఁ
గర్తారుఁడుండు తుర్కలమసీదు

తే. కొంతదవ్వుల నదె మహాగోపురముల
పైఁడి కుండలు రవి దీప్తి బ్రజ్వలించి
కాననయ్యెను మేరు శృంగములఁ బోలెఁ
గేశవ శ్రీ స్వయంభూ నికేతనములు 149

వ. అనుచు నట ముందట నొక్క భైరవాలయంబుఁ బొడగని నమస్కరించి కాసల్నాటి గోవింద మంచనశర్మ యిట్లనియె 150

మ. అమితోత్సాహము తోడ నీవు పటు బాహా ఢక్క నొక్కొక్క మా
టు మనాక్కంపము నొందఁ జేయఁ దొలఁకాడున్ వార్ధివేలా లుఠ
త్కమఠంబై వలమాన మీనమయి యుద్యన్నక్రమై యుత్తర
త్తిమియై యుల్లలదంబు మగ్న ధులియై ధీరా! మహాభైరవా! 151

వ. అని యూర్ధ్వం బవలోకించి యిప్పుడు మధ్యాహ్న కాలం బగుచున్న యది 152

శా. వ్రాలెన్ దిక్కులు భాను భా వ్యతికర ప్రక్రీడ దర్కోపల
జ్వాలా జాల జటాల జాంగల తటీ వాచాల కోయష్టులై
రోలంబంబులు మూతిముట్ట వెఱచెన్ గ్రొవ్వేడి బీరెండలన్
జాలం గ్రాఁగి కరంబు వేడియగు కాసారాబ్జ మైరేయముల్ 153

వ. అని యనంతరం బాకాశంబునం జెవి పెట్టి శ్రుతి నభినయించి గోవిందుండు 154

మ. ఉడువీథిన్ శిఖరావలంబియగు నంద్రోర్వీశు మోసాలపై
గడియారంబున మ్రోసె రెండెనిమిదుల్ ఘంటా ఘణత్కారముల్
సడలెన్ భానుఁడు పశ్చిమంబునకు వైశ్యా! పూఁట కూటింటికిన్
గుడువం బోదమె లెక్క యిచ్చి! కడు నాఁకొన్నార మిప్పట్టునన్ 155

వ. విచారించిన నదియును మనకు విశ్రమస్థానంబు 156

గీ. సంధివిగ్రహ యానాది సంఘటనల
బంధకీ జారులకు రాయబారి యగుచుఁ
బట్టణంబున నిత్యంబు పగలు రేయి
పూఁటకూటింట వర్తించుఁ బుష్పశరుఁడు 157

వ. అనుచుఁ గొంత దవ్వరిగినం దమకు నెదురుగా నేతెంచు నొక్క బ్రాహ్మణుం గనుంగొని 158

ఉ. వీఁడిదె తెల్లనాకులను వీడెము సేయుచు వీథి వచ్చుచు
న్నాఁడు మదించి తిండి తినినాఁడు సుమీ! యిట మీద నేడకో
తేఁడఁగఁ బోయెడిం గరణ దేశపు జాణఁడు గాఁగఁ బోలు నీ
బాఁడు పణోపహార పరిపాటి యెఱుంగఁగ వచ్చు వీనిచేన్ 159

వ. ఇతఁడు వెడలి వచ్చు నవ్వాడయె పూఁట వంటకంబు వెట్టు బాడబుల వాడ గావలయు, నది యెట్లంటేని 160

ఉ. ఘ్రాణ పుటీ కుటీరములఁ గాపురముండఁ దొడంగె నిప్డు పా
షాణ ఘరట్ట ఘట్టన వశంబునఁ బుట్టిన సత్తు గంధ మ
క్షీణ కఠోర సౌరభ విజృంభణ దిక్కులఁ జల్లఁ జొచ్చె సా
మ్రాణి పదార్థ జాలములు బ్రాహ్మణ కాంతలు తాలఁ బోయఁగన్ 161

గీ. మందవేగంబుతోఁ గ్రొత్త మలక వాళ్ళ
కిఱ్ఱు చెప్పులు మొరయ నుంకించి నడుచు
కరణ బ్రాహ్మణ విటముఖ్యుఁ గదియ వచ్చి
పూతిమాషాన్వయుండగు భూసురుండు 162

వ. పూఁట వంటకంబుల వృత్తాంతం బడిగిన నతండు 163

క. ఆహార విహారములకొ!
యాహారంబునకునో విహారంబునకో
బేహరము మీ కీ సం
దేహారంభంబు మాకుఁ దెలియఁగ వలయున్ 164

వ. ఆహారంబున కంటేని 165

ఉ. కప్పుర భోగివంటకము కమ్మని గోధుమ పిండి వంటయున్
గుప్పెఁడు పంచదారయును గ్రొత్తగఁ గాఁచిన యాలనే పెసర్పప్పును
గొమ్మునల్లనఁటి పండ్లును నాలుగు నైదు నంజులున్
లప్పలతోడఁ గ్రొంబెరుగు లక్ష్మణవజ్ఝల యింట రూకకున్ 166

వ. విహారంబున కంటేని 167

క. అఱుగౌను గుబ్బచన్నులు
మెఱుఁగుం గన్నులును గలుగ మెచ్చుల నవలా
కుఱుబోడ ముండరత్నము
బఱివోవఁగ విడిచినట్టి బ్రహ్మకు జే జే! 168

శా. పూవుం బోఁడులు లేరె విప్రవిధవల్ భూమండలిన్ దాని రే
ఖా వైదగ్ధ్య విలాస విభ్రమ కళాగర్వంబు లట్లుండనీ
యా విశ్వస్త యుపస్థ చాయ నవలక్షాధీశ ఫాల స్థలీ
సౌవర్ణ స్థిర పట్టబంధ సుషమా సౌభాగ్య లక్ష్మిన్ నగున్ 169

ఉ. కోయిల పంచమ స్వరము క్రోల్చిన భంగిని గంతమెత్తి రా
మాయణ మాటు కాండములు నచ్యుత జాగరవేళఁ బాడె నా
రాయ వితంతురత్న మనురాగము తోడ 'నమశ్శివాయ శా
న్తాయ సమస్త దోష హరణాయ' సమానమె దాని కెవ్వరున్ 170

ఉ. సంకృతి పూతి మాష కుల సాగర శారద పూర్ణిమా కురం
గాంకుఁడు మంచి, లక్ష్మణు గృహంబున నెచ్చెలికాఁడుఁ దానునుం
జంకలబంటిగా మెసవి చక్కని వేడుకకత్తెఁ జూచి తా
రింకొక మారు వత్తమని యేఁగిరి కార్యభరంబుపెంపునన్ 171

వ. అటం బోవం బోవ ముందట 172

సీ. పాంథ సీమంతినీ ప్రాణమత్స్యములకు
గాలాములగు కంటకములతోడ
గరుడపచ్చల చాయఁ బరిహసింపఁగ జాలు
దళమైన బాహ్యపత్రముల తోడ
జీర్ణ కీకస కణ శ్రేణిఁ జిడ్డలు చేసి
యవియ దోమిన యట్టి యన్ను తోడ
బదియాఱు వన్నియ బంగారు సరివచ్చు
సంవర్తికా పలాశముల తోడ
తే. శివుని చిచ్చుఱ కంట వెచ్చిన యనంగు
బూది కెనయైన కమ్మఁ బుప్పొళ్ళ తోడఁ
దావి ఘనమైన కమ్మ గేదంగి పూవు
భూసురున కిచ్చెఁ దగ నొక్క పుష్పలావి 173

వ. ఇచ్చినం జూచి 174

ఉ. క్రొన్నెల రేఖ తోడఁ గెడఁగూడి సుఖింపఁగ భాగ్య మబ్బమిన్
ఖిన్నత నొందుఁ గాని నవకేతకి శూలి వివేక హీనుఁ డై
తన్నుఁ దిరస్కరించుటకు దైన్యము నొంద దదే వివేక సం
పన్నిధి దాని పాలి పెరుమాళ్ళొకఁ డెక్కడ నైన లేఁడొకో 175

గీ. అందుకొని పుష్పలావికిఁ ద్యాగమిచ్చి
బ్రాహ్మణుల కందు నొక్కొక్క పత్ర మొసఁగి
జాణ విప్రుండు సిగఁ దాల్చెఁ జందమామ
కొండనాలిక యగు నొక్క గొమలి ఱేకు 176

వ. అదె విద్వేషి భువన జిగీషా సంరంభ విజృంభమాణ ఝషధ్వజ భుజ పరాక్రమ సముత్సాహ నాటక ప్రస్తావనా ప్రథమ నాందీ శ్లోకంబగు వేశ వాటికా నికటంబు 177

గీ. చందనంబునఁ గలయంపి చల్లినారు
మ్రోకలిడి నారు కాశ్మీర మృగమదమున
వ్రాసినా రిందురజమున రంగవల్లి
కంజములఁ దోరణంబులు గట్టినారు 178

వ. ఇది యెవ్వరి యిల్లొకో, శోభనంబు ముడిపడుచున్నయది యనుచు నాకాశంబు వీక్షించి యచ్చట వారల నేమి యని యడిగిన 179

శా. ద్వీపాంతంబున నుండి వచ్చితివె భూదేవా! "ప్రశాంతం మహా
పాపం" సర్వజగత్ప్రసిద్ధ సుమనో బాణాసనామ్నాయ వి
ద్యోపాధ్యాయి, ప్రతాపరుద్ర ధరణీశోపాత్త గోష్ఠీ ప్రతి
ష్ఠా పారీణ నెఱుంగ వయ్యెదవె మాచల్దేవి వారాంగనన్ 180

వ. చిత్రశాలా ప్రవేశంబు చేయుచున్నయది. పుణ్యాహవచన కాలంబు. మీరునుఁ బచ్చని పెండ్లికూటంబుఁ జూడవచ్చు నది యనిన 181

తే. లెస్సగాక కిరాట! యీ లేమ చరిత
మాడుదురు నాటకంబుగ నవని లోన
దీని జూడంగఁ బోదమా? యీ నెపమున
నరసి చూతము మనకేమి యచట ననుచు 182

వ. ప్రవేశనాటితకంబునఁ జిత్రశాలఁ జొచ్చి పూతిమాష గోత్రుం దచ్చోటం బెండ్లి కూటంబున నిలువునం గైసేసి హంసతూలికా తల్పంబు మీఁదం గూర్చున్న హావ భావ విభ్రమ విలాసనిధి మాచల్దేవిఁ గనుంగొని 183

తే. అంకుశాఘాతరేఖల నందమొందు
గంధగజ కుంభముల తోడఁ గలహ మాడు
క్రొత్తనఖముల తోడి నీ కుచభరమున
కతివ! యభ్యుదయ పరంపరాభివృద్ధి 184

తే. కల్లఁ జెప్పము విను నీకుఁ గల ప్రసిద్ధి
ఢిల్లి సురతాణికిని లేదు పల్లవోష్ఠి
యాదిలక్ష్మికి నీకును భేదమేమి
యుదధి జనియింపకుండుట యొకటి దక్క 185

తే. ఓరుఁగంటి మాచాంబ పయోరుహాక్షి
పంచబాణావతారుని మంచిఁ జూచి
కంకణాలంక్రియా ఝణత్కార మెసఁగ
'నయ్యగారికి జోహరు' లనుచు మ్రొక్కె 186

తే. అగురు ధూపాధివాసి తాభ్యంతరంబు
మగువ! నీ మన్మథ చ్ఛత్ర మండపంబు
సర్వ యోషిదసామాన్య సౌష్ఠవంబు
కాచుఁ గావుత మోర్గంటి కటక విటుల 187

వ. అనుటయు 188

సీ. ఎందుండి వచ్చితి రీరు? కాసల్నాటి
నుండివచ్చితి మే ముత్పలాక్షి
యెవ్వరి వారు మీ రేము సంకృతి పూతి
మాష మాధవుని కుమారవరుఁడ
మీ దివ్య నామకం బేదియో? గోవింద
మంచనశర్మ సమాహ్వాయులము
మీర లిచ్చటిరాఁ గారణం బెయ్యదిర
చేరి మీ బోంట్ల నాశీర్వదింప

తే. నైన విచ్చేసి కూర్చుండ నవధరింపు
వార్చి వచ్చెద మటుపోయి వనరుహాక్షి
యెచ్చటకి వార్వఁ బోయెద రెఱుఁగఁ జెప్పుఁ
డక్కవాడకు మేము బ్రాహ్మణుల మగుట 189

వ. చిత్రావ లోకనంబు చేసి టిట్టిభునకు గోవింద మంచనశర్మ యిట్లనియె 190

సీ. అదె దారువనభూమి, యసమనేత్రుఁడు వాఁడె
సంయమీంద్రుల పుణ్యసతులు వారె
యదె కన్యకారత్న మబ్జాసనుఁడు వాఁడె
యదె రతిక్రీడా విహార శయ్య
వాఁడె వైకుంఠుండు వారె గోపస్త్రీలు
యమునా నదీ సైకతాంత మదియె
యదె యహల్యాదేవి యమరాధిపుఁడు వాఁడె
యదె పర్ణశాలికాభ్యంతరంబు

తే. చందురుఁడు వాఁడె. యదె బృహస్పతి పురంధ్రి
జాలరిది యదె శ్రీపరాశరుఁడు వాఁడె
కుశికజుఁడు వాఁడె యదె యింద్రు కొలువు లేమ
చిత్తజుని శౌర్య మెఱిఁగించెఁ జిత్రశాల 191

ఉ. తియ్యని వింటి జోదు రతి దేవి చనుంగవ నొత్తిగిల్లి యొ
య్యొయ్యన వంక చక్కఁబడ నొత్తెడుఁ జూచితే పుష్పబాణముల్
మయ్యెర వ్రాసెఁ జిత్తరువు మాఁగిలి మాఁగిలి చిత్రకారు డా
దయ్యము గాక! యీవి పస దానము టిట్టిభ వీని కీఁదగున్ 192

వ. అనుచుఁ దద్గృహంబు నిర్గమించి, పూర్వానుభూత యగు గాంధర్వి గృహంబు రోయువాఁడు, కతిపయ మందిరంబులకు నవల సిందువార లతికా కుడుంగం బడియాలంబున నెఱింగి, యనుంగు మొగసాలం జొచ్చిన దాస దాసీ జనంబు ససంభ్రమంబుగా నెదురేఁగి తోడ్కొని పోవం బోయి యభ్యంతర మందిరంబున

మహోత్సవ వ్యాపార పారీణయై యున్న యవ్వారముఖ్యం జేరి యాసనార్ఘ్య పాద్యాది
సముచిత సత్కారంబులం బొంది సుఖాసీనుండై 193

ఉ. గోత్రము వారలెల్లఁగెడఁ గూడిన వారు వ్రతంబొ, దేవతా
యాత్రయొ పండువో మన గృహంబున శోభనమేమి! శోభనం
బత్రిసమాన! నేఁటి యపరాహ్ణ సమాగమవేళఁ బుష్య న
క్షత్రమునందు నీ యనుఁగు గాదిలి కూఁతురు చూచు నద్దమున్ 194

క. ఆ వేళ నీవు బిడ్డకు,
దీవన మంత్రంబు చెప్ప దీర్ఘాయు వగున్
లావణ్యంబు వివేకము
ప్రావీణ్యము వైభవంబు భాగ్యము గలుగున్ 195

తే. ముకుర వీక్షా విధానంబు మొదలలేక
వెలపడంతికిఁ గారాదు విటునిఁ గవయ
యాయజూకున కెట్లు చేయంగవచ్చు
నరణి సంగ్రహ మొనరింప కధ్వరంబు 196

తే. లంజెవారికి శ్రీమహాలక్ష్మి గాదె
దర్పణము విప్రముఖ్య గంధర్వగణము
పుణ్యచారిత్ర దృష్టాంత భూమిగాదె
దర్పణమ్ము వివర్త వాదముల కెల్ల 197

ఉ. ఉన్మద మత్తకోకిల కుహూ కల పంచమ రాగ రాజ సం
పన్మహనీయమైన మధుమాసపుఁ బున్నమనాఁడు బిడ్డకున్
మన్మథ వేధ దీక్ష పదినాళ్ళగు మాత్రము నేతదర్థమై
సన్మతి నుండఁ గావలయుఁ జక్కని వాఁడవ యక్కవాడలోన్ 198

సీ. అదె నీకుమారిత మదనరేఖా కన్య
వదనరేఖా వైభవమునఁ జంద్రు
దొరఁ గూర్చికొన్నది ధూర్తదేవత నిన్నుఁ
దండ్రిఁ బోలిన యట్టి తరళనయన
సాముద్రికాగమ జ్ఞానపారీణులు
కడు భాగ్యసంపద గలది యంద్రు
భాగ్య సంపద కల్మి ప్రస్ఫుటం బయ్యెఁగా
మీర లిందుల వచ్చి మీఱి యుంట

తే. జనకుఁడవు, కర్త వొజ్జవు, సజ్జనుఁడవు
క్రొత్త లంజెలకాముండ వుత్తముఁడవు
తొడల నిడుకొని ముద్దు కూఁతునకు నీవు
మించుటద్దంబు చూపరా మంచిరాజ! 199

సీ. కేలఁ గ్రొమ్మించు టద్దంబు గీలుకొల్పి
మంచి తొడమీఁద నొప్పారె మదనరేఖ
ముద్దు నెమ్మోము లావణ్యమున జయించి
కువలయాప్తునిఁ జెఱ వెట్టుకొన్న కరణి

200

క. దీవించి మంచి కూఁతురు
'శ్రీవర్ధస్వంబు' చెప్పి, చెవి టిట్టిభసె
ట్టీ! వెస నిప్పింపుము సం
భావన నొక వెండి బిడ్డ పసపున కనియెన్ 201

వ. అనంతరంబు గాంధర్వి పూర్వ సంబంధంబున నైన ప్రేమానుబంధంబునఁ గేలు
గేలం గీలించి యిట్లనియె 202

తే. ఎందుఁ బోయితి గోవింద? ముందరట్ల
యెంద ఱతివల వలపించి తెచట నెచట?
తలఁపు పుట్టించెనే నీకు దైవ మిట్లు
పాయసం బారగించిన ప్రాఁత పట్టు 203

తే. దవన పున్నమఁ గాకుళాధ్యక్షుఁడైన
తెనుఁగు రాయఁడు దేవతాధీశ్వరుండు
భువన హితముగ నుత్సవం బవధరింప
నందుఁ బోయితి మీ పోయినట్టి యేఁడు 204

తే. కారవేల్ల మతల్లికా కల్పవల్లి
కడుపు నిండారఁ గాంచిన కొడుకుఁ గుబ్జ
జార చోర మహాధూర్త చక్రవర్తి
దేవవేశ్యా భుజంగుండు తెనుఁగు భర్త 205

ఆ. పసిఁడి కోర వేఁడి పాలారగించినఁ
బుల్లసిలిన యధర పల్లవమున
విప్రకన్య చనవు వెలయించు చున్నాఁడు
విశ్వమునకుఁ గాకుళేశ్వరుండు 206

ఉ. ఈరసమెత్తు వేదములు హ్రీ వహియించుఁ బురాణ సంహితల్
సౌరభహీనమౌ నుపనిషత్తులు లేఁబడు నాగమావళుల్
గారవ ముల్లసిల్ల సిరికాకుళ నాథుఁడు నాగదేవ భ
ట్టారకు నింటఁ బుట్టి ప్రకటంబుగ వేడుక నాదరింపఁగన్ 207

మ. గరుడస్తంభ ప్రతిష్ఠా కలన మొదలుగాఁ గల్పమంత్రోక్త పుష్పా
ధ్వర పర్యంతంబు కృష్ణాతటిని తటమునన్ ద్వాదశ క్రోశ ధాత్రీ
పరివేషాభ్యంతర శ్రీ పరమపదమునం బర్వకాలంబు నందున్
బర నారీ సంగమాదుల్ భగవదనుమతిం బాపముల్ గాక యుండున్ 208

శా. వ్యామగ్రాహ్య నితంబ బింబ కుచ భారాభీల భద్రాకృతుల్
కామాంధల్ వెలనాటి కోడెవిధవల్ కాకొల్లి తిర్నాళ్ళలో
నా మాంధాళల భీమసేనుఁడు హిడింబాధీశ్వరుం డోపునో
యేమో కాని తెమల్పఁ జాల రితరుల్ యెవ్వార లత్యుద్ధతిన్ 209

ఉ. పేర్చిన సందడిం బెదవి పీల్చి, యురంబునఁ జన్నులొత్తి చే
దూర్చి యనంగమందిరము దూ కొని కూరిమి నీరు జల్లునన్
గార్చు కొనంగఁ జేసి యిఱుఁ గౌఁగిట నుప్పర మెత్తి యేటికిం
దార్చి రమింతు రూళుల వితంతువులం దిరునాళ్ళఁ బల్లవుల్ 210

క. ముంజ పదనైన శంబర
భంజను గేహములు గలుఁగు బ్రాహ్మణ విధవా
పుంజము లుండఁగ నూరక
లంజియ లేమిటికిఁ గాకుళపుఁ దిరునాళ్ళన్ 211

సీ. జవరాలిఁ బొడగన్న సన్యాసిపై నేయుఁ
దులసి లేఁ జిగురాకుఁ దూపు మరుఁడు
వేదవిప్రునిఁ గన్న విధవపై ఝళిపించు
దర్భపల్లవహేతి దర్పకుండు
కటకారకుల కన్యఁ గనిన హోళికు మీఁదఁ
బొడుచుఁ బూ మునికోలఁ బుష్పశరుఁడు
నాడింధమునిఁ గన్ననాతిపై నేయును
నలరుఁ జిచ్చుఱ కోల నంగభవుఁడు

తే. బెరసి వెన్నెల గాయంగఁ బేరకమ్మ
పులిన తలముల నాయాయి కొలము లెఱిఁగి
తాల్చు శస్త్రాస్త్రములు జారదంపతులకు
నసమ బాణుండు తిరునాళ్ళ నన్ని నాళ్ళ 212

వ. అని యనంతరంబ యా ముందటం జనుదెంచు వితంతు సమూహముం గని
యాశీర్వదింప వలయునని 213

సీ. చెలఁగి చెలఁగి పొత్తిచీరలు గట్టెడు
మాచకమ్మకు దీర్ఘమాయు రస్తు
సారె సారెకు దేవసదనంబునకు నేఁగు

చెడిపెకు సంకల్పసిద్ధి రస్తు
నిత్యంబు వ్యభిచార నిష్ఠతో నుండెడు
విధవకుఁ బుత్రాభివృద్ధి రస్తు
దళముగాఁ దులసి పేరులు ధరించిన యట్టి
విశ్వస్త కారోగ్య విభవ మస్తు

తే. మిండముండకు సంపత్సమృద్ధి రస్తు
పఱచు తెంపికి నిత్య సౌభాగ్య మస్తు
వదరుఁ గల్కికి నీప్సితావాప్తి రస్తు
బలు వితంతుకు మైథున ప్రాప్తి రస్తు 214

..........గ్రంథపాతము............

వ. అని యట చనునప్పుడు 215

వ. అనిన గాంధర్వి పరదేశ పట్టణంబుల వితంతువుల చేత వక్షః కుట్టనంబు సేవించుకొన మరగి, నీ వెట్టు మమ్ముం దలంతువు పద పద విచ్చేయు మనుచు నీర్ష్యా కుటిలంబగు కటాక్షంబునం జూచిన 216

చ. లవలవఁ జన్నుదోయి గదలన్ దొలుకారు మెఱుంగుఁ దీగలం
గవ కవ నవ్వు డాలు దెలి కన్నుల మించులు చౌకళింపఁగా
నవనవ యౌవనంబు గల నాఁటి భవ త్పురుషాయితోద్ధతుల్
శివ శివ! యెన్ని భంగులను జిత్తములో మఱవంగ వచ్చునే 217

వ. కార్యాంతర వ్యాసంగంబున నార్యవాటికిం బోవుచున్న వాఁడ, మన మదనరేఖా కన్య దర్పణావలోకన ముహూర్తంబు సుముహూర్తం బయ్యెడు బోయి వచ్చెద నని218

తే. వెడలి పశ్చిమదిశ నాల్గు గడియ లంత
ప్రొద్దు గలుగంగ నడు వీథిఁ బోయి పోయి
కేళి సఖుఁడును దా నాలకించి చనియె
నాగసౌరముల మ్రోఁత యన్నాగరికుఁడు 219

క. నాగస్వర సుషిర సర
న్నాగవరా ళ్యాది వివిధ నానా రాగ
ప్రాగల్భ్య ప్రకట ఫణా
భోగములై యాడఁ జొచ్చె భోగీంద్రంబుల్ 220

సీ. కద్రూ మహాదేవి గారాపు సంతతి
మధుకైటభారాతి మదుఁగుఁ బాన్పు
కాలకంఠుని యంఘ్రి గండ పెండారంబు
భానుమంతుని తేరి ప్రగ్రహంబు
నక్షత్రవీథి నెన్నడిమి పెద్ద గ్రహంబు
మూలాలవాలంబు మొదటిదుంప
యాది భైరవదేవు యజ్ఞోపవీతంబు
క్రీడా వరాహంబు తోడి జోడు

తే. యర్క నందను సెలకట్టె యంపకోల
పులుఁగురాయని తత్కాల పుణ్య భిక్ష
కేతకీ పుష్ప వాసనా కృత్రిమాసి
పర్వతేంద్రంబు తరిత్రాడు, పాపతేఁడు 221

వ. ఇ మ్మహానాగంబులు మనకుం గార్యసిద్ధి యొసఁగుం గాక యని చని ముందట. 222

సీ. కడగోరఁ దీర్చిన కస్తూరి గీర్బొట్టు
నెక్క సక్కెంబుగాఁ జుక్క మెఱయ
నడ్డంబు ద్రికటంబునై యురస్ స్థలమున
గంధసార స్థాసకములు మెఱయఁ
జాల నిగ్గులు గుల్కు పాలతెక్కల కుచ్చు
వామకర్ణంబుతో నక్కళింప
బెనచి వెంద్రుకలతోఁ బిరివెట్టి చుట్టిన
ప్రాంత చెంద్రిక వన్నె పాగ యమర

తే. జన్నిదంబుగఁ బెనుబాము సవదరించి
యంఘ్రి కటకంబు ఘల్లు ఘల్లనుచు మొరయ
నాహితుండిక గరళ విద్యాధిరాజు
వచ్చెఁ బాముల మెంగఁడు వదరులాఁడు 223

సీ. పూత్కార పవనంబు పూరించు పుక్కిళ్ళు
ముసిఁడి పండుల తోడ ముద్దుఁ గురియ
సందిటి సంకు పూసల సద్దు కటు తుంబి
నాద స్వరోజ్జృంభణముల నడఁప
నేడు రంధ్రమ్ములు నిరుఁ గేల వ్రేళ్ళను
వివృతి సంవృతి లీల విస్తరింప
నాలాప తాళాంత రాంతరంబుల యందుఁ
గిక్కను శబ్దముల్ చొక్కటముగ
తే. నాగసింధు ప్రభేద నానా వరాట
రాగ గంధర్వ లహరి కారంభణముల
మిహి పదంబుగఁ బాముల మెంగఁడూఁదె
భోగిరాజులు నర్తింప నాగసొరము 224

వ. అట చని, ముందట నొక్క మండపంబున నొక విట భట పటలంబు నెదురుకట్ల
నార్భటింప టిట్టిభుండు విని గోవిందశర్మ నడిగిన 225

సీ. నున్ననై నలుపెక్కి నొసలఁ జేరువ కంతి
కెకువవైచిన శిఖపెకలుచుండఁ
గరసానఁ దిగిచిన కలివె గందపు బొట్టు
తిరి కట్టుకొని మోము తిరిగియుండఁ
దటపెట ధిమికిట ధ్వనులోలిఁ బుట్టింపఁ
జాలు గుమ్మెట చంక వ్రేలుచుండ
నలుకనై మీఁజేత నంటిన యా క్రొత్త
మువ్వలత్తెము సారె ములుగుచుండ

తే. నొసలు గ్రుక్కించు నావుర్న నోరు దెఱచు
గ్రుడ్లు మిడికించు రాగంబు గుమ్మడించు
పాడు గతులకుఁ దను దానె పరఁగి యాడు
నల్ల యాతండు వో తూర్పునాటి గడిఁడు 226

వ. అనుచు నట పోవఁ గంటె కిరాట! రెండు మేష కంఠీరవంబు లా నీరాట రేవున నీరనుముంచి పంచితంబున నస్యంబు సేయుచుఁ బెంచుటం జేసి, ధేనువుల ననుధావనంబు సేయు వత్సంబులుం బోలె వాత్సల్యంబునం దమ యేలికల వెంటఁ గంఠ గ్రైవేయ ఘంటికా టంకారంబులును విషమ విషాణ కోటి ఘటిత కపాలాయసాశ్వత్థ పల్లవ గుళుచ్ఛ రించోళికా ఘణఘణాత్కారంబులు చెలంగ, యుద్ధక్రీడా సన్నద్ధంబులై వచ్చుచున్నయవి. ఈ సజీవ ద్యూతంబు చూతము కాక! యనుచుఁ గౌతూహలంబున నిలిచియున్న యవసరంబున వాహ్యాళి ప్రదేశంబునం బందెగాండ్రు బందెంబు నొడివి తలపెట్టిన 227

చ. ఉభయము భావవీథి జయ మొందిన భంగి భయం బొకింత లే
కభిముఖమయ్యె వెన్వెనుక కై యటకొన్ని పదంబు లేఁగుచున్
రభసముతో దువాళిగొని భ్రగ్గునఁ దాఁకెడుఁ జూడు సెట్టి టి
ట్టిభ థిథిథీ యనంగను గడింది నదభ్రము లీ యురభ్రముల్ 228

క. నిటలమ్ము లవిసి నెత్తురు
సొట సొట వడియంగ సమర శూరోత్తములై
కటుకునను మెండు తగరులు
చటు లాటోపమున రెండు సరిఁ బడఁ బోరెన్ 229

ఆ. వట్టివెదురు మోపు వైచిన చందాన
గుండు గుండు మీఁదఁ గూలినట్లు
కడిఁది మ్రోత మేషకంఠీరవంబులు
తాఁకి తాఁకి డస్సి తట్టువాఱె 230

వ. ఇట్లు తట్టువాఱి, పొట్టేళ్ళు నాస్కందం బుడిగి మంద నిశ్వాసోచ్ఛ్వాసంబులై డిల్లపడి మూర్ఛిల్లిన 231

సీ. హా!హా! నృపాల సింహాసనాధిష్ఠాన
రత్నకంబళ కాభిరామ రోమ
మజ్ఝా ! కృపీట సంభవ మహాదిక్పాల
హేలా విహార వాహ్యాళి వాహ
మాయురే! ప్రవిలంబ మానాండ సంపాత
కుతు కానుధావిత క్రోష్టురాజ
యహహా! శ్రీవీరభద్రావతార మహేశ
నిహత దక్ష కబంధ విహిత వదన
ఆ. భళిరె! మేంత రాజ బాపు! రురభ్రేశ
ఔర! యేడకేంద్ర! యరరె! తగర!
మమ్మ! హుం క్రియాభిమానా దరిద్రాణ!
మేలు మేలు! గొఱ్ఱె మిండగీఁడ 232

వ. మీకు నీ గండంబులు దొలంగుంగాక! యనుచు నట చని ముందట గక్ష విలంబిత తామ్రచూడులగు కోడిపందెగాండ్రఁ గనుగొని యిదియును నొక్క సజీవ ద్యూతంబ, యీ దురోదర క్రీడా విహారంబు నాదరింపవలయుఁ బానుగంటి కలుకోడి తోడఁ బుట్టువులు వోని యీ జెగజెట్టి కోడిపుంజుల యందుఁ బ్రత్యేకంబు 233

తే. పారిజాతపుఁ బూవు నాఁ బరగుఁ జూడు
తామ్రచూడంబు చూడాపథంబు జొత్తు
దర్ప భరమున బ్రహ్మరంధ్రంబు నడుమఁ
జించి వెడలిన క్రోధాగ్ని శిఖయుఁ బోలె 234

వ. టిట్టిభ! యవలోకింపు, నారికేళ బక జాతీయంబులై యీ జగజెట్టి కోడిపుంజులు మెడలు నిక్కించుచు, ఱెక్కలల్లార్చుచుఁ 'గొక్కొకొ్కొ' యని కాల్దువ్వి, క్రొవ్వు మిగిలి, తరళ తారకోద్వృత్త రక్తాంతలోచన మండలంబులై యొండింటిం గదిసి చుఱచుఱఁ జూచి, యేచిన కోపాటోపంబునఁ గుప్పించి యుప్పరం బెగసి చరణాంగులీ కుటిల నఖ శిఖా కోటి కుట్టనంబుల జిరుదొగడు లెగయన్ వక్షస్స్థలంబులు వ్రచ్చి వందరలాడియుం, ద్రోసియు లాసియు, నాసాపుటంబులం బుటబుటన నడునెత్తిం జొత్తిలు నెత్తురు వఱ్ఱంగాఁ గఱచియుఁ గొఱ కొఱం గొఱుకు ముఖంబున గురుకు

గురుకు మనుచు సవ్యాప సవ్యంబుల నోహరిం బక్ష విక్షేపంబులం బడలు పడ నడచియు నొడిచియు, నడికి నడికిఁ దప్పించుకొని, సడిచప్పుడుగాక యుండం గాళ్ళ క్రిందికిం దూరియుం జీరియు, మాటిమాటికి 'ఘాట ఘాట ఘాట' యని కృకాటం బుక్కుఁ దండసంబులు వోని ముక్కులం జెక్కులం జిక్కగా నొక్కి, యిట్టట్టనక బిట్టూని పట్టి, గాలంపుఁ గొంకుల భంగి వంక లగు కొంకి కత్తులం గడుపు లొడిచికొని, చించి చెండాడి, కొండొకసేపు వాలి సుగ్రీవుల విధంబున, విందానువిందుల చందంబున, మురారి చాణూరల ప్రకారంబున, నేకాంగ యుద్ధంబు చేసి, చారణ గంధర్వ గరుడ విద్యాధర శ్లాఘనీయంబుగా నమోఘ పరాక్రమంబు సలిపి, వీరవ్రతం బేపార వాహ్యాళీ మండలంబునం దమకుఁ దార పాయగిలఁ బడి, పోటు గంట్ల రొప్పు రుధిరంబులం దొప్పఁ దోఁగి మూర్ఛాంధకారంబున మునుంగుచున్న యవి 235

సీ. హా! కుమారస్వామి యౌపవాహ్యము లార!
హా! మంత్రదేవతా స్వాములార!
హా! కాలవిజ్ఞాన పాక కోవిదులార!
హా భూత భుక్తి కుంభార్భు లార!
హా! యహల్యాజార యభయ హేతువులార!
హా! బలాత్కార కామాంధులార!
హా! నిరంకుశ మహా హంకార నిధులార!
హా! కామ విజయ కాహళము లార!

తే. హా! ఖగేంద్రంబు లార! కయ్యమున నీల్గి
పోవుచున్నారె దేవతా భువనమునకు
మీరు రంభా తిలోత్తమా మేనకాది
భోగ కార్యార్థమై కోడిపుంజు లార! 236

వ. అని యట పోవుచు నా దక్షిణంబున పైఁడి కుండల మొగసాల తోడిది, మాధవశర్మ కూఁతురు మధుమావతీదేవి మందిరంబు 237

తే. సింహళ ద్వీపమునఁ గాని, సృష్టిలోనఁ
బద్మినీ జాతి లేదను పలుకు కల్ల

తెఱవ మధుమావతీదేవి దేవకన్య
పద్మినీజాతి దోర్గంటి పట్టణమున 238

చ. మలయజగంధియైన మధుమావతి యూర్పుల కమ్మఁదావి చెం
గలువల సౌరభంబునకు గాదిలి చుట్టము, చక్రవాకులం
గలకల నవ్వు దాని చనుకట్టు తదీయ విశాల నేత్రముల్
తొలకరి క్రొమ్మెఱుంగు సయిదోడులు మిండలు గండు మీలకున్ 239

ఉ. టిట్టిభసెట్టిగారు! వినుఁడీ। యొక చొక్కపు జోగి రేయి రో
వట్టిడి దీనితోఁ గలసి, భైరవ తంత్రముఁ దీర్చి మెచ్చి సౌ
ధాట్టమునన్ లిఖించె నఖరాక్షర భంగిఁ దెనుంగుఁ బద్యమున్
బుట్టువు పే రనాగతము భోగము భాగ్యముఁ బ్రస్ఫుటంబుగన్ 240

క. ఈ తలిరుం బోఁడికిఁ గల
భూత భవిద్భావి కాలముల జన్మములున్
జాతులు ప్రస్ఫుటములుగా
నాతఁడు లిఖియించెఁ బద్య మల్లదె కంటే! 241

సీ. అలకాపురంబున నంగారపర్ణుఁడన్
గంధర్వపతి కన్య కమలపాణి
యా దివ్య గంధర్వి కపరావతారంబు
మధుమావ తోర్గంటి మండలమున
నా మధుమావతి దాక్షారామమునఁ
బుట్టు భువన మోహిని చిన్నిపోతి యనఁగ
నప్సరస్ స్త్రీ జాతి యా సాని కూఁతురు
చిరకాలమున సదాశివునిఁ గూడి

తే. పావనంబైన తమిలేటి పరిసరమున
వేఁగి కురువాటికా దేశ విపిన భూమిఁ
గోవిలను పేరి చెంచుల కులమునందుఁ
గడిమి కత్తులయమ్మి నాఁ గలుగఁ గలదు 242

ఆ. కడిమి కత్తులమ్మి నిడువాలుఁ గన్నులు
గండుమీల నడఁచు మిండగీఁడ!
దాని చన్నుదోయి ధారా సురత్రాణ
కటక కుంభి కుంభ కలహకారి 243

వ. ఈ మధుమావతీదేవి చెలియలు మదాలస మా మామ మీసాలప్పయ్యద్వివేదుల కొడుకు శ్రీధరునకు ననుపు లంజెయై యుండు; నా కంజాక్షిం దగిలి యా రంజకుం డిచ్చోటనే యున్న వాఁడని విన్నార మరయుదము గాక! యనుచు మోసాలం జొచ్చి కక్ష్యాంతరమ్ములు గడచి గాజుటోవరి ముందటఁ గట కంబళంబుల మీఁదఁ దమలోఁ జిటపొట వోవుచుం గూడియుం గూడక యున్న యప్పచెలియండ్రను మామ యాత్మజునిం జూచి గోవిందుండు మందస్మితం బునఁ బటు............ 244

(గ్రంథపాతము)

తే. అహి వెట్టితి జొన్నగడ్డాగ్రహార
వృత్తి యేనూఱు రూకల వృత్తమునకు
ననుభవింపుడు నీవు మదాలసయును
నరయ సంసార మింతయు నధ్రువంబు 245

తే. మిన్నకున్నార లిది యేమి మీరు ముగురు
నీఁగకును బోక వెట్టిన యట్టి భంగి
హెచ్చు కుందింత మాత్ర మేదేనిఁ గలదె
మిగులఁ గోపంబు మీకు లేమియును దోఁచె 246

వ. అనిన మధుమావతి గోవింద మంచనశర్మతో నిట్లనియె 247

సీ. ఏమిచెప్పుదుము! మాకీవు తోఁబుట్టుగ
వైననుం జెప్పక యణఁపరాదు
నీదు వియ్యంకుండు నిర్భాగ్యుఁ డీతండ
యీ పోయినట్టి రే యేకతమున
మా మదాలస కేళి మందిరాంతరమున
హంసతూలిక పాన్పునందు నొంటి

నిద్రించి యుండంగ నీవిబంధం బూడ్చి
యటు చేయవలసిన యట్టు చేసె

తే. మధుమదారంభమున మేను మఱచి యపుడు
మోసపోయితి మీ వాఁడు ముట్టఁ దెలియఁ
జెలియలికి నాకు గొడ్డేఱు కలఁక పుట్టె
బ్రాహ్మణుఁడె వీఁడు? విశ్వాసపాతకుండు 248

క. నడురేయి మధు మదంబున
నొడ లెఱుఁగక యున్న నన్ను నోవరి లోనన్
దడవెను గుడిలో నుండియు
గుడిఱాళ్లను దీసె వీఁడు గోళకుఁ డరయన్ 249

వ. పాడిపంతంబు లెఱిఁగిన పెద్దవు నీవు మాభాగ్య కృతంబున విచ్చేసితివి. అజ్ఞాన కృతంబునకుం బ్రాయశ్చిత్తంబు విధింపుమని, మఱియును 250

శా. హాలాపాన మదాతిరేకమునఁ బర్యంకంబుపై నొంటి ని
ద్రాలస్యంబున నుంట దక్క మరి యే యన్యాయమున్ జేయ నే
నేలా పాపము గల్గె? నీ భయము వో నే ముట్టెదన్ శుద్ధికై
వాలాయంబును మీనకేతనుని దివ్య శ్రీపదాంభోజముల్ 251

వ. అనిన, గోవిందుండు మీరు విట జన ధర్మసూక్ష్మం బెఱుంగరు. ఇది యన్యాయంబు గాదు. వేశ్యాజనంబునకు వావివరుస యెక్కడిది. తొల్లి నముచిసూదనునకు ననుపు లంజెయై యూర్వశి యతని కొడుకుఁ గవ్వడిం గామింపదే? రావణుండు నలకూబరుని రంభోరు నంభోరుహాక్షి రంభం గోడలిని సంభోగింపక సాగనిచ్చెనే? వారకాంతను దల్లి, దాసి, యప్ప, చెలియలు, కూఁతురు, దాది యని గణికా గేహంబునం బరిహరించుట విటధర్మంబు గాదు 252

ఆ. జాణతనము గల్గి సరసతయును గల్గి
తెలివి గల్గి మోర తీరు గల్గి
చే యలంతి తనకుఁ జేకూడినప్పుడు
వావి వలదు లంజె వారి యింట 253

వ. అని పలికి సౌముఖ్యంబు సంపాదించి 254

చ. వదినెయు, లంజెయున్, విటుఁడు వైరము లాత్మల నుజ్జగింపఁ డ
భ్యుదయ పరంపరా విభవ భోగము లందుఁడు మేము వోయి వ
చ్చెద మని వారి సత్కృతులు చేకొని, మంచనశర్మ వెళ్ళెఁ ద
త్సదన మపార భాగ్య ధనసంపద కెంతయుఁ జోద్యమందుచున్ 255

చ. కొడుకులు కూఁతులుం గలిగి కూడును బాడియుఁ ద్రవ్వితండమై
విడిముడి లాఁతుగాఁ గలిగి వెండియుఁ బైఁడియు నిండ్ల లోపలన్
దడఁబడఁ దారు బంధువులుఁ దామరతంపరలై సుఖించు వా
రుడుపతిమౌళి మౌళి నొక యుమ్మెత పూవిడు వారు టిట్టిభా 256

వ. అనుచు మధుమావతీ దేవీ భవనంబు వెలువడి కట్టాయితం బైన ఘటశాసి పుంగవుండు, నింగి చెఱంగు మొన వ్రాలిన పతంగ బింబంబుం గనుగొని టిట్టిభ! యదె చూడు! వరుణరాజ వారాంగనా విలాస దర్పణానుకారియై యహర్పతి గ్రుంకం బోయె, నింక మనకు నే వంకం దడయఁ బని లేదు. కుహళీ చషకంబుల నారికేళంపు మధువుం గ్రోలి మత్తిల్లి వీరిదె మందిరోద్యాన వీథులం బల్లవాధరలు పుష్పగంధికానృత్యంబులు పరిభవించెదరు. వారు కొందఱు మందిర ప్రాంగణంబున వారాంగనా జనంబులు విచిత్ర శ్లోకంబు లనేక రాగంబులం గూర్చి లాస్యాంగం బుత్తమంబుగా జూపెదరు. మఱియు నంతరాంతరంబులం బ్రచ్ఛేదన సైంధవ ద్విమూఢక స్థితపాఠ్యాభి మార్గాభినయ భేదంబులు రసభావ భావనామోద మధురంబుగా శాతోదరు లభినయించెదరు.ఇవ్విధంబున వినోదంబు లిన్నియుం జూడం దలంచితి మేని, కామమంజరీ గృహప్రవేశంబునకుం గార్తాంతికుండు పెట్టిన ముహూర్తంబు సరిగడచు. ఇపుడు పుష్య నక్షత్రంబున నాల్గవపాదంబు నడచుచున్న యది. కాలావర్త విషనాడికా స్పర్శనంబు లేక యమృత ద్వంద్వంబు గూడి, యిందు బింబానన నాధరోష్ఠ పల్లవామృత పారణ లాభంబునకుం గారణంబుగాఁ గలిగియున్న యది. ఇవ్వేశ వాటంబు వీథీ విటంకం బతిక్రమించి వేవేగం జనవలయు. ఇదె యాఁటది యొక సురపొన్న క్రీనీడ క్రీడా భరంబునఁ గన్నియలం గూడి కందుక క్రీడ యొనర్చుచున్నయది, దీని నలవోక
వోలె నైనం జూడవలయునని చూడం జని 257

శా. పంచారించిన లేఁత చన్నుల పయిం బ్రాలంబముల్ గ్రాలఁగాఁ
గాంచీ నూపుర కంకణ క్వణనముల్ గర్జింప బాలాజనుల్
కించిన్న్యంచ దుదంచితంబునను సంక్రీడించె దర్పుండు సూ
చంచత్కాంచన కందుక త్రయములన్ సవ్యాప సవ్యంబులన్ 258

వ. అనుచు గతిపయ పదంబు లరుగఁ గట్టెదుర నొక నట్టువుని కోడలు గోడలు నిక్కి చూడఁ బొడగని యమ్మచ్చెకంటి మున్ను తన్నెఱింగినది యగుట టిట్టిభున కెఱింగించి గోవింద మంచనశర్మ యిట్లనియె 259

క. వ్రాలె నరవింద లోచన
పాలిండులు చూడఁ జూడఁ బ్రసవాంత్యమున
న్నేలా యీ మాటల పని?
వ్రాలుట చోద్యంబె చక్రవాకుల కొదముల్ 260

వ. అనుచుం జను నప్పుడు ముందట నొక సైరికునిం గని టిట్టిభునకుం జూపి యిట్లనియె 261

తే. మాఘమాసంబు పులి వలె మలయు చుండఁ
బచ్చడం బమ్మి కొన్నాఁడు పణములకును
ముదిత చన్నులు పొగ లేని ముర్మురములు
చలికి నొఱగోయ కేలుండు సైరికుండు 262

ఉ. దిక్కరి కుంభకూటముల దీకొను చన్నులు కాము తేరిపై
టెక్కపు గండుమీల నునుడాల్నగు కన్నులు క్రొమ్మెఱుంగుతో
నుక్కిన యూరు కాంతియును నొండ్లకుఁ గల్గనె యోరుఁగంటి యం
దక్కలవాడలోని వెలయాండ్రకుఁ దక్కఁ గిరాట టిట్టిభా! 263

వ. అనుచు నట చని వేశవాటంబు వెడలి భైరవాలయ ద్వారంబునఁ బాడి పంతంబునం గూడిన వార విటలోకంబుం గనుంగొని యేమి ధర్మాసనంబుఁ దీర్చెదరొకో యని యడిగిన 264

సీ. మును తన కూఁతు దీముగఁ జూపి రోవట్టు
పరదేశి విటునిచేఁ బణము గొనియు
ననుపు పల్లవుని సన్నకుసన్న రప్పించి
యతని శయ్యకుఁ దార్చి యనిపి పుచ్చి
కైసేసి తన యింటి దాసి నా విప్రున
కాతిథ్య మొనరింప ననుమతించె
తద్ద్విజుం డా తొత్తుఁ బ్రాతః కాలమునఁ
జూచి బెదద వెట్టిన యప్డు బెదరదయ్యె

తే. పిళ్ళకోపంబుతో నిల్లు వెళ్ళి వచ్చి
తలవరుల కీ ప్రసంగమంతయును జెప్ప
వారు రప్పింప వచ్చె నీ వదరు జఱభి
లంజె తల్లియె యిది గుల్లాము గాక 265

వ. అనిన న జ్జఱభి భయంబు నొంది, సభాసదులకు దండ ప్రణామంబు సేసి యా ద్రవిళు నుద్దేశించి 266

శా. నీకుం జేసిన బాస యెట్టిదియొ తుండీర ద్విజ శ్రేష్ఠ!మా
రాకాచంద్ర నిభాస్య కాకతి మహారాజేనిఁ బుత్తెంచి నం
గైకో దెట్టులు నేమి సేయుదును శృంగారంపు లేఁదోఁటలోఁ
బై కొంగెత్తి కుచంబు లొత్తి పరిరంభం బీదు లేఁ గ్రోవికిన్ 267

వ. మమ్ము నూరక రట్టు చేయుట ధర్మంబు గాదనుచున్న యా ధూర్త జఱభిం జూచి య వ్విటలోకబు "ప్రోడ నొక్క నిమిత్తంబున భంగపెట్టు టయుక్తం" బని, నీవు విట ధర్మం బెఱింగిన వాఁడ వానతీవలయు ననిన గోవిందుండు 268

క. కందర్ప శాస్త్ర వేదులు
నిందుకు షాణ్మాసచింత యేలా నెఱపన్
సందేహింపక గొఱిగిం
పం దగు నీ జఱభి జుట్టుపట్టి రయమునన్ 269

తే. ముక్కు సోఁణంబు దాఁకను జెక్కు టొకటి
బోసి నోరుగఁ బండ్లూడఁ బొడుచు టొకటి
గూబ లంటంగఁ జెవి దోయి గోయు టొకటి
లంజెతల్లి యొనర్చు కల్లలకు శిక్ష 270

వ. మాకుం దోచిన ధర్మంబుఁ జెప్పితిమి. యథాపరాధంబుగా నీ యధమ జాతిని దండింపుఁడు, మఱియు నొక్క విన్నపంబు 271

మ. స్మర దివ్యాగమ కోవిదుల్ మదన శిక్షా తంత్ర విద్యావిదుల్
సురతారంభ మహాధ్వర ప్రవణు లిచ్చో నుండు వేశ్యా వరుల్
తిరమై నాకు ననుజ్ఞ యిం డిపుడు (తార్తీయీకమై యొప్పు న)
పురుషార్థంబు నెఱుంగఁ బోయెదఁ బునర్భూ భామినీ వాటికిన్ 272

వ. అనంతరంబ, భాస్వంతుండు వరుణరాజ శుద్ధాంత కాంతా నివాస మాణిక్య దర్పణంబై చరమ గిరి కటక కాననంబు మాటునం జాటు వడియెఁ గాశ్మీర పరాగ చ్ఛటా భాసురంబైన సంధ్యారాగంబు నింగి యింగిలీకంబునం బెట్టె. క్రీడోద్ధూత ధూర్జటి జటా జూట వల్లీ మతల్లికా మల్లికా కోర కాకారంబులై తారకంబులు వియత్తలంబునఁ దళ తళ వెలింగె. విభావరీ పురంధ్రీ కర్ణపూర చాంపేయ కుసుమ సాదృశ్య సౌభాగ్య సంపత్సంపాదన లంపటంబులై భువన ప్రదేశంబులు ప్రకాశించె. నెఱ సంజయు మసమసకని చీకట్లునుం గలసి దిక్సౌధ కూట వాటి నికురంబంబుల వ్రేలవిడిచిన కురువింద పూసల పేరునుం బోలె పొలుపు మిగిలె నప్పుడు గోవిందశర్మ గోధూళి లగ్నంబున నార్యవాటికఁ బ్రవేశించి, కామమంజరీ చౌర్యరతి విహార సంకేత స్థలంబులైన రథ్యాముఖ శివ చత్వర ప్రపామండపంబులు విలోకించుచుఁ గులటా ఫాల తిలకంబులకుం గుంటెన కత్తియలగు కొత్తెమ బోడితలకుం గ్రేఁగంటి చూపు సన్నఁ దన రాక యెఱింగింపుచు నవ్వేళకుం జూడ గూఢ వివిక్తంబునుం బూర్వపరిచితంబునుం బురుష శూన్యంబును, వివాహ కాలోచిత వృత్త స్తన భార వివిధ విలాస విప్రవాస కన్యా సనాథంబును విశ్రామ స్థలంబును నైన యొక్క తమ్మడిసాని మందిరంబున విడిసి తన రాక దేవయాత్రా వ్యాజంబున న ప్పూజరి విధవ చేత నెఱింగింపం బంచి, వీరభద్రేశ్వర స్థానంబు వెనుక బొడ్డనబావి యందుఁ గృత సంధ్యా వందనుండై నిజాంతర్గతంబున 273

ఉ. కంగటి కాలు పుచ్చుకొని ఖంగనఁ గాలు కిరీట కూటమున్
లొంగఁ గొనంగ లేరు రవి నోరుఁ దటాలునఁ దన్నలేరు క
న్నింగల మూని దర్పకుని నేర్చఁగ లేరు లలాట పట్ట కో
త్సంగము చేరునే యహహ! తక్కటి వేల్పులకై మదంజలుల్ 274

వ. అనుచు శివార్చనంబు దీర్చి సుఖాసీనుండై టిట్టిభునితో నిట్లనియె 275

మ. వదనాంభోరుహ పూత్క్రియా పవన నిర్వాణ ప్రదీపంబు
............................................................
............................................................
............................................................ 276

చ. పొదలిన చీకువాల నడు ప్రొద్దున యౌవనగర్వ విక్రియా
మదమున వింజ మాకిడిన మాడ్కిఁ బురంబు జనంబు నిద్దురం
గదిరిన వేళ, నా యెడకుఁ గామిని రా నలవాటు సేఁతకై
........................................నిమీలితాక్షియై 277

ఉ. దట్టపు నీలి చేల గడితంబుగఁ గచ్చ బిగించి, ఠ్రిందుగాఁ
గట్టి కటారి కోల కర కంజమునం ధరియించి, గుబ్బ చ
న్కట్టునఁ దోఁపుటంగి తొడి గ్రక్కున నన్నడు రేయి వచ్చి నా
కట్టెదురం జొహారులనుఁ గాంత భటుం డయి నవ్వుటాలకున్ 278

వ. అనుచుం బెక్కు ప్రకారంబుల నా కాముకుండు పూర్వ వృత్తాంతంబు కట్టనుంగుఁ జెలికాఁడైన కిరాట టిట్టిభసెట్టితో నుబ్బున నుగ్గడింపుచుఁ గామమంజరీ సందర్శనోత్కంఠాతి సంకులం బైన చిత్తంబు మన్మథాయత్తంబై యుండఁ గొండంత యాశతో ధార్మిక ధర్మసతి యెప్పుడు వచ్చునో యని యువ్విళ్ళూరుచుం దృణంబు చలించినం, జీమ చిటుకన్ననుం జెవి వ్రాలం బెట్టి యాలించుచు భామినీ విలోక నోత్సవం బాసన్నం బగుటం జేసి.................................. ............. దీపంబునుఁ బోలెఁ బరితాపంబు వహించుచుండ నంత జంద్రుండు పురందర హరి ద్దరీ కుహర గర్భాంత రాళంబున నుండి కంఠీరవంబునుం బోలె మింటికి లంఘించి మయూఖ నఖరంబులం దిమిర

కుంభి కుంభంబులు వ్రచ్చి వందఱలాడి నభః క్రోడంబున నుడుగణంబులను ముత్తియంబుల వెదఁజల్లె నా వేళ నిండువెన్నెల గాయఁ బ్రాణనాయకుండు వచ్చుటఁ గని విని పరమ హర్షోత్కర్షంబున 279

తే. వీర భద్రేశ్వరార్చనా విధినెపమున..............................................
.......................................................................................... 280

మ. కరపద్మంబునఁ బైఁడి పళ్ళెరమునం గంధాక్షతల్ పచ్చ క
ప్పురమున్ వీడెముఁ గొంచుఁ గ్రొత్త మడుఁగుం బొన్పట్టు నీరంగితో
మురిపెం బొప్పగ వచ్చెఁ జౌర్యరత సంభోగార్థమై కామమం
జరి గోవిందుని యొద్దకున్ శివనమస్కార చ్ఛలం బొప్పఁగన్ 281

క. మోదంబున రాకా చం
ద్రోదయ దేవతయుఁ బోలె నొయ్యనఁ జని, శా
తోదరి గోవిందుని శ్రీ
పాదంబుల కెఱఁగె భక్తి భయ లజ్జల తోన్ 282

ఉ. మచ్చికయున్ బ్రమోదమును మన్ననయున్, నయమున్ విలాసమున్
మెచ్చును, నేర్పడం దనకు మే యిడి మ్రొక్కిన కామమంజరిన్
గ్రుచ్చియుఁ గౌఁగిలించె, సరి గుబ్బ చనుంగవ రెండు క్రేవలన్
బచ్చని వింటి జోదు పయి పైఁ బులకంబులు నారు వోయఁ గన్ 283

వ. అనంతరం బాసనాసీనులైన నగ్గోవిందుండు కామమంజరిం జూచి 284

మ. అరవిందాస్య! తలంచి చూడ నిది యత్యాశ్చర్యమో కాని నీ
సరసాలాపము లాదరించి వినఁగా సంభావనం జూడఁగన్
ఖరపాకం బయి కర్ణరంధ్రముల కంగారంబుగా బిట్టు ని
ష్ఠరముల్ పల్కెడు రాజకీరములు గండుం గోయిలల్ వీణియల్ 285

వ. అని జార దంపతులు పూజరి వారి యింటి ముంగిట వెన్నెల బైటనుండి, టిట్టిభునకుం గట్టాణి ముత్తియంబునుం బోని తమ్మడిసాని కూఁతుం గూర్పు నేర్పు విచారించి సన్నపు టెలుంగునం బూజరిసానిం బిలిచి కనక నిష్కంబుతోడఁ గూడఁ గర్పూరంబు వీడియం బచ్చేడియ చేతి లోనం బెట్టి యాపాద మస్తకంబు వీక్షించి శిరః కంపంబు సేసి 286

సీ. బంగారు తలుపులు పాయంగ ధట్టించి
లావణ్య విత్తమేలా వ్రయించె
లావణ్య విత్త మేలా వ్రయించును గాక
యతిమాత్ర మేలా ప్రయాస పడియె
నతిమాత్ర మాయాస మనుభవించును గాక
విటజనంబుల నేల వెడ్డుకొలిపె
విటజనంబుల కారవేరంబుసేయఁగా
నేల నిర్మింపఁడో యెనయు మగని
తే. సొమ్ము పోక, మహాప్రయాసమ్ము రాక,
ప్రజలబాధ నిరర్థ కారంభణంబు
లెలమి సిద్ధింప నేమిగాఁ దలఁచె నొక్కొ
సరసిజాసనుఁ డీ తలోదరి సృజించి 287

చ. దొరసెము నందుఁ జుట్టుకొని తోరణకట్టె నురో విభాగమున్
నిరుడు పయోజ కోశ రమణీయతఁ దాల్చెను, వర్తమాన వ
త్సరమున నొప్పె హేమ కలశంబుల బాగున ముందటేటికిం
గరినిభయాన చన్నుఁగవ కౌఁగిలి పట్టులు గాక యుండునే 288

గీ. సన్నచూపులఁ బూజరిసానిఁ బిలిచి
పసిఁడి టంకంబు పరిరంభ పణము సేసి
టిట్టిభుని తోడ నేఁడు కూడింపు కూఁతు
నేకశయ్యా సహాయ శ్రీకై రమింప 289

క. కన్నెఱిక ముడుప వేఱే
సొన్నాటంకములు రెండు చుట్టంబులలోఁ
గన్ను మొఱంగెడు నేర్పును
విన్నాణము మాకుఁ గలదు వెఱపేమిటికిన్ 290

వ. అని అనుమతింపం జెప్పి, బొమలమీద వెంద్రుకలు వ్రాలు పూజరిసాని బిడ్డను వెద్దుపెట్టి, టిట్టిభుని చేతికిచ్చి యచ్చ వెన్నెలలం బొరపొచ్చెంబు లేని మచ్చికల.... చంద్రమండలంబు మీఁద దృష్టి నిలిపి, టిట్టిభుండు విన నిట్లనియె 291

సీ. కలశ పాథోరాశి గారాపు నందన
కల్యాణములు మాకుఁ గలుగఁ జేయు
కుసుమ కోదండుని కూరిమి మామ! సౌ
ఖ్యాభ్యుదయంబు మా కాచరింపు
రాకా విభావరీ రమణీ మనోహర!
సంతోషములు మాకు సవదరింపు
శౌరి పట్టపు దేవి కూరిమి సయిదోడ!
యైశ్వర్యములు మాకు నాచరింపు
తే. మనుచు గొజ్జంగి నీరను నర్ఘ్య మిచ్చి
పచ్చకప్పుర మందంద బడసి వైచి
మ్రొక్కి రనురాగ సంపద మూరిఁ బోవ
జార జాయాపతులు నిండు చందురునకు 292

క. నటులది దోరసముద్రము
విటులది యోర్గల్లు, కవిది వినుకొండ మహా
పుట భేదన మీ త్రితయము
నిటఁ గూర్చెను బ్రహ్మ రసికులెల్లను మెచ్చన్ 294

చ. ముదమున ముల్కినాటిపుర మోహన శైల సువర్ణ కందరా
సదనుఁడు కాలభైరవుఁడు శంభుని పట్టి సమగ్ర వైభవా
భ్యుదయ పరంపరా విభవముల్ గృపసేయుఁ గవీంద్ర కాంక్షిత
త్రిదశ మహీరుహంబునకుఁ దిప్పయ వల్లభరాయ మంత్రికిన్ 295

వ. అని యందఱును యథాసుఖంబుగ నిజ స్థానంబుల కరిగి సుఖియించు చుండిరి. 296

**ఇది శ్రీమన్మహామంత్రిశేఖర వినుకొండ తిప్పయామాత్య నందన చందమాంబా గర్భ పుణ్యోదయ సుకవిజన విధేయ వల్లభరాయ ప్రణీతంబైన క్రీడాభిరామంబను వీథి నాటకంబున సర్వంబు నేకాశ్వాసము.**

శ్రీశ్రీశ్రీశ్రీ

# పదాలు, పదబంధాలు: అర్థాలు, వివరణలు

## (ముందుగల సంఖ్యలు పద్య గద్యాలను సూచిస్తాయి)

1.దశ రూపకాలు : పదివిధాలైన రూపకాలు. రూపక మంటే దృశ్యకావ్యం. అంటే ప్రదర్శన యోగ్యమైనది. కావ్యాలు రెండు విధాలు. (a) శ్రవ్యకావ్యాలు (b) దృశ్య కావ్యాలు.

a.శ్రవ్యకావ్యం: వినదగినది అని అర్థం. పఠింపదగినది కూడా.

b.దృశ్యకావ్యం : ప్రదర్శన యోగ్యమైనది. చదువుకోవచ్చుకూడా. కాని చదివి వినిపిస్తే, ఆకళింపు చేసుకోవటం కొంత ఇబ్బంది. ప్రదర్శింపగా చూడటం మేలు. వీటినే రూపకాలంటారు. ఇవి పదివిధాలు. 1.నాటకం 2.ప్రకరణం 3.భాణము 4.ప్రహసనం 5.డిమం 6.వ్యాయోగం 7.సమవాకారం 8. వీథి 9. అంకం 10. ఈహామృగం. దేని లక్షణాలు దానికున్నాయి. ఈ క్రీడాభిరామం వీథి రూపక భేదానికి చెందినది. ప్రధానంగా దీని ఇతి వృత్తం ప్రేమ (కాముక వ్యాపారం) కు చెందినది. ఒక రోజులో జరిగే కార్యకలాపాలకు దీని విస్తృతి పరిమితం. ఇందులో ఒకరు లేక ఇద్దరు మాత్రమే ప్రధాన పాత్రలు.

2. త్రైశంకవము : త్రిశంకుమహారాజ సంబంధమైనది. విశ్వామిత్రుడు ఈయన కొరకు ఆకాశవీధిలో స్వర్గాన్ని నిర్మించాడని పురాణ కథనం. అదే త్రిశంకుస్వర్గం.

మాలిని : ఆ పేరుగల నది.

సైకతములు : ఇసుక తిన్నెలు.

ఆమ్నాయమాత : గాయత్రి ఇలా సంభావింపబడింది.

దాశరథి : దశరథుని కుమారుడు శ్రీరామచంద్రుడు.

కాలకంధర కోదండ ఖండనుడు : శివుని విల్లును విరిచిన శ్రీరామచంద్రుడు.

గాధి సుతుడు : గాధి కుమారుడైన విశ్వామిత్రుడు.

3. ద్యావాపృథ్వ్యంతరాళాంతరములు : భూమ్యాకాశాల మధ్య ప్రదేశాలు.

4. ప్రాలంబనైపథ్యము : అలంకారమగు కంఠహారము.

అంభోజ భూ భామారత్నము : బ్రహ్మ భార్య సరస్వతీదేవి.

5. అభ్యర్ణుడు : శ్రేష్ఠుడు, హితుడు.

దాన ఖేచరుడు : జీమూత వాహనుడు.

శంకర జటా వాటీ తటము: శివుని జటా జూటం లోని గంగానది.

| | | |
|---|---|---|
| | తరంగ రింఖణము | : అలల సవ్వడి. |
| 6. | వాచస్పతి | : బృహస్పతి. |
| 9. | అద్రిరాజ నందన | : హిమవత్పర్వత రాజపుత్రిక పార్వతి. |
| 10. | రోహిణీ వల్లభుడు | : చంద్రుడు |
| 11. | మందారము | : కల్పవృక్షము |
| | తారాచలము | : కైలాసము. |
| | భావసంభవుడు | : మన్మథుడు. |
| | భద్రుడు | : విష్ణువు 12 మంది కుమారుల్లో ఒకడు; అందగాడు. ఈ పదంతో శివుడు, శ్రీకృష్ణులు కూడా సంభావింపబడ్డారు. |
| 12. | దేవేంద్రసూనుడు | : ఇంద్రుని కుమారుడు జయంతుడు. |
| | సూర్యతనయుడు | : కర్ణుడు. |
| | భార్గవుడు | : శుక్రుడు. |
| | గార్గ్యుడు | : గర్గమహర్షి కుమారుడు; ఋషి. |
| | గీష్పతి | : బృహస్పతి. |
| | గంగాత్మజుడు | : గంగకుమారుడు భీష్ముడు. |
| 13. | సురధుని | : ఆకాశగంగ |
| | పుష్పభల్లావతారుడు | : మన్మథుడు |
| | పన్నగాలంకారుడు | : వినాయకుడు, |
| | గంధకి | : సువాసన గల ఒక పుష్పము |
| | గంధసారము | : చందనము. |
| 14. | కనకాద్రి | : మేరుపర్వతము, |
| | తారా హిమార్కుడు | : చంద్రుడు. |
| | రూపరతీంద్రుడు | : మన్మథుడు. |
| 15. | ఉద్వాహము | : వివాహము. |
| | హరిణాంకుడు | : చంద్రుడు. |
| 16. | అయుగ నయనుడు | : శివుడు. |
| | పుండరీ కేక్షణుడు | : విష్ణువు |
| | సీమాదంతావళములు | : దిగ్గజాలు. |
| 17. | రారాజు | : దుర్యోధనుడు. |
| | రైరాజు | : కుబేరుడు |

మారుడు : మన్మథుడు

సనత్కుమారుడు : ఆ పేరుగల అధ్యాత్మ విద్యావేత్త.

18. దంభోళి : వజ్రాయుధము

తపనీయాచలము : మేరు పర్వతము

19. అటవీ సూకరము : ఆదివరాహము సూచితము

ఫణి : ఆదిశేషుడు సూచితము.

కొండ : మంథరాద్రి సూచింపబడినది.

దిశాతట వేదండము: దిగ్గజము.

కూట కమఠాధ్యక్షుడు: ఆదివరాహము.

నిఖిల క్ష్మామండల చక్రవాళము : సమస్త భూమండలము.

20. గంధవతీ ప్రతీర పురఘస్మరుడు: శివుడు, త్రిపురారి.

పుష్పంధయము : తుమ్మెద.

శ్రుత పర్వతము : వినుకొండ

23. అహరవధి సమయ నృత్యత్తుహినాంశుధరుడు : సంధ్యానటుడైన చంద్రశేఖరుడు.

అభ్రధునీ లహరి : ఆకాశ గంగా ప్రవాహము.

24. హాటక గర్భవధూటి : బ్రహ్మాయిల్లాలు సరస్వతీదేవి.

వీటి : విడెము, తాంబూలము.

విస్ఫుమర : వ్యాపించు, విస్తరించు.

25. హల్లీసక నటనోద్భట వల్లవ

హరికృష్ణ కంఠవనమాల్య మళద్గల్లత్ సురభులు : గోపికలు.

హల్లీసకము : నృత్యభేదము. వివరణ వేరుగా ఇవ్వబడింది.

27. భిల్లావతారుడు : శివుడు.

మధుభిద్భల్లుడు : మధుసూదనుడైన శ్రీమహావిష్ణువు.

29. ధారాధరుడు : మేఘుడు.

తపనజుడు : సూర్యపుత్రుడు, కర్ణుడు.

రాజు : చంద్రుడు

ధారా నగరాధిపుడు : భోజరాజు.

ధారాధరవాహుడు : జీమూతవాహనుడు.

30. ఈవి : త్యాగము, దానము.

నిర్జర పరివృఢ మణి: చింతామణి.

ధనదుడు : కుబేరుడు.
జలదుడు : మేఘుడు.
ఖచరుడు : సూర్యుడు.
నిశాకరుడు : చంద్రుడు
సురతరువు : కల్పవృక్షము.
సురధేనువు : కామధేనువు
వారుణి : మద్యభేదము, కల్లు.
మందారవారుణీ మద ఘూర్ణితాత్ముడు : బలరాముడు.
వెడదకన్నుల చిన్ని వడువు: వామనుడు.
డమరు ఖట్వాంగ దండ కపాల పాణి : శివుడు. ఆయా ఆయుధాలు ధరించిన వాడు అని.
ధూర్త బాలక చక్రవర్తి : బుద్ధుడు.
కుర్కుర పరివార కోటి సేవితుడు : దత్తా త్రేయుడు, కుక్కల సమూహంచే పరివేష్టింప బడు వాడు అని.
వెలదికోఱల మోము వేల్పు: తెల్లని కోరల ముఖంగల దైవం. ఆదివరాహం.
విశ్వవిశ్వంబుపాలించు విభుడు : శ్రీమహావిష్ణువు.
పార్వతీదేవి గారాపు పట్టి: విఘ్నేశ్వరుడు.
39. షట్చరణము : ఆరుకాళ్ళుగలది. భ్రమరము. తుమ్మెద.
మధువ్రతము : తేనెకై అన్వేషించునది, భ్రమించునది, తుమ్మెద.
ప్రాబడిపోవు : పాతబడిపోవు : మాంద్యము వహించు.
40. మంచిరాజు : మంచివాడని. ప్రస్తుతమున మంచనశర్మ అని.
41. ఏకశిలానగరము : ఓరుగల్లు, వరంగల్లు
పునర్భువు : ఇక్కడ వేశ్య, అని నైంఘంటికార్థము. నిజానికి ద్వితీయ వివాహం చేసుకున్న కన్యా వితంతువు.
42. మడుగుదోవతి : ఉతికిన కట్టుపంచె.
గొజ్జంగి పూనీరు : పన్నీరు.
గంగమట్టి : విభూది.
జన్నిదము : జందెము.
42. ఒసపరి : అందగాడు, రూపసి, సొగసుకాడు.
అందంలో మన్మథునికి సాటిరాగల వానిని కవులు ఇలా చెప్పటం పరిపాటి.

నిజానికి ఒసపరి ఏకపదం కాదు. ఒస, పరి అనే రెండు పదాల కలయికతో ఏర్పడిన సమాసపదం. ఈ రెండు పదాలకు ప్రస్తుత సందర్భానికి సరిపోలే అర్థాలు మన నిఘంటువుల్లో చోటు చేసుకోలేదు. 'ఒసె' అనే కన్నడ పదానికి అర్థం, to be delighted, or joyful, to be suitable అని అర్థాలు. కేవల ఒస శబ్దానికి మూలమైన 'హొస' పదానికి newness, freshness అని అర్థాలు. హొసబిగ అంటే wonderful man అని అర్థం. అంటే ఒక విధంగా నీటుగాడు అని చెప్పవచ్చును. హొసదం శబ్దానికి అభినవ అని అర్థం.

ఇక 'పరి' శబ్దాన్ని నన్నయగారు పరికాడు అనే విధంగా ప్రయోగించారు. ఆ పదానికి అర్థం, ఆడఏనుగుల గుంపుకు అధినాయకుడు అని. అంటే మొనగాడు, మేటి అని అర్థం. కనుక ఒసపరి అనేది నీటుగాడు, సొగసరి అనే భావనల్లో కవులు సంయోజించారని భావించాలి. అయితే ఒసపు అరి అని ఆచార్య రామచంద్రగారు.

43. అంధ్రనగరము : ఓరుగల్లు,

44. ఉపద్రవము : అకస్మాత్తుగా, ఒక్కసారిగా వచ్చిపడే వరద. దీనివలన కష్ట నష్టాలు కలుగుతాయి గనుక, ఉపద్రవశబ్దానికి కష్టము, ఆపద అనే అర్థాలు కుదురుకున్నాయి.

45. దువాళిచేయు : విజృంభించు; బాధించు, అసౌకర్యానికి గురిచేయు.

46. కుమ్ములు : నివురు గప్పిన పొయ్యి లోని నిప్పు.

గుత్తపు సుగ్గడితంపుదోపురెంటము : చిక్కగా, జంట నేతతో నేసిన ఎఱ్ఱని దుప్పటి.

నఖంపచము : గోరువెచ్చని, నులివెచ్చని.

తుషారము : మంచు.

47. స్థూల ద్వి త్రి పటావ కుంఠనము : లావైనది, ముతకైనది, రెండుమూడు పొరలు కల బొంత

ప్రాలేయము : మంచు.

50. బలసూదను దిక్కు : ఇంద్రుని దిక్కు, తూర్పు.

కోటడు : గుడ్లగూబ.

51. మాఁగిలి మాఁగిలి : ఆగి ఆగి, ఉండుండి

షడ్జమం : వివరణ మరొకచోట ఇవ్వబడింది.

52. ఏట్రింత : భరద్వాజపక్షి; కబోది.

కొంకనక్క : గుంటనక్క

వలతీరు : కుడివైపు.

54. ధర్మదార : యుద్ధ విరమణకు సంకేతంగా ఊదే బాకా ధ్వని.

56. కడి : అన్నపుముద్ద (ప్రస్తుతంలో). పో.చూ. పేడకడి.

మాడ : ఒక ద్రవ్య ప్రమాణము. నాణెము

తేపాదు : ఉదయము.

పిచ్ఛిలము : పూసకట్టిన పేరు నెయ్యి.

57. గోత్రస్ఖలనము : ఒక దానితో వున్న వేళ, పూర్వ పరిచిత అయిన మరొక ప్రియురాలి సంగతి ప్రస్తావించుట. అలాగే భర్తతో ఉన్నపుడు ప్రియుని స్మరించటం కూడా

59. తపర్తు సమయము : వేసవి కాలము.

లాంగలీ కుసుమము: తరిగొబ్బపుష్పము. నీరుపిప్పలి అని కూడా

పిశంగిత : కపిలగోవన్నె

ప్రావృట్కాలము : వానకాలము.

60. ఝంఝ : గాలివాన; విసిరి విసిరి కొట్టేగాలి, పెనుగాలి.

62. దాసనపు పువ్వు : మంకెన పూవు?

తృణాలయము : పూరిల్లు

పట్టెకంకటి : పట్టె మంచము.

ఎక్కటి : ఒంటరిగా

63. భానుబింబము : సూర్యుడు.

పదియార్వన్నెపసిండి : 16 కారట్ల బంగారపు చాయ. రాకాసుధాకరుని వర్ణము. 16 కళలు గల పూర్ణ చంద్రుని రాకాసుధాకరుడు అంటారు. ఆ పున్నమి రాకా పున్నమి. మనకు కనుపించే పున్నమి చంద్రుడు 15 కళలు గలవాడు మాత్రమే. దీనిని అనుమతి పున్నమి అంటారు. రాకా పున్నమి మొసపొటేమియాలో కనుపిస్తుంది. 16వ కళను శివుడు జటాజూటంలో ధరించాడు కనుక మన పున్నమిలో 15 కళలే వుంటాయని విశ్వాసం.

64. ఈరెండ : లేయెండ.

ఆశ్లేషము : గాఢాలింగనము.

65. గోధూళిలగ్నము (వేళ) : ఆవులు మేతకు వెళ్ళే ఉదయకాలం. అలాగే తిరిగి వచ్చే సాయం సమయం.

67. కటకారులు : మేదర్లు.

68. తాళపలాశ తాటంకము : తాటియాకుతో చేయబడిన కర్ణాభరణములని చెప్పడం జరుగుతోంది. కాని ఒక నిర్ణీతమైన బరువు, ఆకారంగల కర్ణాభరణములని నా

భావన. బహుశా తాటిమొవ్వ ఆకారం గల కర్ణాభరణం కావచ్చు.

తంగేటి జున్ను : తంగేడు చెట్టుకు పట్టిన తేనెపట్టులోని తేనె. ఇది ప్రశస్తమైందని భావన. తంగేడునే పలాశవృక్ష మంటారు. శిరీష వృక్షమని మరోపేరు. దీనిని నాకు చూపి చెప్పిన వారు ఆచార్య ఎన్.జి.రంగా. ఒకప్పుడు (1971) వారు, నేను, కొణిజేటి రోశయ్యగారు అనకాపల్లి నుండి నర్సీపట్నం వెళుతుండగా జరిగిన ఘటన ఇది. తంగేడులో చాలా భేదాలున్నాయి. ఇది కొండ తంగేడు.

వేణుకా కాష్ఠపీఠము : వెదురుతో చేసిన పీట

కాముడు : మన్మథుడు.

69. ఆరకూటము : ఇత్తడి.

పల్లవతస్కరుడు : వృత్తిరీత్యా దొంగ అయిన విటుడు.

తారము : ద్రవ్యపరమైన నాణెం.

వల్లువ : డబ్బుదాచుకొను సంచె, జాలె.

పటీ పల్లవ కోణము : చీర కొంగు.

73. గండాభోగము : చెక్కిలిభాగము.

పిసాళించు : వ్యాపించు

ఇక్షు కోదండుడు : చెరకువింటివాడు, మన్మథుడు,

75. పటితాళించు : కనురెప్పలల్లార్చు.

76. హట్టమార్గము : అంగడి వీధి.

78. ఘోషించుట : ప్రకటించుట. అమ్మేటప్పుడు వేసే కేకలు.

79. కిరాటకులము : వైశ్యకులము

అసమశరాలయము : మరునిల్లు, స్త్రీ జననేంద్రియము.

సమీరణము : గాలి

80. దైత్యారి : విష్ణువు

మునుమిట్ట నుదురు : ముందుకు పొడుచుకు వచ్చిన నుదురు

సజ్జికపు చాయ : ప్రకాశవంతమైన కాంతి.

పంచబాణ మందిరము : మరునిల్లు

81. నిర్యాసము : జిగురుగా వుండేది, బంక.

కామ నిలయము : మరునిల్లు.

పాటలగంధులు : తరుణులు. కలిగొట్టు పూవాసన గల దేహముగల వారు. లేదా తాంబూలపు సువాసన (వారినుండి) వస్తున్న స్త్రీలు.

హాలికవాటి : సేద్యగాండ్రు వుండు వీధి.

కట్టెఱ్ఱ తొగరుం గఱ్ఱల యెఱ్ఱ ఒల్లియ : మంచి ఎరుపుచారలు గల ఎఱ్ఱని వల్లెవాటు, పమిట

చాంపేయ కుసుమము : సంపెంగ పూవు

కుర్కురాసనము : కుక్కకూర్చున్నట్లు, గొంతుకు కూర్చున్న విధము.

82. కందుక కేళి : బంతి ఆట; ఇక్కడ ఒక నృత్త భేదము.

పురుషాయితము : ఉపరతి. పురుషపద్ధతిలో స్త్రీ పురుషుని రమించుట

గోమయ పిండములు : పిడకలు.

84. పొలపము : విలాసము; విలాస చేష్ట.

కాపుటిల్లాండ్రు : కర్షక గృహిణులు.

85. కృకాటిక : పెడతల

86. కుసుమం బెట్టిన చీం : ఎరుపురంగు అద్దకపు చీర అని చెపుతారు. కాని కుసుమ అనేది ఒక దినుసు నూనెగింజ. దాని పూవులు పచ్చని పసిమి వర్ణంలో వుంటాయి. అరకులోయలో పండిస్తారు. కుసుమ వడ్లు కూడా పసుపుమించిన తెలుపు వర్ణంలో వుంటాయి.

క్రొవ్వారు : కొవ్వుపట్టిన, బలిసిన, పెద్దదైన,

అవటూదేశము : ముచ్చిలి గుంట భాగము.

వసివాళ్వాడు : ససిచెడు; అలసటకు గురియగు, వాడిపోవు.

88. కుసుమసాయక తంత్రము: రతిక్రీడ

90. పంచారించు : విస్తరించు, బాగా వ్యాపించు.

ఆస్ఫాలించు : చరచు, తట్టు

లేతబొమ్మంచు కెం జిగురాకుమోవి : లేత ఎరుపురంగు గల, నునులేత ఆకులను పోలిన అధరములు గలనోరు. పెదవులు

ణిసి ధాత్వర్థము : ణిసి ధాత్వర్థము అనగా ముద్దు,ముద్దు పెట్టుకొను.

పంచాస్త్రోపనిషత్తు : మన్మథవేదము.

కాంచీదామ పదము: మొలనూలుకు దిగువనుండు స్త్రీ శరీరభాగము, మొల.

92. పిసాళమాడు : ఎకసెక్కముగా మాట్లాడు, పరియాచకమాడు.

శాటీ హాటక నిష్కములు: కొంగున కట్టుకున్న బంగారు నాణేలు.

నిష్కము : ఒక నాణెము.

టాటాలు గుణించుట: నిశ్చయములేకుండా సంధిగ్ధతలో మాట్లాడుట,

బ్రాహ్మణుల మాండలికము. వచ్చాట్ట, వెళ్ళాట్ట అనే పద్ధతిలో మాట్లాడుట.

93. పన్నిదము : పందెము.

95. సవరగా : అందంగా

జీరువాఱు : వ్యాపించు;తొలగు

దిచ్చరించు : వెలికివచ్చు, బయటపడు, కనుపించు.

97. ఒత్తుకాండ్రు : వత్తాసుపలుకువారు. ప్రోత్సహించువారు.

98. కౌపీనము : గోచి.

99. నెమకు : అన్వేషించు, వెదకు,

ముగుదలు : అమాయకులు, ముగ్ధలు.

పశ్యతోహరుడు : చూస్తుండగానే కాజేయువాడు. కంట్లో కనుమాయ చేయువాడు.

100. శతానందగేహిని : సరస్వతీదేవి

101. విజ్జోడుపడు : విడి వడు.

మొరవంక కడియములు అరవంకి కడియాలవంటివే. వాటినే గ్రహణపు మొర్రి వలె వంకర తిప్పడం వలన మొరవంక కడియాలంటారు.

జంగాళముగా : నిడుపుగా

విచ్చుటాకుల దుద్దుకమ్మలు : దుద్దునుండి, విచ్చుకున్న ఆకులవలె దళములుగల కర్ణాభరణాలు.

ఓరఁగ్రంత : క్రంతవార, సందు మొగదలల్లో

పంచమశ్రుతి : వివరణ వేరుగా ఇవ్వబడింది.

102. జళుకు చూపులు : తళుకు చూవులు. కాంతినిండిన బెదరు కన్నుల చూపులు.

చిలుకల కొలికి : నాసామూలాన్ని అంటివున్న కనుకొలుకులు చిలుకలను తలపించు అందమైన కనుకొలుకులు గల స్త్రీ.

తెలికిజోటి : నువ్వులనూనె ఆడి అమ్మెడి స్త్రీ, గానుగాడెడి స్త్రీ

103. ప్రతోదము : ములుకోల, చిన్నకర్ర.

సంపదచేడియ : లక్ష్మిదేవి.

104. మదాలస : మద్యపు మత్తు వలన కలిగిన అలసత్వము. కాగా మదాలస ఒక నృత్త (భౌమదేశీచారులు) భేదము.

104. గణిక : వేశ్య

105. దాత్యూహము : వానకోయిల

106. ఎగడిగ్గ : పైకి కిందికి

సౌచికపల్లవుడు : కుట్టుపనివాడైన (దర్జీ) విటుడు.

కంచెల : రవిక

వెలచేడియ : వేశ్య.

విషయాభిలాషి : రమించు కోర్కెగలవాడు.

108. వయస్య : నెచ్చెలి.

ఈరు : పేనుగ్రుడ్డు.

110. పరిపాటీ ఖర్వఖర్జూపరతి పురుషాయితము : శరీరాన్ని కుదించి ముడిచి స్త్రీ రమించు పద్ధతి.

హరిద్ర : పసుపు.

కాచభూషలు : గాజులు

112. సంకులము : సమ్మర్దము, ఒత్తిడి

వంకదార : వంపుతిరిగిన త్రోవ.

ఓసరిలు : ఒదిగి ఒదిగి తప్పుకొను,

114. త్రసరేణువు : ధూళి, దూగర.

క్రంత త్రోవ : సందు త్రోవ, గొంది.

అక్కలవాడ : పూటకూటిండ్లు వుండు వాడ; వంటలక్కలుండు వాడ.

115. ఆలువరి : కోటకొమ్ము.

117. ఆలీఢము : నిలుచుట యందలి విన్యాసము. ఒక కాలు ముందుకు అంగవేసి కొంతవంచి నిలుచుండుట. ఆలీఢము ఒక నృత్త భేదం కూడా. అయితే ఇక్కడ అదికాదు. కేవల విన్యాసం మాత్రమే.

కుంతము : పలనాటి వీరుల ఆయుధవిశేషము. శివుని త్రిశూలానికి మూడు మొనలుండగా, కుంతానికి రెండు మొనలుంటాయి. ఒకటే వుంటే బరిసె.

ఆస్ఫోటించు : చప్పుడుతో పాదాన్ని భూమికి తాకించుట, తన్నుట.

118. కలను : యుద్ధభూమి. రణరంగము.

కలని పోతులయ్య : మొదలు బ్రహ్మనాయుడు శివపురి నుండి తెచ్చి కొంతకాలము త్రిపురాంతకంలో వుంచి, యుద్ధసమయంలో కార్యమపూడిలో పాతిన భూతరాట్కంబము.

120. పిండి గందము : ముద్దపసుపు. పచ్చి పసుపు దుంపల ముద్ద పసుపు

121. పల్లేఱు : కృష్ణానది (పలనాడులో కృష్ణకు గల స్థానిక వ్యవహారం).

122. నిప్పులయేఱు : సహగమనము చేసే అగ్నిగుండము

పీలసాని : పేరిందేవి. అలరాజు భార్య; నలగామరాజు కుమార్తె.

గొల్ల సవతి తల్లుల బిడ్డలవని పతులు : అనుగురాజుకు ముగ్గురు భార్యలు. వారివలన జన్మించిన కుమారులు. అనుగురాజు యాదవరాజు.

జనపపెద్దలు : జానపద వృద్ధులు.

123. శ్రీగిరి లింగము : సిరిగిరిపాడు లోని శివలింగము,

ఉత్తర : ఇక్కడ ఉత్తర కార్తె

125. త్రిక్కటి : మూడు పలకల శిఖరము తీర్చిన పోతురాజు స్తంభము

126. నింబపల్లవములు : వేపచివుళ్ళు.

ఏకవీరాదేవి : మూకాసురుని ఒంటరిగా చంపిన కారణంగా పార్వతి అపరావతారమైన దుర్గాదేవికి ఈ పేరు.

127. ఇందిరావరు కన్నతల్లి : లక్ష్మీదేవి భర్తయైన శ్రీమహావిష్ణువు కన్నతల్లి, అదితి.

ఫణిరాజమండనుడు : సర్పాలంకార భూషితుడు విఘ్నేశ్వరుడు.

సోమసూర్యానల నేత్రుడు : చంద్రుడు, సూర్యుడు, అగ్నులను నేత్రములుగా గల వాడు. శివుడు.

జగదంబిక : పార్వతి, దుర్గ.

జమదగ్ని గారాపు సతి : రేణుకాదేవి.

గిరిరాజ నందన : పార్వతి.

128. అఱుత : మెడ, కంఠము

129. త్రుళ్లాడు : త్రుళ్లి ఆడు : తూలిపోవునట్లాడు, రెట్టించిన ఉత్సాహముతో ఆడు

ఓలలాడు : స్నానమాడు

నాచి : శ్రేష్ఠురాలు, నాంచారు, నాచ్చియార్ (తమిళము)

130. జవనిక : తంత్రీవాద్య విశేషము

వొటారించు : వాద్యమును వాయించు, తట్టు, చరచు, (to cause to beat)

బిత్తరిల్లు : విస్తరించు, పెద్దదిచేయు, వెడల్పుచేయు to extend, to spread

నెఱవాది : నేర్పరి

131. జనంగమ ప్రమద : మాలెత

చెలగం బాడు : అతిశయించి పాడు.

వలరాజు : మన్మథుడు.

133. వ్రీళ (వ్రీడ) : సిగ్గు

కటీరమండలము : మొల

134. తొగరుపుట్టము : ఎరుపు చీర

చౌకము : చదరము.

ఓలగందము : పిండిగందము

136. బోనము : భోజనము (వరి)అన్నము

మసిబొట్టు బోనాన నసలు కొల్పిన కన్ను : మద్దెల మధ్యభాగమునందుండు నల్లని భాగము (కరణి). దీనిని మెదిపిన అన్నంతో పదనుచేయడం వలన మంచిధ్వని వస్తుంది.

కొడుపు : డోలు మీటే చిన్న కర్రపుల్ల.

136. జీవగట్టి : డోలుకు రెండువైపులా చర్మాన్ని పట్టివుంచే కర్రచట్రము.

137. నెఱిక తూలు : చెరగు తొలగు.

ఓలిన్ : వరుసగా

తొంగలించు : మెరయు, ప్రకాశించు, తళుక్కుమను.

139. ప్రతిబంధనోదనార్థము : అడ్డంకులను తొలగించుకొనుటకు

పరీక్షారాధనము : ముడుపు చెల్లించుకొనుటకు చేయుపూజ.

140. మంద్ర, మధ్య, తార మానత్రయి : వివరణ వేరుగా ఇవ్వబడింది.

142. చంద్రమల్లెలు : చంద్రనిప్పులు.

ఉట్టిచేరులు : ఉట్ల త్రాళ్ళు.

ఉడువీథి : ఆకాశము.

143. గొరగపడుచు : మాలెత:

144. రసనాప్రవాళము : నాలుకకొస

145. ఆదిత్యవారము : ఆదివారము.

148. శీధుపానము : మద్యపానము

ఆసాదులు : మాదిగవారు.

149. కొమరసామయ్య : కుమారస్వామి

153. అబ్జమైరేయము : తామరపూవుల లోని మధువు.

159. తెల్లనాకులు : తెల్లని ఆకులు : తమలపాకులలో ఒక భేదము. శ్రేష్ఠమైనవి. తెలంగాణ శాసనాల్లో కూడా వీటి ప్రసక్తి వుంది. వాటితో వ్యాపారం చేసారు గనుకనే ఆ కుటుంబాల వారికి తెల్లాకుల అనేది ఇంటి పేరు అయింది.

బాఁడు : బాపడు, బ్రాహ్మణుడు.

160. బాడబులు : బ్రాహ్మణులు.

161. సత్తు : సక్తు,పిండి

సాంబ్రాణిపదార్థజాలములు : సువాసన నిచ్చే పదార్థాలు. ప్రస్తుతంలో ఇంగువ మొదలగునవి.

164. బేహారము : బేరము, వ్యాపారము.

166. కప్పురభోగి : ఢిల్లీ భోగాల వంటి, బాస్మతివంటి సువాసన గల బియ్యము. (అన్నము)

నంజులు : కూరలు

169. విశ్వస్త : వితంతువు.

ఉపస్థ : స్త్రీ జననేంద్రియము.

170. అచ్యుతజాగరవేళ : ఏకాదశి జాగరణము.

171. కురంగాంకుడు : నిండు చంద్రుడు.

173. జీర్ణ కీకస శ్రేణి బిడ్డలు చేయు : చచ్చిన పురుగులను తుడిచి శుభ్రము చేయు.

సంవర్తికా పలాశములు. ముడుచుకొనియున్న పూరేకలు

గేదంగి పూవు : కేతకి. మొగిలిపూవు.

పుష్పలావి : పూలమ్మెడి స్త్రీ

175. కేతకి : మొగిలి

శూలి : శివుడు

పెరుమాళ్ళు : విష్ణువు, వైష్ణవుడు.

176. త్యాగమిచ్చు : వెల కంటె ఎక్కువ చెల్లించు.

చందమామ కొండనాలిక : లోలోపల చివరకు గల (పూరేక). పో. చూ : తాటితేగలోపలి అంకుర భాగము.

177. జిగీష : గెలువవలెనను కోరిక

ఝషధ్వజుడు : మన్మథుడు.

178. కాశ్మీరము : కుంకుమ పూవు.

ఇందురజము : కర్పూరపు పొడి.

కంజములు : పద్మములు.

180. సుమనోబాణాసనామ్నాయము : మన్మథవేదము.

185. పంచబాణావతారుడు: మన్మథావతారుడు

191. అసమనేత్రుడు : శివుడు.

అబ్జాసనుడు : బ్రహ్మ

వైకుంఠుడు : శ్రీమహావిష్ణువు.

అమరాధిపుడు : ఇంద్రుడు.

బృహస్పతి పురంధ్రి : తార
జాలరిది : (ప్రస్తుతమున) సత్యవతి, యోజనగంధి.
కుశికజుడు : విశ్వామిత్రుడు
ఇంద్రు కొలువు లేమ : (ప్రస్తుతమున) మేనక
చిత్తజుడు : మన్మథుడు.

192. తియ్యని వింటి జోదు : మన్మథుడు.
మయ్యెర : కుంచె.
ఈవి : దానము, త్యాగము, బహుమానము

193. గాంధర్వి : సంగీత నాట్యములు నేర్చిన స్త్రీ. గాంధర్వమంటే సంగీతము. ప్రస్తుతమున వేశ్య.
రోయు : వెదకు, అన్వేషించు
సిందువారలతికా కుడుంగము : వావింట పొదరిల్లు.
అడియాలము : ఆనవాలు, గుర్తు, జ్ఞాపకము.

196. ముకురవీక్ష : అద్దము చూచువేడుక, వేశ్యలకు కన్నెరికమునకు ముందు చేయవలసిన వేడుక
యాయజూకుడు : యజ్ఞము సేయువాడు.

197. వివర్తవాదము : మాయా వాదము, అద్వైతవాదంలోనిది. a method of asserting the vedanta doctrine (maintaining the development of the universe from Brahma as the sole real entity, the phenomenal world being held to be a mere illusion or Maya).

198. మధుమాసపు పున్నమి : వసంతపున్నమి.

200. కువలయాప్తుడు : చంద్రుడు.

శ్రీ వర్ధస్వంబు చెప్పుట : ఆశీస్సులందించే సందర్భంలో 'శ్రీయాం వర్ధస్య మాయుష్య మారోగ్యమస్తు'. అనే మంత్రంతో దీవించి, పిదప ఋగ్వేదం నుండిగాని, యజుర్వేదం నుండి కాని, సామవేదం నుండి కాని కొన్ని పనసలు చదువుతారు. అయితే సామవేదం నుండి ప్రారంభిస్తే మాత్రం మరో వేదం నుండి చదువరాదు. ఈ సందర్భంలో ప్రభాకరశాస్త్రిగారు దీనిని ద్విజేతరుల విషయంలోనే చదువుతారని వ్రాయడం విచార్యము)

204. దవనపున్నమ : ప్రస్తుతమున వైశాఖపున్నమి. కాని శాసనాల్లో వివిధ పున్నములను దవన పున్నమగా చెప్పడం జరిగింది. దవనముతో పూజించుపున్నమి అని ఒక వివరణ. కాని కార్తికం నుండి వైశాఖం వరకూ గల పున్నములని నా భావన.

నిర్మలాకాశంలోని పున్నమి. (మరిన్ని వివరాలు కోరువారు నా 'భావపరిమళము' చూడునది)

తెలుగురాయడు : కృష్ణాజిల్లా దివితాలూకా శ్రీకాకుళంలోని అధిష్ఠానదైవం. విష్ణువు. ఆంధ్రనాయకుడు

205. కారవేల్లము : కాకర

తెలుగుభర్త : చూడు: తెలుగురాయడు.

206. పసిడికోర : బంగారు గిన్నె

పుల్లసిలు : పులిసిపోవు ; వెగటుపుట్టు.

కాకుళేశ్వరుడు : శ్రీకాకుళేశ్వరుడు, చూ : తెలుగురాయడు.

207. సిరికాకుళము : శ్రీకాకుళము.

209. వ్యామగ్రాహ్యము : బారచే పట్టదగిన

కాకొల్లి : శ్రీకాకుళము.

210. అనంగమందిరము : మరునిల్లు.

211. కాకుళము : శ్రీకాకుళము

212. మరుడు, దర్పకుడు, పుష్పశరుడు, అసమబాణుడు : మన్మథుడు.

పేరకమ్మ పులిన తలములు : కృష్ణానది ఇసుక తిన్నెలు.

నాడింధముడు : తంతువాయుడు; సాలె; నేతపనివాడు.

అలరుచిచ్చరకోల : పుష్పబాణము.

జారదంపతులు : విటీవిటులు.

214. మాచకమ్మ : పురుష లక్షణాలు గల స్త్రీ.

తెంపి : బరితెగించిన స్త్రీ, రంకుటాలు.

216. కుట్టనము : ఆలింగనము.

కటాక్షము : కడకంటిచూపు.

220. భోగీంద్రములు : పడగలు గల సర్పములు ; నాగుపాములు.

మధుకైటభారాతి : విష్ణువు.

కాలకంఠుడు : శివుడు.

భానుమంతుడు : సూర్యుడు.

నక్షత్రవీథి నెన్నడిమి పెద్దగ్రహము : కుజుడు.

క్రీడావరాహము : ఆదివరాహము రూపుదాల్చిన శ్రీమహావిష్ణువు.

అర్కనందనుడు : కర్ణుడు.

పులుగురాయడు : గరుత్మంతుడు.

పర్వతేంద్రము : మంథర పర్వతము.

221. ప్రగ్రహము : పగ్గము

223. ఎక్కసక్కెము : ఎగుడుదిగుడుగా. వ్యవహారంలో పరిహాసము, వేళాకోళము.

గంధసారము : చందనము.

స్థాసకము : కుంకుమ

చెంద్రిక వన్నెపాగ : ఎర్రని తలపాగ.

అంఘ్రికటకము : కాలి అందె

225. ఎదురుకట్ల : ఎదురుగా, ఎట్టఎదుట, కళ్ల ఎదుట.

226. కరసాన : చిన్నసాన, చేసాన.

కలివె గంధము : కలివె మొక్క కాండాన్ని దంచడం వలన వచ్చే రసము.

ఆవుర్న : ఆవురుమను. (అలా నోరుతెరచు)

గడిదు : గడ కట్టి ఆడువాడు.

తూర్పునాడు : శ్రీకాకుళం విజయనగరం, విశాఖజిల్లా, ప్రాంతాలు.

227. విషాణము : కొమ్ము.

రింఛోళిక : సమూహము

ఉరభ్రము : పొట్టేలు

229. నిటలము : నుదురు, ఫాలము.

తగరులు : పొట్టేళ్ళు.

ఆటోపము : పరాక్రమము.

230. ఆస్కందము : యుద్ధము.

డిల్లపడు : నీరసించు

232. కృపీట సంభవుడు : అగ్ని

క్రోష్టువు : నక్క

మేంఠము, ఏడకము: గొఱ్ఱె

233. తామ్రచూడులు : కోడిపుంజులు

దురోదరము : జూదము.

పానుగంటి కలుకోడి: పానగల్లుకు చెందిన జాతి కోడి.

235. నారికేళ, బక జాతీయములైన కోడిపుంజులు : వివరణ వేరుగా ఇవ్వబడింది.

ఉప్పరము : ఆకాశము.

తండసము : ముక్కు వెంట్రుకలు పెరుకుటకు మంగలి ఉపయోగించు సాధనము.

పాయగిలపడు : ఒరిగిపోవు. ప్రక్కకు పడిపోవు.

236. అహల్యాజారుడు : ఇంద్రుడు.

240. రోవట్టు : వేశ్యకు చెల్లించు నియమిత సుంకము.

244. గాజుటోవరి : అద్దాలగది

245. అహివెట్టు : తాకట్టుపెట్టు

ఏనూఱు : అయిదువందలు

248. గొడ్డేఱు : వ్యర్థమైన, పనికిమాలిన,

249. గోళకుడు : విధవకు జారునివలన పుట్టినవాడు.

251 హాలాపానము : మద్యపానము.

మీనకేతనుడు : మన్మథుడు.

252. నముచి సూదనుడు : ఇంద్రుడు

కవ్వడి : అర్జునుడు

256 విడిముడి : ముడివేయడం అంటే-ధనాన్ని సంచిలో దాచి, దాని ముడి బిగించుట. అయితే ఇలా దాచే ధనం మిగులు ధనం. దీనిని దీర్ఘకాలిక మదుపుకు ఉపయోగిస్తారు. ఇది కాక దైనందిన వ్యయానికి అంటే దినవెచ్చానికి అవసరమయ్యే దానిని విడిగా వుంచుకుంటారు. ఇది విడి ముడి.

256 లాంతుగా : సమృద్ధిగా.

256. ఉమ్మెత్తపూవిడుట : ఉమ్మెత్త పూవు ఉన్మత్తకారకము. శివుని పార్వతి ఉమ్మెత్త పూలతో పూజించినది.

257. ఘటశాసి పుంగవుడు: సమయ జ్ఞానము తెలిసిన శ్రేష్ఠుడు.

నింగి చెరంగు మొన వ్రాలిన పతంగ బింబము : పడమటి దిక్కున వాలిన పటము (సూర్యబింబము) సూర్యుని, పటమని చిత్తూరు, కడప జిల్లాలలో వ్యవహరిస్తారు.

వరుణరాజు : వర్షాధిపతి, పశ్చిమ దిక్కునకు అధిపతి.

అహర్పతి : సూర్యుడు.

కుహళీచషకము : తమలపాకు దొన్నె

నారికేళంపు మధువు : కొబ్బరి కల్లు. (feny?)

కార్తాంతికుడు : లగ్న, ముహూర్తములను నిర్ణయించు పురోహితుడు.

కాలావర్త విషనాడికా స్పర్శనము : వర్జ్యము.

అలవోక : అల పోయినంత సేపు, కొంచెం సేపు.

| | | |
|---|---|---|
| 258. | పంచారించు | : వ్యాపించు, విస్తరించు. |
| | సవ్యాపసవ్యములు | : కుడి ఎడమలు. |
| 259. | కట్టెదుర | : ఎట్టఎదుట |
| 262. | పచ్చడము | : శాలువ, దుప్పటి, |
| | ముర్మురములు | : కుంపట్లు |
| 263. | దిక్కరి | : దిగ్గజము. |
| | కాముడు | : మన్మథుడు. |
| | ఒడ్లు | : అన్యులు, ఇతరులు |
| 265. | దీముగ | : దిమ్ముగ, నమ్మకంగా, దిలాసాగా. |
| | సన్నకుసన్న | : రహస్యముగా, సైగకు మారు సైగగా |
| | జఱభి | : వృద్ధవేశ్య |
| 266. | ద్రవిళుడు | : ద్రవిడుడు, తమిళదేశపు వాడు. |
| 267. | తుండీర (దేశము) | : తొండమండలము. కాళహస్తినుండి కంచివరకుగల దేశము తొండమండలము. |
| | పరిరంభము | : కౌగిలింత |
| 269. | కందర్పశాస్త్రవేదులు | : మదన శాస్త్ర పండితులు. |
| | షాణ్మాసములు | : ఆరునెలలు. |
| 270. | ముక్కుసోణము | : ముక్కుమొదలు, నాసామూలము |
| 272. | స్మరుడు | : మన్మథుడు. |
| 273. | భాస్వంతుడు | : సూర్యుడు |
| | చరమగిరి | : అస్త్రాద్రి, పడమటికొండ, |
| | ఇంగిలీకము | : అగ్ని |
| | ధూర్జటి | : శివుడు |
| | తార్తీయీకము | : తృతీయపురుషార్థము, కామము. |
| | బొడ్డనబావి | : అడుగున బావి గల దిగుడుబావి. |
| 274. | కంగటి కాలు | : మంచపుకోడు. |
| | పొదలిన | : వ్యాపించిన |

279. ధార్మిక ధర్మసతి : సాధారణంగా అగ్ని సాక్షిగా పెండ్లాడిన స్వకులానికి చెందిన భార్యను ధర్మసతి అంటారు. స్వకర్మాచరణకు చెందిన విధి విధాన కార్యక్రమాల్లో భర్తతో పాల్గొనడానికి ఈమెకు మాత్రమే అర్హత వుంటుంది. ఇతర భార్యలకు ఆ అర్హత వుండదు.

వారిని ద్వితీయ అర్ధాంగలక్ష్మి అని చెపుతారు. అలాగే ఇతర కులాల నుండి చేసుకున్న భార్యలను భోగ పత్నులని చెపుతారు.

సతి అనే పదం నిజానికి పార్వతికి మాత్రమే పరిమితం. కాని అనంతరం పత్నికి మారుగా ఉపయోగం లోనికి వచ్చి, కులసతిగా వ్యవహరింపబతోంది.

ఇక్కడ కామమంజరిని ధర్మసతిగా, అందునా ధార్మిక ధర్మసతిగా చెప్పడం గమనార్హం. సాధారణ అవగాహనలో కామమంజరి గాంధర్వి. అంటే వేశ్యగా చెప్పబడింది. అయితే, వెనుకటి తరాల్లో భోగకాంతలు తమను చేరదీసిన వారిని భర్తగా భావించి వారిపట్ల జీవితాంతం విశ్వాసంగా మెలిగే వారు. అతడు కాలంచేస్తే వైధవ్యాన్ని పాటించేవారు. అయితే సహగమనానికి అర్హతలేదు. పలనాటి వీర చరిత్రలో బాలచంద్రునితో సాని సబ్బాయి మాటల్లో అది స్పష్ట పరుప బడింది. ఇక్కడ కామమంజరి కూడా అలాంటిదే. అతని వలన ఆమెకు కలిగే సంతానానికి, అతని స్వార్జితమైన ఆస్తిలో (పిత్రీయమైన దానిలో కాదు) హక్కుకూడా వుంటుంది. ఆ కారణంగా మదనరేఖను మంచనశర్మ కుమార్తెగా సంభావించటం జరిగింది. అయితే ఆమె వృత్తిలోనికి ప్రవేశిస్తున్న కారణంగా ఆస్తి హక్కు ఏర్పడదు. కాని కామమంజరి పోషణకు యావజ్జీవితం బాధ్యత వహించక తప్పదు. అందువల్లనే అతడు ధార్మిక ధర్మసతిగా సంభావించటం జరిగిందని భావించాలి.

279. పురందరుడు : ఇంద్రుడు

283. పచ్చని వింటిజోదు : మన్మథుడు.

286. కనక నిష్కము : బంగారు నాణెము.

287. వెడ్డుకొలుపు : బాధించు;

సరసిజాసనుడు : బ్రహ్మ

288. దొరసెము : వివరణ వేరుగా ఇవ్వబడింది.

289. పరిరంభము : కౌగిలి

290. సొన్నాటంకములు : బంగారునాణెములు.

విన్నాణము : విజ్ఞానము,నేర్పు,

291. వెడ్డుపెట్టు : దగ్గరకు తీసి, వెడ్డియ్యు (కన్నడము) to surround.

పొరపొచ్చెంబులేని : అరమరికలు లేని

292. కలశ పాథోరాశి : పాలసముద్రము

కుసుమ కోదండుడు : మన్మథుడు.

శౌరిపట్టపు దేవి : విష్ణుమూర్తి భార్య లక్ష్మీదేవి

294. త్రిదశ మహీరుహము : కల్పవృక్షము.

# ధ్వన్యనుకరణ పదాలు

23,26,136. **ఘుమ ఘుమములు :** వల్లభరాయని వాగ్వైభవ పాటవాన్ని కీర్తిస్తూ చెప్ప బడింది.ఇక్కడ ధ్వని మాత్రంగా గాక, ఆయన వాక్యసంపద లోని భావపరిమళానికి వర్తిస్తుంది.అయితే 26 పద్యంలోనిది శబ్దాడంబరాన్నే సూచిస్తున్నది. 136 లోనిది కోణమనే వాద్యము నుండి ఉత్పన్నమయ్యే ధ్వని.

50. **ఘుక్కు :** గుడ్లగూబ అరుపును సూచించే విధంగా ప్రయుక్తమైంది.

51. **కేఁగో :** నెమలి క్రేంకార ధ్వని

68. **దిస్సువాఅగ నవ్వుట :** నవ్వుటలోని ఒక తీరులో ఉత్పన్నమయ్యే ధ్వని

71. **అహ్హహా :** బిగ్గరగా (ఆశ్చర్యముతో) నవ్వుట యందగు ధ్వని.

104,274.**ఖంగు:** మీటబడిన దాని గట్టిదనాన్ని తెలుపుటకు ప్రయుక్తమగునది. ముఖ్యంగా లోహపు వస్తువులను మీటినపుడగు ధ్వని (ఇక్కడ గుబ్బచన్నుల గట్టిదనాన్ని చెపుతూ ఉపయోగింపబడింది).

108. **సీత్ :** నొక్కుట యందుచేసే ధ్వని. పేలను చంపునపుడు అయ్యే ధ్వని.

110,186. **ఝణత్కారము :** నగలు కదులుతున్నప్పుడు ఉత్పన్నమయ్యే ధ్వని. ముఖ్యంగా గాజులసవ్వడి

116. **ధుం ధుం ధుం :** చర్మవాద్య ధ్వని

116,117.**ఫీట్కారము :** ఈల ధ్వని. ఏదైనా విన్యాస ప్రయత్న ప్రారంభంలో ఊతగా చేసే ధ్వని కూడా.

117. **గర్జన :** సాధారణంగా సింహం యొక్క అరుపును ఈ పదంతో సంభావించడం జరుగుతుంది. అయితే కోపంతో మనుషుల అరుపును కూడా ఈ శబ్దంతో చెప్పడం జరుగుతుంది.

130,140 . **డమడమ :** ఢమరుకం నుండి ఉత్పన్నమయ్యే ధ్వని. ఢక్క ధ్వని కూడా.

131,198 . **కుహూకారము :** కోయిల కూత

132. **తకదుందుమ్మలు :** మద్దెల ధ్వని. అయితే ఇది మృదంగం కాదు. భజంత్రీల వద్దనుండే డోలు.

132. **తందాన :** తందె (తంత్రి) ను మీటగా వచ్చే ధ్వని. తందె, తాన(ళ) కలిపి తందాన. అన్నమయ్య చేతిలోనిది తందె. అలాగే, బుర్ర కథల్లో ఉపయోగించే తంత్రీ వాద్యం

136. **గిల్కుగిల్కు :** గిలుక్కు గిలుక్కు మనుధ్వని. కాళ్ళకు కట్టుకున్న కడియాలలోని మువ్వలు, మణికట్టుకు కట్టుకున్న కడియంలోని మువ్వలు చేసే ధ్వని. రెంటిలోను మువ్వలు ఎక్కువగా వుండవు. వీటిని కింకిణీలంటారు.

138. **ఝుంకృతము :** జగఝ్ఝుంకృత అని ప్రయోగము, తుమ్మెదల రొద నిజానికి ఝుంకారము. ఇక్కడ శ్రుతికి మారుగా ఉపయోగింపబడింది.

148. **అకరో, యమ్మకరో, యమక్కరొ :** అక్కరో, అమ్మ అక్కరో, అమ్మక్కరో:తప్పెట్లు చేసే ధ్వనికి అనుగుణంగా, దాని ననుకరిస్తూ ఉచ్చరించే శబ్దాలు.

148. **జక,జుంజుం,జకజుంజు జుమ్ము :** తప్పెట్ల నుండి లయాను బద్ధంగా వెలువడే శబ్దాలు.

155,227. **ఘణత్కారము :** కంచుగంటపై కొయ్య సుత్తితో కొట్టినపుడు వచ్చే ధ్వని.

161. **ఘరట్ట :** రోటిలో దంచునప్పుడు, తిరగటి రాళ్ళవలన కలిగే ఘర్షణ ధ్వని.

162. **కిఱ్ఱు :** చెప్పులలో కిఱ్ఱుచెప్పులు వేరు. నడిచేటప్పుడు అవి కిఱ్ఱుకిఱ్ఱు మని శబ్దం చేస్తాయి. వాటికుపయోగించే చర్మం వేరుగా వుంటుంది. అలాగే కుట్టడానికి ఉపయోగించే వారును పదునుపట్టే విధానంలో ప్రత్యేకత వుంటుంది. కూర్చే చర్మాలు కొంచెం వదులుగా వుండటం వలన ధ్వని ఉత్పన్నమవుతుంది.

210. **జఱ్ఱు :** నీరు కారు నప్పుడు, అగు ధ్వని.

217. **కవ కవ :** నవ్వుటయందగు ధ్వని. మనసారా సంతోషాతిశయంతో బిగ్గరగా నవ్వుటను కహ, కహ నవ్వినట్లు అంటారు.

223. **ఘల్లుఘల్లు :** కాలి అందెల రవళి

224. **ఫూత్కారము :** బుగ్గలలో గాలి నింపుకోవడానికి లోపలికి గాలి పీల్చునప్పుడు నోటిలో ఉత్పన్నమయ్యే ధ్వని

224. **కిక్ :** నాగస్వరంపై ఆలాపన కావిస్తున్నప్పుడు, గుక్క తిప్పుకోవడానికి ఆపినప్పుడు గొంతులో అయ్యే ధ్వని.

226. **తట,పెట,ధిమికిట :** చంకలో తగిలించు గుమ్మెటను వాయించేటప్పుడు వచ్చే ధ్వని.

226. **ఆవుర్న :** ఆవురుమను. నిజానికి ఆవులింతలో వచ్చేధ్వని. ఇక్కడ ప్రదర్శనలో మధ్య మధ్య నోరు తెరిస్తే వచ్చే ధ్వని

227. **టంకారము :** ఘంటానాదము.

228. **భ్రగ్గు :** పొట్టేళ్ళు పోటీలో, వేగంగా ఎదుటిదానిమీదికి ఉరుకునప్పుడు అగుధ్వని.

228. **ఢి ఢి ఢీ :** పొట్టేళ్ళు రెండూ ఢీ కొన్నప్పుడు పుట్టేధ్వని.

235. **కొక్కొక్కొ :** కోడిపుంజులు చేసే అరుపు, ధ్వని.

235. **గురుకు గురుకు :** కోడిపుంజులు ఒకదాని నొకటి కొరుక్కుంటున్నప్పుడు అగు ధ్వని.

235. **ఘాట,ఘాట,ఘాట :** కోడిపుంజు, ప్రత్యర్థి పుంజు నెత్తిని తన వాడి ముకుగోళ్ళతో పట్టబోవునపుడు చేసే ధ్వని.

239. **కలకల నవ్వు :** పరిహాస పూర్వకంగా నవ్వేటప్పుడు అయ్యే ధ్వనిగా ప్రయోగింపబడినది.

279. **చిటుకు :** సన్నని, వినీ వినపడని శబ్దము.

## ప్రసక్తమైన జాతీయాలు - వివరణ

**22.కరతలామలకము :** వల్లభామాత్యుడు 'ఆశ్వలాయన శాఖయందు ఋగ్వేదంబు కరతలామలకంబుగాఁ బఠించె నని చెప్పబడింది.
ఏదైనా ఒకవిషయం సాకల్యంగా తెలిసివుండటాన్ని, లేక అందులో గల ప్రవేశం పరిపూర్ణంగా గలదని చెప్పటానికి దీనిని ప్రయుక్తం గావించటం జరుగుతుంది. (మరిన్ని వివరాలకు నా 'మాటతీరు' ను చూడవచ్చును).

**22.వార్త కెక్కు :** జగత్ప్రసిద్ధం గావడం. సర్వులకు తెలిసివుండటం

**28.నెల్లూరి తూముకాలువ :** నీటి సరఫరాకు మానవనిర్మితమైన ప్రసిద్ధమైన కాలువ. ఇక్కడ అందులోని చెంగలువలను గూర్చి చెప్పడం జరిగింది.

**37.దేశ భాషలందు తెనుగు లెస్స :** దీని కిదే మొదటి ప్రయోగం. తరువాత దీనిని శ్రీకృష్ణ దేవరాయలు తన ఆముక్త మాల్యదలో ఉపయోగించుకోవడం జరిగింది. నేడు, మనభాష గొప్పదనాన్ని చెప్పే సందర్భంలో అందరి నోటా వినపడుతోంది. అంటే మన భాష ప్రాశస్త్యాన్ని తెలిపే ఒక జాతీయాన్ని ప్రసాదించిన వాడైనాడు వల్లభరాయడు. మరింత వివరణ వేరుగా ఇవ్వబడింది.

**39.చెట్టుల చేమల (నేమిగల్గును) :** అందుబాటులో ఉన్న దానిని విడిచి, దేనికొరకో చేసే వ్యర్థ ప్రయత్నాన్ని చెప్పేటప్పుడు దీనిని ఉపయోగించటం జరుగుతుంది. చేమ<శ్యామ, పచ్చని చేలు, అడవులు.

**52.కొంగు బంగారము :** సొమ్ము అవసరమైనపుడు, దాని కొరకు ఏ విధమైన వెంపర్లాట, సంశయము, ఆత్రుత లేకుండా, తక్షణోపయోగానికి అది అందుబాటులో వుండటాన్ని ఇలా చెపుతారు. ready money అనే అర్థంలో. ఇది స్త్రీలకు సంబంధించినది. అదే మగవారి విషయమైతే రొండినదాచిన సొమ్ము! మరిన్ని వివరాలు కావలిసినవారు ఈ గ్రంథకర్త 'మాటతీరు' చూడగలరు.

**62.పదియార్వన్నె పసిండి :** పసిడి అంటే బంగారమని తెలిసిందే. ఈ పసిడిశబ్దమే పైడిగా కూడా రూపెత్తింది. పసిడి అనేది బంగారానికి గల రంగు (పసుపువన్నె) ను బట్టి వచ్చిందని తెలుసు. పదహారువన్నెను ప్రత్యేకంగా చెప్పటానికి గలకారణాన్ని తెలుసు కుందాము. సహజంగా శరీర పసిమి ఛాయను ముఖ్యంగా స్త్రీల మేని ఛాయను విశేషించి చెప్పేసందర్భంలో ఉపయోగించటం జరుగుతుంది ఎందుకిలాగంటే – మేలిమి బంగారాన్ని

24 కారెట్ల వన్నెగా చెపుతారు. అందులో 16 వన్నెలను మాత్రమే గ్రహించి పోల్చిచెప్పడం జరుగుతోంది. ఈ 16 పదాన్ని మరోచోట కూడా – పదహారు అణాల అని కూడా చెప్పడం జరుగుతుంది. అంటే రూపాయికి 16 అణాలు అని కూడా చెప్పడం జరుగుతుంది. అంటే రూపాయికి వెనుకటి లెక్కలో 16 అణాలు వుండేవి. పదహారణాల అని చెప్పడమంటే, ఎంతమాత్రం తక్కువలేదు. పూర్తిగా అని చెప్పడం.

అటు రూపాయి విషయంలోను, ఇటు బంగారు వన్నె విషయంలోను 16నే సంకేతంగా తీసుకోవటానికి కారణం – నిండుపున్నమి నాడు చంద్రుడు 16 కళలతో ప్రకాశిస్తాడు గనుక. కాని మన ప్రాంతంలోని పున్నమినాటి చంద్రునికి 15 కళలే వుంటాయి. 16 కళలున్న చంద్రుడు యూఫ్రటిస్ – టైగ్రస్ నదుల ప్రాంతంలో (మొసపొటేమియా) మాత్రమే దర్శన మిస్తాడు. అలా పదహారు, వన్నెకు సంకేతమైంది. అలాగే రూపాయని 16 అణాలుగా (భాగాలుగా) విభజించు కోవడం జరిగింది. అంటే ఒక వన్నె ఒక అణాకు సంకేతమన్నమాట. ( ఈవిషయం పై మరిన్ని వివరాలు కోరువారు నా 'మాటతీరు' పుస్తకాన్ని చూడవచ్చును.

**88.నోముల పంట :** ఎంతో శ్రమించి (నోము నోచి) సాధించుకున్న ఫలము. దుర్లభమను కొన్న దానిని లభింపచేసుకొనుట. అపురూపమైన దానిని పొందుట అనే అర్థాల్లో ఉపయోగం. ఇక్కడ ఒక విటుడు అలా అంటూ వేశ్యను తిరిగి రతి సౌఖ్యం కొరకు బెల్లించిన విధానాన్ని టిట్టిభసెట్టి అలా చెప్పాడు.

**92.రాపాడగా పట్టగా :** వేధించుట. నిర్బంధించుట. ఎదుటివానికి ప్రతిఫలం ముట్టచెప్ప కుండా వట్టిమాటలతో కార్యాన్ని సాధించుకోవాలను కోవడం కుదరదని ఇక్కక కర్ణాట వేశ్య మంచన శర్మను ఆ పద ప్రయోగంతో హెచ్చరించడం జరిగింది.

**118.పిఱికి కండలేని :** పిఱికి తనమన్నది ఎరుగని. నిలిచిన నిలువున ధైర్యము మూటగట్టుకున్నవారు. రూపుదాల్చిన ధైర్యము.

**120.రచ్చలకెక్కినట్టి :** ప్రసిద్ధిగాంచిన. ప్రత్యేకతలో ప్రసిద్ధిగాంచిన. ఇక్కడ పలనాటి వీరుల అలంకారములు చెప్పబడ్డాయి. అంటే వారి వేషభూషల వలననే వారు పలనాటివీరులని గుర్తుపట్టగల మన్నమాట! అంటే అవి వారికి ప్రత్యేకమన్నమాట. సైనికులకు ఏ దేశం వారికి  ఆ దేశపు ప్రత్యేక చిహ్నాలుంటాయి గదా! వారిని చూడం గానే వారు ఫలానాదేశం వారని గుర్తించ గలం గదా! అలాగన్నమాట.

**128.సైదోడు :** సహతోడు. తోబుట్టువు. తోబుట్టువు వంటి. కూరిమి గలవారు. మిత్రుడు చెప్పిన దానిని మారాడక అంగీకరించే తత్వంగల వ్యక్తిని అవతలివానికి సైదోడుగా

చెప్పవచ్చును.

**130.నెఱవాది :** నేర్పుగలవాడు. ఒక పనిని నిర్వర్తించటంలో దాని ఆనుపానులను సాంగంగా తెలిసి, దానిని తీరైన పద్ధతిలో నెరవేర్చువాడు.

**142.అవఅవ :** ఇక్కడ గుండములోని చంద్రనిప్పులు మండటాన్ని చెప్పడం జరిగింది. మంట ఎర్రగా వుండటం సాధారణం. ఇక్కడ నిజానికి మంట లేదు. మండి చంద్ర కర్రలు నిప్పులుగా మారాయి. అవి ఎరుపును మించిన పసుపు వర్ణంలో గోచరిస్తాయి. ఆ ప్రకాశాన్ని అవఅవ శబ్దంతో సూచించడం జరిగింది. నగలను అవణములు అని చెప్పటానికి కారణం, వాట మెరుపువలననే.

**142.మిసిమింతులు :** జంకూ గొంకూ లేనివారు.

**143.నెట్టిక సీలంత :** సీల రెండింటిని కలపడానికి ఉపయోగించే సన్నని, చిన్నదైన పనిముట్టు, ఇక్కడ అది మరింత చిన్నది ఆ గొరగ బాలిక అని చెప్పడానికి ప్రయుక్తమైంది.

**145.మంచుకుంచాల కొలుచుట :** మంచు కరిగి పోయే స్వభావంగలది. దీనిని కొలవడం అసాధ్యం. కుంచం పదార్థాలను కొలవడానికి ఉపయోగించే పాత్ర. అసాధ్యాన్ని సుసాధ్యం చేయ నేర్పుగలవాడు అని మైలారదేవుని చెప్పడం జరిగింది. సర్వసమర్థుడు అని చెప్పటం.

**146.ఆబాలవృద్ధులు :** పసిబాలురనుండి ముదుసలి వారివరకూ, సర్వజనులూ అని చెప్పటం.

**153.మూతిముట్టవెఱచెన్ :** మూ చూడటానికే [మూతితో (నోటి) ముట్టుకోవటానికే] భయపడటం. ఇక్కడ వేడిమి విషయాన్ని గూర్చి ఇది ప్రస్తావింపబడింది.

**166.లప్ప :** ఎవనికైనా, అప్రయత్నంగా సొమ్ములభిస్తే, వాడికి లప్ప వచ్చిపడింది అంటారు. అంటే ఆధిక్యాన్ని సూచించటం. అపరిమితం అని చెప్పటం. ఇక్కడ కోరినంత, కాదనకుండా పెరుగువడ్డిస్తారని చెప్పటం

**171.చంకల బంటిగా :** చంకలవరకూ : వలసిన దానికి మించి తిన్నారని, అది కూడా రుచిగా వుండటాన బాగా ఇష్టంగా తిన్నారని చెప్పటం. తెగతిన్నారన్నట్లుగా.

**173.పదియాఱువన్నియ బంగారు :** చూడు పదియార్వన్నె పసిండి.

**203.పాయసం బారగించిన ప్రాంతపట్టు :** మాలిమి, మన్నన గలిగిన, అలవాటైన పాతచోటు. రుచిమరిగిన, పూర్వపరిచయం గలచోటు. అరమరికలు లేనిచోటు.

**211.ముంజె పదను :** తాటిముంజల మార్దనము. లేత, ముదురూ కాని, పాకానికి వచ్చిన ముంజెల మృదుత్వము. ఇక్కడ శ్రీకాకుళపు తిరునాళ్ళకు వచ్చిన బ్రాహ్మణ విధవల

ఉపస్థల మార్దవం, అలా ఉపమించబడింది.

**217.లవలవ :** మెత్తని, మృదువైన వస్తువుల చలనం ఇలా వుంటుందని చెప్పడం జరిగింది.

**233,235.జగజెట్టి :** పేరు మోసిన మల్లయుద్ధ ప్రవీణుడు.

**235 చించి చెండాడుట :** దండలను ముక్కలు ముక్కలు చేసి ఎగరుగొట్టుట, అంత సునాయాసంగా ప్రత్యర్థిని గాయపరచుట, చిత్తుచేయుట అనే అర్థంలో ప్రసక్తమైంది

**239.గాదిలి చుట్టము :** ప్రియమైన బంధువు.

**246.ఈగకు పోక పెట్టుట :** పోక కఠినమైనది. ఈగకు అనుభవంలోనికి రానిది. కనుక దానిపై వాలదు. వాలినా ఉపయోగం లేదు. అంటీముట్టకుండా, మాటాపలుకూ లేకుండా వున్న సందర్భాన్ని ఇక్కడ ఇలా చెప్పబడింది.

**248.గొడ్డేఱు :** నీరు వట్టిపోయిన ఏరు. ఉపయోగానికి పనికి రానిది. వ్యర్థమైనది. పనికిమాలిన. ఇక్కడ మధుమావతి తనకూ, చెల్లెలు మదాలసకు అలా కొరగాని కలక పుట్టిందని చెపుతోంది.

**249.గుడిలో నుండి గుడిరాళ్ళను తీయుట :** గుడిని ఆశ్రయించుకుని జీవనం సాగిస్తూ, దానికే హాని తలపెట్టటం. విశ్వాస ఘాతకుడు. నమ్మక ద్రోహి అని చెప్పటం.

**256. తామర తంపర :** సరస్సులో ఒక్క తామరదుంప వేస్తే అది మొత్తం సరస్సు అంతా విస్తరిస్తుంది. సమృద్ధి అని చెప్పటానికి. అధిక సంఖ్యలో కుటుంబం, కొడుకులు కుమార్తెలు బంధువులతో విస్తరిస్తే తామరతంపరగా విస్తరించిందని చెపుతారు.

**277. వింజమాకిడిన మాడ్కి :** ఇక్కడ నిశ్శబ్దమనే భావనలో ప్రయుక్తమైంది. నిశ్శబ్దమనే భావనలోను, గాలి ఎంతమాత్రము లేని, నిరామయంగా అనే అర్థంలో ఉపయుక్తమైంది. ఇక్కడ వింజము అంటే వింధ్య పర్వతము ఆకు అంటే ఇక్కడ పత్రమని కాదు. అడ్డమాకలోని ఆక. అంటే తిరిగి అడ్డమనే అర్థం. వింధ్యపర్వతం ఒకప్పుడు హిమాలయంపై ఈర్ష్యతో ఎత్తు పెరిగిపోయింది. ఆ కారణంగా సూర్యచలనానికి అడ్డంకిగా మారింది. అలా ఇవతలివైపున చీకట్లు అలముకున్నాయి. జీవనం స్తంభించిపోయి నిరామయస్థితి ఏర్పడింది. ఆ స్థితిని గూర్చి ఇక్కడ అలా చెప్పబడింది.వుంది. ఇక్కడ వింజం అంటే వింధ్య పర్వతం.

**283.పులకంబులు నారువోయుట :** ఇక్కడ సంతోషాతిశయం వలన రోమాలు నిక్కబొడుచుకొను అనే అర్థంలో చెప్పబడింది. సంతోష మనేదే ఫలితార్థము. మంచనశర్మ కామమంజరిని గుచ్చి కౌగలించుకోవడం అనేది, మన్మథుడు, పైపైన పులకములకు నారువోస్తే ఎలావుంటుందో ఆమెలో అలాంటి స్థితిని కలిగించింది అని చెప్పడం.

పులకరింత అంటే గగుర్పాటు. ఇది సంతోషం వలన కలిగే స్థితి. గగుర్పాటులో రోమాలు నిక్కపొడుచు కుంటాయి. ఈ స్థితి భయం కలిగినపుడూ వుంటుంది. పులకరమనే మాట దైహికశ్రమ అధికమైనపుడు కలిగే ఇబ్బందిని చెప్పేటప్పుడూ ఉపయోగించటం వుంది, ఒళ్ళంతా పులకరంగా వుంది అని వ్యవహారం. కవులు సంతోషాన్ని వ్యక్తీకరించు అనే అర్థంలో మాత్రమే గ్రహించారు.

వ్యవసాయానికి సంబంధించి పులక తడి అనేమాట వుంది. వరినారు పోయడానికి మడిని పదునుచేసి, విత్తులు చల్లి తడి పెడతారు, నాలుగయిదు రోజుల్లో మొలకలొస్తాయి. కాని ఆ సమయానికి పై మట్టి ఎండకు ఆరి బెత్తలు కడుతుంది. దానిని చీల్చుకొని మొలకలు (అంకురాలు) పైకి రాలేవు. అపుడు మళ్ళీ తడి పెడతారు. మరునాటికి, మొలకలు పైకి తేలి మడి అంతా పచ్చగా వుంటుంది. రెండవసారి పెట్టే తడిని పులకతడి అంటారు. సంతోష సమయంలో శరీరంపై రోమాలు ఎలా నిక్కబొడుచుకుంటాయో, అలా మొలకలు (అంకురాలు) ఆ తడి పెట్టంగానే పైకి నిక్కపొడుచుకొని వస్తాయి.

ఇక్కడ కామమంజరిలో కలిగిన సంతోషాతిశయాన్ని చెప్పడానికి, ఈ జాతీయం ఉపయోగించడం జరిగింది.

## అవతారికా భాగంలో ప్రసక్తమైన వ్యక్తులు

ఇక్కడ క్రీడాభిరామ అవతారికలో ప్రసక్తమైన వ్యక్తుల వివరాలు పొందుపరచబడ్డాయి. వీరు కేవలం వల్లభరాయని వంశీకులు, వారికి ఆశ్రయమిచ్చిన ప్రభువులు, వల్లభరాయనిచే కీర్తింపబడ్డ కవులు మాత్రమే. పాఠకుల సౌకర్యార్థం వల్లభరాయని వంశ వృక్షం వేరుగా కూడా చూపబడింది. గమనించగలరు. ప్రక్కన సూచింపబడినవి పద్యసంఖ్యలు)

**3. మంచన :** క్రీడాభిరామ కర్త వల్లభ రాయని వంశకర్త (క్రీడాభిరామకర్త వల్లభ రాయనికి పూర్వం మరో వల్లభరాయడున్నాడు). విశ్వామిత్రగోత్రజుడు (మరో మంచన కూడా వున్నాడు. ఆయన , ఈయన మనుమడు).

**4,5,6. చంద్రామాత్యుడు :** పై మంచన కూర్మినందనుడు. ఈయన, నాటి కర్ణాట రాజ్యపాలకుడైన పెదబుక్కరాయల వద్ద మంత్రిగాపని చేసాడు. (ఈయన గాక మరోచంద్రమంత్రి వున్నాడు. అతడు ఈయన మనుమడు)

**5. పెదబుక్క క్ష్మాపతి :** కర్ణాట రాజ్య ప్రభువు. దేవేంద్రునిగా ఉపమింపబడ్డాడు. ఈయన వద్దనే చంద్రామాత్యుడు మంత్రిగా పనిచేసాడు.

**6.పోచాంబ :** పై చంద్రామాత్యుని భార్య

**6,7 : మంచనార్యుడు** : పోచాంబా చంద్రామాత్యుల పుత్రుడు. బుద్ధియందు బృహస్పతిగా చెప్పబడ్డాడు.

**7.తిప్పమ :** పై మంచనార్యుని భార్య.

**7.తిప్పన, సింగన(8) మల్లన (13,16)(17), చెన్నమంత్రి :** ఈ నలుగురూ, తిప్పమ మంచనార్య దంపతుల కుమారులు. ఇందులో మల్లన, మల్లికార్జునునిగా కూడా (13) చెప్పబడ్డాడు.

**8.చంద్రమంత్రి :** పైవారిలో సింగన కుమారుడు.

**9.మిరుతూరి విట్ఠమంత్రి :** మంచన, తిప్పమల కుమారులు నలువురిలో ఒకడైన మల్లనకు పిల్ల (త్రిపురమ) నిచ్చిన మామ.

**10.త్రిపురమ :** మల్లన భార్య : మిరుతూరి విట్ఠమంత్రి కుమార్తె. పై మల్లన భార్య.

**10.తిప్పన(15,16,17,18,19) వల్లభుడు 12,13. లింగన(14), సింగన, భైరవేంద్రుడు :** ఈ అయిదుగురూ. త్రిపురమ, మల్లన దంపతుల కుమారులు. వీరిలో వల్లభుడు (12) ప్రఖ్యాతినొందిన వాడుగా, క్రీడాభిరామకర్త వల్లభ రాయడు కీర్తించాడు. ఇందలి లింగన హరిహర రాయలవద్ద మంత్రిగా పని చేశాడు (14). ఇందలి తిప్పన

వినుకొండ దుర్గాధ్యక్షుడు.

**13.బైచమంత్రి, మల్లవిభుడు, పోచన్న, తిప్పన :** పై వారిలో వల్లభుని కుమారులు.

**15.తిప్పనార్యుడు :** త్రిపురమ, మల్లన పుత్రులలోని తిప్పనకు తన కుమార్తె పెద్దమాంబ నిచ్చి వివాహం చేసాడు. హరిత గోత్రజుడు.

**15.పెద్దమాంబ :** హరిత గోత్రజుడైన తిప్పనార్యుని కుమార్తె. త్రిపురమ మల్లనల కుమారుడైన తిప్పనకు భార్య.

**20.బైచన, మల్లన, తిప్పన(22) :** త్రిపురమ మల్లనల పుత్రుడైన తిప్పన, (10,15,16,17,18,19,) పెద్దమాంబ దంపతుల కుమారులు. ఇందలి తిప్పన త్రిపురాంతకాధీశ్వరుడు. భార్య చందమాంబ. కుమారుడు క్రీడాభిరామకర్త వల్లభరాయడు.

**22.చందమాంబిక :** పెద్దమాంబ, తిప్పనల కుమారుడైన తిప్పన భార్య. క్రీడాభిరామకర్త వల్లభామాత్యుని తల్లి.

**22.వల్లభామాత్యుడు :** క్రీడాభిరామ కృతికర్త. చందమాంబా తిప్పనల పుత్రుడు. కడపజిల్లా మోపూరుకు అధికారి. ఆశ్వలాయన శాఖలో ఋగ్వేదాన్ని కరతలామలకంగా పఠించాడు. భైరవస్వామిని ప్రత్యక్షం గావించుకొని సిద్ధసారస్వతశ్రీని వరించాడు. కామకాయన సవిశ్వామిత్ర గోత్రజునిగా ప్రసిద్ధికెక్కారు.

**33,36.రావిపాటి త్రిపురాంతక దేవుడు :** సంస్కృతంలో ప్రేమాభిరామాన్ని రచించినవాడు, కృతి అలభ్యము. దీని ననుసరించే వల్లభరాయడు క్రీడాభిరామం రచించినట్లు చెప్పుకున్నాడు. రెండవ ప్రతాపరుద్రుని ఆస్థానంలో వున్నట్లు కొందరు పరిశోధకులు భావించారు. మరికొందరు కాదన్నారు. మదన విజయం. అంబికాశతకం, త్రిపురాంతకోదాహరణం, చంద్రతారావళి, మున్నగుగ్రంథాలు రచించినట్లు సమాచారం. ఇందులో త్రిపురాంతకోదాహరణాన్ని, మానవల్లి రామకృష్ణకవిగారు ప్రచురించారు.

**36.నన్నయ భట్టు :** తెనుగున శ్రీమహాభారత రచనకు ఉపక్రమించి. ఆది సభా పర్వాలను, అరణ్యపర్వంలో కొంతభాగాన్ని రచించిన ఆదికవి. కాలం 11వ శతాబ్దం.

**36.తిక్కన :** నన్నయ ప్రారంభించిన శ్రీమహాభారతాన్ని, విరాటపర్వం మొదలుగా మిగిలిన పదిహేను పర్వాలను. ఉత్తర రామాయణాన్ని రచించిన కవి. కాలం 13వ శతాబ్దం.

**36.హుళక్కి భాస్కరుడు :** తిక్కనకు ముందువాడు. భాస్కర రామాయణంలోని యుద్ధకాండలో కొంతభాగాన్ని రచించిన కవి.

**36. చిమ్మపూడి అమరేశ్వరుడు :** ఇతని కాలం సమంగా తెలియదు. ఇతనిని కీర్తించిన మొదటి కవి వల్లభామాత్యుడే. ఆ తరువాత చాలామంది కవులు కీర్తించారు. ఇతడు విక్రమసేనమనే గ్రంథం రచించాడు. కాని అది పూర్తిగా లభ్యం కాలేదు. కేవలం 56 పద్యాలు దొరికినట్లు వాటిని ప్రచురించిన ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక వలన తెలియవస్తుంది.

## క్రీడాభిరామ ఇతి వృత్తకథనంలో పేర్లతో ప్రసక్తమైన వ్యక్తులు

క్రీడాభిరామంలో ప్రధానమైన వ్యక్తులు మంచనశర్మ, అతని వైశ్య మిత్రుడు టిట్టిభసెట్టి. మంచన శర్మ, ఓరుగంటిలో వుంటున్న తన ననుపుగత్తె కామమంజరిని కలుసుకోవడానికి బయలుదేరగా, ఆంధ్రనగరాన్ని చూడటానికి, అతని వెంట బయలుదేరి వెళ్ళినవాడు టిట్టిభసెట్టి. అక్కడకు వెళ్ళిన తరువాత. పూజారి విధవ తమ్మడిసాని ఇంట వారద్దరూ ఆ రాత్రి బస చేసారు. ఆమెతో కబురుపంపించి మంచనశర్మ కామమంజరిని తన వద్దకు రప్పించుకున్నాడు. అలాగే తమ్మడిసాని కూతుర్ని తనమిత్రుడు టిట్టిభసెట్టికి కూర్చాడు. ప్రధానమైన వృత్తాంతం ఇంతమాత్రము. అందువలన ఇందు ప్రధానమైన వ్యక్తులు ఇందులోని మొదటి ముగ్గురు మాత్రమే వారి వారి పేర్లతో వ్యవహరింపబడ్డారు. మిగిలిన ఇద్దరూ (తమ్మడిసాని, ఆమె కూతురు) పేర్లు లేకుండానే వ్యవహరింపబడ్డారు. ఈ అయిదుగురూ కాక మిగిలిన వారంతా ప్రస్తావ వశంగా పేర్లులేకుండానే వ్యవహరింపబడ్డారు.

ఆ కారణంగా, పేర్లు గల వ్యక్తులను, పేర్లు లేని వ్యక్తులను వేరువేరుగా వివరించటం జరుగుతోంది. ముందుగా పేర్లతో వ్యవహరింపబడ్డ వ్యక్తులు. ఆయా వ్యక్తుల ప్రసంగం కావ్యంలో ఎక్కడెక్కడ జరిగిందో, ఆయా పద్య గద్య సంఖ్యలు సూచింపబడుతున్నాయి. అలాగే వారు ఎన్నివిధాలుగా సంభావింప బడింది, ఏకరువు పెట్టడం జరిగింది. కావ్యకర్త, లేక, కృతిలోని వ్యక్తులు వారి వారిని ఎలా వర్ణించారు అన్న విషయాలను కూడా ఎత్తి చూపడం జరిగింది. వారిని గూర్చిన వర్ణనలు అతిదీర్ఘమైన వాటిని, ఆయా పద్య సంఖ్యల సాయంతో పాఠకులు గమనింపవచ్చును.

1. **మంచనశర్మ :** కాసల్నాటి బ్రాహ్మణుడు. సంకృతి పూతిమాష గోత్రజుడు. ఘటశాసి. మాధవుని కుమారుడు. మీసాలప్పయ్య ద్వివేది మేనల్లుడు. ఆయన కుమారుడు శ్రీధరునికి వరుసకు వియ్యంకుడు. ఓరుగల్లులోని కామమంజరి ఇతగానికి ననుపుగత్తె. వీరిరువురి కుమార్తె మదనరేఖ.

ఇతనిని గూర్చిన ప్రశంస 40,41,42,43,61,76,79,88,89,92,93,94, 96,97,112,139,150,154,162,171,173,176,180,186,189,190,197, 199,200,201,202,203,219,225,244,247,252,257,259,268,273, 279,281,282,284, సంఖ్యలు గల గద్యపద్యాలలో కనిపిస్తుంది.

ఇతడు స్వనామధేయంతో మంచిరాజు, కాసల్నాటి గోవింద మంచనశర్మ, గోవిందశర్మమంచన, మంచనశర్మ, గోవిందుడు, మంచి అనేవిధంగా పేర్కొనబడటం లేదా ఆయా వ్యక్తుల చేత సంభావింపబడటం గాని జరిగింది.

అలాగే ఒసపరిమన్మథుడు, కాసల్నాటి శ్రేష్ఠుడు, ధాత్రీసురతిలకుడు, కుసుమ శరాసన సముడు, రసికకులా వతంసుడు, బ్రాహ్మణుడు, విప్రవర్యుడు, దిట్టబాపండు, కాసల్నాటి బాపడు, పూతిమాషాన్వయుడు, భూసురుడు, జాణవిప్రుడు, భూదేవుడు, పూతిమాషగోత్రుడు, సంకృతిపూతిమాషమాధవుని కుమారవరుడు, విప్రముఖ్యుడు, అత్రిసమానుడు, క్రొత్తలంజల కాముండు, ఉత్తముడు, నాగరకుడు, పాడిపంతంబులెరిగినపెద్ద, ఘటశాసిపుంగవుడు, అనే విధంగా సంభావింపబడటం జరిగింది.

**మాధవుడు :** సంకృతి పూతిమాష గోత్రజుడు. మంచన శర్మ తండ్రి. ఇతని ప్రసక్తి 42,189ల్లో కనుపిస్తుంది.

**మీసాలప్పయ్యద్వివేది :** కాసల్నాటి శ్రేష్ఠునిగా చెప్పబడిన ద్వివేది. మంచనశర్మకు మేనమామ., శ్రీధరునికి తండ్రి. 43,244,ల్లో ఈయన ప్రసక్తి వుంది.

**టిట్టిభుడు :** మంచన శర్మకు మిత్రుడు. వైశ్యుడు. ఆయనతో ఓరుగల్లును దర్శించాడు. సుసరభేత్తును గూర్చి మంచన శర్మకు వివరించి చెప్పాడు. కర్ణాట వేశ్య దైహిక స్థితిని వర్ణించి చెప్పాడు. కోడికూత సతీపతులకు దర్మధార వలె వుందని చెప్పినవాడు. యాత్రకైన వ్యయం ఇతడే భరించినట్లు, పూటకూటింటికి డబ్బు చెల్లించడం, మదనరేఖకు మంచనశర్మ మాటపై సంభావన ఇవ్వడం ద్వారా తెలియవస్తుంది. యాత్ర ఫలితంగా ఇతనికి తమ్మడి సాని కూతురుతో పొందు లభించింది.

ఈయనప్రస్తావన 41,44,48,50,51,53,57,59,63,76,78,79,85,93,96, 102,103,113,115,125,133,139,141,155,171,182,190,192,201,219,225,275, 235,240,257,259,261,263,279,286,289,291, లలో కనుపిస్తుంది.

ఇతడు సంభావింపబడిన తీరు : వైశ్య, కిరాటకుల రత్నము, కిరాట, వైశ్యరాజ, కోమటిసెట్టి అనే విధంగా సామాజికవర్గం పేరుతోను, మంచనశర్మ మిత్రునిగా, వయస్య నర్మసఖుడు, నెచ్చెలికాడు, కేళిసఖుడు, సఖుడు, కట్టనుగు చెలికాడు అనే విధంగాను సంభావింపబడ్డాడు.

**కామమంజరి :** ఓరుగంటి నివాసియైన ఈమె మంచన శర్మకు ననుపుగత్తె. ధార్మికధర్మసతి వీరిరువురి కుమార్తె మదనరేఖ. ఈమె పునర్భువు, ముద్దియ, మదన పట్టాభిషేక మత్తేభ రాజగమన, గాంధర్వి, కామిని, భామిని, కాంత, చంద్రోదయ దేవతను పోలిన శాతోదరి, అరవిందాస్య, అనే విధంగా సంభావింపబడింది.

కాగా ఈమె ప్రస్తావన 41,57,59,62,257,273,281,283,284,285 సంఖ్యలుగల గద్య పద్యాలలో కనుపిస్తుంది.

**మాచల్దేవి :** సర్వజగత్ప్రసిద్ధ సుమనోబాణాసనామ్నాయ విద్యోపాధ్యాయిగా, ప్రతాపరుద్ర ధరణీశోపాత్త గోష్ఠీ ప్రతిష్ఠాపారీణగా చెప్పబడిన వారాంగన. ఓరుగల్లు వాసి.

ఈమె ప్రస్తావన 180,183,186, లలో కనుపిస్తుంది. ఓరుగంటి మాచాంబగా కూడా చెప్పబడింది. కాగా విజయవాడ మల్లికార్జున ఆలయంలో గల శాసనంలో ప్రస్తావింపబడ్డ మాచల్దేవి, ఈమె కాదు కారణం కాలంలోని అంతరం.

**మదనరేఖ:** మంచనశర్మ వలన కామమంజరికి జన్మించినది. కథాకాలము నాటి మధుమాసపు పున్నమవాడు ఈమెకు కన్నెరికమని చెప్పబడింది. ఈమెప్రస్తావన 193,199,218లలో కనుపిస్తుంది.

**పాముల మెంగడు :** ఇతని వృత్తాంతం 223లో చోటుచేసుకుంది.

**మాధవశర్మ :** మధుమావతి తండ్రిగా చెప్పబడ్డాడు. అయితే మంచనశర్మ తండ్రిపేరు కూడా ఇదే. వీరిరువురూ ఒకరు కావచ్చును, కాక పోవచ్చును. 237లో ఇతని ప్రసక్తి కానవస్తుంది.

**మధుమావతీదేవి :** మాధవశర్మకుమార్తె. పద్మినీజాతి స్త్రీగా, దేవకన్యగా, మలయజగంధిగా చెప్పబడింది. ఈమె పూర్వజన్మలో అంగారపర్ణుడనే గంధర్వపతి కుమార్తె కమలపాణి అని, ఆమే ప్రస్తుతం ఓరుగల్లులో మధుమావతిగా జన్మించిందని, రాబోవు జన్మల్లో దక్షారామంలో చిన్నిపోతిగాను, పిదప తమ్మిలేరు పరిసరాల్లోని వేంగిదేశంలో కోవులను చెంచుకుల భేదంలో కత్తులమ్మ పేరుతో జన్మిస్తుందని, ఆమె ఇంటి గోడమీద ఒక జోగి వ్రాసిన తెనుగు పద్యాన్ని బట్టి తెలుస్తున్నదని ఆ పద్యాన్ని చూపి మంచనశర్మ టిట్టిభసెట్టికి వివరించినవైనం 237,238, 239,243,247,257 పద్యాల్లో కనుపిస్తుంది.

**మదాలస :** మధుమావతి చెల్లెలు. మంచన శర్మ మేనమామ మీసాలప్పయ్య ద్వివేది కుమారుడు శ్రీధరునకు ననుపులంజె అని, ఆమె కొరకుగా శ్రీధరుడు జొన్నగడ్డ అగ్రహారాన్ని అయిదువందల రూకలకు కుదువబెట్టి, ఓరుగల్లులో ఆమెతో వుంటున్నట్లు మంచనశర్మ టిట్టిభసెట్టికి చెప్పడం జరిగింది. 244,248, పద్యాల్లో ఈమె ప్రస్తావన వుంది.

**శ్రీధరుడు :** మంచన శర్మ మేనమామ మీసాలప్పయ్య ద్వివేది కుమారుడు. మదాలసతో ఓరుగంటిలోనే నివాసమంటున్నాడు. దాని కొరకుగా జొన్నగడ్డ అగ్రహారాన్ని అయిదు నూర్ల రూకలకు తాకట్టుపెట్టాడు. 244 లో ఇతడు ప్రస్తావింపబడ్డాడు.

## పేర్లు లేకుండా ప్రస్తావనలోనికి వచ్చిన వారు

(ప్రక్కన గల సంఖ్యలు గద్యపద్యాలను సూచిస్తాయి).

41. సూత్రధారుడు
52. శాకునిక వరులు
54. ఏకశిలాపురంలోని చంచలనేత్రలు, వారి పతులు.
56. పల్లెపట్టులలోని భాగ్యవంతుడు
60. వర్షాకాలంలో నిర్భర వియోగగ్లానితో పట్టెమంచంపై ఎక్కటి నిద్రించుచున్న వాడవనిత
68. మేదరకరణవేశ్య. ఈమె వీటిపామర విటుల తంగేటి జున్నుగా (68), కటకారకుల వధూటిగా (69), కటకుటీర విలాసిని (70) గా చెప్పబడింది.
71. పల్లవతస్కరుడు. పై మేదర వేశ్యను కూడిన వాడు.
73. ఋతుస్నానార్థమై వచ్చిన, చండాలాంగన. ఈమె ఇక్షుకోదండుండేర్చిన బాణముతో ఉపమింపబడింది.
75. నీళ్ల బిందెను మోసుకు తెస్తున్న కర్ణాట స్త్రీ.
77. సుసరభేత్తు అమ్ముతున్న జోటి
81. హాలికవాటి యందలి ఒక చక్కని జవరాలు. ఈమెనే పామరభామ (82,83) కాపుటిల్లాలు (84), అని సంభావించటం జరిగింది. సందర్భం ఆమె పిడకలు చేసుకోవటం.
85,86. కర్ణాటాంగన, ఈమెనే కర్ణాటవేశ్య (87), మృగశాబ నేత్ర (88), కర్ణాట తాటంకిని (90), బాలకి (91), కరణ కాంత (95) అని సంభావించటం జరిగింది. సందర్భము, ఆమెతో మంచనశర్మ పరిహాసంగా మాట్లాడుట.
97. ఒత్తుకాండ్రు. జూదమాడుతున్న వారిని ప్రేరేపించి ఉత్సాహ పరుచుచున్నవారు.
101. సంపంగి నూనె అమ్ముతున్న కనుమ అవ్వలి దేశపు కరణకాంత.
102. తెలికజోటి. ఈమె నళినాక్షిగా (103), గానుల దానిగా (104) చెప్పబడింది.
106. సౌచిక పల్లవుడు. దర్జీ.
106. వెలచేడియ. దర్జీ వద్ద రవిక కుట్టించు కోవడానికి వచ్చింది.
107. ఒక ఇంటి మరుగున గల మచ్చెకంటి. ఈమె తన చెలికత్తెకు ఈరీర్చుతూ పేలు చూస్తోంది. ఈమే 108లో చకోరనేత్రగా సంభావింపబడింది.
110. పసపు నూరుకుంటున్న తరుణీ రత్నము.
116. ద్విపద ప్రబంధమున వీరానీకమును పాడుతున్న స్త్రీ. ఈమే పల్నాటి వీరులను పాడుతున్న పడతి (117).
117. వీరసంబెట కోలవేయువాడు, కుంతాభినయము గైకొనువాడు, ఫీట్కార మొనరించు వాడు, ధరణి యాస్ఫోటించి దాటువాడు గుఱ్ఱంపై నుండి ఉరికించు వాడు ఈ పద్యంలో ప్రస్తావింపబడ్డారు.

124. పలనాటి చిగురుబోడులు : కాపు గుబ్బెతలు.
130. బవనీల చక్రవర్తి. బవనీంద్ర నాయకుడు.
131. ఏకవీరాదేవిని ప్రస్తుతిస్తున్న జనంగమ ప్రమద.
134. పురమునకు వచ్చిన కాపు పూవుబోడి.
136. జక్కుల పురంధ్రి.
137. అక్కదేవతల రూపుదాల్చిన జక్కుల స్త్రీలు.
139. అక్కదేవత పూజచేయిస్తున్న గృహస్థుడు.
142,143. మైలార వీరభటులు.
143. గొరగపడుచు
146. పూర్ణకలశములు నిలిపిన బాల వృద్ధాంగనలు
147. ఆసాదులు
159. కరణదేశపు జాణడు. ఇతనినే 162లో కరణ బ్రాహ్మణ విట ముఖ్యుడని చెప్పడం జరిగింది.
169. పూటకూటింటి విశ్వస్త.
171. పూటకూటింటిలోని ఒక వేడుకకత్తె.
173,176. మొగిలిపూవు లమ్ముతున్న పుష్పలావిక.
209. వెలనాటి కోడె విధవలు.
223. పాములమెంగడు
226. తూర్పునాటి గడిడు.
227. పొట్టేళ్ళ పందెగాండ్రు.
253. కోడి పందెగాండ్రు.
257. పుష్పగంధికా నృత్యము చేయుచున్నవారు. విచిత్రశ్లోకములను అనేక రాగాల్లో పాడుతున్న వారు, వివిధ దేశీయ నృత్యములను అభినయిస్తున్నవారు, సురపొన్న క్రీనీడలో కందుక క్రీడ సలుపుతున్న పడతులు. ఈ వచనంలో ప్రస్తావింపబడ్డారు.
259. గోదవార నిక్కిచూస్తున్న నట్టువని కోడలు.
261,262. పణములకు పచ్చడమమ్ము కొన్న సైరికుడు.
263. ఓరుగంటి అక్కల వాడలోని వెలయాండ్రు.
264. ధర్మాసనం తీర్చిన విటలోకము.
266. వేశ్యతల్లి : ద్రవిళుడు.
273. తమ్మడిసాని. పూజారి విధవ
274. పూజరి సాని కూతురు.
293. దోర సముద్రపు నటులు : మోపూరి తిరునాళ్ళలో క్రీడాభిరామాన్ని ప్రదర్శించినవారు.

# క్రీడాభిరామంలో ప్రసక్తమైన నృత్త భేదాలు - వివరణ

క్రీడాభిరామంలో, మంచనశర్మ తన చెలికాడు టిట్టిభసెట్టితో మధుమావతీ దేవి మందిరం నుండి వెలుపలికి వచ్చి, అప్పటికి సాయంకాలం కాగా, సాయం సంధ్యను గూర్చి మిత్రునికి వివరించి చెప్పి ఆ సమయంలో, పల్లవాధరలు పుష్ప గంధికా నృత్యం చేస్తారని, వారాంగనా జనులు కొందరు విచిత్రశ్లోకాలను అనేక రాగాలలో కూర్చి లాస్యాంగాన్ని ఉత్తమంగా ప్రదర్శిస్తారని, లోపలి చావిళ్ళలో ప్రచ్ఛేద, సైంధవ, ద్విమూఢక, స్థితపాఠ్యాభి మార్గాభినయ భేదాలను రసభావ భావనామోద మధురంగా అభినయిస్తారని విశదపరిచాడు.

పాఠకుల ప్రయోజనం కొరకు వాటిని ఇక్కడ వివరించటం జరుగుతోంది. మరిన్ని వివరాలు కోరువారు జాయపసేనాని రచించిన నృత్త రత్నావళిని పరామర్శింపవచ్చును.

పై మంచన శర్మ మాటల్లో నృత్యము. నృత్తము అనేవి చోటుచేసుకున్నాయి గదా! వాటి సంక్షిప్త వివరణలు చూద్దాము. నానాటి బ్రతుకు నాటకమని గదా అన్నమాచార్యులు! అంటే – జీవనం సుఖదుఃఖ మిశ్రమం. దానిని అనుకరించేదే నాట్యం. యథార్థజీవనంలో తాను సుఖ దుఃఖ మిశ్రమంగా అనుభవిస్తున్న దానినే, రంగస్థలంపై నటులు అభినయించగా చూసి, సామాజికుడు దాని నుండి తత్కాలీనంగా ఆనందానుభూతిని పొందుతూ, అనంతర కాలంతో అందలి ఉపదేశాన్ని గ్రహించి తన జీవన గమనాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాడు. ఆ విధంగా నాట్యం సమాజానికి రెండు విధాలుగా ఉపయోగపడుతోంది,

నాట్యం రసాన్ని ఆశ్రయించుకొని, వాక్యార్థాభినయాత్మకమై వుంటుంది. విభావాదుల సమ్మేళనం వలన కలిగేది రసం. వాక్యార్థం పదార్థాల సమాహారం కాగా, నృత్యం పదార్థాభినయాత్మకము, భావాశ్రయము. ఈ రెండింటి కంటె వేరైనది నృత్తము. ఇది కేవలం తాళలయాశ్రితం. కాగా ఇవి, మార్గ దేశి భేదాల వలన రెండు విధాలు. అది అలా వుండగా నృత్యము, లాస్యము తాండవమని రెండు విధాలు. లాస్యము సుకుమారమైనది కాగా, తాండవం ఉద్ధతము.

స్త్రీ పురుషులకు సంబంధించిన అనురాగ సంబంధమైన భావాన్ని లాసమంటారు. దానికి సంబంధించిన విధివిధానం లాస్యం. అంటే వారిలో అనురాగ భావాన్ని వృద్ధి పొందించేందుకు సహకరించేది లాస్యము. కనుకనే లాస్యం 'మనసిజోల్లాస హేతువు'గా చెప్పబడింది. అంటే స్త్రీ పురుషులలో కామోద్దీపనము కలిగించడానికి సహకరిస్తుంది. కలిగిస్తుంది. శివుడు పార్వతికి దీనిని ఉపదేశించాడు. కనుక సాధారణంగా స్త్రీలే దీనిని

అభినయిస్తారు. పురుషులు అభినయించరని కాదు. సుకుమారమైన శరీరాంగములు కలపురుషులు కూడా అభినయిస్తున్నారు కాని స్త్రీలకే ప్రాధాన్యం.

లాస్యానికి సంబంధించి 10 అంగాలున్నాయి. వాటిని లాస్యాంగాలు అంటారు. అవి 1.గేయపదం 2.స్థితపాఠ్యం 3.ఆసీనము 4.పుష్పగంధిక 5.ప్రచ్ఛేదకం 6.త్రిమూఢకం 7.సైంధవం 8.ద్విమూఢకం 9.ఉత్తమోత్తకం 10.ఉక్తప్రత్యుక్తం అనేవి.

ఇందులో క్రీడాభిరామంలో ప్రసక్తమైనవి పుష్పగంధిక, ప్రచ్ఛేదన, సైంధవ, ద్విమూఢక, స్థిత పాఠ్యమనేవని ముందు చూసాము. నాట్య, నృత్య, నృత్తాలను దేశి, మార్గ అనే రెండు పద్ధతుల్లోనూ అభినయించటం జరుగుతుందని ముందు చెప్పుకున్నాము. ఇక్కడ అవి మార్గపద్ధతిలోనే జరిగాయి. కారణం వాటిని అభినయించిన వారు వారాంగనలు. వారాంగన లన్నంత మాత్రాన, వారిని కేవల భోగకాంతలు మాత్రమే అనుకోవడం పొరపాటు. సంగీత సాహిత్యాలను పరమనిష్ఠతో అభ్యసించినవారు. నిన్న మొన్నటి వరకు అంటే 50 ఏండ్లక్రితం వరకు పెద్దాపురం, గుడివాడ మున్నగు చోట్ల గల దేవదాసీలు ఆ కోవకు చెందినవారు. రసజ్ఞులైన పండితుల సమక్షంలో, ఆలయవార్షికోత్సవాలలో, ప్రముఖుల ఇండ్లలో జరిగే వివాహాది శుభకార్యాలలో ప్రదర్శనలిచ్చేవారు. ఆంగిక, వాచిక అభినయాల్లో, ఆహార్యం విషయంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. ప్రేక్షక కోటి నుండి, సదస్యుల నుండి ఎలాంటి విమర్శలు వస్తాయోనని ఎంతో అప్రమత్తంగా వుండేవారు. విమర్శలను సహృదయంతో స్వీకరించేవారు. తమదైన విషయ పరిజ్ఞానపాటవంతో, అత్యంత వినయంగా విమర్శలను ఎదుర్కొనే వారు. చాల సందర్భాల్లో శిక్షగరపిన ఆచార్యులు కూడా వారివెంట వుండేవారు. అలాంటి రెండు సందర్భాలకు ఈ రచయిత ప్రత్యక్ష సాక్షి. ఇప్పుడు లాస్యాంగ లక్షణాల గూర్చి నృత్తరత్నావళి ప్రతిపాదనలను గమనిద్దాం.

యత్రాసన సుఖాసీనాన్తం త్ర్యోద్య సంయుతం
గాయంతి గాయనీ శ్శుష్కం తద్గేయ పదమిష్యతే
ఆసనస్థా వదేద్యత్ర ప్రాకృతం విరహే వధూః
మన్మథానల తప్తాంగీ స్థితపాఠ్యం తదుచ్యతే
చింతా శోకాన్వితం సర్వైః వాద్యై రభినయై రపి
హీనం యత్రాస్యతే తస్మాత్ ఖ్యాత మాసీన సంజ్ఞయా
నృత్తం గీతం చ వాద్యంచ యత్ర నానావిధం భవేత్
పుంవచ్చ వివిధా శ్చేష్టా నార్యాస్సా పుష్పగంధికా
ప్రచ్ఛేదకో భవేద్యత్ర జ్యోత్స్నా సంతాపవిహ్వలాః
కామిన్యో యాంతి నిర్వ్రీలాస్స్వపరాధనపి ప్రియాన్

నాట్యం పుంభావ భూయిష్ఠం సమవృత్త విభూషితం
అనిష్ఠురశ్లక్ష్ణ పదం యత్రస్యాత్త త్రిమూఢకం
పాత్రం వంచిత సంకేతం నాట్యం పాఠ్యేన చోజ్ఝితం
భాషాచ సైంధవీ యత్ర తద్జ్ఞా స్తత్సైంధవం విదుః
ముఖప్రతిముఖోపేతం చతరశ్ర పదక్రమం
శ్లిష్ట భావరసం యత్త ద్వైచిత్ర్యార్థం ద్విమూఢకం
విచిత్రశ్లోక బంధం యన్నానా రస సమాశ్రయం
ఉత్తమోత్తమకం తత్స్యాత్ లీలా భావ మనోహరం
సాధిక్షేపైః పదైర్యుక్తం చిత్రగీతార్థ యోజితం
కోపప్రసాద సంజాత ముక్త ప్రత్యుక్తకం విదుః

**గేయపదం :** గాయనీ మణులు ఆసనాల్లో సుఖాసీనులై. తంత్రీవాద్యముల సహకారంతో గానం చేయటాన్ని గేయపదమంటారు. తాళం కూడా వుంటుంది. గేయగానం గాయనులే ప్రత్యక్షంగా చేస్తారు. అంటే నేపథ్యగానముండదు. రూపక పాత్రలు గానం చేయటం వుండదు. ప్రియుని గుణాలను గానం చేస్తారు.

**స్థితపాఠ్యం :** విరహంలో మన్మథుని ప్రతాపానికి తాళలేక, వివశురాలై.ఆసనంలో వుండి ప్రాకృతంలో భాషిస్తే అది స్థితపాఠ్యం. అయితే ఇందులో తాళగతి తగదు.

**ఆసీనము :** చింతా శోకాన్వితయై, ఆసీనురాలై గీతాలాపం గావించటం ఆసీనం. అంటే ఇందులో అవయవవిక్షేపం గాని, వాద్యవాదన ప్రసక్తిగాని వుండదు.

**పుష్పగంధిక :** బహువిధాలైన నృత్తాలు గీతాలు, వాద్యాలు ఇందులో వుంటాయి. పురుషులకు వలె వివిధములైన చేష్టలుంటాయి. స్త్రీ, పురుష వేషాన్ని ధరించి గాని, లేకుండా గాని, పురుష చేష్టలను ప్రదర్శించుట వుంటుంది. లలిత పదయుక్తమైన సంస్కృతం ఉపయోగింపబడుతుంది.

**ప్రచ్ఛేదకము :** ప్రియుని విరహంలో వేగిపోతూ, నాయిక (కామిని) వెన్నెల్లో విహరిస్తూ, ఛాయాదర్శనంలో ప్రియుని భావిస్తూ హర్షాతిశయంతో సంచరించటం ప్రచ్ఛేదకం. ఈ ప్రతిబింబ దర్శన భావన-మదిరాపానం గావిస్తున్న వేళ మదిరలో కావచ్చును లేదా దర్పణ ప్రతిబింబితం కావచ్చును. అంటే ఇక్కడ యథార్థత లేదు. కేవలం భావన మాత్రమే. దానికి (భ్రమకు) లోనైన కామని హర్షాన్ని, ప్రణయకోపాన్ని ప్రదర్శించటం.

**త్రిమూఢకము :** ఇది పురుష భావాధికమైనది. ఈ లాస్యాంగంలో నాయకుడు అపరాధి. నాయిక విషణ్ణయై అతనిని ద్వేషించటం, నవనాయిక ప్రథమ ప్రణయ కావడం వలన

లజ్జావ్యథిత కావడం - ఇలా ముప్వురి ప్రమేయం వలన ఇది త్రిమూఢకం. ఇందులో సమవృత్త రచనా విధానంతో కూడిన విభూషితత్వం, నిష్ఠురములు కాని విశ్లక్ష్ణములైన పదాల పొందిక వుంటుంది. శ్లక్ష్ణము అంటే ప్రియమైన అని అర్థం.

**సైంధవము :** సింధుదేశ భాషాశ్రయము అనగా అచ్చటి దేశీయ భాష (ప్రాకృతము) ప్రకృతిజనులు మాట్లాడునది) లో వుంటుంది గనుక ఇది సైంధవము. వస్తానని చెప్పి రాక మోసపుచ్చిన సందర్భంలో ఒక వ్యక్తి సింధుప్రాకృతంలో పలుకుతూ అభినయ పూర్వకంగా అనగా కరణములతో వ్యవహరింపబడేది సైంధవం. తంత్రీవాద్యాల సహకారముంటుంది.

**ద్విమూఢకము :** ముఖ ప్రతిముఖ సహితమై చతురశ్ర పదక్రమం, శ్లిష్టభావ రసోపేతమై, విచిత్రార్థం గలది ద్విమూఢకము. నాయికానాయికల వ్యామోహము ఇందులో ప్రతిపాదిత మవుతుంది. ఒకప్పుడు ఇద్దరు నాయిక లుండవచ్చును. ముందు సామాజికులకు అభిముఖముగా పరిచయంము గావించుకొని పిదప అభినయం చేసే వారు ఇద్దరూ ఒకరి కొకరు ప్రతిముఖముగా, రంగస్థలం నాలుగువైపులా సంచారం గావిస్తూ చేసే అభినయం.

**ఉత్తమోత్తమకము :** ఇందులో విచిత్ర శ్లోక బంధముంటుంది. అనేక రసభావాలకిది ఆశ్రయం. అనేక రస సంశ్రయం గనుక అసాధారణ రసానికి ఆశ్రయం. ఇందలి శ్లోకఘటనా విధానాలు వివిధ పద్ధతుల్లో విచిత్రములై వుంటాయి. ఇది లీలాభావ మనోహరమై వుంటుంది.

**ఉక్త ప్రత్యుక్తము :** సాధిక్షేప పదాలతో కూడిన చిత్రగీతార్థాలలో కోప ప్రసాద సంపాదితమై వుంటుంది. ఇది మాటకు మాటగా (సంవాదము) పలికే మాటలన్నీ కోపం, ప్రసాదము, ఆక్షేపకాలతో కూడి ఆహ్లాదజనకమై రసానుభూతి కలిగిస్తుంది.

*****

**గొండ్లి :** గోండలీ గోమండలి

దేశీ నృత్త విశేషాలలో ప్రధానమైనది. దీనిని గోండలీవిధి, కుండలిని విధి అని కూడా అంటారు. మహారాష్ట్రలో భిల్ల స్త్రీని గోండలి అంటారు. ఈ విషయమై నృత్తరత్నావళి ఇలా చెపుతోంది.

కల్యాణ కటకే పూర్వం భూత మాతృ మహోత్సవే
సోమేశః కౌతుకాత్కాంచి ద్భిల్లీవేష ముపేయుషీం
నృత్యంతీ మధగాయంతీం స్వయం ప్రేక్ష్య మనోహరం
ప్రీతో నిర్మితవాన్ చిత్ర గోండలీ విధి మిత్యయం
యతో భిల్లీ మహారాష్ట్రే గోండలీత్యభిదీయతే
కుండలీం నామ మృద్వంగీం సుకేశీం దివ్యయోషితం

సంగీతం కోమలం నృత్తం శిక్షయామాస పార్వతీ

తన్నృత్తం కుండలీ మాహుః తత్సంబధా త్పురాతనాః

కల్యాణకటకంలో పూర్వం ఒకప్పుడు భూతమాతృమహోత్సవం జరిగిన సందర్భంలో అప్పటి ప్రభువు సోమేశ్వరుడు, నర్తనం గానం చేస్తున్న భిల్లవేషంలో వున్న ఒక స్త్రీని చూచి ఆమె మనోహరాకృతికి నృత్యానికి సంతోషించి చిత్రగోండలీ విధిని నిర్మించాడు. గోండలి నామానికి కారణం భిల్లస్త్రీని మహారాష్ట్రలో గోండలి అనడమే.

ఒకప్పుడు పార్వతీదేవి కుండలి అనే పేరుగల మనోహారాకృతి గల ఒక దివ్యస్త్రీని ఆదరించి సంగీత నృత్తాలను ఉపదేశించింది. అలా కుండలీ సంబంధమైనది గనుక ఇది కుండలీ నృత్తమని ప్రాచీనుల అభిప్రాయం.

అయితే శార్గదేవుడు సంగీత రత్నాకరంలో గౌండలి అని సంభావించాడు. ఇందులో కఠినవాద్య ప్రబంధాల ప్రసక్తిలేక ఆయా ధ్రువాశ్రితములైన గీతాలు లాస్యాంగాలు మాత్రమే వుంటాయి. నర్తకి నర్తిస్తూ స్వయంగా గానం చేస్తుంది. త్రివలీవాదనం కూడా స్వయంగా చేస్తుంది.

కాగా పార్వతి శివపత్ని కాగోరి చిరకాలం తపస్సుచేసి, చివరకు లాస్యం చేస్తాను గాక అని, స్ఫాటిక మండపంలో గాలికి దానంతట అది మ్రోగే వేణుస్వనం ఉపాంగ శ్రుతిగా, భ్రమరీ నినాదం గీతంగా, కోకిల కూజితం కాహళంగా లాస్యం చేసింది. శివుడు దానిని చూసి, ఆనందంతో తాను కూడా పార్వతితో నృత్తం గావించాడు. దానిని వేదాలు కుండలి అని సంభావించాయి. కనుక దానికి ఆ పేరు. కుండలీ నృత్తము శృంగార రస సంబంధియై మధురమై ఆహ్లాదాన్నిస్తుంది.

# ప్రసక్తమైన గ్రామాలు, నదులు ప్రాంతాల వివరణ

2.**మాలిని :** ఒక నది. గంగానదికి కూడా వర్తిస్తుంది.

5.**కర్ణాటక్షితి :** కర్ణాటరాజ్యము. రాయవంశస్థులు పరిపాలించారు. బళ్ళారి జిల్లా విజయ నగరము రాజధాని. నేటి కర్ణాటక రాష్ట్రము. చంద్రామాత్యుని కాలం నాడు దీనికి ప్రభువు పెదబుక్కరాయలు.

9.**మిరుతూరు :** మల్లన భార్య త్రిపురమ. ఆమె తండ్రి విట్ఠమంత్రి. ఆయన గృహనామంగా మిరుతూరు చెప్పబడింది. అయితే ఆ పేరుతో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో రెవిన్యూ గ్రామం లేదు. కాగా మిడుతూరు పేరుతో కడపజిల్లా కడప తాలూకాలో ఒకగ్రామం, కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకాలో మరో గ్రామం ఉన్నాయి. అచ్చుతప్పుగా, భావించడం కుదరదు. ఇంకెక్కడైనా ఆ పేరుతో గ్రామమైనా వుండి వుండాలి, లేదా, ప్రాసకొరకు రేఫను కవి ప్రయోగించి వుండాలి.

20,293.**శ్రుతపర్వత దుర్గము :** గుంటూరు జిల్లాలోని వినుకొండ ఈ విధంగా సంస్కృతీ కరింపబడింది. క్రీడాభిరామ రచయిత వల్లభరాయని ఇంటిపేరు వినుకొండ. ఇంటిపేరని భావించటం కంటే, ఆ దుర్గానికి ఆయన పూర్వికులు అధికారులు కావడాన, అలా వ్యవహరించడం జరిగింది. గ్రామనామాలు ఇంటిపేర్లుగా రావడానికి మూలకారణం, ఆ కుటుంబాల వారు ఆయా గ్రామాల నుండి మరొక ప్రాంతానికి తరలిపోవడం. అలాంటిసందర్భాల్లో అవే వారి గృహనామాలుగా పరిణమించాయి. గ్రామాధికారులు, చేతివృత్తుల వారు అదే గ్రామంలోవున్నా, ఆ గ్రామం పేరే వారికి ఇంటిపేరవుతుంది!

22. **మోపూరు :** కడప జిల్లా పులివెందుల తాలూకా గ్రామం. క్రీడాభిరామంలో ప్రస్తావింప బడిన భైరవాలయం ఈ గ్రామంలో ఇప్పటికీ వుంది. ఈ దేవాలయానికి సంబంధించి దక్షిణభారత శాసన సంపుటి, 16వ వాల్యూంలో 1,3,28,91,139 సంఖ్యలతో ఆరు శాసనాలు ఉన్నాయి. ఇందులో 1వ నెంబరు శాసనం శక 1273 నాటిది. ఉదయగిరి రాజధానిగా పాలించిన సావన్నవడయ, ముల్కినాటిలోని చదువురేవుల గ్రామాన్ని భైరవదేవునికి ధారాదత్తం చేయడం అందులోని విషయం.

22,294. **ముల్కినాడు : ములికినాడు :** మోపూరు ముల్కినాటిలోనిదిగా చెప్పబడింది. నేటి కడపజిల్లాలోని కడప, పులివెందుల తాలూకాలు కర్నూలుజిల్లాలోని శిరువెళ్ల తాలూకాలోని కొంతభాగం ములికినాడుగా శాసనాల వలన తెలియవస్తోంది.

22 : **త్రిపురాంతకము :** నేటి ప్రకాశంజిల్లా మార్కాపురం తాలూకా గ్రామం. శ్రీశైలానికి తూర్పుద్వారం. దీనికే కుమారగిరి అని కూడా పేరు.

28. **నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో ఆ పేరు గల జిల్లాకు కేంద్ర కార్యస్థానం.

29. **ధారానగరము :** భోజరాజు రాజధాని.

36. **చిమ్మపూడి :** కవి అమరేశ్వరుని ఇంటిపేరుగా నిలిచిన గ్రామనామం. చిమ్మపూడి ఖమ్మం జిల్లాలో పాపటపల్లి రైల్వే స్టేషనుకు దగ్గరలో వుంది.

33. **రావిపాడు :** దీని ఔపవిభక్తిక రూపం 'రావిపాటి' ప్రేమాభిరామకర్త త్రిపురాంతకుని గృహనామంగా నిలిచింది. బహుశా గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకాలోని రావిపాడు కావచ్చును. గుంటూరుజిల్లా బాపట్ల తాలూకా, శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం తాలూకా, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం తాలూకా, తాడేపల్లిగుడెం తాలూకా, ప్రకాశం జిల్లా కంభం తాలుకా, నెల్లూరుజిల్లా వెంకటగిరి తాలూకాలలో కూడా రావిపాడు పేరుతో గ్రామాలున్నాయి.

43. **ఆంధ్రనగరము :** నేటి వరంగల్లు

54. **ఏక శిలాపురము :** వరంగల్లు

43,92,189. **కాసలనాడు :** మెదక్ కరీంనగర్ జిల్లాలలోని కొంత భూభాగము

64,128,145,186,238,242,263,293. **ఓరుగంటిపురము : ఓర్గల్లు :** వరంగల్లు.

75. **కర్ణాటి :** కర్ణాటకదేశపు స్త్రీ. ఈ కర్ణాట దేశప్రసక్తి కర్ణాటాంగన 86,కర్ణాటవేశ్య, 87,కర్ణాట తాటంకిని 90,కర్ణాట స్త్రీలు 92,అనే పద్ధతిలో కూడా ప్రసక్తమైంది. ముందు, 5వ పద్యంతో కర్ణాటక్షితి అనే పదాన్ని గమనించాము. దానిని నేటి కర్ణాటక రాష్ట్రప్రాంతంగా చెప్పడం జరిగింది. అయితే ఇక్కడ చెపుతున్న కర్ణాటకం అదికాదు. ఈ కర్ణాటకం వేరు. 75,90,92 పద్యాల్లో చెప్పబడిన కర్ణాట స్త్రీని మంచన శర్మ 95వ పద్యంలో 'కరణకాంత' అని సంబోధించాడు. అంటే ఒకరినే, కర్ణాటిగాను, కరణదేశపు కాంతగాను సంభావించినట్లయింది. కర్నాటి, కరణం అనేవి నేడు కూడా కొందరి గృహనామాల్లో కనుపిస్తాయి. (ఉదా: కర్నాటి లక్ష్మీనరసయ్య, కరణం బలరామ కృష్ణమూర్తి). ఇక్కడ 'కరణం' పదం గ్రామాధికారిని గాక, ప్రాంతం పేరునే సూచిస్తుంది! అలాగే కర్నాటి కూడా! కరణదేశాన్ని కనుమ అవ్వలి దేశంగా, ఇదే గ్రంథంలో సంపంగి నూనెను అమ్మే స్త్రీని గూర్చిన వర్ణనలో, (పద్యం101) చెప్పడం జరిగింది. అంటే

స్థూలంగా రెండింటినీ ఒకటిగాను, మరో పద్ధతిలో వేరు వేరుగాను చెప్పడం జరిగింది.

ఇక్కడ పాఠకులు, శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో తన భాష కర్ణాట భాష అనడాన్ని, కాశీఖండంలో తాను కర్ణాట కటక పద్మవనహేళి అనడాన్ని, శివరాత్రి మాహాత్మ్యంలో కర్ణాటకమలముఖులు కనుమ యవ్వలివారుగా (2-54) చెప్పివుండటాన్ని గమనికలోనికి తీసుకుందురుగాక! శ్రీనాథుడు తన భాష కర్ణాటభాష అనడాన్ని, పూర్వపండితులు ఆయన పూర్వులు నేటి కర్ణాట రాష్ట్రానికి చెందినవారై వుంటారని, కర్ణములకు (చెవులకు) ఇంపైన భాష అని చెప్పడం తెలిసిందే? కాని అవి ఎంతవరకు నిలుస్తాయో తరువాత చూద్దాం! ప్రస్తుతానికి కావలిసింది కర్ణాట కమల ముఖులు కనుమ అవ్వలివారని శ్రీనాథుడు చెప్పటాన్ని గమనిక లోనికి తీసుకుంటే, క్రీడాభిరామంలో కర్ణాటస్త్రీ కరణకాంత ఇరువురూ ఒకే ప్రాంతానికి చెందిన వారుగా ముందు చెప్పిన మాట-అంటే అక్కడ కూడా కనుమ అవ్వలి అనే ప్రయోగాన్ని బట్టి, నిరూపణ అవుతోంది.

ఇప్పుడు కరణ దేశమేదో, కర్ణాట దేశమేదో గమనిద్దాము. ముందుగా కరణదేశ విషయం చూద్దాము, అది కనుమ అవ్వలి దేశంగా క్రీడాభిరామం చెపుతోంది. దాని ప్రసంగం వరంగల్లులో కదా జరిగింది. మనకు తూర్పు కనుమలున్నాయి. పడమటి కనుమలున్నాయి. ఇందులో ఏ కనుమలను క్రీడాభిరామం నిర్దేశిస్తున్నట్లు? అక్కడ ఏమీ సమాచారం లేదు. అయితే వరంగల్లుకు దగ్గరైనవి తూర్పుకనుమలేగాని పడమటి కనుమలుకావు. కనుక అవి తూర్పు కనుమలే కావాలి. దీనిని నిశ్చయించి చెప్పడం ఎలా? అంటే-క్రీడాభిరామకర్త వినుకొండ వాడు. దానిని ప్రదర్శించింది కడపజిల్లా మోపూరులో. అవి పడుమటి కనుమలే అయితే, రెండు విధాలుగా కనుమలున్నప్పుడు, వాటిని స్పష్టంగా, వల్లభరాయడు నిర్దేశించాలిగదా! లేకుంటే పాఠకుల్లో సంధిగ్ధత నెలకుంటుంది గదా! కనుక అవి తూర్పు కనుమలే కావాలి. అయితేమాత్రం! వల్లభరాయడు నిర్దేశించి చెప్పవచ్చు గదా అనే సందేహం మన మనసుల్లో మెదిలే అవకాశం లేకపోలేదు! కాని ఒకటి ఆలోచించండి. క్రీడాభిరామం తెనుగురచన. వారికి పరిచయమైనవి తూర్పుకనుమలే తప్ప పడమటి కనుమలు కావు. అలా అవి అందరికీ పరిచయమైనవే అయినపుడు, స్థానికుడైన వల్లభరాయడు నిర్దేశించి చెప్పవలసిన అవసరం ఏముంటుంది గనుక! కనుక అవి తూర్పు కనుమలే! అయితే మరో సందేహం పొడకడుతుంది. అదేమంటే -తూర్పు కనుమల పర్వతశ్రేణి శ్రీకాకుళం జిల్లా నుండి చిత్తూరుజిల్లా వెలిగొండల వరకు వ్యాపించి వున్నాయి గదా! అయినపుడు కనుమ అవ్వలిదేశం అంటే, ఏ ప్రాంతాన్ని నిర్దేశించాలి అనేది ఆ సందేహం. దానికి సమాధానం, వల్లభరాయడు మోపూరులో

వుండి చెపుతున్నాడు గనుక, స్థానికమైన కనుమల భాగాన్నే నిర్దేశిస్తున్నాడని చెప్పడం ఒక సమాధానం. ఇంతకంటే నిర్దుష్టమైనది కర్ణాటదేశాన్ని గ్రహించి చెప్పటం! అది కూడా కనుమ అవ్వలిదిగా చెప్పబడింది గదా! కనుక ప్రసక్తమైన కర్ణాట దేశమేదో నిరూపిస్తే, దానిని బట్టి కరణదేశమేదో కూడా తెలుస్తుంది. (నేటి కర్ణాటక రాష్ట్రం ఏ కనుమలకూ ఆవల లేదుగదా!)

ఇప్పుడు మనకు అవసరమయ్యేవి, భీమఖండం, కాశీఖండాల్లో శ్రీనాథుని వక్కణలు. శ్రీనాథుని జన్మస్థలం సింగరాయకొండకు సమీపాన గల తీర గ్రామం పాకల. అది కర్ణాటదేశంలో వుంది. రెండవ ప్రౌఢదేవరాయలు రాజప్రతినిధిగా ఉదయగిరి రాజధానిగా పాలిస్తున్నప్పుడు, ఆ ఉదయగిరిని 'ఉదయగిరి నామ్నీ నగరే కర్ణాట కటక మధ్యస్థలే' అని నిర్దేశించి శాసనంలో చెప్పబడింది. ఇప్పుడు శ్రీనాథుని కర్ణాటకటక పద్మవనహేళి అనే దానిని వివేచిస్తే అతడు తనభాష కర్ణాటభాష అనడంలోని ఆంతర్యం బోధపడుతుంది. నిన్న మొన్నటి వరకు పాలించిన ఆంగ్లేయులు. కృష్ణానది దక్షిణపార్శ్వం నుండి కన్యాకుమారి వరకు గల తీర భూభాగాన్ని కర్నాటకగా సంభావించి వుండటం విజ్ఞులైన పాఠకులకు తెలిసిన విషయమే! (మరిన్ని వివరాలు కోరేవారు నా రచన "అక్షర యజ్ఞం"లోని శ్రీనాథుడు కర్ణాటుడే అనే వ్యాసం చూడగలరు). తూర్పుసముద్రం, తూర్పుకనుమలు, కృష్ణానది దక్షిణ పార్శ్వం నుండి, పెన్నానది ఎడమపార్శ్వం వరకుగల భూభాగం స్థూలంగా కమ్మనాడు. (నిజానికి గుండ్లకమ్మ వరకే) ఇందులో తీరభాగం వెలనాడు (వేలము : తీరము). తీరభాగానికి దూరంగా వున్న ప్రాంతంలో (పై హద్దులలో) ఈవని కంద్రవాడినాడు కోట కమ్మనాడు, గిరి పశ్చిమభూమి (గిరులు : కొండవీటి కొండలు) కొండనతనాటిసీమ, పల్నాడు, వెంగళనాడు, దూపాటిసీమ. కరణదేశము అనే విభాగాలుగా పిలువబడింది. స్థూలంగా కరణ దేశ మేదంటే కనిగిరి నుండి కందుకూరు ఆవలివరకు, (పెన్నహద్దు) నేటి జాతీయరహదారికి పడమటగల ప్రాంతం. తీరభూమిలో గుండ్లకమ్మనుండి పెన్నవరకు గల భూభాగం కర్నాటకం. దాని ఆవలిది పాకనాడు ఈవలిది వెలనాడు అని ముందు చెప్పడం జరిగింది. కనుక కరణ దేశమంటే సుమారుగా నేటి కందుకూరు తాలూకా ప్రాంతం!

ఇక కర్నాటస్త్రీ అంటే – తీరప్రాంతపు స్త్రీ అన్నమాట. కర్నాటకం గుంటూరు నుండి కన్యాకుమారి వరకూ గల తీరభూమి అంతా అయినా కనుమ అవ్వలి అనే నిర్దేశం వలన ఒంగోలు నుండి నెల్లూరు వరకూ గల భూభాగమని బోధపడుతుంది. బహుశా కర్ణాటవేశ్య నెల్లూరి వాసి కావచ్చునేమో!

119,121,122,115,117, **పలనాడు : పల్లెక్ష్మాకాంత, పల్లెదేశము** : గుంటూరు జిల్లాలో

ఆ పేరుతో గల తాలూకాప్రాంతము దాని పరిసరాలలో గల ఇతర తాలూకాలలోని కొంతభూబాగము.

118. **గురిజాల :** పలనాడులోని గ్రామం. నలగామరాజు రాజధాని.

121. **నల్లంగొండ :** ఇది కారంపూడికి దక్షిణంగా కనుపించే పర్వతశ్రేణి. ఇది దాటి బాలచంద్రుడు మేడపినుండి కారంపూడికి వచ్చాడు. నాగులేరు ఈ పర్వతశ్రేణిలోనే పుట్టింది. అంతేతప్ప ఆపేరు గల జిల్లాకు కేంద్ర స్థానమైన నల్గొండ కాదు.

121. **నాగరికల్లు :** ప్రస్తుతం నకిరేకల్లు. గుంటూరుజిల్లా నరసరావు పేట తాలూకా చల్లగుండ్ల మండల గ్రామం. అంతే తప్ప నల్గొండ జిల్లా లోనిది కాదు.

121. **పల్లేరు :** కృష్ణానదికి స్థానికంగా గల పేరు

121. **నాగులేరు :** కారంపూడిని అంటి ప్రవహిస్తున్న ఏరు.

123. **మాచెరల :** మాచెర్ల. ఇక్కడ గల చెన్నకేశవాలయమే క్రీడాభిరామంలో ప్రస్తుతింపబడింది. శాసనాలలో మహాదేవి చెర్ల (చెరువులు)గా చెప్పబడింది. కాని నిజానికి మాచెర్ల అనేది ఒక చెట్టు పేరు.

123. **శ్రీగిరి :** ప్రస్తుతం శ్రీగిరిపాడు. ఇక్కడ ప్రసిద్ధమైన శివాలయముంది. దీనినే వల్లభ రాయడు శ్రీగిరిలింగమని పేర్కొనడం జరిగింది. పల్నాడు వైపునుండి నల్లమల అడవులకు ఇది ముఖద్వారం వంటిది. విమర్శకులు దీనిని శ్రీశైలంగా భావించటం పొరపాటు.

128. **మండపాక :** పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలో తణుకుకు నైరుతి దిశలో 5,6 కి మీ. దూరంలో వుంది. ఇక్కడ గల గ్రామదేవతను స్థానికులు ప్రస్తుతం ఎల్లా రమ్మగా సంభావిస్తున్నారు.

128,129. **పెనుంబాక :** పెనుమాక. గుంటూరుజిల్లా మంగళగిరి తాలూకాగ్రామం. ఉండవల్లి కొండలను అంటి పడమరవైపున వుంది. ఇక్కడ, ప్రస్తుతం అమ్మవారిని పోలేరమ్మ అని సంభావిస్తున్నారు. రచయిత ఈ ఆలయాన్ని దర్శించడం జరిగింది.

128. **మాహురము :** మెదకుజిల్లాగ్రామం. జోగిపేట దగ్గరలోని టేకుమాలకు 7 కిలోమీటర్ల దూరంలోవుంది.

128. **నాగవరం :** సమంగా తెలియరాలేదు. కారణం ఈ పేరుతో చాలా గ్రామాలుండటం, చాలా గ్రామాల్లో అమ్మవారి ఆలయాలుండటం. అయితే నల్గొండ జిల్లాలోని దేవలమ్మ నాగవరంకాని, వరంగల్లు జిల్లాలోని ఏటూరు నాగారం కాని కావడానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

128,129. **పోలాస :** పొలవాస. కరీంనగరుజిల్లా గ్రామం.

129. **కదుళ్ళవాగు :** ఏటూరు నాగారం సమీపంలో స్థానికంగా గల వాగుల్లో ఒకటి కావచ్చును.

145. **కత్రశాల :** తెలియరాలేదు.

145. **ఐనప్రోలు :** ఐనవోలు, అయినవోలు : వరంగల్లు జిల్లాగ్రామము. గుంటూరు జిల్లాలో మరో అయినవోలు వుంది. క్రీడాభిరామంలో ప్రసక్తమైంది వరంగల్లు జిల్లా లోనిది.

145. **బాసవెల్లి :** తెలియరాలేదు.

185. **ఢిల్లి :** భారతదేశపు ప్రస్తుత రాజధానీ నగరము.

204,206,209. **కాకుళము, సిరికాకుళము, కాకొల్లి :** కృష్ణాజిల్లా దివితాలూకాలోని శ్రీకాకుళం. ఇక్కడి అధిష్ఠాన దైవం ఆంధ్రనాయకుడు, ఆంధ్రవల్లభుడు తెలుగురాయడు, కాకుళయ్య అనే విధంగా సంభావింప బడతాడు. కాసుల పురుషోత్తమ కవి చెప్పిన ఆంధ్రనాయక శతకం ఈ దైవం మీద చెప్పినదే.

208. **కృష్ణాతటిని :** కృష్ణానది.

209. **వెలనాడు :** 'వేలము','వేల'గా రూపెత్తింది. వేలము అంటే తీరభూమి. కృష్ణానది దక్షిణాపార్శ్వము నుండి గుండ్లకమ్మ వరకుగల తీరభూమికి వెలనాడని శాసనాల్లో వ్యవహారం. దీనికే ఆరువేల నాడని పేరు. అంటే ఏరులు, సముద్రతీరముగల భూభాగమని అర్థం. అంతేగాని ఆరువేల గ్రామాలు గల నాడని కాదు.

212. **పేరకమ్మ :** పేర్ అంటే పెద్ద అని, కమ్మ అంటే నది అని అర్థాలు. పెద్దనది. కృష్ణానది ఇలా చెప్పబడింది. పేరార్, పేర్దొరె అనికూడా శాసనాల్లో వ్యవహారం.

226. **తూర్పునాడు :** శ్రీకాకుళం, విజయనగరం విశాఖ జిల్లాలు తూర్పునాడుగా సంభావింపబడ్డాయి. నేడు ఉత్తరాంధ్ర అంటున్నారు. కాని అది పొరపాటు.

233. **పానుగల్లు :** నల్గొండ జిల్లా గ్రామం.

238. **సింహళద్వీపము :** నేటి శ్రీలంక

242. **అలకాపురము :** కుబేరుని పట్టణము.

242. **దక్షారామము :** తూర్పుగోదావరి జిల్లాలోని నేటి ద్రాక్షారామము. ఇక్కడ భీమేశ్వరాలయంవుంది. అమ్మవారి పేరు మాణిక్యాంబ. ఈమెనే క్రీడాభిరామకర్త చిన్నిపోతి అని చెపుతున్నాడు. కాగా దాక్షారామం శాసనాల్లో దాకరేమిగా చెప్పబడింది.

242. **తమిలేరు :** తమ్మిలేరు. పశ్చిమగోదావరిజిల్లా ఏలూరును ఆంటి ప్రవహిస్తున్న ఏరు.

242. **వేగి :** దేశము మరియు గ్రామము. పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణాజిల్లాలోని కొంతభాగం వేంగిదేశం లోనిదిగా శాసనాల్లో చెప్పబడింది. తూర్పుచాళుక్యులకు

ఇదే రాజధాని. పేదవేగి పేరుతో ఏలూరుకు ఉత్తరంగా గ్రామం వుంది. ఇక్కడ చిత్రరథస్వామి ఆలయముంది. ప్రసిద్ధిచెందిన గుంటుపల్లి గుహలు ఇక్కడికి సమీపానవున్నాయి. ఈ రచయిత సందర్శించాడు.

242. **కురువాటిక :** వేగి గ్రామానికి సమీప ప్రాంత భూమి.

242,243. **కడిమి :** వేగికి ఏలూరుకు మధ్య దుగ్గిరాల ప్రాంతంలో గల పెద్దకడిమి అనే గ్రామం. పినకడిమి అనే మరోగ్రామం, శనివారప్పేట ప్రాంతంలో వుంది.

244. **జొన్నగడ్డ :** అగ్రహారంగా చెప్పబడింది. శ్రీధరునిచే తాకట్టు పెట్టబడింది. మహబూబ్ నగర జిల్లా గ్రామం.

266. **తుండీరము :** తొండమండలము ఇలా సంభావింపబడింది. సుమారుగా కాళహస్తి నుండి కంచి పరిసర ప్రాంతము వరకు గల భూభాగం తొండ మండలం.

293. **దోరసముద్రము :** ద్వారసముద్రము ఇలా సంభావింపబడింది. కర్ణాటక రాష్ట్రములోని నేటి హళెబీడుకు పూర్వనామము, హోయసల రాజుల రాజధాని.

294. **మోహనశైలము :** మోపూరునందు భైరవాలయం గల కొండకుపేరు.

"సత్యేసర్వం ప్రతిష్ఠితం"

# క్రీడాభిరామం కొన్ని విశేషాలు

**హల్లీశ :** one of the eighteen enterinments or
minor dramatic entertainments (described
and dancing by one male and 7,8 or 10 female
performers: perhaps a kind of ballet). Sahitya Darpanam.
a Circular dance (performed by women under the direction of
a man). Kavyadarsa.

హల్లీసక : a kind of dance. kavyadarsa.

పై నిర్వచనము యమునా నదీ తీరంలో గోపికలు శ్రీ కృష్ణుని మురళీ నాదానికి ముగ్ధులై చేసిన రాసక్రీడను తలపిస్తోంది. నృత్త రత్నావళి కర్త జాయపసేనాని దీనిని నర్తనంగా చెప్పడం జరిగింది. ఆయన ఇలా అంటాడు.

షోడశైవ పరం తత్ర యత్తా భిర్బంధ పూర్ణతా
చేలం అర్ధోరుకం యద్వాకార్వాసం కంచుకం తథా
ధమ్మిల్లం వేణికాం వాపి తత్తదేశానుసారతః

.................................................

ఆది రాజ శ్రియం ప్రేక్ష్య స్వాను రూపం చిరాద్వరం
స్వయం వరీతుం మాహోత్మ్యా త్ర్పాప్తా ఇవ సభాపతిం
గోపికానాం సహస్రభ్యేమానితా ముఖ్య నాయికాః

.....................................................

అయితే రాసకాల్లో భేదాలున్నాయి. రాసకాలన్నీ గోపీకృష్ణుల రాసలీలా నృత్త విశేషాలతోనే కూడి వుంటాయి. హల్లీసకం, దండరాసకానికి దగ్గరగా వుంటుంది. దండమంటే కోలాటపు కర్ర.

**షడ్జమ(51), పంచమ (101) శ్రుతులు :** సరిగమ పదనిస అనేవి సప్తస్వరాలు. ఈ స్వరాలన్నింటికి ఆయా స్వరాక్షరాల పేరుతో శ్రుతి భేదాలను చెపుతారు. షడ్జమం అంటే 'స' పంచమం అంటే 'ప'.

**మంద్ర, మధ్య తార మానత్రయి :** మంద్రము, మధ్యము, తార అనేవి వాద్యాలనుండి లేక గానం చేసేటపుడు గొంతునుండి వెలువడే ధ్వనిలోని స్థాయీ భేదాలు. మంద్రస్థాయిలో

ధ్వని సన్నగాను, తారస్థాయిలో పెద్దదిగాను వుంటుంది. మధ్యమస్థాయి ఈరెంటికి మధ్యస్థంగా వుంటుంది.

**దేశభాషలందు తెనుఁగులెస్స (37) :** చాలమంది, దీనిని మొదట చెప్పినవాడు శ్రీకృష్ణ దేవరాయలనే భ్రమలో వున్నారు. వేదికలపై అలాగే చెపుతూవుంటారు. కాని దీనిని మొదట చెప్పింది. వినుకొండ వల్లభరాయడు. క్రీడాభిరామం చాల ఆలస్యంగా వెలుగులోనికి రావడం, ముందుగా ఆముక్త మాల్యద వెలుగు చూడటం కారణంగా, శ్రీకృష్ణదేవరాయలే ఈ మాట మొట్టమొదట చెప్పిన వానిగా ప్రచారంలోనికి వచ్చింది.

దేశ భాషలంటే - సంస్కృతం గాక, దేశీయ జనుల నిత్యవ్యహార భాషలు-వీటినే మరో పద్ధతిలో ప్రాకృత భాషలంటారు. ప్రకృతి జనులు (దేశీయులు) మాట్లాడు తారు గనుక ఆ మాట. సంస్కృతం పండితభాష. ప్రాకృత భాషలు ఎన్ని అనే విషయంలో పండితుల్లో ఏకవాక్యత లేదు. అయితే భరతవర్షంలో 56 దేశాలున్నాయి. కనుక 56 దేశీయ భాషలు (ప్రాకృతాలు) ఉన్నట్లే. వాటిల్లో-అంటే అలాంటి ప్రాకృత (దేశీయ) భాషల్లో తెనుగు భాష విశిష్టమైనది అని వల్లభరాయడు చెపుతున్నాడు.

తెనుగు అంటే- నేడు మనం వ్యవహరిస్తున్న భాష అని అందరికే తెలిసిందే. కాని ఒక విశేషముంది! అదేమిటంటే-మనం వ్యవహరిస్తున్నది తెనుగే అయినా, మీ భాషేమిటని ఇతరులు ఎవరైనా అడిగితే మనం చెప్పేమాట తెలుగు అని. అంతే తప్ప తెనుగు అని కాదు. తెనుగు అని చెప్పేవారు పండితులు. అది కూడా సకృత్తుగా - మాత్రమే, నేటి మన భాషా వ్యవహారానికి తెనుగు, తెలుగు, ఆంధ్రము అనే మూడు పేర్లున్న విషయం, కేవలం భాషా విద్యార్థులకే పరిమితం.

నిజానికి ఆ మూడూ వేర్వేరు భాషలు. ఇంకా నిక్కచ్చిగా చెప్పాలంటే-ఆంధ్రము, తెలుగు వేరు వేరు భాషలు. ఆ రెండిటి మిశ్రమం తెనుగు. ఆంధ్రులు ఉత్తరాది నుండి వచ్చి తీరంలో స్థిరపడ్డవారు. వారి భాష ఆంధ్రభాష. ఇది క్రీస్తుపూర్వం 4వ శతాబ్దనుండి క్రీస్తుశకం 6,7 శతాబ్దాల వరకు చెలామణిలో వుంది. ఆ కాలంలో వచ్చిన శాసనాల్లోని భాష, ప్రాకృతమని చెప్పబడుతున్నది ఆంధ్రభాషే, తెలుగు తెలంగాణపు భాష. క్రీస్తుశకం 4వ శతాబ్దంలో తీరప్రాంతానికి వచ్చిన చాళుక్యులతో ఆ భాష తీరానికి వచ్చింది. క్రీ.శ 7.8 శతాబ్దాలనుండి 9వశతాబ్ది మధ్యవరకు వచ్చిన శాసనాలు తెలుగుభాషలో వచ్చాయి. ఈ రెండు భాషల వ్యవహర్తలు సహజీవనం చేయటం వలన, ఆ రెండు భాషలు మిశ్రితమైనాయి. ఆ మిశ్రమభాషకు తెనుగు అని పేరు పెట్టింది నన్నయ. తెనుగులో వచ్చిన మొదటి రచన శ్రీమహాభారతం (ఆది. సభాపర్వాలు, అరణ్యపర్వంలో కొంతభాగం మాత్రమే నన్నయరచించి స్వర్గతుడైనాడు). అందువలన నన్నయ 'తెనుగు' భాషలో ఆదికవి.

తన భాష మీది అభిమానం వలనగాని, తనకు తెలిసిన భాషలన్నింటి పరిశీలనలో తన భాషే మేలైనదని పించటం వలనగాని, వల్లభరాయడు తెనుగుభాషను పై విధంగా కీర్తించటానికి కారణమై వుంటుంది.

**కందుక క్రీడ (258)**

క్రీడాభిరామంలో కందుక క్రీడావిశేషాన్ని గూర్చి మంచన శర్మ టిట్టిభసెట్టికి వివరించిన తీరు ఈ క్రింది విధంగా వుంది.

శా. పంచారించిన లేఁత చన్నుల పయిం బ్రాలంబముల్ గ్రాలఁగాఁ
గాంచీ నూపుర కంకణ క్వణనముల్ గ్రాలంగ, బాలాజనుల్
కించి న్న్యంచ దుదంచితంబునను సంక్రీడించె దర్పుండు సూ
చంచత్కాంచన కందుక త్రయములన్ సవ్యాప సవ్యంబులన్.

సందర్భమంటూ అనువుపడితే, కవులు ఈ కందుక క్రీడను తప్పక తమ కృతుల్లో ప్రస్తావిస్తారు. కందుక క్రీడపై గారాబు పచరించు హస్తాబ్జముల పూనె నక్షమాల' అని శ్రీనాథుడు హరవిలాసంలో పార్వతి శివునికై తపస్సు చేసిన సందర్భంలో అంటాడు.

క్రీడాభిరామంలో కేవలం క్రీడగానే చెప్పబడింది. వాద్యాల ప్రసక్తి అక్కడ లేదు. కాని కందుక నృత్తంలో వాద్యాలుంటాయి. ఈ నృత్తమనే కాదు. అన్ని దేశీయ నృత్తాలలోను వాద్యాలుంటాయి. ఈ నృత్తవిశేషంలోని పద్మబంధం, గోమూత్రికా బంధం, నాగ బంధం, చక్ర బంధం మొదలైన వాటికి తగినట్లుగా వాదకులు వాదన గావిస్తారు.

ఇక నర్తకీ వేషధరించిన తరుణులు (క్రీడాభిరామంలోని వారు నర్తకులు గారు, ఆడుకుంటున్న తరుణులే) చాల అందమైన వారుగా-సుమధ్యలు, దీర్ఘలోచనాలు, బలుపైన ఊరువులు, కటిభారములు, ఉన్నతములు పీనములైన చనుకట్టు కలిగి వుంటారు. అలాంటి వారు బంగారంతోగాని, వెండి, కంచు, లేక కొయ్యతో చేసినబంతులతో ఆడతారు. ఆ బంతులు బోలుగా వుండి, లోపల ఇనుప గుండ్లు వుంటాయి. ఆడేటపుడు అవి ధ్వనిని పుట్టిస్తాయి. ఒకరికొకరు బంతులు విసరుకోవడం, పట్టుకోవడం, తిరిగి విసరడం-ఈ విన్యాసంలో, వారు ధరించిన గాజులు గలగలలధ్వని కలిసి మనోహరంగా వుంటుంది.

కాగా, అలా ఎగురవేయబడుతున్న బంతులు, అ సందర్భంలో, ఆ వనితల కుచా సక్తములు, ముఖాసక్తములైన పక్షులను తలపిస్తాయి. ఆటలో అటూ ఇటు పరుగెడుతూ ఉత్సాహంతో కూలీలు పెడతారు. అప్పటి వారి పదచలనాలు (గతి,) భ్రూవిక్షేపాలు, కన్నుల కదలికలు చూసేవారి కళ్ళకు ఇంపుగావుంటుంది. దాదాపుగా ఈ భావాన్నంతా వల్లభ రాయడు పైపద్యంలో ఒదిగించాడు.

కందుకనృత్తాన్ని గూర్చి జాయపసేనాని ఇలా వివరించాడు (పై వ్యాఖ్యానం దీనిని అనుసరించినదే.)

పద్మ గోమూత్రికా నాగచక్ర ప్రభృతిషు స్ఫుటం
వాద్యమానేషు బంధేషు నానాపావాషు వాదకై : దేశీయనర్తన ప్రోక్త ప్రబంధేష్వధటేక్రమాత్
నర్తకీ వేషధారిణ్యా: సుమధ్యా దీర్ఘ లోచనా:
పీవరోరు కటీ భారా: పీనోన్నత పయోధరా:
స్పర్ధమానా మిధ: కాంతిరూప యౌవన విభ్రమై:
హేమ్నారూప్యేణ కాంస్యేన రచితాన్ దారుణాధవా అంతశ్చలదయోగోల నిక్వాణ
ముఖరీకృతాన్ దత్త్వాన్యాసాం నిజాన్ తద్వత్ గృహ్ణత్యా: పరత: పరాన్
మిధో వినిమయే నైతాన్ స్వీకుర్వత్యా: కదాచన
కుచవక్త్రకృతా నక్తాన్ శకుంతానివ కందుకాన్
కరైరుడ్డా పయం తస్తాన్ కౌతుకోత్కూల కూజితా :
ఉల్లలత్కందుక ప్రాప్తి ధావల్లోలాక్షి లీలయా
రచయంత్య ఇవాకాశం సరోమీనాబ్జ సంకులం
చారీ భిర్గతిభి: పాదైః లాస్యాంగై రపి కోమలై :
నృత్యంతి వనియత్త తత్స్యాత్కందుక నర్తనం.

**శుద్ధసాళగ సంకీర్ణ వివిధ రాగములు (130) :** శుద్ధ సాళగ రాగంతో పాటు వివిధ సంకీర్ణ రాగాల్లో ఏకవీరాదేవి ఎదుట నిలిచి బవనీంద్ర ముఖ్య నాయకుడు పరశురాముని వృత్తాంతాలను ఆలాపిస్తున్నట్లు చెప్పబడింది.

సాళగరాగం 7వ చక్రంలో మొదటిరాగం. 37వ మేళం. దీనిని సౌగంధిని రాగం అని కూడా అంటారు. సంపూర్ణరాగం. కనుక ఆరోహణ అవరోహణల్లో సప్తస్వరాలు వుంటాయి.

**నాగసింధు ప్రభేద నానా వరాటరాగాలు :** నాగసింధు : దీనిని గూర్చిన సమాచారం ప్రస్తుతం లభ్యం కావటం లేదు. మొదలు ఇది ఒక ప్రత్యేక రాగమా లేక సింధుభైరవి రాగాన్నే ఇలా సంభావిస్తున్నారా అనే అభిప్రాయం సంగీత శాస్త్ర పండితుల్లో వుంది. వారి అభిప్రాయం ఎలా వుందంటే మనకు దేశాల పేర్లతో రాగాలున్నాయి కదా! సింధు భైరవి సింధు దేశానికి చెందినది. ఆంధ్రదేశాన్ని నాగులు పాలించినట్లు, నాగజాతివారున్నట్లు చారిత్రకుల కథనం ఎలాగూ వుంది. కనుక నాగులైన వారు సింధుబైరవిని ఆలాపించిన కారణంగా నాగసింధు అని వుండవచ్చుననేది ఆ అభిప్రాయం. ఇక్కడ కూడా అది నాగసారం మీద ఆలాపించడం గమనార్హం.

వరాటరాగం : 10వ చక్రంలో 59వ మేళంలోని జన్యరాగం, జనకరాగం ధర్మవతి. కనుక ఇది ప్రతి మధ్యమ రాగం. ప్రాచీన రాగం. ప్రస్తుతం ప్రచారంలో వున్నట్లు సమాచారం

లేదు. కనుక ఆరోహణ అవరోహణలు తెలియరావు. వరాట కూడా దేశంపేరు. విదర్భదేశాన్నే వరాట దేశమంటారు.

పేరకమ్మ (212) : దీని విషయమై కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి కొంత సందేహాన్ని వెలిబుచ్చారు. క్రీడాభిరామంలోని ప్రసక్తిని బట్టి దానిని కృష్ణానదిగానే భావించినా, మందడంలోని శాసనాన్ని బట్టి (నిజానికి ఈ శాసనం మల్కాపురంలో వుంది. మందడానికి సమీపగ్రామమే. శాసన సంఖ్య 395. దక్షిణ భారత శాసన సంపుటి 10) కృష్ణానది కాక, దానినంటి ప్రవహిస్తున్న మరొక ప్రవాహమేమోనని భావించారు. శాసన పాఠం కూడా ఇచ్చారు. అయితే వారు ఆప్రాంతపు పరిసరాలను చూడకపోవడం చేత అలా వ్రాశారు. పేరకమ్మనుండి వెడలిన ఇమ్మంగాలి కాల్వ తల పొలమెర. అది మొదలు ఈశాన్య పర్యంతం కృష్ణవేణిల ప్రస్తావన వుంది. ఆ కారణంగా వారు ఆ రెండూ వేరు వేరు అని పొరపడ్డారు. అసలు విషయం ఏమిటంటే కృష్ణానది నుండి (పేరకమ్మ) ఒకపాయ తుళ్ళూరుకు ఈవల చీలి వెలగపూడి, రాయపూడి, మందడం మీదుగా కృష్ణాయపాలెం వచ్చేది. కృష్ణాయపాలెం వద్ద, పై నుండి వచ్చిన పుల్లేరును (నేడు దీనిని కొండవీటి వాగు అంటున్నారు) కలుపుకొని దిగువభాగాలను ముంచెత్తేది. దానిని నివారించడానికి అప్పటి పెనుమాక గ్రామాధికారి కృష్ణాయపాలెం నుండి పెనుమాక, ఉండవల్లి మీదుగా ఒక కాలువను త్రవ్వించి, కృష్ణలో కలిసే విధంగా ఆ ప్రవాహాన్ని మళ్లించాడు. పేరకమ్మ అంటే కృష్ణానదే.

నారికేళ, బకజాతి కోళ్ళు : నారికేళ జాతి. బక జాతి అనే రెండు జాతులకు చెందిన కోళ్ళు ఇక్కడ ప్రస్తావింపబడ్డాయి. ఇవి పానుగంటి కలుకోడికి తోబుట్టువు ల్లాంటివని చెప్పడం జరిగింది. ఈ పానుగంటి కలుకోడి ప్రస్తావన పల్నాటి వీరచరిత్రలో కనిపిస్తుంది.దీనినే క్రీడాభిరామంలో ప్రస్తావించింది. బ్రహ్మనాయని కోడిపుంజు చిట్టిమల్లు. కోడిపుంజు కొరకు బ్రహ్మన్న అడుగగా పెద్దన్న ఆయనతో 'వినవయ్య తమ్ముడా విశదంబుగాను, భూమండలపు కోడి పోసగదు మనకు, మనము పట్టగవలె మహిమగల కోడి, పానుగల్ పురమున బడమటి దిశను ఒగి శనైశ్చరుడను నొక చట్టుక్రింద చిట్టిమల్లని యెడి చిత్రంపు కోడి కలదయ్య, యచ్చట కంటి నానాడు, తగు జెట్టి నొక్కని తడయక పంపి ఆ పుంజు దెప్పింపు' మనిచెప్పాడు. కలుకోడి ఒరయూరులో కూడా వున్నట్లు శాసనాల్లో సమాచారం వుంది.

కోడిపుంజులు పౌరుషానికి ప్రతీకలు. అయితే పందెగాండ్రు పోటీల కొరకు కొన్ని ప్రాంతాల కోళ్ళను పెంచుతారు. ప్రస్తుతకాలంలో అలాంటి ప్రశస్తి బొబ్బిలి కోడిపుంజులకు వుంది. పలనాటి చరిత్రకాలంలో పానుగంటి కలుకోడికి అలాంటి ప్రాముఖ్యముందన్నమాట. ఒరయూరులో కూడా దాని ప్రసక్తి వుంది కనుక కలుకోడి అనేది కోళ్ళల్లో ఒక ప్రత్యేకమైన జాతిదిగా భావించాలి. కల్లు అంటే రాయి అని అర్థం. గనుక అలాగ మొక్కవోని ధైర్యంతో పోరాడేదని భావించవచ్చు. లేదా కల్లి అంటే యుద్ధం. కనుక పోరాట పటిమ గల వాటిని,

అలా పరిగణించి వుండవచ్చు. ఆ జాతికి నేడు బొబ్బిలివలె ఆనాడు పానుగల్లు ప్రసిద్ధి చెంది వుండవచ్చు.

దానికి తోబుట్టువులు లాంటివని ఇక్కడ నారికేళ, బక జాతులకు చెందిన కోడిపుంజులను చెప్పడం జరిగింది. ఇందులో నారికేళ బకాన్ని గూర్చి మంచన కేయూరబాహు చరిత్రలో ప్రస్తావించాడు.

పెక్కునీళులు లేనట్టి యొక్క కొలను
క్రేవ నున్నతమగు నారికేళ మొకటి
చీకు కొక్కెర యొకటి వసించు నచట
వారి బహుతర జలచరాహార మగుట. (3-149.కేయూర బాహుచరిత్ర)

అంటే ఇక్కడ కొబ్బరి చెట్టుమీద గల గుడ్డి కొక్కిరాయిని ప్రస్తావించటం జరిగింది. గుడ్డికొక్కిరాయి కొంగజాతి లోని పక్షి, కొంగల్లో చాలా జాతులున్నాయి. మనకు సాధారణంగా (డెల్టాజిల్లాల్లో) కనుపించేది కాళ్ళు, మెడ పొడవుగా పూర్తిగా తెల్లగా వుండేది. సాధారణంగా ఇవి గుంపుగానే వుంటాయి. గుడ్డికొక్కిరాయిలు గుంపుగా వుండవు. పైన చెప్పిన కొంగ కంటె పొట్టిది. దీని ఈకలు పై భాగాన నలుపు ఊదారంగు కలగలిసిన రంగులో వుంటాయి. లోపలి భాగం కొంత తెలుపు. అంటే కొంగ తెలుపంత స్వచ్ఛంగా ప్రకాశంగా వుండదు. కేయూరబాహు చరిత్రలోని ఈ ప్రయోగాన్ని చూసి క్రీడాభిరామంలోని నారికేళ బక జాతి అన్న దానిని ఏకపదంగా గ్రహించి, శ్రీప్రభాకర శాస్త్రిగారు కొబ్బరిచెట్లపై నుండే కొంగజాతిని స్ఫురింపజేసే కోడిపుంజు అని వ్రాయడం, పిదప వేదం వేంకట రాయశాస్త్రిగారు నారికేళ, బక జాతులను గూర్చిన వివరణ కేతన దశ కుమార చరిత్రలో వున్నట్లు తెలిపారని, శ్రీప్రభాకర శాస్త్రిగారు వ్రాస్తూ, దశకుమారచరిత్ర లోని పద్యాలను ఉదహరించారు. వాటిని ఇక్కడ గమనించండి.

బకజాతికోడి : చరణములు నేత్రములుఁ గడు
నరుణము లారెలును ముక్కు నాయతములు కం
ధరములు దొడలును సన్నము
లరయఁగ బకజాతి కది భయంపడుఁ బోరన్

నారికేళ జాతికోడి : ఆరెలు వలములుఁ దొడలును
దోరము బలుమెడయుఁ జుట్టుఁ దుండముఁ గుఱుచల్
బీరంబును నురమును వి
స్తారియగు న్నారికేళ జాతికి నెందున్.

కాళ్ళు, కన్నులు ఎర్రగా వుండి, కాలిగోళ్ళు, ముక్కు పొడువుగా వుండి, మెడ, తొడలు సన్నంగా వుండేవి బక జాతికి చేందినవి. కాలిగోళ్ళు బలంగా, తొడలు లావుగా, మెడ జుట్టు, ముక్కు పొట్టిగా, రొమ్ము భాగం వెడల్పుగా వుండేవి నారికేళ జాతికి చెందినవి.

కొంగను పోలినవి ఒక జాతి. కాగా, రొమ్ము విశాలంగా వుండి, పొట్టభాగం రాను రాను సన్నంగా వుండి కొబ్బరికాయవలె వుండేది నారికేళ జాతి. ఇవి మధ్య భారతంలో వుండే జాతులని ఒక మాట. బొబ్బిలి జాతికి చెందినవి ఈ రెంటి, సంకర జాతి కావడానికి అవకాశముంది.

288. దొరసెము : నిరుటికి ముందటేడాది అని పూర్వ వ్యాఖ్యాతలు చెప్పడం జరిగింది. వారు అలా చెప్పడానికి కారణం నిరుడు, వర్తమాన, రానున్న సంవత్సరాల ప్రస్తావన అక్కడ వుండటం. అక్కడ గల పద్యం ఈ క్రింది విధంగా వుంది.

చ. దొరసెము నందుఁజుట్టుకొని తోరణ కట్టె నురో విభాగమున్
నిరుడు పయోజకోశ రమణీయతఁ దాల్చెను వర్తమాన వ
త్సరమున నొప్పె హేమ కలశంబుల బాగున, ముందటేటికిం
గరి నిభయాన చన్నుఁగవ కౌఁగిలి పట్టులు గాక యుండునే.

అయితే అలాంటి పదంగాని, దానికి ఆ అర్థంగాని తెనుగులో వున్నట్లు తెలియరాదు. అక్కడ చెపుతోంది స్తనోద్భేదన విషయం మాత్రమే. రొమ్మున అవి (చనుమొలకలు) అంకురించి, గత సంవత్సరానికి రూపుదాల్చాయి. ఇప్పుడు (ఈ ఏడాది) హేమ కలశాలంత అయినాయి. వచ్చే ఏటికి అవి కౌగిలి పట్టు లంత అవుతాయి అని.

ఈ క్రింది వివరణలను గమనించండి.

| | | |
|---|---|---|
| తమిళము : | తోర్ (tor̲) పదం | = తోలు, చర్మము అనే అర్థాన్నిస్తుంది. |
| | తొర్రమ్ (tor̲r̲am) | = appearance, vision, sight, origin rise, beginnig, source |
| | తోర్రమ్ ఆ (torram - ā) | = to come into existance; |
| | తోర్రు (torru) | = appearance. |
| | తోర్రణమ్ (tor̲r̲an̲am) | = Btunted sensibility |

పద్యంలోని 'దొరసెము', 'తోరణ కట్టె' పదాలను, తమిళంలోని పై పదాలతో పోల్చి చూసినపుడు, ముందుగా రొమ్మున గుండ్రని (చిన్నదిగా) ఆకారం రూపుదిద్దుకొని, ఆ పిదప మధ్యలో మొన తేలాయని బాధపడుతోంది. దీనినే శ్రీనాథుడు స్తనోద్భేదనమని హరి విలాసంలో చెప్పడం జరిగింది. అక్కడి సందర్భం కుమార్తెకు స్తనోద్భేదనం జరిగిన నాటి నుండే, ఆమె వివాహవిషయమై తల్లి ఆలోచన చేస్తూ వుంటుందని, పార్వతి విషయమై మేనకను గూర్చి చెప్పడం జరిగింది.

బాల్యంలో స్త్రీ, పురుష శిశువులందరికీ చనుమొనలు ఒకే విధంగా వుంటాయి. కాల క్రమంలో ఆఁడపిల్లలకు, అక్కడి శరీర భాగం ఉబ్బెత్తుగా గుండ్రని రూపుదాల్చి, మధ్య గల చన్మొనలు నిక్కబొడుచుకుంటాయి. ఇక్కడి పద్యంలో ఆ స్థితిని చెప్పి క్రమంగా వాటి పరిమాణం వృద్ధి పొందిన తీరును చెప్పడం జరిగింది.

# వినుకొండవల్లభామాత్యుని వంశవృక్షము



# క్రీడాభిరామము : పద్యాల అకారాది అనుక్రమణిక

**(కుండలీ కరణముల లోనివి పద్యసంఖ్యలు వచనాలను గ్రహింపలేదు)**


**అ**

అకలంక స్థితిఁగోరి ...... 132
అకలంక స్థితి శీధుపాన ...... 147
అఖిల ప్రపంచంబు ...... 2
అగురు ధూపాది ...... 187
అంకుశాఘాత ...... 184
అటవీ సూకర ...... 19
అదిగో యెత్తిన వారు ...... 146
అదె దారువన భూమి ...... 191
అదె నీ కుమారిత ...... 199
అదె భైరవస్థాన ...... 149
అదె మాణిక్యపు ...... 63
అనినఁ డిట్టిభ ...... 115
అందుకొని పుష్పలావికి ...... 176
అమితోత్సాహము ...... 151
అమృతరస ...... 26
అరవిందాస్య ...... 285
అఱు గౌను ...... 168
అలకాపురంబున ...... 242
అలరుం బోఁడి ...... 131
అలిగి యెంతటి ...... 129
అహరవధి ...... 23

**ఆ**

ఆ చంద్రమంత్రి ...... 6
ఆతఁడెంతటి ...... 34
ఆ మంత్రీశ్వరు ...... 4
ఆ మల్లామాత్య ...... 16
ఆరువల్లి నాయురాలి ...... 119
ఆలోకింపక ...... 133
ఆ విశ్వామిత్రు ...... 3
ఆ వేళ నీవు ...... 195
ఆహార విహార ...... 164
ఆహి వెట్టితి ...... 245

**ఇ**

ఇచ్చోట భుజియించి ...... 122

**ఈ**

ఈ తలిరుంబోఁడికి ...... 241
ఈ నలినాక్షి ...... 103
ఈ మరి ...... 88
ఈరసమెత్తు ...... 207

**ఉ**

ఉడువీథిన్ ...... 155
ఉన్మద మత్త కోకిల ...... 198
ఉపమించెద ...... 29
ఉభయము భావవీథి ...... 228

**ఎ**

ఎకసక్కెముగ ...... 68

ఎట్టకేలకు ...... 58
ఎందుండి వచ్చితిరీరు ...... 189
ఎందు పోయితి ...... 203

ఏ

ఏమి చెప్పుదుము ...... 248

ఓ

ఓరుంగంటి పురంబు ...... 64
ఓరుఁగంటి మాచాంబ ...... 186

క

కంగటి కాలు ...... 274
కటిభారంబును ...... 75
కడగోరఁదీర్చిన ...... 223
కడిమి కత్తులమ్మి ...... 243
కద్రూ మహాదేవి ...... 225
కనకాద్రి ప్రతి మాన ...... 14
కందర్ప శాస్త్ర వేదులు ...... 269
కందుక కేళి ...... 82
కన్నెతీక ముడుప ...... 290
కపటాచార ...... 18
కప్పురభోగి ...... 166
కమఠావతారంబు ...... 80
కర పద్మంబున ...... 281
కర్ణాట క్షితి నాథుడైన ...... 5
కలశ పాథోరాశి ...... 292
కల్లఁజెప్పము ...... 185
కక్ష నిక్షిప్త ..... 130
కారవేల్ల మతల్లికా ...... 205
కాసల్నాటి శ్రేష్ఠుఁడు ...... 43
కుమ్ములు హవ్యవాహములు ...... 46
కులము దైవతంబు ...... 118
కుసుమం బెట్టిన చీర ...... 86
కేలఁ గ్రొమ్మించు ...... 200
కొడుకులు కూఁతులుం ...... 256
కొలుచును జేనవెట్టి ...... 106
కోణాగ్ర సంఘర్ష ...... 136
కోయిల పంచమ ...... 170
కోల దాపునఁ ద్రిక్కటి ...... 125
క్రొన్నెల రేఖ తోడ ...... 175

గ

గణన కెక్కిన ...... 1
గండాభోగము ...... 73
గతి రసికుండ ...... 39
గంధవతీ ప్రతీర ...... 20
గన్నెరు బూఁజాయ ...... 42
గరుడ స్తంభ ...... 208
గర్జించి యరసి ...... 117
గార్హ్య సిద్ధాంత ...... 66
గీసిన వెదురు ...... 70
గొన కొనం ...... 52
గోత్రము వార లెల్ల ...... 194
ఘ్రాణ పుటీ ...... 161

చ

చందనంబునఁ గలయంపి ...... 178
చాటు ప్రౌఢిఁ బిసాళ ...... 92
చిత్తము గూర్చి ...... 123
చుక్క యొకింత నిక్కి ...... 50
చెలఁగి చెలఁగి ...... 214

చేరవచ్చి ...... 40

## జ

జనని సంస్కృతంబు ...... 37
జతివోని గడితంపు ...... 134
జవరాలిఁ బొడగన్న ...... 212
జాణతనము గల్గి ...... 253
జిగురుటుండలు నించి ...... 77

## ట

టట్టిభసెట్టిగారు ...... 240

## త

తారకా మందార ...... 12
తిప్పమంత్రి ...... 15
తియ్యని వింటిజోదు ...... 192

## ద

దట్టపు నీలిచేల ...... 278
దవన పున్నమ ...... 204
దాసనపుఁ బువ్వు ...... 62
దిక్కరి కుంభ కూటముల ...... 263
దిట్టబాపండు ...... 93
దీవించి మంచి ...... 201
దొరసెము నందు ...... 288
ద్రుత తాళంబున ...... 116
ద్వీపాంతంబున నుండి ...... 180

## న

నటులది దోరసముద్రము ...... 293
నడురేయి ...... 249
నన్నయభట్ట ...... 36
నల్లంగొండయు ...... 121
నాగస్వర సుషిర ...... 220
నిటలమ్ము లవిసి ...... 229
నీకుంజేసిన బాస ...... 267
నీకునౌ నీకునౌ ...... 99
నున్ననై నలుపెక్కి ...... 226
నెల్లూరి తూముకాలువ ...... 28

## ప

పచ్చని పిండి గందమును ...... 120
పంచారించిన నీ ...... 90
పంచారించిన లేఁత ...... 258
పటు ఝుంఝూ ...... 60
పద్మలోచన ...... 128
పరిపాటీ ఖర్వ ...... 110
పరివేష్టించి ...... 97
పలికినప్పుడు ...... 102
పల్లవ తస్కరుండొకఁడు ...... 71
పసిఁడి కోర ...... 206
పాంథ సీమంతినీ ...... 173
పారిజాతంపుఁ బూవు ...... 234
పుటభేదన ...... 69
పూవుం బోఁడులు ...... 169
పేర్చిన సందడి ...... 210
పొదలిన చీకు ...... 277
పొలపములు లేవు ...... 84
ప్రక్కలు వంచి ...... 45
ఫూత్కార పవనంబు ...... 224

## బ

బంగారు తలుపులు ...... 287
భిల్లావతార ...... 27

## మ


మగ సింగంబులు ...... 124
మచ్చికయుం బ్రమోదమును ...... 283
మంచన వింటివో ...... 54
మంచనార్యు ...... 7
మంద వేగంబుతో ...... 162
మందారవారుణీ ...... 32
మంద్ర మధ్యతార ...... 140
మలయజ గంధి ...... 239
మల్లన మంత్రికిం ...... 10
మాఁగిలి మాఁగిలి ...... 51
మాఘమాసంబు ...... 262
మిన్నకున్నార ...... 246
మిరుతూరి విట్ఠమంత్రీ ...... 9
మీన విలోచనంబులును ...... 104
ముకుర వీక్షా విధానంబు ...... 196
ముక్కు సోణంబు ...... 270
ముంజెపదనైన ...... 211
ముదమున ముల్కినాటి ...... 294
ముద్రికా మాణిక్యముల ...... 137
ముని తన కూఁతు ...... 265
ముసి ముసి నవ్వుతో ...... 79
ముసుఁగు వెట్టిననేమి ...... 95
మూఁడు గ్రామ గ్రాసముల ...... 22
మోదంబున ...... 282


## ర


రాజమార్గంబు ...... 114
ఱవఱవమందు ...... 142


## ల


లంజె వారికి ...... 197
లవలవఁ జన్నుదోయి ...... 217
లెస్స గాక కిరీట ...... 182


## వ


వట్టివెదురు మోపు ...... 230
వదనాంభోరుహ ...... 276
వదినెయు లంజెయున్ ...... 255
వందనం బిందిరావరు ...... 127
వాచాల సురధునీ ...... 13
వాహకుండెక్కి విడిచిన ...... 87
విజ్జోడు పడ ...... 101
వీఁడిదె తెల్లనాకులను ...... 159
వీరభద్రేశ్వరార్చనా ...... 280
వీరు మైలారదేవర ...... 143
వెదలి పశ్చిమదిశ ...... 219
వెనుకకు మొగ్గ వ్రాలి ...... 144
వ్యామగ్రాహ్య నితంబ ...... 209
వ్రాలని నీ చన్నులతో ...... 91
వ్రాలె నరవిందలోచన ...... 260
వ్రాలెన్ దిక్కులు ...... 153


## శ


శనివార సిద్ధి ...... 145
శీతకాలంబు ...... 56


## స


సంగాసంగ ...... 98
సత్యవ్రతాచార ...... 17
సంధి విగ్రహ ...... 157

సన్నచూపుల ...... 289
సప్తపాతాళ ...... 112
సంకృతి పూతిమాష ...... 171
సరివత్తు రీవి ...... 30
సారాచారమునన్ ...... 31
సారెకు సారెకేమిటికి ...... 108
సింగనామాత్య ...... 8
సింహళ ద్వీపమున ...... 238
స్థూల ద్వి్త్రిపటావ కుంతనమున్.... 47
స్థూల ద్వి్త్రిపటావ కుంతనములు..... 48
స్మర దివ్యాగమ ...... 272

## హ

హర! హర! యింత ...... 138
హల్లీసక ...... 25
హా! కుమారస్వామి ...... 236
హాటక గర్భ వధూటీ ...... 24
హాలాపాన మదాతిరేక ...... 251
హా! హా! నృపాల ...... 232



కుటుంబసభ్యులతో యార్లగడ్డ

⌘

ఈ క్రీడాభిరామం ప్రౌఢకవితాభిరామం. అందఱికూ అందనిది. అందలి యితివృత్తమూ, సాధారణ సామాజికోదంతం. అందఱికూ అందవలసినది. ఇంతకాలానికి ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు గారు దీనికి వచన రూపాన్ని ప్రసాదించి ప్రజలకు చేరువచేసే పనిని చేపట్టడం ముదావహమైన విషయం.

కేవలం ప్రధాన గ్రంథాన్ని వచనీకరించడమే గాక క్రీడాభిరామంలో ప్రయుక్తమైన ధ్వన్యనుకరణపదాలు, ప్రసక్తమైన గ్రామాలు, ప్రాంతాల వివరణ, ఇతివృత్తంలో, ప్రస్తావనభాగంలోని వ్యక్తులు,పేర్లు లేకుండా ప్రసక్తమైన వారి వివరాలు, క్రీడాభిరామం వలన తెలియవచ్చే సామాజిక విశేషాలు. ప్రసక్తమైన నృత్తాల, రాగాల వివరణలు, వల్లభామాత్యుని వంశవృక్షం, పదాల పదబంధాల అర్థాల వివరణలు, జాతీయాల వివరణలతో ఈ గ్రంథాన్ని క్రీడాభిరామ విజ్ఞానసర్వస్వంగా రూపొందించారు.

– ఆచార్య **వి.రామచంద్రచౌదరి**